

'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 23

సోమవారం 15-4-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




**ముంబైకి ముకుతాడు**

రోహిత్ సెంచరీ వృథా.. 20 పరుగుల తేడాతో చెన్నై గెలుపు - 14లో



**పసిడి పరుగు ఎందాకా?**

బంగారం ధరల పెరుగుదలకు కారణాలపై ప్రత్యేక కథనం - 15లో



# మాటువేసి.. మట్టుబెట్టే కుట్ర

## ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను అంతం చేయడమే లక్ష్యంగా దుండగుడి దాడి

- దాడికి పాల్పడ్డ తీరును విశ్లేషించి నిర్ధారించిన పోలీసులు
- 'మేమంతా సిద్ధం' రూట్ మ్యాప్ ఆధారంగా పక్కాగా రెక్కీ
- వ్యూహాత్మకంగా వివేకానంద స్కూల్-గంగానమ్మ గుడి మధ్య ప్రాంతం ఎంపిక
- చీకట్లో సులభంగా తప్పించుకోవచ్చనే.. స్కూల్ ప్రాంగణంలో నక్కి 45 డిగ్రీల కోణంలో బలంగా దాడి
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రోడ్డుకు కుడివైపున జనసందోహానికి అభివాదం చేస్తుండగా ఎడమ వైపు నుంచి ఆగంతకుడి దాడి 2లో
- క్యాటర్‌బాల్ లేదా ఎయిర్‌గన్ వినియోగించినట్లు నిర్ధారణ
- వెలంపల్లి ఫిర్యాదుతో హత్యాయత్నం కేసు నమోదు
- అన్ని కోణాల్లో దర్యాప్తు ముమ్మరం.. సిట్ ఏర్పాటు
- సీసీ టీవీ కెమెరాల ఫుటేజ్ పరిశీలన.. సెల్ టవర్ పరిధిలో ఫోన్ కాల్స్ డేటా సేకరణ.. కీలక ఆధారాలు లభ్యం..
- పోలీసుల అదుపులో కొందరు అనుమానితులు
- కేసులో కొంత పురోగతి సాధించామన్న విజయవాడ సీపీ కాంతిరాణా టాటా.. సీఎంపై దాడి ఘటన మీద రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి మీనాకు నివేదిక



సింగ్‌నగర్‌లో వివేకానంద స్కూల్ ప్రాంగణం నుంచి సీఎం జగన్‌పైకి దూసుకొస్తున్న పదునైన రాయి లాంటి వస్తువు (పై ఫొటో) అది తగలడంతో పక్కకు తూలిన సీఎం జగన్ (కింది ఫొటో)



తీవ్ర గాయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

### అది ప్రాణాలు తీసేంత దాడే

సీఎంపై పదునైన వస్తువుతో బలంగా దాడి

కణతపై తగిలి ఉంటే పెను ప్రమాదం

ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ కేవీఆర్ శాస్త్రి

10లో

### కణతకు తగిలి ఉంటే సీఎంకు ప్రాణాపాయం

కణత వద్దే పుర్రెలో సున్నిత భాగం

మెదడుకు రక్తప్రసరణ ప్రధాన నరం అక్కడే

న్యూరోసర్జన్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డి

10లో

### పథకం ప్రకారమే హత్యాయత్నం

సీఎం జగన్‌ను అంతమొందించడమే ఆగంతకుడి లక్ష్యం.. అదృష్టం బాగుండి బయటపడ్డారు

గురి తప్పకుండా కాల్చగల షార్ప్ షూటర్లే ఇలాంటివి చేస్తారు.. శక్తివంతమైనవారి మద్దతు లేకుండా వీరు ఆ పనిచేసి ఉండరు: సజ్జల

10లో



## వికసిత భారత్ 'సంకల్ప పత్రం'

24 కీలక అంశాలతో బీజేపీ మేనిఫెస్టో విడుదల

పేదలు, యువత, రైతులు, మహిళల సంక్షేమానికి ప్రాధాన్యం.. మరో ఐదేళ్లపాటు పేదలకు ఉచిత రేషన్

70 ఏళ్లు దాటిన వృద్ధులకు రూ.5 లక్షల ఉచిత వైద్యం

నిరుపేదలకు మూడు కోట్ల ఇళ్లు

త్వరలో దక్షిణాదికీ బుల్లెట్ రైలు

దేశంలో ఉమ్మడి పౌరస్మృతి అవసరమన్న ప్రధాని మోదీ

6లో

"వికసిత భారత్‌లో అంతర్భాగమైన యువశక్తి, నారీ శక్తి, పేదలు, రైతులు అనే నాలుగు స్తంభాలను మా సంకల్ప పత్రం బలోపేతం చేస్తుంది. ఒక దేశం, ఒకే ఎన్నిక దిశగా అడుగులు వేస్తాం. దేశాభివృద్ధికి అడ్డుగోడగా మారిన అవినీతిపై యుద్ధం కొనసాగిస్తాం."

– ప్రధాని మోదీ

## న్యూస్‌రీల్

### అంబేడ్కర్ ఆశయాలను నెరవేరుస్తున్న సీఎం జగన్



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ కలలుగన్న ప్రజాస్వామ్య, సామ్యవాద సమాజాన్ని నిర్మించే దిశగా సీఎం జగన్ పరిపాలన సాగిస్తున్నారని ఆ పార్టీ నేతలన్నారు. వివరాలు 12లో ▸

### 21న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష



ఏపీ మోడల్ స్కూల్స్ (ఆదర్శ పాఠశాలలు)లో 2024–25 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశాల కోసం ఉద్దేశించిన ప్రవేశ పరీక్ష ఈ నెల 21న నిర్వహించనున్నట్లు పాఠశాల విద్యా శాఖ తెలిపింది. విద్యార్థుల హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది. వివరాలు 16లో ▸



## ఇదంజగత్



సభలకు రావాలని ఏదో తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు

తిరుపతిలో నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు



## టీడీపీ హత్యా రాజకీయాలపై.. ఎగసిన నిరసన

జననేతకు సంఘీభావం తెలుపుతూ రాష్ట్రవ్యాప్తంగా అభిమానులు, వైఎస్సార్‌సీపీ నేతలు నల్లబ్యాడ్జీలతో ర్యాలీలు

చంద్రబాబు, లోకేశ్, పవన్‌కళ్యాణ్ ప్రోద్బలంతోనే హత్యాయత్నానికి తెగబడ్డారని ఆగ్రహావేశాలు

11లో

పలుచోట్ల చంద్రబాబు దిష్టిబొమ్మలు దగ్ధం

నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్

చంద్రబాబు, ఆయన భజన బృందాలు నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరిక

## ఇటు ఖండన.. అటు హేళన

వ్యూహాత్మకంగా ట్రోల్ చేయించిన చంద్రబాబు.. రెచ్చిపోయిన టీడీపీ ఆస్థాన పెయిడ్ లీడర్స్

సోషల్, ఎల్లో మీడియాలో అవాకులు చవాకులు

అసెంబ్లీలో ఎవరూ ఏమీ అనకున్నా భోరున ఏడ్చిన బాబు

ఎదుటి వారిపై మాత్రం అడ్డగోలు ఆరోపణలు

టీడీపీ తీరును అసహ్యించుకుంటున్న ప్రజలు




సాక్షి, అమరావతి: అమానుషత్వం, వక్రీకరణల్లో తలపండిన చంద్రబాబు పరివారం సీఎం జగన్‌పై హత్యాయత్నం ఘటనలో తన ప్రతిభనంతా రంగరించి ప్రదర్శిస్తోంది. ముఖ్యమంత్రి మీద దాడి జరిగితే దాన్ని హేళన చేస్తూ పచ్చ మూకలు స్వైర విహారం చేయడాన్ని చూస్తుంటే ఆయనపై వారు ఎంత ఈర్ష్య, ద్వేషంతో ఉన్నారో స్పష్టమవుతోంది. ప్రధాని మోదీ నుంచి పలు రాష్ట్రాల సీఎంలు, ప్రముఖులు ఈ దాడిని ఖండిస్తుంటే

మిగతా 10వ పేజీలో ▶

### 2019లోనూ అదే హేళన

2019లో విశాఖ ఎయిర్‌పోర్టులో వైఎస్ జగన్‌పై దాడి జరిగిన సమయంలోనూ చంద్రబాబు, టీడీపీ ఇదే రీతిలో స్పందించాయి. అప్పుడు సీఎంగా ఉన్న చంద్రబాబు తన హోదాను మరచిపోయి ఆ ఘటనను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు చేసి అభాసుపాలయ్యారు. ఏం జరిగిందో పూర్తిగా తెలుసుకోకుండా గంటల వ్యవధిలో మీడియా సమావేశం పెట్టి జగన్ మనుషులే ఆయనపై దాడి చేశారని హేళన చేశారు. నాటి డీజీపీ ఆర్పీ ఠాగూర్‌పై ఒత్తిడి తెచ్చి వైఎస్సార్‌సీపీ అభిమాని దాడి చేసినట్లు చెప్పించారు. ఇప్పుడు విజయవాడలో జరిగిన దాడిపైనా అదే సూత్రాన్ని అనుసరించారు. అయితే ఈసారి వ్యూహాత్మకంగా చంద్రబాబు ఖండించగా టీడీపీ, తోక పార్టీ జనసేన నేతలంతా దుష్ప్రచారానికి దిగారు.

'వర్డ్ పవర్ చాంపియన్‌షిప్' పోటీల్లో బహుమతులు అందుకున్న ఏపీ ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు



## జాతీయ స్థాయి ఇంగ్లిష్ పోటీల్లో ఏపీ విద్యార్థుల ప్రతిభ

'వర్డ్ పవర్ చాంపియన్‌షిప్'లో ఎన్టీఆర్ జిల్లా విద్యార్థులకు బహుమతులు

సత్ఫలితాలు ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వ కృషి

సాక్షి, అమరావతి: మన రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు జాతీయ వర్డ్ పవర్ చాంపియన్‌షిప్ పోటీల్లో సత్తా చాటారు. విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాలు పెంపొందించడంలో భాగంగా విభా, లీప్ ఫార్వార్డ్ సంస్థల ఆధ్వర్యాన నిర్వహించిన జాతీయ వర్డ్ పవర్ చాంపియన్‌షిప్ పోటీల్లో రాష్ట్రానికి రెండు బహుమతులు సాధించారు. గత నెల 14వ తేదీన విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన ఐదుగురు విద్యార్థులు ఈ నెల 12న ముంబైలో జరిగిన గ్రాండ్ ఫినాలే పోటీల్లో పాల్గొన్నారు. ఫైనల్స్‌లో ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం కనిమెర్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన

మిగతా 12వ పేజీలో ▶



## ఇజ్రాయెల్‌పై ఇరాన్ మెరుపుదాడి

300కుపైగా క్షిపణులు, డ్రోన్ల ప్రయోగం

- దాదాపు అన్నింటినీ మిత్రదేశాల సాయంతో కూల్చేశామన్న ఇజ్రాయెల్
- ఇరాన్ దాడిని ఖండించిన ప్రపంచ దేశాలు
- ఉక్కుకవచంలా ఇజ్రాయెల్‌కు రక్షణగా నిలుస్తామన్న అమెరికా అధ్యక్షుడు బైడెన్
- పశ్చిమాసియాలో ముసురుకున్న యుద్ధమేఘాలు!

6లో

### నీ మీద రాయి వేస్తే కొంపలు కూలిపోయినట్లు మాట్లాడతావా?

గాజువాక సభలో చంద్రబాబు అహంకారపూరిత వ్యాఖ్యలు 5లో



### గులకరాయికే ఇంత ఇదా?

తెనాలి సభలో పవన్ అనుచిత వ్యాఖ్యలు 3లో



## వెలంపల్లికి నేతల పరామర్శ

సాక్షి, అమరావతి: సీఎం జగన్‌పై దాడి జరిగిన ఘటనలో గాయపడిన మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావును ఆదివారం పలువురు నేతలు పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి.. వెలంపల్లి ఇంటికి వెళ్లి ఆయన కంటికి అయిన గాయం గురించి ఆరా తీశారు. డాక్టర్‌ను కలిసి చికిత్స పొందాలని సూచించారు. ఘటన జరిగిన తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. సజ్జల వెంట రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, పార్టీ నేతలు కాకుమాను రాజశేఖర్, కనకారావు మాదిగ, గుబ్బా చంద్రశేఖర్ ఉన్నారు.

# రాయి తగిలినట్టుండాలి.. ప్రాణం పోవాలి...

- సీఎం జగన్ హత్యకు పక్కాగా పథక రచన
- జగన్‌కు వస్తున్న ప్రజాదరణ చూసి తట్టుకోలేకే బాబు కుట్రలు
- జగన్‌ను మసి చేస్తాం.. అంటూ ఇటీవల టీడీపీ అధినేత ప్రసంగాలు
- వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ధ్వజం

సాక్షి, అమరావతి : మేమంతా సిద్ధం బస్సు యాత్రలో విజయవాడ నడిబొడ్డున ఒక పథకం ప్రకారమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడ్డారని పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు, ఎమ్మెల్యేలు చెప్పారు. రాయలసీమతో పాటు కోస్తాలోనూ, మరీ ముఖ్యంగా విజయవాడలో కూడా సీఎం జగన్‌కు వస్తున్న ప్రజాదరణ చూసి తట్టుకోలేకే చంద్రబాబు ఈ దారుణానికి ఒడిగట్టారని ఆరోపించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం పలువురు మీడియాతో మాట్లాడారు.

## ఇది చంద్రబాబు కుట్ర



సీఎం జగన్‌పై జరిగిన హత్యాయత్నం కుట్రపూరితం. చంద్రబాబే దీనికి కారకుడు. విజయవాడ నడిబొడ్డున బస్సు యాత్రకు అడుగడుగునా ప్రజలు హారతులు పడుతుంటే తట్టుకోలేకే చంద్రబాబు ఇలా చేయించారు. యాత్రకు వచ్చిన జనాన్ని టీవీల్లో ప్రజలు చూస్తే టీడీపీకి పుట్టగతులుండవని భయపడే చంద్రబాబు ఈ దురాగతానికి పాల్పడ్డారు. సీఎం జగన్‌ను ఉద్దేశించి చంద్రబాబు చాలాసార్లు మసి చేస్తాం.. అన్నారు.. జగన్‌ను మసి చేయాలనే ప్రయత్నంలో భాగమేనా ఈ హత్యాయత్నం? జగన్‌ను ఎదుర్కోలేకే చంద్రబాబు కూటమి కట్టారు. సీఎం జగన్ ఉంటే రాజకీయం చేయలేమన్న నిర్ణయానికి వచ్చాకే చంద్రబాబు ఇలా చేశారు. అందుకే విజయవాడను సరైన ప్రదేశంగా బాబు ఎంచుకున్నారు. రాయి తగిలినట్టుండాలి.. ప్రాణం పోవాలి.. అనే రీతిలో ఇదంతా పక్కాగా ప్లాన్ చేశారన్న విషయం అర్థమవుతోంది.

– వాసిరెడ్డి పద్మ, వైఎస్సార్‌సీపీ నాయకురాలు

## బెజవాడలో ప్రజల బ్రహ్మరథం తట్టుకోలేకే..



మేమంతా సిద్ధం బస్సు యాత్ర విజయవాడలో జరిగేటప్పుడు ప్రజాబలం అంతగా ఉండదని చంద్రబాబు భావించారు. అయితే బస్సు యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టడాన్ని చూసి ఓర్వలేక ఈ దుశ్చర్యకు పాల్పడ్డారు. ఎన్నో సభల్లో చంద్రబాబు.. సీఎం జగన్ బచ్చా.. అంతు చూస్తాం.. మసి చేస్తాం అన్నారు. లోకేశ్ అయితే ఎంత మందిని కొట్టి వస్తే.. ఎన్ని ఎక్కువ కేసులు పెట్టుకుని వస్తే అంత ఎక్కువ ప్రాధాన్యం ఇస్తాం అన్నారు. వీటన్నిటినీ గమనిస్తే ఓ షార్ప్ షూటర్‌తో చేయించిన హత్యాయత్నం ఇదని అర్థమవుతోంది. అదే రాయి నుదిటిపైన, కంటిపై తగిలి ఉంటే పరిస్థితేంటి?

– హఫీజ్‌ఖాన్, ఎమ్మెల్యే

## రంగా హత్యకు ప్లాన్ చేసినట్టుగా..



సీఎం జగన్‌కు వస్తున్న ప్రజాదరణను చూసి బాబుకి ఓటమి భయం పట్టుకుంది. వెన్నులో వణుకు పుట్టి హత్యాయత్నం చేశారు. ఇలాంటి హింసా రాజకీయాలు చేస్తే 2024 ఎన్నికల్లో ప్రజలు టీడీపీకి సమాధి కడతారు. మచిలీపట్నంలో చంద్రబాబు మాట్లాడుతూ.. క్లెమోర్ ఫేయండి.. సీఎం జగన్‌ను సమాధి చేసి, సీసం పోసి, కంకరేసి సమాధి కట్టండి.. అన్నారు. ఇలాంటి మాటలు మాట్లాడొచ్చా. సీఎం జగన్ బస్సు యాత్రకు రాయలసీమ దాటాక ప్రజాదరణ తగ్గుతుందనుకున్నారు. దానికి మించి మరింతగా విజయవాడలో జనం రావడం చూశారు. రంగా హత్యకు ప్లాన్ చేసినట్టుగా అప్పటికప్పుడు ప్లాన్ చేశారు. దేవుడి ఆశీస్సులు, ప్రజా దీవెనలతో హత్యాయత్నం నుంచి సీఎం జగన్ బయటపడ్డారు.

– పోతుల సునీత, ఎమ్మెల్సీ

## బస్సు యాత్రను సీఎం జగన్ కొనసాగించి తీరతారు..



విజయవాడ నడిబొడ్డులో 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని నెలకొల్పిన రోజు నుంచి ఒక వర్గానికి చెందిన కొందరు సీఎం జగన్‌పై కక్షగట్టారు. గతంలో టీడీపీ కూడా సీఎం జగన్‌పై అక్రమ కేసులు పెట్టించి 16 నెలలు జైల్లో పెట్టించింది. కోడి కత్తి దాడిలో కూడా టీడీపీ నేతల ప్రమేయం ఉంది. చంద్రబాబు తన ప్రసంగాల్లో రాళ్ల దాడులకు టీడీపీ శ్రేణులను ఉసిగొల్పుతున్నారు. ఇది దురదృష్టకరమైన విషయం. ఎన్ని అవాంతరాలు ఎదురైనా బస్సు యాత్రను జగన్ కొనసాగిస్తారు.

– కె.రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి

## చంద్రబాబుది దింపుడు కళ్లెం ఆశ



దింపుడు కళ్లెం ఆశతో చంద్రబాబు ఇదంతా చేస్తున్నారు. తాడికొండ, ఇతర చోట్ల చంద్రబాబు మాట్లాడిన మాటల్ని ఒకసారి గమనిస్తే.. హత్యాయత్నం ఎవరు చేయించారన్నది స్పష్టంగా అర్థమవుతుంది. దీనిలో ప్రథమ నిందితుడిగా చంద్రబాబును చేర్చాలి. ఇది ఎన్నికల స్టంట్ అని అచ్చెన్నాయుడు అంటున్నారు. అలిపిరి వద్ద చంద్రబాబుపై జరిగిన దాడి కూడా ఎన్నికల స్టంటా? ఎన్టీఆర్ సభలో మల్లెల బాబ్జి చేసిన దాడి కూడా ఎన్నికల స్టంటా?

– కొమ్మూరి కనకారావు, మాదిగ కార్పొరేషన్ చైర్మన్

## ఇలాంటి దాడులకు బెదిరే వ్యక్తికాదు వైఎస్ జగన్



నిన్న మధ్యాహ్నం తుళ్లూరులో చంద్రబాబు.. సీఎం జగన్‌ను రాళ్లతో కొట్టాలని చెప్పారు. చంద్రబాబు మాటలు విని కులోన్మాదంతో విజయవాడలో హత్యాయత్నం చేశారు. దీన్ని ఖండించాల్సిన కొందరు సంస్కారహీనంగా మాట్లాడుతున్నారు. అలిపిరి ఘటనను నటన అని ఎవరైనా అన్నారా? ఆనాడు ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్సార్ చంద్రబాబుకు సంఘీభావంగా తిరుపతిలో మౌనదీక్ష చేశారు. చంద్రబాబు భుజాలు తడుముకోవడం చూస్తే వీళ్లే దాడి చేయించి ఉంటారని కచ్చితంగా భావించాల్సి వస్తోంది. ఇలాంటి దాడులకు బెదిరే వ్యక్తి కాదు వైఎస్ జగన్. 2024 ఎన్నికల్లో సీఎం రెండోసారి ప్రమాణ స్వీకారం చేస్తారు.

– అప్పిరెడ్డి, శాసనమండలిలో ప్రభుత్వ విప్

## ప్రాణాపాయం సంభవించి ఉండేది



సీఎం వైఎస్ జగన్‌పై విజయవాడలో జరిగిన హత్యాయత్నం ఘటనలో అదృష్టవశాత్తు ప్రాణాపాయం తప్పింది. ఈ హత్యాయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. సీఎంకు అయిన లోతైన గాయాన్ని పరిశీలిస్తే చాలా పదునైన వస్తువుతోనే దాడిచేసినట్టు అర్థమవుతోంది. ఆ పదునైన వస్తువు కనుబొమ్మకు కొంత కింద తగిలి ఉంటే కంటిచూపు కోల్పోయేవారు. మరోవైపు పరిశీలిస్తే పుర్రె భాగంలో ఎంతో సున్నితమైన ప్రదేశాన్నే ఎంచుకుని ఈ దురాగతానికి పాల్పడినట్టు స్పష్టం అవుతోంది. ఈ క్రమంలో మెదడులోని మాటలను నియంత్రించే బ్రోకా ప్రదేశానికి బలమైన దెబ్బ తగిలినట్లైతే శాశ్వతంగా మాట కోల్పోయే ప్రమాదం ఉండేది. అదేవిధంగా కణతి, తల భాగంలో ఎక్కడ తగిలినా బ్రెయిన్ ఇంజ్యూరి అయి ప్రాణాపాయం సంభవించి ఉండేది. నిత్యం రోడ్డు ప్రమాదాల్లో తలకు బలమైన గాయంతో బ్రెయిన్ డెడ్, కోమాలోకి వెళ్లడం వంటివి తరచు చూస్తుంటాం.

– డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి, ఆరోగ్యశ్రీ ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రుల రాష్ట్ర అధ్యక్షుడు

## అనాగరిక చర్య

ప్రజాస్వామ్య వ్యవస్థలో భౌతికదాడి ఎంతో అనాగరికమైన, నీచమైన చర్య. సీఎం జగన్‌పై హత్యాయత్నాన్ని ఖండిస్తున్నాం. బాధ్యులను గుర్తించి కఠినంగా శిక్షించాలి. ఐదేళ్ల పాలనలో సీఎం జగన్ అన్ని వర్గాలకు మేలు చేకూర్చారు. ఆయన త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నాం.

– డాక్టర్ సుబ్బారెడ్డి, ఏపీ ప్రైవేట్ హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

## పిరికిపందల చర్య

సీఎం జగన్‌పై జరిగిన హత్యాయత్నాన్ని ఖండిస్తున్నాం. ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదు. ఇది పిరికిపందల చర్య. మంచి పనులు చేసి ప్రజల మనసు గెల్చుకోవాలిగానీ ఇలా హింసాయుత పనుల ద్వారా ఎన్నికల్లో గెలవాలనుకోవడం దారుణం. ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలి.

– కొంతం గోవర్ధన్‌రెడ్డి, చైర్మన్, తెలంగాణ అడ్వకేట్ అసోసియేషన్

# మాటు వేసి.. మట్టుబెట్టే కుట్ర

- సీఎం జగన్‌ను అంతం చేయడమే లక్ష్యంగా దుండగుడి దాడి
- దాడికి పాల్పడ్డ తీరును విశ్లేషించి నిర్ధారించిన పోలీసులు
- 'మేమంతా సిద్ధం' రూట్ మ్యాప్ ఆధారంగా పక్కాగా రెక్కీ

సాక్షి, అమరావతి: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని హత్య చేసేందుకే పక్కా పన్నాగంతో ఆయనపై ఆగంతకుడు దాడికి పాల్పడినట్లు స్పష్టమైంది. ముందుగా రెక్కీ నిర్వహించి సమీపం నుంచి దాడి చేసి తప్పించుకునేందుకు అనువుగా ఉందనే విజయవాడ అజిత్‌సింగ్ నగర్‌లోని డాబా కొట్ల జంక్షన్‌ను ఎంపిక చేసుకున్నట్లు నిర్ధారణ అయింది. క్యాటర్ బాల్ / ఎయిర్‌గన్ లాంటి పరికరం ద్వారా పదునైన రాయి లాంటి వస్తువుతో దాడికి పాల్పడ్డాడు. కణతపైగానీ తల వెనుక దిగువ భాగం పైగానీ తీవ్రంగా దాడి చేయడం ద్వారా ముఖ్యమంత్రిని అంతమొందించాలన్నదే దుండగుల లక్ష్యమని వెల్లడైంది. దాడిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తోపాటు తీవ్రంగా గాయపడ్డ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విజయవాడ అజిత్‌సింగ్ నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రాథమిక ఆధారాలు లభించడంతో ఐపీసీ సెక్షన్ 307 కింద హత్యాయత్నంగా కేసు నమోదు చేసి దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ కేసులో పోలీసులు ఇప్పటికే కొందరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో సీఎం జగన్‌పై ఆగంతకుడు ఎక్కడ నుంచి ఏ విధంగా దాడికి పాల్పడ్డాడనే దానిపై స్పష్టమైన నిర్ధారణకు వచ్చారు. ఆ ప్రాంతంలో సీసీ టీవీ కెమెరాల ఫుటేజీలు, టవర్ పరిధిలోని సెల్ ఫోన్ల డేటా, ఇతర సాంకేతిక ఆధారాలను విశ్లేషిస్తున్నారు. అనుమానితులపై నిఘా పెట్టడంతోపాటు ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ దర్యాప్తును వేగవంతం చేశారు. కాగా సీఎం జగన్ పై జరిగిన హత్యాయత్నం ఘటనకు సంబంధించి విజయవాడ పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనాకు నివేదిక సమర్పించారు



సీఎం జగన్‌పై ఆగంతకుడు పదునైన వస్తువుతో దాడి చేసినట్టుగా వీడియో ఫుటేజీలో పోలీసులు గుర్తించిన దృశ్యం

### హత్య చేసేందుకే పక్కాగా రెక్కీ..

ముఖ్యమంత్రి జగన్‌పై ఆగంతకుడి దాడి లక్ష్యం ఆయన్ని అంతం చేయడమేనని పోలీసులు నిర్ధారించారు. సీఎం జగన్ నిర్వహిస్తున్న 'మేమంతా సిద్ధం' యాత్ర విజయవాడలో కొనసాగే వివిధ ప్రాంతాల్లో ఆగంతకుడితోపాటు ఈ కుట్రలో ఇతర పాత్రధారులు రెక్కీ నిర్వహించారు. సమీపం నుంచి దాడి చేసి తప్పించుకునేందుకు డాబా కొట్ల జంక్షన్‌ను ఎంపిక చేసుకున్నారు. కాస్త ఇరుకుగా ఉండే ఆ రోడ్డులో కుడివైపు ఇళ్లు, దుకాణాలున్నాయి. అక్కడ ప్రజలు భారీగా గుమిగూడతారు. ఎడమ వైపున వివేకానంద స్కూల్ భవనం ఉంది. అటువైపు జన సంచారం ఉండదు. సీఎం జగన్ తన వాహనంపై నుంచి కుడివైపు ఉన్న ప్రజలకు అభివాదం చేస్తూ వెళతారు. ఎడమ వైపు ఎవరూ దృష్టి సారించరు. అంతేకాకుండా ఆ జంక్షన్‌లోనే ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. సీఎం జగన్ ప్రయాణిస్తున్న భారీ ప్రచార వాహనం వెళ్లేందుకు వీలుగా ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని గుర్తించారు. దీంతో స్కూల్ భవనం వైపు పూర్తిగా చీకటి కమ్ముకుని ఉంటుంది. ప్రహరి లోపల స్కూల్ భవనానికి, ఆ పక్కనే ఉన్న గంగానమ్మ ఆలయానికి మధ్యలో ఖాళీ స్థలంలో నిందితులు మాటు వేసి ఉండవచ్చని భావిస్తున్నారు. స్కూల్ ప్రాంగణం వెనుక వైపు నుంచి తూర్పు దిశలో ఉన్న చిన్న ఇనుప గేటు దాటి మాకినేని బసవపున్నయ్య స్టేడియంలోకి వెళ్లి సులభంగా తప్పించుకునేందుకు అవకాశం ఉంది. సీఎం జగన్ యాత్రకు సంఘీభావంగా హాజరైన భారీ జనసందోహంలో కలిసిపోతే ఎవరూ గుర్తించ లేరు. ఇన్ని రకాలుగా కసరత్తు చేసిన అనంతరమే వివేకానంద స్కూల్ ప్రాంగణం నుంచి దాడి చేసేందుకు ఆగంతకుడు తెగబడ్డాడు.

### వీడియో ఫుటేజీ విశ్లేషణ..

ముఖ్యమంత్రి జగన్‌పై హత్యాయత్నం జరిగిన సమయంలో వీడియో ఫుటేజీని పోలీసులు విశ్లేషించారు. వివేకానంద స్కూల్ ప్రాంగణం నుంచి 45 డిగ్రీల కోణంలో బలమైన రాయి లాంటి వస్తువు అత్యంత వేగంగా దూసుకొచ్చి సీఎం జగన్ ఎడమ కనుబొమ్మ పైభాగంలో బలంగా తాకినట్లు ఫుటేజీలో స్పష్టంగా కనిపించింది. ఆయనకు తగిలి అనంతరం ఆ పక్కనే ఉన్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ కంటికి కూడా బలంగా తాకింది. సీఎం జగన్‌కు ఎడమ కనుబొమ్మ పైభాగంలో తీవ్ర గాయం కాగా ఎమ్మెల్యే వెలంపల్లి కంటికి కూడా తీవ్ర గాయమైంది. ఆ ప్రదేశంలో రోడ్డువైపు నుంచి వివేకానంద స్కూల్ ప్రహరి గోడ ఆరు అడుగుల ఎత్తు ఉంది. స్కూల్ ప్రాంగణంలో నేల ఎత్తు చేయడంతో లోపల వైపు నుంచి ప్రహరి కేవలం మూడు అడుగుల ఎత్తే ఉంది. అక్కడి నుంచి సీఎం వాహనం వచ్చే రోడ్డు కేవలం 20 అడుగుల దూరమే ఉంది. ఆ ప్రహరి లోపల ముందుగానే మాటు వేసిన ఆగంతకుడు సీఎం వాహనం అక్కడికి చేరుకోగానే బలమైన రాయిని క్యాటర్ బాల్‌తోగానీ ఎయిర్‌గన్ వంటి పరికరంతోగానీ బలంగా గురి చూసి కొట్టాడు. 45 డిగ్రీల కోణంలో బలంగా వచ్చిన రాయి సీఎం జగన్‌కు తగిలింది. సీఎం జగన్ రోడ్డుకు కుడివైపున ఉన్న జనసందోహాన్ని చూస్తూ అభివాదం చేస్తుండగా దుండగుడు ఈ దాడికి పాల్పడ్డాడు. ఎడమ కణతపైగానీ తల వెనుక కింద భాగంలోగానీ దాడి చేయాలన్నది ఆగంతకుడి ఉద్దేశమన్నది స్పష్టమైంది. ఎందుకంటే కణతపైగానీ తల వెనుక కింద భాగంలోగానీ బలంగా దాడి చేస్తే మెదడుకు తీవ్రగాయం /మెదడులో రక్తస్రావం జరిగి ప్రాణాలు కోల్పోయే అవకాశాలు ఉంటాయి. కణత ప్రాంతంలో మెత్తగా ఉండే ఎముక విరిగి మెదడుకు గుచ్చుకునే ప్రమాదం ఉంది. దాంతో మెదడులో రక్తస్రావమై ప్రాణాపాయం సంభవించవచ్చు. తల వెనుక కింద భాగంలో తగిలినా, మెదడు దెబ్బతిన్నా ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సీఎం జగన్‌ను అంతమొందించాలనే పక్కా ప్రణాళికతోనే ఆగంతకుడు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసులు నిర్ధారించారు. అదృష్టవశాత్తూ ఆ సమయంలో కుడివైపు ఉన్న ప్రజలకు అభివాదం చేస్తూ సీఎం జగన్ తలను కాస్త పక్కకు తిప్పడంతో ఆ బలమైన రాయి ఆయన కణతకు, తల వెనుక కింద భాగంలో కాకుండా ఎడమ కనుబొమ్మ పైభాగంలో తగిలింది. లేదంటే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.

### కీలక ఆధారాలు లభ్యం

సీఎం జగన్‌పై హత్యాయత్నం కేసులో విజయవాడ పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తును ముమ్మరం చేశారు. శనివారం రాత్రి నుంచి అజిత్‌సింగ్ నగర్‌లోని డాబా కొట్ల జంక్షన్ ప్రాంతాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున 4 గంటల వరకు వివేకానంద స్కూల్, గంగానమ్మ గుడి, మాకినేని బసవపున్నయ్య స్టేడియం తదితర చోట్ల విస్తృతంగా తనిఖీలు నిర్వహించి దాడి ఎలా జరిగిందనే అంశంపై స్పష్టమైన నిర్ధారణకు వచ్చారు. ఈ క్రమంలో ఈ కేసు దర్యాప్తు కోసం 'ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఆదివారం ఏర్పాటు చేశారు. అదనపు ఎస్పీ శ్రీహరి నేతృత్వంలో ఏర్పాటైన సిట్‌లో ఆరు టాస్క్‌ఫోర్స్ బృందాలున్నాయి. దాడి జరిగిన ప్రదేశాన్ని డ్రోన్ కెమెరాలతో చిత్రీకరించి ఆగంతకుడు ఏ మార్గాల్లో తప్పించుకునేందుకు అవకాశం ఉంది? ఎంత దూరం వెళ్లి ఉండవచ్చు? అనే కోణాల్లో విశ్లేషిస్తున్నారు. పరిసర ప్రాంతాల్లో ఉన్న 24 సీసీ టీవీ కెమెరాల ఫుటేజీలను సేకరించి పరిశీలిస్తున్నారు. వీటి ఆధారంగా అనుమానితుల కదలికలపై దృష్టి సారించారు. గంగానమ్మ గుడి ప్రాంతంలో ఉన్న సెల్ టవర్ పరిధిలోని మొబైల్ ఫోన్ల డేటాను విశ్లేషిస్తున్నారు. ప్రత్యేక బలగాలను మోహరించి ఆ ప్రాంతంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. డాబా కొట్ల జంక్షన్‌తోపాటు పరిసర ప్రాంతాల్లో నేర చరిత్ర ఉన్నవారి వివరాలను ఆరా తీస్తున్నారు. విజయవాడ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈ తరహా దాడులకు పాల్పడ్డ నేరగాళ్ల రికార్డులను పరిశీలిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి గతంలో విజయవాడలో దాడులకు పాల్పడిన వారి ఆచూకీపై ఆరా తీస్తున్నారు. సీసీ టీవీ ఫుటేజీలు, కాల్ డేటా రికార్డులు, ఇతర శాస్త్రీయ ఆధారాల ద్వారా సేకరించిన సమాచారాన్ని క్రోడీకరించి పోలీసులు ఈ కేసులో ఇప్పటికే కొందరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. వారి నుంచి కీలక వివరాలను రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నారు.

### కుట్ర కోణంపై దృష్టి

సీఎం జగన్‌పై దాడికి పాల్పడ్డ ఆగంతకుడితోపాటు నిందితుడి వెనుక ఉన్న అసలు కుట్రదారులు ఎవరనే కోణంలోనూ పోలీసులు దృష్టిసారించారు. ఈ కేసు దర్యాప్తులో విజయవాడ పోలీసులు ఇప్పటికే కీలక పురోగతి సాధించారు. ఒకటి రెండు రోజుల్లో ఈ కేసు దర్యాప్తులో స్పష్టత వస్తుందని పోలీసు అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అనంతరం అసలు కుట్రదారులెవరనే కోణంలో దర్యాప్తు వేగవంతం చేస్తామని చెబుతున్నారు.

### త్వరలోనే ఛేదిస్తాం



సీఎం వైఎస్ జగన్‌పై హత్యాయత్నం కేసులో దర్యాప్తు వేగం పుంజుకుంది. ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశాం. సీసీ టీవీ ఫుటేజీలు, కాల్ డాటా, ఇతర శాస్త్రీయ ఆధారాలను విశ్లేషిస్తూ దర్యాప్తు చేస్తున్నాం. కేసులో ఇప్పటికే కొంత పురోగతి సాధించాం.

– కాంతి రాణా టాటా, విజయవాడ పోలీస్ కమిషనర్

# తల్లడిల్లిన జన హృదయాలు

- జన నేతను కళ్లారా చూడాలని తాపత్రయం
- కేసరపల్లిలో బస చేసిన ప్రాంతానికి వెల్లువెత్తిన నేతలు, అభిమానులు
- గాయం బాధతో విశ్రాంతి తీసుకున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి/గన్నవరం: ప్రతి ఇంటికీ పెద్ద కొడుకయ్యాడు.. కష్టం వచ్చిన ప్రతిసారి అన్నగా తోడయ్యాడు.. అడగకుండానే ప్రజల అవసరాలు తెలుసుకుని మరీ తీరుస్తున్నాడు.. కులం చూడం.. మతం చూడం.. ప్రాంతం చూడం అంటూ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నాడు.. అలాంటి సీఎం జగన్‌పై హత్యాయత్నం జరిగిందని తెలిసి రాష్ట్ర ప్రజల్లో ఆందోళన మొదలైంది. అభిమానుల హృదయం తల్లడిల్లిపోతోంది. బిడ్డ ఎలా ఉన్నాడోనని ఓ తల్లి.. కొడుకు ఏం చేస్తున్నాడోనని ఓ తండ్రి.. అన్నకేమైందోనని ఓ చెల్లి, తమ్ముడు.. ఇలా జగన్‌ను తమ కుటుంబ సభ్యుడిగా సమాదరించే వందలాది మంది ఒకసారి తమ నేతను చూడాలని తాపత్రయపడ్డారు. 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర చేస్తున్న సీఎం జగన్‌పై విజయవాడలోని సింగ్‌నగర్ వద్ద హత్యాయత్నం జరగడంతో ఆయన తీవ్రంగా గాయపడి ఆదివారం యాత్రకు విరామం ఇచ్చారు. అయినా ఇంటికి వెళ్లిపోకుండా కృష్ణా జిల్లా కేసరపల్లి వద్ద రాత్రి బస చేసిన ప్రాంతంలోనే విశ్రాంతి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో జగన్‌ను చూడాలని, పలకరించి యోగక్షేమాలు తెలుసుకోవాలని పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు భారీగా ఆ ప్రాంతానికి చేరుకున్నారు. ఉదయం నుంచీ వస్తున్న జన ప్రవాహాన్ని పోలీసులు నిలువరించారు. గాయం తీవ్రత కారణంగా జగన్ ఎవరినీ కలిసే పరిస్థితుల్లో లేరని, ఈ ఒక్కరోజు ఆగితే బస్సుయాత్రలో మరలా ఆయన మీ ముందుకు వస్తారని నచ్చజెప్పి అందరినీ వెనక్కు పంపించారు. 'జగనన్నా.. నీకేం కాదన్నా.. మేమంతా నీవెంటే ఉంటామన్నా.. మీరు క్షేమంగా మా మధ్యకు రావాలన్నా.. మిమ్మల్ని మళ్లీ సీఎంగా గెలిపించుకుంటామన్నా' అని నినాదాలు చేస్తూ.. జగన్ త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తూ వారంతా అక్కడి నుంచి తరలివెళ్లారు.

**బస ప్రాంతానికి వచ్చిన మంత్రులు, ఎంపీలు**

గన్నవరం సమీపంలోని కేసరపల్లిలో బస చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పరామర్శించేందుకు ఆదివారం పలువురు ప్రముఖులు విచ్చేశారు. రాష్ట్ర మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి, జోగి రమేష్, విడదల రజని, రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎంపీలు మిథున్‌రెడ్డి, రెడ్డప్ప, ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ తదితరులు ఇక్కడకు వచ్చిన వారిలో ఉన్నారు.

# ఈ హత్యాయత్నం చంద్రబాబు కుట్రే

- తాడికొండ సభలో సీఎం జగన్ లక్ష్యంగా కార్యకర్తలను రెచ్చగొట్టిన బాబు
- ఏ రాయి దొరికితే దాంతో చిత్తుగా కొట్టాలని పిలుపు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దాడి వెనుక టీడీపీ అధినేత చంద్రబాబు నేతృత్వంలోని పచ్చ ముఠా పక్కా పథకం ఉన్నట్లు చంద్రబాబు మాటలే చెబుతున్నాయి. శనివారం సాయంత్రం తాడికొండలో జరిగిన సభలో ప్రసంగించిన చంద్రబాబు.. సీఎం జగన్ లక్ష్యంగా టీడీపీ కార్యకర్తలను తీవ్రంగా రెచ్చగొట్టారు. ఏ రాయి దొరికితే అది తీసుకొని దాడి చేయాలంటూ ఉసిగొల్పారు. ఆ తర్వాత కొద్ది గంటల్లోనే జగన్‌పై దాడి జరగడం గమనార్హం .శనివారం సాయంత్రం 4 గంటలకు తాడికొండలో జరిగిన ప్రజాగళం సభలో చంద్రబాబు గంటకు పైగా ప్రసంగించారు. ఆయన ప్రసంగం ఆసాంతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని అసభ్య పదజాలంతో దూషిస్తూ టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టారు. పాలిచ్చే ఆవును కాదని తన్నే దున్నపోతు లాంటి జగన్‌రెడ్డిని గెలిపించుకున్నామని, దాని ఫలితం.. గత ఐదేళ్లుగా అవస్థలు పడుతున్నామని అన్నారు. ఇప్పుడు ప్రజలంతా తిరుగుబాటుకు సిద్ధం అవుతున్నారని చెప్పారు. మీకు పట్టుదల ఉందా లేదా అంటూ టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టారు. మీ పాట్ల కొట్టిన ఫ్యాన్‌ను చిత్తు చిత్తు చేసి చెత్తకుప్పలో పడేయాలన్నారు. అమరావతి ద్రోహుల్ని తరిమికొడదాం అంటూ రెచ్చగొట్టారు. 'ప్రతి ఒక్కరూ రాయి తీసుకుని.. ఏది దొరికితే అది తీసుకుని ఆ దున్నపోతుపై (జగన్) దాడి చేయండి. ఫ్యాన్ దూరంగా విసిరేయండి' అంటూ తీవ్రంగా రెచ్చగొట్టారు. ఈ ప్రసంగాన్ని ఎల్లో మీడియా ప్రత్యక్ష ప్రసారం చేసింది. ఈ సభ ముగిసిన కొద్ది గంటల్లోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై విజయవాడ సింగ్‌నగర్‌లో హత్యాయత్నం జరిగింది. దీంతో చంద్రబాబు నాయుడు ప్రసంగానికి, దాడికి సంబంధం ఉన్నట్లు స్పష్టం అవుతోంది.

## హింసకు తావులేదు

### తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



ఖమ్మంవన్‌టౌన్: ప్రజాస్వామ్యంలో హింసకు తావు లేదని, అలాంటి కార్యక్రమాలు ఏ పార్టీ వారు చేసినా సమాజానికి మంచిది కాదని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఏపీ సీఎం జగన్‌పై హత్యాయత్నాన్ని ఖండించారు. హింసాత్మక చర్యలను ఎవరూ సమర్థించరన్నారు.

## జగన్‌పై హత్యాయత్నం పిరికిపందల చర్య

### ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ



సాక్షి, హైదరాబాద్: సీఎం జగన్‌పై హత్యాయత్నం పిరికిపందల చర్యగా ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అభివర్ణించారు. ఆయన ఎంపీ మిథున్ రెడ్డితో మాట్లాడి సంఘటనపై ఆరా తీశారు. తన స్నేహితుడు జగన్‌కు అంతా మంచి జరగాలని తెలియజేసినట్లు ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

# సీఎం జగన్‌పై హత్యాయత్నాన్ని ఖండిస్తూ యూకేలో ప్రవాసాంధ్రులు నిరసన



యూకేలో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రవాసాంధ్రులు

సాక్షి,అమరావతి: చంద్రబాబుకు ఏ దురుద్దేశమూ లేకపోతే ఇటీవల అమరావతి పరిసర ప్రాంతాల్లో పర్యటిస్తూ సీఎం జగన్‌ను రాళ్లతో కొట్టండి అని ఎందుకు అన్నారో సమాధానం చెప్పాలని వైఎస్సార్‌సీపీ యూకే సోషల్ మీడియా సభ్యులు భూమిరెడ్డి కార్తీక్ టీడీపీని డిమాండ్ చేశారు. బాబు అన్న కొద్ది గంటల్లోనే సీఎం జగన్‌పై హత్యాయత్నం జరిగిందని గుర్తు చేశారు. దీనిని వైఎస్సార్‌సీపీ యూకే విభాగం తీవ్రంగా ఖండిస్తుందని పేర్కొన్నారు. ఆదివారం యూకేలో సీఎం జగన్‌పై హత్యాయత్నం ఘటనను ఖండిస్తూ నిరసన చేపట్టారు. కార్తీక్ మాట్లాడుతూ.. విజయవాడలో సీఎం జగన్ చేపట్టిన బస్సుయాత్రకు ప్రజలు పెద్ద ఎత్తున మద్దతు పలికారని, దాన్ని చంద్రబాబు ఓర్చుకోలేక పోయారని అన్నారు. యాత్ర ఇలాగే సాగితే టీడీపీకి రాజకీయ భవిష్యత్తు ఉండదని భావించే సీఎం జగన్‌పై ఘాతుకానికి తెగబడ్డారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగన్ కచ్చితంగా గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. పాలెం క్రాంతి కుమార్ రెడ్డి, మలిరెడ్డి కిషోర్, వడ్డూరి అప్పాజీ, వీర పులిపాకల, వజ్రాల రాజశేఖర్, భీమిరెడ్డి ప్రతాప్, మాదిరెడ్డి శ్రీకాంత్, వెంకట్ రమణ మామిడిశెట్టి, వంశీ కృష్ణా రెడ్డి కూకటి, గుండం సాయి తేజ తదితరులు పాల్గొన్నారు.

# నేడు 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర ఇలా..

- కేసరపల్లి నుంచి ఉదయం 9 గంటలకు సీఎం బస్సు యాత్ర ప్రారంభం
- జొన్నపాడు వద్ద భోజన విరామం
- సాయంత్రం గుడివాడ వద్ద బహిరంగ సభ
- నారాయణపురం వద్ద రాత్రి బస

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర 15వ రోజైన సోమవారం(ఏప్రిల్ 15) షెడ్యూల్‌ను వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం ఆదివారం విడుదల చేశారు. ఈ యాత్రలో భాగంగా కేసరపల్లి దగ్గర నుంచి సీఎం జగన్ సోమవారం ఉదయం 9 గంటలకు బయలుదేరుతారు. గన్నవరం, ఆత్కూర్, వీరవల్లి క్రాస్, హనుమాన్ జంక్షన్, పుట్టగుంట మీదుగా జొన్నపాడు వద్దకు చేరుకుని భోజన విరామం తీసుకుంటారు. అనంతరం జొన్నపాడు, జనార్దనపురం మీదుగా సాయంత్రం 3.30 గంటలకు గుడివాడ చేరుకొని బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. అనంతరం హనుమాన్ జంక్షన్ జాతీయ రహదారి, గుండుగొలను మీదుగా నారాయణపురం వద్ద ఏర్పాటు చేసిన రాత్రి బస శిబిరానికి సీఎం జగన్ చేరుకుంటారు.



# అరాచకమే టీడీపీ విధానం

## అందులో భాగమే సీఎం జగన్‌పై హత్యాయత్నం: ఎమ్మెల్యే వెలంపల్లి


కుటుంబ సభ్యులతో కలిసి మాట్లాడుతున్న వెలంపల్లి

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): తెలుగుదేశం పార్టీ ఇప్పుడే ఇంతలా బరితెగిస్తోందని, ఆ పార్టీని అధికారంలోకి వస్తే ఎంతకైనా తెగిస్తుందన్న విషయాన్ని ప్రజలు గ్రహించాలని విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే, సెంట్రల్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాస్ కోరారు. టీడీపీవి ఆరాచక విధానాలని, అందులో భాగంగానే సీఎం జగన్‌పై హత్యాయత్నం జరిగిందన్నారు. ఆయన ఆదివారం తన కుటుంబ సభ్యులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రజలు సీఎం జగన్‌కు బ్రహ్మరథం పట్టడంతో ఓర్వలేకనే ఆయనపైన, తనపైన హత్యాయత్నానికి తెగబడ్డారన్నారు. కూటమిలోని మూడు పార్టీలు కలిసినా ప్రయోజనం లేదు కాబట్టే సీఎంను చంపేందుకు చంద్రబాబు కుట్ర చేస్తున్నారన్నారు. బాబు ఆయన తొత్తు బొండా ఉమా బ్యాచ్‌తో ఈ దాడులు చేయించారని చెప్పారు. బొండా ఉమా చేసే దారుణాలతో నగరానికి పెను ప్రమాదం ఉందన్నారు. తీవ్ర గాయంతో రక్తం కారుతున్నప్పటికీ, సీఎం జగన్ ఆయన కోసం ఎదురు చూస్తున్న ప్రజల కోసం యాత్రను కొనసాగించారన్నారు. ఎవరైనా తెలిసీ కంట్లో పొడుచుకొని రాజకీయాలు చేస్తారా అని ప్రశ్నించారు. సీఎంకు భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలన్నారు. ఈమేరకు తక్షణమే ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని కోరారు. సీఎం జగన్‌పై దాడి జరిగితే సోషల్ మీడియాలో టీడీపీ అసభ్యకరమైన పోస్టులు పెట్టడం దారుణమన్నారు. తన కంటికి దెబ్బ తగిలితే బొండా ఉమా బ్యాచ్ మానవత్వం మరిచి వెటకారంగా పోస్టులు పెడుతున్నారని దుయ్యబట్టారు. బొండా వంటి కబ్జాకోరులను, కుట్రదారులను ప్రజలు తరిమికొట్టాలన్నారు. కుంభకోణాల్లో అరెస్టయిన బాబు ఆయన వయసు పెద్దదని, కంటి చూపు సరిగా లేదని బెయిల్ తెచ్చుకున్నారని విమర్శించారు. అచ్చెన్నాయుడు సైతం పైల్స్ వ్యాధి అంటూ బెయిల్ తెచ్చుకున్నారని విమర్శించారు.

**జగన్‌పై హత్యాయత్నం అమానుషం: కేశినేని నాని**



సీఎం వైఎస్ జగన్‌పై హత్యాయత్నం అమానుషమని విజయవాడ ఎంపీ కేశినేని నాని అన్నారు. ఆదివారం వెలంపల్లిని ఆయన స్వగృహంలో నాని పరామర్శించారు. బాబు మొదటి నుంచి రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తున్నారు. బొండా ఉమా ఒక గూండా, భూకబ్జాదారుడన్నారు. పథకం ప్రకారమే సీఎం జగన్‌పై హత్యాయత్నం జరిగిందని, ఈ ఘటనపై తమకు చాలా అనుమానాలు ఉన్నాయని అన్నారు. మళ్లీ ఓడిపోతున్నామని టీడీపీకి భయం పట్టుకుందన్నారు. నూజివీడు ఎమ్మెల్యే మేకా ప్రతాప అప్పారావు, పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి షేక్ ఆసిఫ్, ఎంపీ కేశినేని నాని కుమార్తె శ్వేత తదితరులు వెలంపల్లిని పరామర్శించారు.

## గులకరాయికే ఇంత ఇదా?: పవన్ కళ్యాణ్

**తెనాలి:** సీఎం జగన్‌కు గాయమైతే రాష్ట్రానికే గాయమైనట్లు అల్లరి చేస్తున్నారని జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ విమర్శించారు. 'జగన్‌పై ఎవరో రాయి విసిరారట. అదేమిటోగానీ ఎన్నికలు అనేసరికి ఏదొకటి జరుగుతుంది. గాయాలవటమో... చంపేయటమో... చంపటమో జరుగుతోంది. జెడ్ కేటగిరీ సెక్యూరిటీ ఏమైంది? ఇంటెలిజెన్స్, పోలీస్ అధికారులు ఏం చేస్తున్నారు? గత ఎన్నికల్లో విశాఖలో కోడికత్తితో గాయం చేశారు.. వైఎస్ వివేకాను ఏ కత్తితో పొడిచారో తెలియదు...' అంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారు. గుంటూరు జిల్లా తెనాలిలో ఆదివారం రాత్రి బహిరంగ సభలో వారాహి నుంచి పవన్ మాట్లాడుతూ.. 15 ఏళ్ల అమర్నాథ్‌ను చెరుకుతోటలో పెట్రోలు పోసి అడ్డంగా తగలేస్తే రాష్ట్రానికి గాయం కాలేదా? 35 వేల మంది ఆడపిల్లలు అదృశ్యమైతే రాష్ట్రానికి గాయం కాలేదా? గతంలో చంద్రబాబుపై రాళ్ల వర్షం కురిపించినప్పుడు రాష్ట్రానికి గాయం కాలేదా? మీకు గులకరాయి తగిలితేనే ఇంత ఇదా! అంటూ విమర్శలు చేశారు. సానుభూతి తెలియజేస్తూ స్టేట్‌మెంట్ ఇవ్వాలని పార్టీ నాయకులు తనకు సూచించారన్నారు. అయితే ఏం జరిగిందో తెలియకుండా ఎలా ఇస్తానని ప్రశ్నించానన్నారు. 'ఏమో...అతనే కొట్టేసుకున్నాడేమో? ఎవరికి తెలుసు? కరెంటు కూడా పోయిందట! నాన్న-పులి కథలా ఒకసారి జరిగితే అనుకోవచ్చు. ప్రతిసారీ జరుగుతుంటే అబద్ధమంటున్నాం. సెంటిమెంటల్ డ్రామాలు ఆపండి... నాటకాలు భరించలేకున్నా. అందరిపైనా దాడిచేసే వ్యక్తిపై ఎవరైనా దాడిచేస్తారా? అయినా దాడిచేస్తే ఎంతసేపు పట్టుకోవటానికి?' అని పేర్కొన్నారు.

### ప్రజాదరణ చూసి ఓర్వలేకే

# సీఎం జగన్‌పై హత్యాయత్నం

## సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే వెలంపల్లి

**సాక్షి ప్రతినిధి, విజయవాడ:** సీఎం జగన్‌పై శనివారం రాత్రి విజయవాడ సింగ్‌నగర్‌లో జరిగిన హత్యాయత్నంపై విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే, సెంట్రల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాస్ అజిత్‌సింగ్ నగర్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్రంలో వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకే ఆయనపైన, తనపైన హత్యాయత్నం చేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. 'మేమంతా సిద్ధం బస్సు యాత్రంలో భాగంగా సీఎం జగన్ 13వ తేదీ సాయంత్రం విజయవాడ చేరుకున్నారు. కనకదుర్గ వారధి, సాయిబాబా గుడి, శిఖామణి సెంటర్, చుట్టగుంట, బీఆర్‌టీఎస్ రోడ్డు, గవర్నమెంట్ ప్రెస్ కూడలి, సింగ్‌నగర్ ఫ్లై ఓవర్, డాబాకొట్లు సెంటర్ మీదుగా వివేకానంద స్కూల్ వద్దకు చేరుకుంది. ఈ యాత్రలో పెద్ద ఎత్తున పాల్గొన్న ప్రజలకు అభివాదం చేస్తూ సీఎం జగన్ ముందుకు సాగారు. రాత్రి 8.30 గంటల సమయంలో వివేకానంద స్కూల్ వద్ద కొందరు దుండగులు సీఎం జగన్ పైన, నా పైన హత్యాయత్నం చేశారు. ఈ దాడిలో సీఎం జగన్ ఎడమ కనుబొమపై తీవ్ర గాయమైంది. నా ఎడమ కంటికి తీవ్ర గాయమైంది' అని ఫిర్యాదులో వివరించారు. దాడి అనంతరం అప్రమత్తమైన సీఎం జగన్ భద్రతా సిబ్బంది ప్రథమ చికిత్స చేశారని పేర్కొన్నారు. ఒక పథకం ప్రకారమే దురుద్దేశ పూర్వకంగా సీఎం జగన్‌ను అంతమొందించాలనే ఈ దాడి చేశారని, దీనికి పాల్పడిన వ్యక్తులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైతే కొంత మంది వ్యక్తుల మనుగడకు ప్రమాదం వాటిల్లుతుందని, ఆ భయంతోనే సీఎం జగన్‌పై హత్యాయత్నం చేశారని ఫిర్యాదులో వివరించారు.

**డీసీపీ హరికృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు**

సీఎం జగన్, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్‌పై జరిగిన హత్యాయత్నంపై సమగ్ర విచారణ జరిపేందుకు డీసీపీ హరికృష్ణ ఆధ్వర్యంలో పోలీస్ శాఖ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. ఏసీపీ స్థాయి అధికారులతో ఏర్పాటైన ఈ ఆరు బృందాలు లోతైన విచారణ చేపడుతున్నాయి. క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్, టాస్క్‌ఫోర్స్ బృందాలు ఆ ప్రాంతంలో వివరాలను సేకరిస్తున్నాయి.

## వైఎస్సార్‌సీపీ ప్రచార వాహనంపై దాడి


దాడికి గురైన వాహనం

**పెనమలూరు:** కృష్ణా జిల్లా పెనమలూరు మండలం యనమలకుదురులో టీడీపీ, జనసేన పార్టీ మూకలు వైఎస్సార్‌సీపీ ప్రచార వాహనంపై దాడి చేశాయి. ఆ రెండు పార్టీలకు చెందిన వ్యక్తులు వాహనానికి ఉన్న ఫ్లెక్సీలను ధ్వంసం చేసి పార్టీ శ్రేణులను బెదిరించారు. జనసేన మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, పెనమలూరు టీడీపీ అభ్యర్థి బోడె ప్రసాద్ ఎదుటే ఆదివారం రాత్రి ఈ ఘటన జరిగింది. వైఎస్సార్‌సీపీ కార్యాలయం ఎదుట ఆ పార్టీ ప్రచార వాహనం ఉండగా.. అదే సమయంలో కూటమి అభ్యర్థులు బాలశౌరి, బోడె ప్రసాద్ ర్యాలీ వచ్చింది. దాన్ని చూసిన టీడీపీ, జనసేన కార్యకర్తలు రెచ్చిపోయి దాడి చేశారు. వాహనానికి ఉన్న వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావు, ఎమ్మెల్యే అభ్యర్థి జోగి రమేష్ ఫ్లెక్సీలను ధ్వంసం చేశారు. ఆటో డ్రైవర్ ప్రవీణ్‌పై దౌర్జన్యానికి దిగి కులం పేరుతో దూషించారు. ఇంత జరుగుతున్నా కూటమి అభ్యర్థులు బాలశౌరి, బోడె ప్రసాద్ వారించలేదు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు ప్రతిఘటించటంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది.



మనిషి అత్యంత క్రూర జంతువు.
– ఫ్రెడరిక్ నీషే



సాక్షి

సోమవారం, 15 ఏప్రిల్ 2024

# నీరమ్మా... నీరు

ముసిల్దానికి అర్ధరాత్రి దప్పికేసింది. 'నీల్లు... నీల్లు'... ప్రాణం తుదకొచ్చి అంగలార్చింది. పదేళ్ల మనవరాలు పోలికి దిక్కు తెలియలేదు. బంగారమో, వెండో అయితే ఎవరింటి నుంచైనా దేబిరించి తేవచ్చు. నీళ్లెక్కడవి? అందునా రాళ్లమిట్ట అనే ఈ ఊళ్లో. వానలకు ముఖం వాచిన రాయలసీమ వాకిట్లో! 'నీల్లే'... ముసల్ది ఆర్తనాదం చేసింది. మనవరాలికి ఉన్నది ఒక్కతే అవ్వ. అవ్వకు మిగిలింది ఒక్కతే మనవరాలు. మనవరాలు అవ్వ దగ్గరికి వచ్చి నిలబడింది. ముసల్దాని కట్టె బిగుసుకుపోతూ ఉంది. 'తెస్తానుండవ్వా' సత్తు చెంబు తీసుకొని పరిగెత్తింది. ఎక్కడికి? పక్కింటికా? దాపున ఉన్న బావికా? ఎక్కడా నీళ్లు లేవు. ఊరవతల కోనేటికి వెళ్లాలి. ఈ రాత్రి... నిర్మానుష్యదారుల్లో. దాహానికి పిడచగట్టిన బాట వెంట. పోలి పరిగెత్తింది. భయంతో పరిగెత్తింది. దడతో పరిగెత్తింది. దప్పికతో పరిగెత్తింది. కోనేరు వచ్చింది. చీకటి పరదాలు కప్పుకుని ఉన్న నీరు. రాత్రయితే దెయ్యాలు తిరుగుతాయని చెప్పుకునే తావు. నుదుటి మీద చెమటతో పోలి కోనేటి మెట్ల మీద నిలుచుంది. వెళ్లిపోదామా? అవ్వ దప్పికతో ఉందే! ధైర్యం చేసి దిగింది. చెంబు ముంచింది. ఎవరో చేయి పట్టి లాగిన భ్రాంతి. 'ఓలమ్మో'. పోలి నీళ్లలో పడింది. జీవితాన మరలా దప్పికే వేయనంత నీరు తాగుతూ మింగుతూ ఆ చిన్నారి పోలి, పసిపిల్ల పోలి అలా అడుక్కు వెళ్లిపోయింది. రాయలసీమ రచయిత దాదా హయత్ రాసిన 'గుక్కెడు నీళ్లు' కథ ఇది.

నీళ్లెప్పుడో తెల్లారి మూడుగంటలకు వస్తాయి. నిద్ర చెడిపోతుంది. పోనీ వచ్చేవి నిండుగా వస్తాయా? రెండు బిందెలు దొరికితే పెన్నిధి. అంత తెల్లవారుజామున మొగుడు లేస్తాడా? పెళ్లామే లేవాలి! దక్కిన నీళ్లను ఇంట్లో మొగుడు సర్దుబాటు చేస్తాడా? పెళ్లామే చేయాలి. అన్నం దగ్గర అందరూ కూచున్నప్పుడు చేయి కడుక్కునే ఉప్పునీళ్ల చెంబు ఒకవైపు, తాగే నీళ్ల చెంబు ఒకవైపు. భూమి బద్దలైపోయినా చెంబులు మారడానికి లేదు. ఆ రోజు ఇంటి పిల్లాడు తాగే నీళ్లతో చేయి కడిగేశాడు పొరపాటున. అంతే! తల్లి భద్రకాళి అయ్యింది. పిల్లాడి వీపు చిట్లగొట్టేసింది. ఆనక వాణ్ణే పట్టుకుని బోరుమని ఏడ్చింది. ఆ కళ్లల్లో వచ్చేన్ని నీళ్లు కుళాయిలో వస్తే ఎంత బాగుండు! బండి నారాయణ స్వామి రాసిన 'నీళ్లు' కథ ఇది.

తల్లి 'ఒక బిందె నీళ్లు తేమ్మా' అంటే బిందె పట్టుకుని వెళ్లిన కూతురు సాయంత్రమైనా పత్తా లేదు. వయసొచ్చిన కూతురు. షాదీ చేయాల్సిన కూతురు. అందాక రోజూ నీరు మోసి తేవాల్సిన కూతురు. 'ఈ నీళ్ల బాధ పడలేనమ్మా. నన్ను నీళ్ల కోసం బయటకు పంపని గోషా పెట్టే ఇంట్లో పెళ్లి చెయ్యి' అనడిగిందా కూతురు. నీళ్లున్న చోట గోషా కానీ నీళ్లు లేని చోట ఏం గోషా! కూతురైనా, కోడలైనా నీళ్లకు పోవాల్సిందే. 'నీళ్లు ముందు... మతం తర్వాత తల్లీ!' అందా తల్లి కూతురితో. పాపం ఏమనుకుందో ఆ కూతురు! నీళ్ల బిందె పట్టుకెళ్లి ఆ తర్వాత ఎవరితోనో వెళ్లిపోయింది. ఎవరు తీసుకెళ్లాడో వాడు ఆమె చేత నీళ్లు మోయించకుండా ఉంటాడా? ఏమో! వేంపల్లి షరీఫ్ రాసిన 'పానీ' కథ ఇది.

కాళీపట్నం రామారావు 'జీవధార' కథ ప్రఖ్యాతమైనది. అందులో బస్తీ ఆడవాళ్లు సంపన్నుల బంగ్లా ముందు నీళ్ల కోసం నిలువుకాళ్ల కొలువు చేస్తుంటారు. 'వెళ్తారా కుక్కల్ని వదలమంటారా?' అంటుంటారా బంగ్లావాళ్లు. 'మీరు కుక్కల్ని వదిలితే మేము అంతకన్నా పెద్దగా మొరిగి తరిమికొడతాం' అంటారు బస్తీ ఆడవాళ్లు. పాలకుల పుణ్యాన నీళ్లు లేక వారిది కుక్కబతుకైంది మరి. పేదలు తెగబడితే నిలువరించే ఇనుపగేట్లు ఇంకా ఎవరూ కనిపెట్టలేదు. సంపన్నులు తల ఒంచి నీళ్లు ఇవ్వడానికి గేట్లు తెరుస్తారు.

పెద్దిభొట్ల సుబ్బరామయ్య 'నీళ్లు' కథ కూడా విఖ్యాతమైనదే. అందులో రాయలసీమ నుంచి విజయవాడకు ఉద్యోగం కోసం వచ్చిన యువకుడు ఎప్పుడు పడితే అప్పుడు నీళ్లు ముంచుకోదగ్గ కూజాను, ఎప్పుడు కావాలంటే అప్పుడు స్నానం చేయదగ్గ కృష్ణ ప్రవాహాన్ని చూసి తబ్బిబ్బవుతాడు. ఎన్ని బకెట్లు కావాలంటే అన్ని బకెట్లు పోసుకోదగ్గ బావి గట్టును అతడు వదలడే! 'మా ఊళ్లో ఇన్ని నీళ్లుంటే ఎంత బాగుండు' అని నీళ్లకు దీనులయ్యే తల్లినీ, చెల్లినీ అతడు తలుచుకు ఏడ్వని రోజు ఉందా?

ఇదంతా ఒక బాధైతే దళితులది మరో బాధ. అవును. నీటికి కూడా కులం ఉంటుంది. వారు తాగేందుకు వేరే గ్లాసుంటుంది. ఈ బాధ పడలేక ఇంట్లోనే బావి తవ్వించుకోవాలనుకుంటాడో దళిత లెక్చరరు అనంతపురంలో. కాని బండ పడుతుంది. బతుకులో వర్ణాశ్రమబండ... బావిలో రాతి బండ. కాని ఆగకూడదు. ఆగితే ప్రాణం, ఆత్మాభిమానం మిగలదు. ధైర్యం చేసి బండను తూటాలతో పేలుస్తాడు లెక్చరరు. బండ ముక్కలవుతుంది. గంగ పైకి ఎగజిమ్ముతుంది. నేలమ్మకు అంటరానితనం లేదు. అది ప్రతి బిడ్డకు నీళ్లు కుడుపుతుంది. కొలకలూరి ఇనాక్ 'అస్పృశ్య గంగ' కథ ఇది.

నీరు నాగరికత. నీరు సంస్కృతి. నీరు శుభ్రత. నీరు సిరి. నీరు శాంతి. నీరు గాదె. నీరు బోదె. నేల మీదున్న, నింగి మీదున్న నీటిని ఏ జనవాహినైతే కాపాడుకోగలదో దానిదే భవిష్యత్తు. మండు వేసవిలో నిండు కుండను ఇంట ఉంచగలిగేలా చూసేదే మంచి ప్రభుత. ప్రకృతి ఎన్నో సంకేతాలిస్తోంది. సూచనలు చేస్తోంది. నీళ్లింకిన నగరాలను ఆనవాలు పట్టిస్తోంది. నీళ్లు లేకపోతే ఏమవుతుందో సాహిత్యం కన్నీటి తడితో రాసి చూపింది. మేల్కొనడం మన వంతు!

# కాంగ్రెస్ ఇవ్వలేకపోయిన హామీ!

కామెంట్



కరణ్ థాపర్

**మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ 'రాజ్యాంగ పరిరక్షణ'కు మూడు ముఖ్యమైన హామీలను ఇచ్చింది. ఉభయ సభల్ని ఏడాదికి కనీసం వంద రోజులు సమావేశ పరచటం; ప్రతిపక్షాలు సూచించిన అంశాలపై చర్చకు సమయాన్ని కేటాయించటం; రెండు సభల ప్రిసైడింగ్ అధికారులు తమ పార్టీలతో సంబంధాలను తెంచుకోవాలన్న నిబంధన ద్వారా నిష్పాక్షికతను సాధించటం. అలాగే ఇంకొక హామీని కూడా కాంగ్రెస్ పార్టీ ఇచ్చి ఉండవలసింది. బ్రిటన్‌లో మాదిరిగా పార్లమెంటు సమావేశాలలో 'ప్రైమ్ మినిస్టర్స్ క్వశ్చన్ టైమ్'ని ప్రవేశపెట్టి ప్రతిపక్ష సభ్యుల ప్రశ్నలకు ప్రధానమంత్రే స్వయంగా సమాధానాలు ఇచ్చే సంప్రదాయాన్ని ప్రారంభించటం. మన పార్లమెంటు కోసం, మన ప్రజాస్వామ్యం కోసం, అంతకుమించి సుపరిపాలన కోసం ఇవి అవసరం.**

సాధారణంగా నేను రాజకీయ మ్యానిఫెస్టోల జోలికి వెళ్లను. చాలా సందర్భాలలో పార్టీ గానీ, లేదా ఓటరు గానీ వాటిని అంత సీరియస్‌గా తీసుకోరు. అయితే కాంగ్రెస్ పార్టీ తాజా మ్యానిఫెస్టోలోని పార్లమెంటు పని తీరుకు సంబంధించిన ఒక క్లాజు నా కంటపడింది.

మ్యానిఫెస్టోలోని 'రాజ్యాంగ పరిరక్షణ' అనే అంశం కింది 9వ క్లాజు మూడు నిర్దిష్టమైన, ముఖ్యమైన హామీలను ఇస్తోంది. **మొదటిది ఇలా చెబుతోంది:** 'పార్లమెంటు ఉభయసభలు దేనికది ఏడాదికి 100 రోజులు సమావేశం అవుతాయి అని మేము హామీ ఇస్తున్నాం.' నిజంగా ఇది మన ప్రజాస్వామ్య విధి నిర్వహణకు కావలసిన సత్తువను ఇస్తుంది. ఇందుకు వివరణగా, కోవిడ్ వల్ల ప్రభావితమైన లోక్‌సభవి కాకుండా, ఆ ముందరి సమావేశాల నుంచి నేను కొన్ని ఉదాహరణలు ఇస్తాను.

16వ లోక్‌సభ 1,615 గంటలు మాత్రమే పని చేసింది. ఇది అన్ని పూర్తికాల లోక్‌సభల సగటు కంటే 40 శాతం తక్కువ. 15వ లోక్‌సభలో 26 శాతం వరకు చట్టపరమైన బిల్లులు 30 నిమిషాల లోపే ఆమోదం పొందాయి. ఆ సంఖ్య తర్వాతి కాలంలో పెరిగి ఉండొచ్చు కానీ, 14, 15 లోక్‌సభలలో నమోదైన 71 శాతం, 60 శాతంతో పోలిస్తే 16వ లోక్‌సభలో కేవలం 25 శాతం బిల్లులే కమిటీల సూచనల కోసం వెళ్లాయి. దీనిని బట్టి, అమలుకు అవసరమైన అర్హతల పరిశీలనకు చట్టపరమైన బిల్లులు వెళ్లలేదని స్పష్టం అవుతోంది. లోక్‌సభ ఏడాదికి 100 రోజులు సమావేశం అయితే కనుక ఆ సమస్యకు మంచి పరిష్కారం దొరుకుతుంది.

**రెండవ హామీ:** 'రెండు సభల్లోనూ వారానికి ఒకరోజును ప్రతిపక్షాలు సూచించిన అంశంపై చర్చించటానికి కేటాయిస్తామని మేము హామీ ఇస్తున్నాం'. దీని అర్థం, ప్రభుత్వం నిరాకరించిన జీఎస్టీ, ధరల పెరుగుదల, పెగసస్, రఫేల్, చైనా చొరబాట్లు, ఎలక్టోరల్ బాండ్ల వంటి అంశాలు చర్చకు వస్తాయని! ప్రభుత్వం మొండిగా తిరస్కరించే వాటిని చర్చించేందుకు ఈ నిబంధన అత్యవసరతను కల్పిస్తుంది. పార్లమెంటరీ చర్చలను సంపూర్ణం, అర్థవంతం చేస్తుంది.

**మూడవ హామీ ఇలా చెబుతోంది:** 'రెండు సభల ప్రిసైడింగ్ అధికారులు (స్పీకర్, ఛైర్మన్) ఏ రాజకీయ పార్టీతో తమకున్న సంబంధాన్నయినా తెంచుకోవాలన్న నిబంధనను చేర్చుతామని మేము హామీ ఇస్తున్నాం.' ప్రస్తుతం లోక్‌సభ స్పీకర్ సభకు అధ్యక్షుడిగా బాధ్యతలను చేపట్టిన తర్వాత కూడా తన పార్టీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. అది ఆమోదయోగ్యం కాదు. అలా ఉండటం పక్షపాతానికి దారి తీస్తుంది. నిర్ణయాలను ప్రశ్నార్థకం చేస్తుంది. రాజ్యసభ ఛైర్మన్ కూడా అంతే. ప్రిసైడింగ్ అధికారి అయ్యాక కూడా వారు తమ పార్టీలో కొనసాగడం అన్నది అంతే సమానంగా (లోక్‌సభ స్పీకర్‌తో సమానంగా) ఆమోదయోగ్యం కానిది.





దీనికి అదనంగా నేను మరొకటి జోడిస్తాను. సిట్టింగ్ స్పీకర్ కనుక మళ్లీ ఎన్నికకు నిలబడితే అతడికి పోటీ లేకుండా చూడాలి. బ్రిటన్‌లో అలాగే జరుగుతుంది. దాని వల్ల స్పీకర్ స్థానంలోకి వచ్చే వారి తటస్థతకు హామీ ఉంటుంది. ఈ విషయాన్ని కాంగ్రెస్‌కు ఎందుకు ఆలోచించలేదో మరి?

ఏమైనా, కాంగ్రెస్ మ్యానిఫెస్టో మరొక కీలకమైన అడుగును ముందుకు వేసి ఉండవలసింది! బ్రిటన్ 'హౌస్ ఆఫ్ కామన్స్' సమావేశాలలో ఒక నిర్దిష్టమైన రోజున, ఒక అరగంట సేపు 'ప్రైమ్ మినిస్టర్స్ క్వశ్చన్ టైమ్' (పీఎంక్యూ) పేరిట – ప్రతిపక్ష నాయకుడు వేసే కనీసం అరడజను ప్రశ్నలతో పాటుగా, ప్రతిపక్షాలు అడిగే ప్రశ్నలకు ప్రధాన మంత్రి సమాధానాలు ఇవ్వటం అనే సంప్రదాయాన్ని మన దగ్గర మొదలు పెడతామని హామీ ఇవ్వవలసింది. దీని వల్ల ఉన్నత స్థాయిలో జవాబుదారీతనానికి భరోసా ఏర్పడటం మాత్రమే కాదు, దేశంలోనే అత్యంత శక్తిమంతమైన వ్యక్తిని ప్రశ్నించటానికి ప్రతిపక్షానికి అవకాశం లభిస్తుంది.

యూకేలో పీఎంక్యూస్ అని పిలిచే ఈ ప్రశ్నోత్తర సమయం రసవత్తరంగా సాగుతుంది. ఇటు ప్రధానమంత్రి, అటు ప్రతిపక్ష నాయకుడు... ఆ ఇద్దరిలోని అత్యుత్తమమైన ప్రతిభను వెలికి తీస్తుంది. అందుకే అది, దేశ ప్రజలు తమ నాయకుల పనితీరును వీక్షించి, వారేమిటో తెలుసుకోటానికి, వారి బలహీనతలను గుర్తించటానికి, వారి బలాలను ప్రశంసించటానికి ఒక గవాక్షం. ఒక్క మాటలో అది... ప్రజాస్వామ్యం పని చేయటం. ప్రపంచంలోనే అతి పెద్దదైన మన ప్రజాస్వామ్యానికి అలాంటి ఒక గవాక్షం ఇప్పుడు అత్యవసరం.

మరి ఈ హామీని ఇవ్వటానికి కాంగ్రెస్ ఎందుకు వెనకడుగు వేసింది? నరేంద్ర మోదీ దాడిని మల్లికార్జున్ ఖర్గే, లేదా రాహుల్ గాంధీ... తిప్పికొట్టలేరన్నదే కారణమా? వాళ్లు దీని గురించి ఎప్పుడూ ఆలోచించి ఉండరనీ, లేదా ఇది అసాధ్యం అని వారు కొట్టిపడేసి ఉంటారనీ నేను నమ్మలేను కనుక బహుశా అదే కారణం అయ్యుండాలని నా అనుమానం.

మ్యానిఫెస్టోలో ఇప్పుడు హామీ ఇచ్చినవాటినైనా కాంగ్రెస్ నెరవేర్చవలసిన అవసరం ఉంది. మన పార్లమెంటు కోసం, మన ప్రజాస్వామ్యం కోసం, అంతకుమించి సుపరిపాలన కోసం నెరవేర్చాలి. అందుకే ఇది నరేంద్ర మోదీకి, బీజేపీకి కూడా పరీక్ష. వారు నిజంగా భారతదేశం ప్రజాస్వామ్యానికి తల్లి వంటిది అని విశ్వసిస్తుంటే కనుక కాంగ్రెస్ మ్యానిఫెస్టోలోని హామీల అమలుకు వారెలా 'కాదు' అని చెప్పగలరు? నిజానికి ప్రతి ఆలోచనాత్మకమైన, బాధ్యత గల రాజకీయ పార్టీ కూడా ఈ ప్రతిపాదనలను ఆమోదిస్తుందని నేను ఆశిస్తున్నాను.

అయితే... విచారకరమైన, అంతుచిక్కని నిజం ఒకటి ఉంది. ప్రశ్నలను ఎదుర్కోవటానికి సిద్ధం అని ఏ పార్టీ అయినా అంటుందని కచ్చితంగా చెప్పగలను. కానీ ఆ పార్టీ అధికారంలోకి వస్తే, చర్య తీసుకోవలసిన స్థితిలో ఉంటే ప్రశ్నలకు సిద్ధంగా ఉండగలదా? ఇక్కడే సందేహాలు కదలాడుతున్నాయి.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!





సోషల్ మీడియా

### వాళ్లదే బాధ్యత



చాలా రోజులుగా ఉన్న సరిహద్దు ప్రతిష్టంభనను అంతం చేయడానికి చర్చలే మార్గమన్న తన విధానానికి అనుగుణంగానే చైనా మీద మోదీ తాజా వ్యాఖ్యలు ఉన్నాయి. అందుకే ఆయన చైనా మీద స్పష్టమైన ఆంక్షలను విధించకుండా నియంత్రించుకున్నారు. కానీ ఆయన వ్యాఖ్యలు సరిహద్దు శాంతిని నెలకొల్పాల్సిన భారం దురాక్రమణదారుదేనన్న సంకేతాన్ని ఇస్తున్నాయి.

– బ్రహ్మ చెల్లానీ, వ్యూహాత్మక అంశాల నిపుణుడు

### పోలీసులు పూజారులా?



ఇది అర్థరహితం. ఒకవేళ ఆలయం(అయోధ్య రామాలయం) పోలీసుల కాపలాను కోరివుంటే, వాళ్లు తమ యూనిఫారాల్లో రావాలి. లేదంటే ఆలయమే ఉద్యోగులను నియమించుకుని వారికి ఏది ఉచితం అనుకుంటే ఆ యూనిఫారమే ఇచ్చుకోవచ్చు. పోలీసులను ఎలా అంటే అలా మెలితిప్పడానికి వాళ్లు మీ మనుషులు కాదు. (పోలీసులకు పూజారుల దుస్తులు ఇచ్చారన్న వార్త నేపథ్యంలో.)

– దీప్‌శిఖా ఘోష్, వైద్యురాలు

### కొత్త విషయం



కొన్ని వారాల్లో 'ద మంకీ మ్యాన్' సినిమా పాకిస్తాన్‌లో విడుదల కానుంది. బహుశా ఒక సినిమా ఇండియాలో నిషేధానికి గురై, అది పాకిస్తాన్‌లో ఆడటం తొలిసారని ఒక పాకిస్తాన్ స్నేహితుడు వ్యాఖ్యానించాడు.

– అసీమ్ ఛాబ్రా, సినిమా నటుడు

### అంతేనా?



అమెరికా అనేది చిత్రమైన దేశం. జీరు కొనడానికి ఫొటో ఐడీ అడుగుతారు; కానీ అదే అధ్యక్షుడికి ఓటు వేసేటప్పుడు అదేమీ అక్కర్లేదు. బీరే అంతకంటే విలువైనదని వారు స్పష్టంగా అనుకుంటూ ఉండాలి!

– సంక్రాంత్ సాను, ఆంట్రప్రెన్యూర్

### మంచి నాయకులైతే చాలు!



మనకు దేశంలో 'ముస్లిం' నాయకుడు అక్కర్లేదు. అదేవిధంగా, 'హిందూ' నాయకుడు కూడా అక్కర్లేదు. ఇలాంటి ఆలోచనా విధానమే పాకిస్తాన్ పుట్టుకకు కారణమైంది. మనకు కావాల్సిందల్లా వాళ్ల మతంతో నిమిత్తం లేకుండా దేశ నిర్మాణం కొరకు పాటుపడగలిగే సమర్థులైన నాయకులు.

– ఒమర్ ఘాజీ, రచయిత

### నా జట్టు



టీ20 ప్రపంచ కప్‌కు నా 15 మంది: రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, యశస్వీ జైస్వాల్, శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్, సంజు శామ్సన్, రింకూ సింగ్, హార్దిక్ పాండ్యా, రవీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్, రవి బిష్ణోయి, జస్‌ప్రీత్ బుమ్రా, మయాంక్ యాదవ్, మహమ్మద్ సిరాజ్, సూర్యకుమార్ యాదవ్.

– ఖాలిద్ బేగ్, యూట్యూబర్

ఇన్ బాక్స్

## ఒక 'మంచి' ప్రయాణం

ఉద్యోగాలు చేసుకునే నలుగురు మిత్రులు పిల్లల పుస్తకాల కోసం తెలుగులో ఒక సంస్థ ఉండాలనుకుని బాలసాహితి పేరుతో 1990లో ట్రస్ట్ ఏర్పాటు చేశారు. పదేళ్ళ కాలంలో 40 పుస్తకాల దాకా తెచ్చారు. తరువాత కొనసాగించలేకపోయినా ఆ 40లో 20 పుస్తకాలను వేర్వేరు సంస్థలు నేటికీ ప్రచురిస్తూ ఉండటం వాటి గొప్పతనానికి నిదర్శనం. తెలుగులో పిల్లల కోసం పుస్తకాలు తేవాలన్న కోరిక మాత్రం వారిలో అలానే ఉంది. 2002లో పుస్తకాలతో స్నేహం పేరుతో హైదరాబాద్ పుస్తక ప్రదర్శనలో స్టాల్ పెట్టారు. పుస్తక ప్రదర్శనకు వచ్చిన పిల్లల తల్లిదండ్రులు, టీచర్లతో ఎలాంటి పుస్తకాలు ఉండాలి? ఎలా చదివించాలి? అనే అంశాలు గురించి మాట్లాడారు. ఈ అనుభవాల ఆధారంగా 'మంచి పుస్తకం' తరఫున ప్రచురణలు 2003లో ప్రారంభించారు. పిల్లల్లో పుస్తకాల పట్ల ప్రేమను కలిగించటం, తెలుగులో పఠనా సామర్థ్యాన్ని పెంచటం ప్రధాన లక్ష్యంగా 'మంచి పుస్తకం' పని చేస్తోంది. తెలుగు, తెలుగు–ఇంగ్లీషు, ఇంగ్లీషు, హిందీ భాషలలో 470 పుస్తకాలను ప్రచురించింది. వీటిలో బొమ్మల కథలు, కథలు, నవల, జీవిత చరిత్ర, లైఫ్ స్కిల్స్, యాక్టివిటీ, విజ్ఞాన శాస్త్రం తదితర అంశాల్లో పుస్తకాలు ఉండటం గమనార్హం. పిల్లల కోసం పుస్తకాలను 5–8, 8–12, 12–14, 14+ వయసులలో విభజించారు.



తన ప్రచురణలే కాకుండా సి.బి.టి., విజ్ఞాన ప్రచురణలు, పీకాక్ క్లాసిక్స్, కావ్య పబ్లిషింగ్ హౌస్, హెచ్.బి.టి. వంటి ఎంపిక చేసిన సంస్థల ప్రచురణలు కూడా అందుబాటులో ఉంచుతోంది. వారి ఉద్దేశాలలో కలిసి వచ్చే సంస్థలతో కలిసి పని చెయ్యటానికి 'మంచి పుస్తకం' మొదటి నుంచి ప్రాధాన్యం ఇచ్చింది. వీటిల్లో విజ్ఞాన ప్రచురణలు (మొదట్లో జన విజ్ఞాన వేదిక) ఒకటి. విజ్ఞాన శాస్త్రానికి సంబంధించినవే కాకుండా ఇంకా ఎన్నో పుస్తకాలు ఈ రెండు సంస్థల ఉమ్మడి ప్రచురణలుగా ఉన్నాయి. వికాస విద్యావనం, జాబిల్లి ట్రస్ట్, దేవినేని సీతారావమ్మ ఫౌండేషన్, వాహిని, శాంతి వనం, అలరు వంటి సంస్థలతో ఉమ్మడి ప్రచురణలు చేపట్టారు. తొలి రోజుల్లో ఎక్కువగా అనువాద పుస్తకాలు ప్రచురించిన 'మంచి పుస్తకం' క్రమేపీ తెలుగులో మూల రచనలను ప్రచురించటం మొదలు పెట్టింది. ఇందులో చెప్పుకోదగినది 'తానా'తో భాగస్వామ్యం. 2017 నుంచి మొదలు పెట్టి పదేళ్ల లోపు పిల్లల కోసం 28 బొమ్మల కథల పుస్తకాలు, పదేళ్లు పైబడిన పిల్లల కోసం 21 నవలలు తీసుకువచ్చి కొత్త ప్రయోగం చేశారు. ఒక సమయంలో పిల్లల పుస్తకాలు అంటే సోవియట్ బాల సాహిత్యంగా ఉండేది. ఇందులోంచి 50కి పైగా పుస్తకాలను 'మంచి పుస్తకం' తిరిగి ముద్రించింది. అనేక మంది అనువాదకులు, రచయితలు, చిత్రకారులు 'మంచి పుస్తకం' ప్రచురణలలో సహకరించారు. అదే విధంగా కొంతమంది రచయితలు, చిత్రకారులను 'మంచి పుస్తకం' పరిచయం చేసింది.

మంచి పుస్తకం వ్యవస్థాపక ట్రస్టీలుగా కె. సురేష్, ఎ.రవీంద్ర బాబు ఉన్నారు. 2010 నుంచి ట్రస్టీగా కొనసాగుతున్న ఎస్.ఎస్.లక్ష్మి క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. 2007 నుంచి తన పూర్తి సమయాన్ని ఇస్తున్న పి.భాగ్యలక్ష్మి పుస్తకాలను పిల్లలకు చేరువ చేయటంలో చేస్తున్న కృషి ఎనలేనిది. వీరి ప్రయాణం దిగ్విజయంగా కొనసాగాలని కోరుకుందాం.

– వలేటి గోపీచంద్, ఆకాశవాణి విశ్రాంత ఉద్యోగి । 94412 76770
(నేడు హైదరాబాద్‌లో 'మంచి పుస్తకం' ఇరవై ఏళ్ల సభ)

# ప్రజలు 'సిద్ధం'గా ఉన్నారు!

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మే నెల 13వ తేదిన అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ ఎన్నికలు అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి, ప్రతిపక్ష తెలుగు దేశం పార్టీకి ప్రతిష్ఠాత్మకంగా మారాయి. ముఖ్యంగా టీడీపీకి జీవన్మరణ సమస్యగా ఈ ఎన్నికలు తయారయ్యాయి. అందుకే ఆ పార్టీ శత విధాల ప్రయత్నించి బీజేపీ, జనసేనలతో పొత్తుపెట్టుకుని, పచ్చ మీడియా సాయంతో వైఎస్సార్‌సీపీని ఢీ కొంటోంది.

చంద్రబాబు నాయుడు, లోకేష్ వంటివారు కరోనా కరాళ నృత్యం చేసిన సమయంలో జాడ లేకుండా పోయి ఎన్నికల సమయంలో ప్రజల ముందు వాలిపోయారు. ఇంగ్లీషు మీడియం స్కూల్స్ వద్దనీ, పేద ప్రజలకు అమరావతిలో పట్టాలివ్వకూడదనీ అన్న తెలుగు దేశం అధినాయకుణ్ణి పేద ప్రజలు అసహ్యించు కొంటున్నారు. ప్రజలకు ఇచ్చే సంక్షేమ పథకాలు వాళ్ళను సోమరిపోతులను చేస్తున్నాయన్న నారా బాబు మాటలు ఆయన ఎంతటి సంక్షేమ వ్యతిరేకో తెలుపుతున్నాయి.

చంద్రబాబు నాయుడు 'పచ్చ మీడియా'తో కలిసి ప్రభుత్వంపైనా, వైఎస్సార్ సీపీ పైనా విషం చిమ్మడం దినచర్యగా పెట్టుకున్నారు. ఒంటరిగా అధికార పక్షాన్ని ఎదుర్కోలేని టీడీపీ... జనసేనతో పాటూ బీజేపీతోనూ పొత్తు పెట్టుకుని పోటీ చేస్తోంది. పోలవరం చంద్రబాబుకు పేటీఎం అయ్యిందని సాక్షాత్తు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్న విషయం ప్రజల మెదళ్ళ నుండి తొలగించగలరా? అలాగే చంద్రబాబు నాయుడు నరేంద్ర మోదీని గత ఎన్నికల్లో తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టారు కదా... అయినా బీజేపీ – టీడీపీ ఎలా పొత్తు పెట్టుకొన్నాయి?

నిన్న మొన్నటివరకూ వలంటీర్ల వ్యవస్థనూ, ప్రజా సంక్షేమ పథకాలనూ దుయ్యబట్టిన చంద్రబాబు... ఎన్నికలు రావడంతో నాలుక మడతేసి, వాలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తాననీ, జగన్ కంటే ఎక్కువ సంక్షేమ పథకాలు అందిస్తాననీ, తనను గెలిపిస్తే సంపద సృష్టించి అప్పుల ఆంధ్రాను స్వర్ణాంధ్రప్రదేశ్ చేస్తాననీ అంటున్నారు. ప్రజలు నమ్ముతారా? చంద్రబాబు మాటలకు విశ్వసనీయత ఉందా? ఎన్నికల ముందు కోటి వరాలిస్తారు; గెలిచిన తర్వాత నరాలు కోస్తారని ఆయన గత చరిత్రే చెబుతోంది. టీడీపీ గత మేనిఫెస్టోలో అలవిగాని హామీలిచ్చి, ప్రభుత్వం ఏర్పరచిన తర్వాత మేనిఫెస్టోను ఎవరికీ కనిపించకుండా చేసిన వైనాన్ని ప్రజలు మరచిపోలేదు. ఇలాంటి చంద్రబాబుకు ప్రజలు ఏ విధంగా ఓట్లు వేస్తారు?



ఇకపోతే జనసేన పార్టీ విషయానికి వద్దాం. బోల్డన్ని పుస్తకాలు చదివానని చెప్పుకునే పవన్ కల్యాణ్‌కు ప్రాక్టికల్ నాలెడ్జ్ లేదు. అన్న పెట్టిన ప్రజారాజ్యం పార్టీలో 'యువరాజ్యం' అధినేతగా ఉన్నప్పటికీ రాజకీయాల్లో ఇంకా ఓనమాలు కూడా నేర్చుకోలేదు. ప్రశ్నిస్తానని రాజకీయాల్లోకి వచ్చి, గత తెలుగుదేశం పార్టీ పాలనలో ఏమి ప్రశ్నించావని ప్రజలు అడుగుతున్నారు. పూనకం వచ్చిన వాడిలాగా ఊగిపోతూ ప్రగల్భాలు పలకడం, ముఖ్యమంత్రిని సైతం దారుణమైన భాషతో తిట్టడం... ఇవి తప్ప ఆయనకు ఏమీ తెలియదని ఆయన ఎన్నికల ప్రసంగాలు విన్న ప్రజలు అంటున్నారు. ఏ కులాన్నయితే పవన్ కల్యాణ్ నమ్ముకున్నారో, ఆ కులం వాళ్లు... జనసేన విడిగా పోటీ చేస్తే ఓట్లేయ్యటానికి సిద్ధంగా ఉన్నారు కాని తెలుగుదేశంపార్టీకి బోయీలుగా మారటానికి వాళ్ళు సిద్ధంగా లేరని కొందరంటున్నారు.

ఇక భారతీయ జనతాపార్టీ వ్యవహారం చూద్దాం. 2014 ఎన్నికల్లో తిరుపతి వెంకన్న సాక్షిగా ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పి, సంఘటన ప్రజలకు చిరకాలం గుర్తుండి పోయేదే. అంతేకాక కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రయివేట్ పరంచేయటానికి పూనుకోవటం ప్రజల మనస్సులను తీవ్రంగా కలచివేసింది. టీడీపీతో అనైతిక పొత్తు కూడా ప్రజలు ఆ పార్టీని వ్యతిరేకించడానికి ఒక కారణంగా నిలుస్తోంది.

ఇక కాంగ్రెస్ కూటమి సంగతి కొద్దాం. సీపీఐ, సీపీఎంలతో ఈ పార్టీ పొత్తుపెట్టుకుని ఇక్కడ ఎన్నికల బరిలో దిగింది. రాష్ట్రాన్ని అడ్డగోలుగా విభజించి, అనంతరం ఏమాత్రం న్యాయం చెయ్యకపోవటం కాంగ్రెస్ పార్టీ చేసిన పెద్ద తప్పిదం. అందుకే ఆ పార్టీ ఏపీలో నామరూపాల్లేకుండా పోయింది. ఇప్పట్లో తలెత్తే పరిస్థితీ లేదు. ఇంత కంటే ఆ పార్టీ గురించి చెప్పడానికి ఏమీ లేదు.

చివరగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పరిస్థితిని గమనిద్దాం. భారతదేశ చరిత్రలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రీ చేపట్టని సంక్షేమ పథకాలను అవినీతి, బంధు ప్రీతి లేకుండా నేరుగా ప్రజల ముంగిటలోకి వలంటీర్ వ్యవస్థ ద్వారా తెచ్చిన ఘనత వైఎస్సార్ సీపీ అధినేత, ముఖ్యమంత్రి జగన్‌దే అనడం అతిశయోక్తి కాదు. పేద ప్రజలకు విద్య, వైద్య సేవలను అందించడంలో జగన్ చేసిన కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలచిపోతుంది. 'నాడు–నేడు' ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చి, ఇంగ్లీషు మీడియంను ప్రవేశపెట్టి ఎందరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా మొక్కవోని ధైర్యంతో ముందుకే వెళ్లారు జగన్. 'ఆరోగ్యశ్రీ' కార్డు పరిమితిని రూ. 25 లక్షల వరకు పెంచిన ఘనత ఆయనదే. 'విలేజ్ క్లినిక్'ల ద్వారా ప్రజలకు వైద్యం అందించడం జగన్ ప్రభుత్వానికే సాధ్యమయ్యింది. 'నవరత్నాలు' పొందుపరచిన మ్యానిఫెస్టోను ఒక బైబిల్‌లాగా, ఒక ఖురాన్ లాగా, ఒక భగవద్గీతలాగా భావించటం జగన్ దార్శనికతకు నిదర్శనం. 'అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, జగన్ గోరుముద్ద, కాపునేస్తం, లానేస్తం, అవ్వ తాతలకు పెన్షన్, విద్యాదీవెన, వసతి దీవెన' లాంటి మరెన్నో పథకాలకు రూపశిల్పి జగనే కదా! 'నా ప్రభుత్వం వలన మీకు, మీ కుటుంబానికి లబ్ధి జరిగితేనే మీ బిడ్డను ఆశీర్వదించి, చల్లని దీవెనలిచ్చి, గెలిపించండి' అని అన్నారంటే జగన్‌కు తాను ప్రజలకు చేసిన మేలుపై ఎంత నమ్మకం ఉండి ఉండాలి?

ఇంతటి బాహుబలిని ఢీ కొట్టడం ఎవ్వరికీ సాధ్యపడదు. మే 13న బాక్సులు బద్దలవ్వటం ఖాయం. విజయం ఎవరి పరమని వేరే చెప్పాలా? జూన్‌లో నూతన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా మరోసారి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ, మహిళల వంటి అణగారిన, పీడిత వర్గాలవారి అండతో గెలిచి పెత్తందార్లపై పేదలు సాధించే విజయం ఎలా ఉంటుందో చూపించబోతున్నారు.

– గుత్తికొండ విశ్వేశ్వరరావు
రాజకీయ విశ్లేషకులు । 90522 20464

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** శు.సప్తమి ప.3.50 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** పునర్వసు పూర్తి (24గంటలు), **వర్జ్యం:** సా.5.44 నుండి 7.24 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.23 నుండి 1.14 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.42 వరకు, **అమృతఘడియలు:** రా.3.22 నుండి 5.56 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.49, **సూర్యాస్తమయం:** 6.11.

## క్లుప్తంగా...

### ఇలాంటి ఘటనలు ప్రజాస్వామ్యానికి ప్రమాదం

- సీఎం జగన్‌పై హత్యాయత్నాన్ని ఖండించిన హైకోర్టు న్యాయవాదుల సంఘం

**సాక్షి అమరావతి:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నాన్ని హైకోర్టు న్యాయవాదుల సంఘం తీవ్రంగా ఖండించింది. ఇలాంటి ఘటనలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని సంఘం ప్రధాన కార్యదర్శి వి.సాయికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం జగన్‌కు ప్రజల్లో ఆదరణ పెరుగుతుండటంతో ఓర్వలేని వ్యక్తులు ఇలాంటి దారుణాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు.

**దర్యాప్తు చేయాలి**

ముఖ్యమంత్రిపై దాడికి బాధ్యులైన వారిని వెంటనే పట్టుకోవాలని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది చిత్తరవు నాగేశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు. కుట్రకోణంపై లోతైన దర్యాప్తు చేయాలని పోలీసులను కోరారు.

### రెబల్‌గా పోటీకి దిగుతా

- టీడీపీ మాజీ ఎమ్మెల్యే మీసాల గీత



**విజయనగరం రూరల్:** టీడీపీ ఇక్కడి పెద్దల కళ్లల్లో ఆనందం కోసమే తనకు అన్యాయం చేసిందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత మీసాల గీత ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మాభిమానం కోసం తాను రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తానని చెప్పారు ఆదివారం విజయనగరంలో మీడియాతో మాట్లాడుతూ.. టీడీపీ అధినేత చంద్రబాబు, లోకేశ్ 2024 ఎన్నికల్లో సీటు గ్యారెంటీ అని హామీ ఇచ్చారని, తీరా అభ్యర్థుల జాబితాలో పేరు లేదన్నారు. 2014 ఎన్నికల్లో 15 వేలకు పైగా మెజార్టీతో గెలిచిన తనకు 2019 ఎన్నికల్లో సీటు ఇవ్వలేదన్నారు. అయినా పార్టీ కోసం పని చేశానని, తనపై ఎటువంటి ఆరోపణలు లేకపోయినా ఇక్కడ పార్టీ పెద్దల కళ్లల్లో ఆనందం కోసమే ఈసారి సీటు ఇవ్వలేదని పరోక్షంగా అశోక్‌గజపతిరాజును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. సీటు ఇవ్వకపోయినా కనీ సం సంప్రదింపులైనా చేయకుండా అధిష్టానం అవమానించిందని, ఆత్మాభిమానం దెబ్బతినడంతో రెబల్‌గా పోటీకి దిగుతానని స్పష్టం చేశారు. పార్టీని ధిక్కరించే ఆలోచన లేదని, పార్టీకి రాజీనామా చేయనని, గౌరవాన్ని నిలబెట్టుకోవడానికే పోటీ చేస్తున్నానని వ్యాఖ్యానించారు.

### విశాఖ కూటమి ఎంపీ అభ్యర్థి మార్పుపై చర్చ!

- సీఎం జగన్‌పై హత్యాయత్నం హేయమైన చర్య
- బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు



**సాక్షి, విశాఖపట్నం:** విశాఖపట్నం లోక్‌సభ కూటమి అభ్యర్థి మార్పుపై తమ పార్టీలో చర్చ జరుగుతున్నదని బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు తెలిపారు. దీనిపై పార్టీ అధిష్టానం ఏం నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సి ఉందన్నారు. ఆదివారం విశాఖ బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. విశాఖ ఎంపీ స్థానాన్ని జీవీఎల్ ఆశించారు. అయితే కూటమి పొత్తులో టీడీపీ అభ్యర్థి, లోకేశ్ తోడల్లుడు భరత్‌కు ఈ సీటును కేటాయించారు. దీంతో అప్పట్నుంచి తీవ్ర అసంతృప్తితో ఉన్న ఆయన తనకు ఈ సీటు రాకుండా పురందేశ్వరి అడ్డుపడ్డారని ఇదివరకే పరోక్షంగా చెప్పారు. ఈ నేపథ్యంలో విశాఖ కూటమి అభ్యర్థి మార్పుపై చర్చ జరుగుతున్నదన్న ఆయన ప్రకటనకు ప్రాధాన్యత సంతరించుకుంది. కాగా ప్రధాని మోదీ ఆదివారం విడుదల చేసిన బీజేపీ మేనిఫెస్టో అన్ని వర్గాల వారికి మేలు చేకూర్చేదిగా ఉందని జీవీఎల్ అన్నారు. ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం హేయమైన చర్యగా జీవీఎల్ అభివర్ణించారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

# ఏపీకి మళ్లీ జగనే సీఎం కావాలి

## రాష్ట్రాభివృద్ధి కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీనే అధికారంలోకి రావాలి

- వైఎస్ జగన్ చరిష్మాను తట్టుకోలేని దుష్టశక్తుల కుట్రలను తిప్పి కొట్టాలి
- హైదరాబాద్‌లో 'మేమంతా సిద్ధం' సభలో వక్తల పిలుపు
- జై జగన్ నినాదాలతో మార్మోగిన కూకట్‌పల్లి పరిసరాలు

**కూకట్‌పల్లి (హైదరాబాద్):** ఏ నోట విన్నా అదే మాట.. ఏ నోట విన్నా అదే పాట.. జై జగన్.. జైజై జగన్.. కూకట్‌పల్లిలో ఆంధ్రప్రదేశ్ ఓటర్లు మేమంతా సిద్ధం పేరిట ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ అభిమానుల ఆత్మీయ సమ్మేళనం జగన్నినాదంతో పోటెత్తింది. జెండాలు జతకట్టడమే మీ ఎజెండా.. జనం గుండెల్లో గుడి కట్టడమే జగన్ ఎజెండా' అంటూ యువత హోరెత్తించింది. కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి నియోజకవర్గాల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉన్న వేలాది మంది ఏపీ ఓటర్లు ఈ ఎన్నికల్లో మళ్లీ ఫ్యాన్ తడాఖా చూపిస్తామంటూ నినదించారు. ఆదివారం ఎస్ఎకెఎస్ఆర్ గార్డెన్‌లో జరిగిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌కి చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రసంగించారు. ఏపీని అన్ని రంగాల్లో అగ్రగామిగా అభివృద్ధి చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విపక్షాలు రాజకీయంగా ఎదుర్కోలేకనే భౌతిక దాడులకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. రాష్ట్రం విడిపోయి కష్ట కాలంలో ఉన్న సమయంలో రూ.లక్షల కోట్లతో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. పేద విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియం చదువు కోసం ఏపీలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ. 54 వేల కోట్లను వెచ్చించిందని గుర్తుచేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకెళ్లిన వైఎస్ జగన్ ప్రభుత్వానికి ప్రజలు నీరాజనాలు పలుకుతుంటే ఓ వైపు ఎల్లో మీడియా, మరో వైపు ప్రతిపక్షాలుగా చెప్పుకుంటున్న అన్ని పార్టీలు మళ్లీ మాఫియాలా తయారయ్యాయని ధ్వజమెత్తారు.



వైఎస్సార్‌సీపీ అభిమానుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న తిరుపతి ఎంపీ గురుమూర్తి



హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో జరిగిన ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన వైఎస్సార్‌సీపీ అభిమానులు

### అందరూ ఓట్లేయాలి

తిరుపతి ఎంపీ అభ్యర్థి గురుమూర్తి, ఎమ్మెల్యే అభ్యర్థులు రఘురామిరెడ్డి, అన్నాబత్తుని శివ కుమార్, ఎమ్మెల్సీలు శివరామిరెడ్డి, కల్పలతతో పాటు నేతలు కరుణాకర్‌రెడ్డి, ఎంఈవీప్రసాద్ రెడ్డి, హనుమంతరెడ్డి, ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి తదితరులు ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్‌లో మాఫియా ముఠాలు ఎన్ని కుట్రలు పన్నినా వైఎస్సార్‌సీపీదే అంతిమ విజయమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో రూ.15 లక్షల కోట్ల పెట్టుబడులతో అభివృద్ధి పనులు, పరిశ్రమలు వచ్చాయని, అవి సంపూర్ణంగా ఆంధ్ర ప్రజలకు అందాలంటే జగన్ మరోసారి సీఎం కావాల్సిందే అని వారు తెలిపారు. ఇక్కడి కార్యకర్తలందరూ వారం రోజులు ముందుగానే తమ గ్రామాల్లో ఉన్న ఓటర్ల వివరాలను సేకరించుకుని వారితో ఓటు వేసే విధంగా కృషి చేయాలని సూచించారు. నిర్వాహకులు ఎస్వీ సుబ్రమణ్యం, బాణరాగవు సునీల్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, చంద్రారెడ్డి, విజయభాస్కరరెడ్డి, రఘురాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. తొలుత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి, వైఎస్సార్ విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు.



సిద్ధం సాంగ్ ఆవిష్కరిస్తున్న నాయకులు

## శ్రీవారి సేవలో హరియాణా, శ్రీలంక గవర్నర్లు

**తిరుమల:** తిరుమల శ్రీవారిని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, శ్రీలంక గవర్నర్ సెంథిల్ తొండమాన్ ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు.



హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ



శ్రీలంక గవర్నర్ సెంథిల్ తొండమాన్

**17న తిరుమలలో శ్రీరామనవమి ఆస్థానం**

తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 17వ తేదీన శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆస్థానం నిర్వహించనున్నారు. ఉదయం తొమ్మిది నుంచి 11 గంటల వరకు రంగనాయకుల మండపంలో శ్రీ సీతారామ లక్ష్మణ సమేత హనుమంతులవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు శ్రీరాముల వారు హనుమంత వాహనంపై మాడ వీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షిస్తారు. అలాగే 18వ తేదీ రాత్రి ఎనిమిది గంటల నుంచి తొమ్మిది గంటల నడుమ బంగారువాకిలి చెంత ఆలయ అర్చకులు శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం నిర్వహిస్తారు. దీంతో సహస్ర దీపాలంకార సేవను టీటీడీ రద్దు చేసింది.

## వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు



వైఎస్సార్‌సీపీలో చేరిన చేజర్ల సుబ్బారెడ్డి తదితరులతో నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి

- నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన టీడీపీ నేతలు, కార్యకర్తలు
- సొంత గూటికి మాజీ ఎంపీపీ చేజర్ల

**సాక్షి ప్రతినిధి, నెల్లూరు/ పెనుమంట్ర/మోపిదేవి(అవనిగడ్డ):** రాష్ట్రంలో టీడీపీ గ్రాఫ్ రోజురోజుకూ దిగజారుతోంది. ఆ పార్టీ నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. తాజాగా శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని ఉదయగిరి నియోజకవర్గానికి చెందిన మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి తన అనుచరులతో కలిసి ఆదివారం నెల్లూరు లోక్‌సభ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి, నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయనతో పాటు నోటి శ్రీనివాసులురెడ్డి, బాలిబోయిన శ్రీనివాసులు, ఉప్పుటూరి హరి, రవి, కంభాల నరసింహారెడ్డి, వాకా తిరుపాల్‌రెడ్డి, కందల శేఖర్, చేజర్ల సుధాకర్‌రెడ్డి, చేజర్ల వెంకట్రామిరెడ్డి, కృష్ణారెడ్డి, సుజాత, అంబటి శివ, కొండా రాజశేఖర్, వాకా వెంకటేశ్వరరెడ్డి తదితరులకు విజయసాయిరెడ్డి పార్టీ కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి ఉన్న చేజర్ల సుబ్బారెడ్డి నెల కిందట కొన్ని అనివార్య కారణాల వల్ల టీడీపీలో చేరినా.. అక్కడ ఇమడలేక తిరిగి వైఎస్సార్‌సీపీలోకి రావడం శుభపరిణామమన్నారు. చేజర్ల సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రి చేసుకునేందుకు, ఉదయగిరిలో మేకపాటి గెలుపు కోసం కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీలు బీదా మస్తాన్‌రావు, మోపిదేవి వెంకటరమణ, పార్టీ నాయకులు జూపూడి ప్రభాకర్‌రావు, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, గురవారెడ్డి, మోది రామాంజనేయులు, పాముల రమణయ్య, నిర్మల తదితరులు పాల్గొన్నారు. కాగా, పశ్చిమ గోదావరి జిల్లా పెనుమంట్ర మండలం ఎస్.ఇల్లిందలపర్రుకి చెందిన టీడీపీ నేత, మాజీ సర్పంచ్ గంటా శ్రీనుతోపాటు పలువురు టీడీపీ కార్యకర్తలు ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చెరుకువాడ సమక్షంలో ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. కృష్ణాజిల్లా మోపిదేవిలోని ఎస్సీ కాలనీలో టీడీపీ, కాంగ్రెస్ పార్టీకి చెందిన 10 కుటుంబాలు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి.



మోపిదేవిలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

# నీ మీద రాయి వేస్తే కొంపలు కూలినట్లు మాట్లాడతావా?

## పోలీసులు, కరెంట్ డిపార్ట్‌మెంట్‌దే తప్పు

- డీజీపీ, సీఎస్, ఇంటెలిజెన్స్‌కు బాధ్యత లేదా?
- గాజువాక సభలో చంద్రబాబు అహంకారపూరిత వ్యాఖ్యలు
- స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా కాపాడింది తానేనంటూ అబద్ధాలు



జనం లేక వెలవెలబోతున్న చంద్రబాబు సభ

**సాక్షి, విశాఖపట్నం/సాక్షి, అనకాపల్లి:** 'నీ మీద రాయి వేస్తే కొంపలు కూలిపోయినట్లు మాట్లాడతావా? నేనే వేశానని అంటున్నారు. నేను గులకరాళ్లు వేయిస్తానా' అంటూ విశాఖ జిల్లా గాజువాక, అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో ఆదివారం నిర్వహించిన ప్రజాగళం బహిరంగ సభలో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఉద్దేశించి అహంకారపూరిత వ్యాఖ్యలు చేశారు. 'అసలు ఎవరిది తప్పు? పోలీసులు, కరెంట్ డిపార్ట్‌మెంట్‌దే తప్పు. పోలీసులకు, డీజీపీకి, ఇంటెలిజెన్స్‌కు, సీఎస్‌కు బాధ్యత లేదా' అని అన్నారు. 'కోడికత్తి డ్రామాలు వేశావు. గొడ్డలి వేటుతో బాబాయిని చంపేసి నామీద పెట్టాలని ప్రయత్నించావు. ఇప్పుడు నీ చెల్లి అడుగుతుంటే సమాధానం చెప్పలేకపోతున్నావు. ఇప్పుడు విజయవాడలో డ్రామాలు వేస్తున్నారు' అంటూ సీఎం జగన్‌పై దాడిని అవహేళన చేస్తూ మాట్లాడారు. సీఎం జగన్‌పై హత్యాయత్నాన్ని అవహేళనగా మాట్లాడటంపై ప్రజలు బాబు తీరుని అసహ్యించుకున్నారు. జగన్ రూ.13 లక్షల కోట్లు అప్పు చేసి బటన్ నొక్కినా ఎవరి జీవితాలూ మారలేదని చంద్రబాబు అన్నారు. వాజ్‌పేయి ప్రధానిగా ఉన్న సమయంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా కాపాడింది తానేనంటూ బాబు అబద్ధాలు చెప్పేశారు. వలంటీర్లతో నేరాలు, ఘోరాలు చేయించారని అన్నారు. ఈసారి ఓటు కూటమికి వేయాలని, తాను మళ్లీ సీఎం అవుతానని బాబు అనడంతో జనసేన కార్యకర్తల్లో నైరాశ్యం అలముకుంది. పవన్ సినిమా రంగంలో ఎదురులేని వ్యక్తి అంటూ పరోక్షంగా రాజకీయాల్లో అనుభవం లేదని చెప్పడంతో జనసేన శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి.

**స్పందించని ప్రజలు**

ఈ ప్రభుత్వాన్ని తరిమి కొడదామా అని బాబు అడిగినా ప్రజలు స్పందించలేదు. తనపైనా చాలాసార్లు రాళ్ల దాడి జరిగిందని, ఇప్పుడు చేసిన రాళ్ల దాడిపై చప్పట్లు కొట్టి నిరసన తెలపండని చంద్రబాబు అడిగినా.. ఒక్కరూ స్పందించకపోవడంతో టాపిక్ మార్చేశారు. బాబు బస్సుపైకి టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థితో పాటు జనసేన, బీజేపీ నుంచి ఒక్కొక్కర్ని మాత్రమే అనుమతించారు. వారిని కూడా సెక్యూరిటీ వెనుక నిలబెట్టారు. మిగిలిన వారెవ్వరికీ ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో బీజేపీ, జనసేన నేతల్లో అసహనం వ్యక్తమైంది. జిల్లాలో మూడు చోట్ల జనసేన అభ్యర్థులు పోటీ చేస్తున్నా.. వారిని గెలిపించమని చెప్పకపోవడంపై ఆ పార్టీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. టీడీపీ నేతలు ఎంతగా ప్రయత్నించినా రెండు సభలకు జనం అంతంతమాత్రంగానే వచ్చారు. ఈ సభలకు చంద్రబాబు రెండు గంటలు ఆలస్యంగా రావడంతో వచ్చిన కొద్దిమంది జనం, కార్యకర్తలు బాబు ప్రసంగిస్తుండగానే వెళ్లిపోయారు.

### శ్రేణుల ఎదుటే బండారును అవమానించిన బాబు

మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత బండారు సత్యనారాయణమూర్తిని పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు కార్యకర్తల ఎదుటే తీవ్రంగా అవమానించారు. పెందుర్తి టికెట్ ఆశించిన బండారు.. ఆ స్థానాన్ని జనసేనకు కట్టబెట్టడంతో మనస్తాపానికి గురయ్యారు. ఆదివారం చంద్రబాబుని కలిశారు. టికెట్ ఇవ్వకుండా అవమానించడం సరికాదని చంద్రబాబుతో అనడంతో.. ఒక్కసారిగా బాబు రెచ్చిపోయారు. 'ఏం తమాషాలు చేస్తున్నావా? టికెట్ లేదని చెప్పిన తర్వాత కూడా వేషాలేస్తున్నావ్. మర్యాదగా చెప్పినట్లు నడుచుకో. జనసేనకు సహకరించు' అంటూ దాదాపు పది నిమిషాలు బండారుపై చిందులేశారు. ఇంత అవమానించి.. చివరకు బండారుని బుజ్జగించే ప్రయత్నం చేయగా.. చంద్రబాబుకి నమస్కారం చెప్పి నేరుగా ఇంటికి వెళ్లిపోయారు. తీవ్ర మనస్తాపానికి గురైన బండారు సత్యనారాయణ మూర్తి.. కార్యకర్తలు, అనుచరులతో కూడా మాట్లాడలేదు. మాడుగుల టికెట్ అయినా ఇవ్వాలని బండారు కోరారని, అందుకు ఒప్పుకోని చంద్రబాబు.. సీనియర్ నేతకు కనీస మర్యాద ఇవ్వకుండా ఘోరంగా అవమానించారంటూ టీడీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.



## కారుతో ఢీ కొట్టి.. మృతదేహంతోనే వెళ్లాడు

- మృతదేహాన్ని ప్రయాణికులు గుర్తించడంతో కారు వదిలేసి ఉడాయించిన ఘనుడు
- అనంతపురం జిల్లా వై.కొత్తపల్లి వద్ద ఘటన



ఇన్నోవా కారుపై ఎర్రిస్వామి మృతదేహం

**ఆత్మకూరు:** ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న వ్యక్తిని కారుతో ఢీకొన్నాడు. ఎగిరి కారుపై పడి మృతిచెందిన యువకుడిని అలాగే 15 కిలోమీటర్ల దూరం తీసుకెళ్లాడు. అటుగా వెళుతున్న వాహనదారులు కారు పైభాగంలో మృతదేహం ఉండటాన్ని గుర్తించి అప్రమత్తం చేయడంతో కారును రోడ్డుపక్కన ఆపి ఉడాయించాడు. సంచలనం రేకెత్తించిన ఈ ఘటన అనంతపురం జిల్లాలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కూడేరు మండలం చోళసముద్రం గ్రామానికి చెందిన జెన్నే ఎర్రిస్వామి (35)కి ఆత్మకూరు మండలం సిద్ధరామపురం గ్రామానికి చెందిన మంజులతో వివాహమైంది. వీరికి ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. ట్రాక్టర్ మెకానిక్‌గా జీవనం సాగిస్తున్న ఎర్రిస్వామి ఆదివారం ద్విచక్ర వాహనంపై అత్తారింటికి వచ్చాడు. రాత్రి ద్విచక్ర వాహనంపై అనంతపురానికి బయలుదేరాడు. జాతీయ రహదారిపై వై.కొత్తపల్లి వద్దకు చేరుకోగా.. ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన ఇన్నోవా కారు ఢీకొంది. దీంతో ఎర్రిస్వామి కారు పైభాగంపై పడి మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ కారును ఆపకుండా నిర్లక్ష్యంగా ముందుకు దూసుకెళ్లాడు. దాదాపు 15 కిలోమీటర్ల దూరం ప్రయాణించిన తర్వాత బెళుగుప్ప మండలం హనిమిరెడ్డిపల్లి వద్ద వాహన చోదకులు కారు పైభాగంపై మృతదేహం ఉండటాన్ని గుర్తించి.. కారు డ్రైవర్‌కు చెప్పారు. దీంతో కారును రోడ్డు పక్కన ఆపి, టాప్‌పై పడి ఉన్న మృతదేహాన్ని గమనించి అక్కడి నుంచి ఉడాయించాడు. గ్రామస్తుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# వికసిత భారత్ సంకల్ప పత్రం

## భాజపా కా సంకల్ప్.. మోదీ కీ గ్యారంటీ-2024 పేరుతో బీజేపీ మేనిఫెస్టో ● 24 కీలక అంశాలతో ఎన్నికల ప్రణాళిక విడుదల

- పేదలు, యువత, రైతులు, మహిళల సంక్షేమానికి ప్రాధాన్యం
- దేశంలో ఇక ఉమ్మడి పౌరస్మృతి
- మరో ఐదేళ్లపాటు పేదలకు ఉచిత రేషన్ ● నిరుపేదలకు మూడు కోట్ల ఇళ్లు
- దేశంలో ఉత్తర, దక్షిణ, తూర్పు ప్రాంతాల్లోనూ బుల్లెట్ రైళ్లు
- 70 ఏళ్లు దాటిన వృద్ధులకు రూ.5 లక్షల ఉచిత వైద్యం
- రక్షణ, వంటనూనెలు, ఇంధన రంగాల్లో స్వయం సమృద్ధి
- 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' దిశగా అడుగులు వేస్తామన్న ప్రధాని నరేంద్ర మోదీ



ఆదివారం ఢిల్లీలో 'సంకల్ప పత్ర'ను విడుదల చేస్తున్న ప్రధాని మోదీ, రాజ్‌నాథ్, జేపీ నడ్డా

సాక్షి, న్యూఢిల్లీ: 'భాజపా కా సంకల్ప్.. మోదీ కీ గ్యారంటీ-2024' పేరుతో అధికార బీజేపీ సార్వత్రిక ఎన్నికల సంకల్ప పత్రాన్ని (మేనిఫెస్టో) విడుదల చేసింది. పేదలు, యువత, రైతులు, మహిళలకు (జీవైఏఎన్)లకు మేనిఫెస్టోలో అధిక ప్రాధాన్యత ఇచ్చారు. చిరు వ్యాపారులు, విశ్వకర్మలు, కార్మికులకు భరోసా కల్పించారు. సురక్షిత, సమృద్ధ భారత్‌తోపాటు ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, అన్ని రంగాల్లో సమగ్ర వికాసం, సాంకేతికత, నవీన ఆవిష్కరణలు వంటి హామీలు ఇచ్చారు. ఆదివారం ఢిల్లీలో బీజేపీ ప్రధాన కార్యాలయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్, నిర్మలా సీతారామన్ తదితరులు సంకల్ప పత్రాన్ని విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలతో లబ్ధిపొందిన ఒక మహిళతోపాటు మరో ముగ్గురికి సంకల్ప పత్రం తొలి కాపీలను మోదీ అందజేశారు. అంతకంటే ముందు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 133వ జయంతిని పురస్కరించుకుని నివాళులర్పించారు. రాజ్‌నాథ్‌సింగ్ నేతృత్వంలో 27 మంది కమిటీ సభ్యులు సుమారు 15 లక్షల మంది నుంచి సలహాలు సూచనలు స్వీకరించి, సంకల్ప పత్రాన్ని రూపొందించారు. 24 అంశాలతో కూడిన 57 పేజీలతో మేనిఫెస్టోను సిద్ధం చేశారు.

### సంకల్ప పత్రంలోని 24 అంశాలు..

'2047 నాటికి వికసిత భారత్' లక్ష్య సాధనే ధ్యేయంగా బీజేపీ మేనిఫెస్టోలో 24 కీలక అంశాలను చేర్చారు. పేద కుటుంబాల సేవ, మధ్యతరగతి కుటుంబాల విశ్వాసం, మహిళా సాధికారత, యువతకు అవకాశాలు, సీనియర్ సిటిజన్లకు ప్రాధాన్యత, రైతులకు గౌరవం, మత్స్యకార కుటుంబాల సమృద్ధి, కార్మికులకు గౌరవం, ఎంఎస్ఎంఈలకు చేయూత, చిరు వ్యాపారులు, విశ్వకర్మల సాధికారత, సబ్‌కా సాథ్ సబ్ కా వికాస్, విశ్వబంధు భారత్, సురక్షిత భారత్, సమృద్ధ భారత్, గ్లోబల్ తయారీ హబ్, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, ఈజ్ ఆఫ్ లివింగ్, వారసత్వం-అభివృద్ధి, సుపరిపాలన, ఆరోగ్య భారత్, నాణ్యమైన విద్య, క్రీడల వికాసం, అన్ని రంగాల్లో సమగ్ర వికాసం, సాంకేతికత-నూతన ఆవిష్కరణలు, పర్యావరణ అనుకూల భారత్ వంటి అంశాలు ఉన్నాయి.

### పదేళ్లుగా అభివృద్ధి పథంలో భారత్: జేపీ నడ్డా

వచ్చే ఐదేళ్లు దేశానికి ఎలా సేవ చేస్తామో చెప్పేదే బీజేపీ మేనిఫెస్టో అని పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలో దేశం పదేళ్లుగా అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని, వచ్చే ఐదేళ్లు కూడా ఇది కొనసాగుతుందని నడ్డా వివరించారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ముందుకెళ్తున్నామని, అందరి సహకారం, సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ విశ్వసిస్తోందని పేర్కొన్నారు.

### బీజేపీ మేనిఫెస్టోలోని కీలక అంశాలు

- ఉమ్మడి పౌరస్మృతి తీసుకురావడం
- 80 కోట్ల మంది పేదలకు మరో ఐదేళ్లపాటు ఉచిత రేషన్
- ఐదేళ్లలో పేదల కోసం మరో మూడు కోట్ల ఇళ్ల నిర్మాణం
- దివ్యాంగులకు అనుకూలంగా ఇళ్ల నిర్మాణం
- దేశంలో ఉత్తర, దక్షిణ, తూర్పు ప్రాంతాల్లో బుల్లెట్ రైళ్లు
- వందేభారత్ రైళ్ల విస్తరణ
- ఇంటింటికీ పైప్‌లైన్ ద్వారా వంటగ్యాస్ సరఫరా
- ముద్ర రుణాల పరిమితిని రూ.20 లక్షలకు పెంచడం
- 70 ఏళ్లుపైబడిన వయోజనులకు ఆయుష్మాన్ భారత్ పథకం కింద రూ.5 లక్షల విలువైన ఉచిత వైద్యం
- వృద్ధుల కోసం ఆయుష్ శిబిరాలు
- రాష్ట్ర ప్రభుత్వాల సాయంతో పుణ్య క్షేత్రాల సందర్శన కోసం వృద్ధులకు చేయూత
- ట్రాన్స్‌జెండర్లకు సైతం ఆయుష్మాన్ భారత్ వర్తింపు
- మూడు కోట్ల మంది మహిళలను లఖ్‌పతీ దీదీలుగా మార్చే ప్రణాళిక
- పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద పేదల నివాసాలకు ఉచిత విద్యుత్ సరఫరా
- మహిళాపారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం
- ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం
- మత్స్య ఉత్పత్తి, ప్రాసెసింగ్ కోసం ప్రత్యేక క్లస్టర్లు
- ఎప్పటికప్పుడు పంటలకు కనీస మద్దతు ధర పెంపు
- ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం
- సేవారంగంలో స్వయం సహాయక సంఘాల అనుసంధానం
- గ్రీన్ ఎనర్జీ, ఫార్మా, సెమీ కండక్టర్, ఎలక్ట్రానిక్స్, ఇన్నోవేషన్, లీగల్ ఇన్సూరెన్స్, వాహన రంగాల్లో ప్రపంచ స్థాయి హబ్‌ల ఏర్పాటు
- విద్యుత్తు వాహనాల రంగానికి మరింత ప్రోత్సాహం
- రక్షణ, వంటనూనెలు, ఇంధన రంగాల్లో స్వయం సమృద్ధి
- విదేశాల్లోని భారతీయుల భద్రతకు చర్యలు

### ఉమ్మడి పౌరస్మృతి అవసరం: మోదీ

దేశంలో ఉమ్మడి ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) తీసుకురావాల్సిన అవసరం ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. గత మేనిఫెస్టోల్లోనే ఈ హామీ ఇచ్చినప్పటికీ దాన్ని పూర్తి చేయలేకపోయామని చెప్పారు. గత సంకల్ప పత్రంలో ఇచ్చిన ఆర్టికల్ 370 రద్దు, అయోధ్యలో రామ మందిర నిర్మాణం వంటి హామీలను నెరవేర్చామని గుర్తుచేశారు. ఆదివారం మేనిఫెస్టో విడుదల సందర్భంగా మోదీ మాట్లాడారు. సంకల్ప పత్రాన్ని 'మోదీ కీ గ్యారంటీ'గా అభివర్ణించారు. వికసిత భారత్‌లో అంతర్భాగమైన యువ శక్తి, నారీ శక్తి, పేదలు, రైతులు అనే నాలుగు స్తంభాలను తమ సంకల్ప పత్రం బలోపేతం చేస్తుందని అన్నారు. 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' దిశగా అడుగులు వేస్తామన్నారు. దేశాభివృద్ధికి అడ్డుగోడగా మారిన అవినీతిపై యుద్ధం కొనసాగిస్తామని వెల్లడించారు. అవినీతిపరులు ఎంతటివారైనా కటకటాల వెనక్కి పంపిస్తామని, ఇది తన గ్యారంటీ అని స్పష్టం చేశారు. గరీబ్, యువ, అన్నదాత, నారీ(జీవైఏఎన్)ని దృష్టిలో పెట్టుకొని బీజేపీ సంకల్ప పత్రం రూపొందించామని పేర్కొన్నారు. దేశంలోని యువత ఆకాంక్షలను ఈ పత్రం ప్రతిబింబిస్తోందన్నారు. వందేభారత్, బుల్లెట్ రైళ్లను మరింత విస్తరిస్తామని తెలిపారు. ముంబై-అహ్మదాబాద్ మధ్య బుల్లెట్ రైలు మార్గం పూర్తి కావొచ్చిందని, ఇక ఉత్తర, దక్షిణ, తూర్పు భారత్‌లో కూడా బుల్లెట్ రైలు మార్గాలు అందుబాటులోకి తీసుకొస్తామని, దీనిపై త్వరలో అధ్యయనం ప్రారంభిస్తామని చెప్పారు. '140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలే మోదీ మిషన్. జూన్ 4వ తేదీన ఎన్నికలు ఫలితాలు వచ్చాక వంద రోజుల్లోనే సంకల్ప పత్రాన్ని అమలు చేసే ప్రణాళికతో పని చేస్తున్నాం' అని ప్రధానమంత్రి మోదీ వివరించారు.

### బీజేపీ మేనిఫెస్టోని విశ్వసించలేం: ఖర్గే

బీజేపీ మేనిఫెస్టోపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదివారం ఘాటుగా స్పందించారు. గత పదేళ్ల కాలంలో పేదల కోసం ఏమీ చేయని ప్రధాని మోదీ ఇప్పుడు కొత్తగా హామీలు గుప్పించడం ఏమిటని ప్రశ్నించారు. అది మేనిఫెస్టో కాదు, జుమ్లా పత్రం అని మండిపడ్డారు. "రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని గతంలో ప్రధానమంత్రి హామీ ఇచ్చారు. పంటలకు కనీస మద్దతు ధర పెంచుతానని, చట్టబద్ధత కల్పిస్తామని చెప్పారు. గడిచిన పదేళ్లలో దేశంలోని ప్రజలందరికీ మేలు చేసేంత పెద్ద పని ఆయన ఏమీ చేయలేదు. పదేళ్లలో పెరిగిన ద్రవ్యోల్బణం, నిరుద్యోగం గురించి మోదీకి ఏమాత్రం ఆందోళన లేదు. పేదల సంక్షేమం కోసం ఏమీ చేయని ప్రధానమంత్రిని, బీజేపీ మేనిఫెస్టోను విశ్వసించలేం'' అని ఖర్గే పేర్కొన్నారు. అలాగే ప్రధానమంత్రికి 14 ప్రశ్నలను 'ఎక్స్' వేదికగా ఖర్గే సంధించారు. యువతకు ఏటా 2 కోట్ల ఉద్యోగాల హామీ ఏమైంది? రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేశారా? ఒక్కొక్కరి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామన్న హామీ సంగతేంటి? ఎస్సీ, ఎస్టీలపై నేరాలు 46 శాతం ఎందుకు పెరిగాయి? మహిళా రిజర్వేషన్లను ఎందుకు అమలు చేయడంలేదు? మహిళలపై అఘాయిత్యాలను ఎందుకు ఆపడం లేదు? 100 కొత్త స్మార్ట్ సిటీల సంగతేంటి? 2020 నాటికి గంగానదిని ప్రక్షాళన చేస్తామన్న హామీ ఎటుపోయింది? అంటూ మల్లికార్జున ఖర్గే ప్రశ్నల వర్షం కురిపించారు.



మోదీజీ ఆలోచనా ముద్ర

### ఎన్నికల వి'చిత్రం'

ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో ఆదివారం లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టో విడుదల సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో పార్టీ చీఫ్ జేపీ నడ్డా ప్రసంగాన్ని శ్రద్ధగా వింటున్న ప్రధాని మోదీ

## ఎలక్షన్ బీట్

### మనువాదంపైనే పోరాటం: ఖర్గే

నాగ్‌పూర్: ఈ లోక్‌సభ ఎన్నికల్లో తమ పోరాటం ప్రధాని మోదీపై కాదు, మనువాద సిద్ధాంతాన్ని బలపరుస్తున్న అధికార వర్గంపైనేనని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. భారత రాజ్యాంగాన్ని, 140 కోట్ల భారతీయుల హక్కులను కాపాడేందుకు తమ పార్టీ ప్రయత్నిస్తోందని చెప్పారు. ఈ ఎన్నికల్లో ఆర్ఎస్ఎస్-బీజేపీలు గెలిస్తే ఇకపై దేశంలో ఎన్నికలుండవు, రాజ్యాంగం కూడా ఉండదని ఖర్గే హెచ్చరించారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాలుపంచుకోని ఆర్ఎస్ఎస్ ఇప్పుడు రామాలయం, అంబేడ్కర్ పేరుతో ఓట్లడిగేందుకు వస్తోందని చెప్పారు.

### మోదీ, పుతిన్ మధ్య తేడా లేదు: పవార్

షోలాపూర్: ప్రధాని నరేంద్ర మోదీకి రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు మధ్య తేడాయే లేదని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎస్పీ) చీఫ్ శరద్ పవార్ విమర్శించారు. ఆదివారం శరద్ పవార్ షోలాపూర్ జిల్లా అక్లుజ్‌లో మీడియాతో మాట్లాడారు. 'దేశంలో అధికార పక్షం వంటిదే ప్రతిపక్షం కూడా. కానీ, వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్షం నుంచి ఎవరూ గెలవకూడదని మోదీ భావిస్తున్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌ది కూడా సరిగ్గా ఇటువంటి వైఖరే' అని ఆయన వ్యాఖ్యానించారు.

### ప్రజల సమస్యలు బేఖాతరు: ప్రియాంక

జైపూర్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజలకు దూరమై పోయారని, వారి సమస్యల్ని పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ వాద్రా ఆరోపించారు. అపరిమితమైన అధికారాన్ని చెలాయిస్తున్న మోదీకి నిజాలను ఆయన చుట్టూ ఉండేవారు తెలియనివ్వడం లేదన్నారు. 'సామాన్య ప్రజలను ఇబ్బంది పెడుతున్న అతిపెద్ద సమస్య ద్రవ్యోల్బణం. ఈ విషయాన్ని మోదీ తెలుసుకోలేకపోతున్నారని అనుకుంటున్నా. చుట్టూ ఉండే అధికారులు, సహచరులు నిజాలను ఆయనకు చెప్పేందుకు భయపడుతున్నారు. దీంతో, ప్రజలకు ప్రధాని మోదీకి మధ్య దూరం పెరిగిపోయింది' అని ప్రియాంక అన్నారు. రాజస్తాన్‌లోని జలోర్‌లో ఆదివారం ఆమె కాంగ్రెస్ ఎన్నికల ర్యాలీలో మాట్లాడారు.

### రాష్ట్రంగా పశ్చిమ యూపీ: మాయావతి

ముజఫర్ నగర్: కేంద్రంలో తమ పార్టీ అధికారంలోకి వస్తే ఉత్తరప్రదేశ్‌లోని పశ్చిమ ప్రాంతాన్ని ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేసేందుకు గట్టి చర్యలు తీసుకుంటామని బీఎస్పీ అధినేత్రి మాయావతి హామీ ఇచ్చారు. యూపీలోని ముజఫర్‌నగర్‌లో ఆదివారం జరిగిన పార్టీ ర్యాలీలో ఆమె ప్రసంగించారు. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా జరిగి, ఈవీఎంలు ట్యాంపరింగ్ జరగని పక్షంలో ఈదఫా బీజేపీ అధికారంలోకి రాదని ఆమె వ్యాఖ్యానించారు.

### దేశం విశ్వగురువా?: అఖిలేశ్ యాదవ్

మీరట్: భారత్ 'విశ్వగురు'గా మారనుందంటూ బీజేపీ చేస్తున్న ప్రచారాన్ని సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ తిప్పికొట్టారు. ప్రజల్లో 80 శాతం మంది ఉచిత రేషన్‌పైనే ఆధారపడి ఉన్న దేశం విశ్వగురుగా మారడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన ద్వారా కేంద్రం ప్రతినెలా 80 కోట్ల మంది ఉచిత రేషన్ అందజేస్తున్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్ష ఇండియా కూటమి విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

### త్వరలో రాజకీయ పార్టీ: హీరో విశాల్

సాక్షి, చెన్నై: త్వరలో రాజకీయ అరంగేట్రం చేయబోతున్నట్లు తమిళ నటుడు విశాల్ ప్రకటించారు. 2026లో తమిళనాడు శాసనసభ ఎన్నికల్లో తన పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తారని ఆయన వెల్లడించారు. చెన్నైలో ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడారు. "త్వరలో రాజకీయాల్లోకి వస్తా. 2026లో పార్టీ తరఫున నేను కూడా బరిలో దిగుతా. పార్టీ ఏర్పాటు, ఇతరత్రా వివరాలను త్వరలోనే వెల్లడిస్తా. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా పోలింగ్ 100 శాతం జరగాలని ఆశిస్తున్నా'' అని విశాల్ చెప్పారు.

### ఎన్నికల నిధుల కోసం 'క్రౌడ్ ఫండింగ్'

అహ్మదాబాద్: 'ఈ ఎన్నికల్లో నేను గెలవకుంటే మళ్లీ నాకు అవకాశం దక్కదు. నా సొంత ఠాకూర్ వర్గం సాధికారత సాధించేందుకే కాంగ్రెస్ టికెట్ సాధించా' అంటున్నారు గుజరాత్‌లోని బనస్కాంత లోక్‌సభ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి గెనీబెన్ ఠాకూర్. బనస్కాంత జిల్లా వావ్ నియోజకవర్గం సిట్టింగ్ ఎమ్మెల్యే కూడా అయిన గెనీబెన్ ఎన్నికల ప్రచార నిధుల కోసం 'క్రౌడ్ ఫండింగ్' బాట పట్టారు. ఆన్‌లైన్‌లో తన వినతికి బనస్కాంత ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించిందని ఆమె చెప్పారు. గత 40 రోజుల్లోనే రూ.50 లక్షలవిరాళాలు అందాయన్నారు. తన ప్రచార వాహన నిర్వహణ ఖర్చులు భరిస్తామని కొందరు ముందుకొస్తే, వేదికల ఏర్పాటు ప్రచార సామగ్రి, ఆహార పదార్థాలు తదితరాలకయ్యే వ్యయం సమకూరుస్తామంటూ మరికొందరు చెప్పారని ఆమె శుక్రవారం జరిగిన ఎన్నికల ర్యాలీలో వెల్లడించారు.

### విరోధుల అలయ్‌బలయ్!

బరంపురం: రాజకీయాల్లో బద్ధ విరోధులైన ఆ ఇద్దరు నేతలు ఎన్నికల ప్రచారం కోసం ఒకే చోటుకు చేరుకున్నారు. ఇద్దరూ పరస్పరం ఎదురుపడ్డారు. అప్పటిదాకా నినాదాలు చేసుకుంటూ వచ్చిన ఇద్దరు నేతల అనుచరులు సైలెంటైపోయారు. ఆ నేతలిద్దరూ ముకుళిత హస్తాలతో పలకరించుకుని, ముందుకు సాగారు. ఆ వెంటనే వారి అనుచరగణం..జై జగన్నాథ్.., జై శ్రీరాం అంటూ చేసిన నినాదాలతో ఆ ప్రాంతం మారుమోగిపోయింది. మార్నింగ్ వాక్, వ్యాయామం కోసం అక్కడున్న వారు ఈ విడ్డూరం చూసి ముక్కున వేలేసుకున్నారు. ఆదివారం గంజాం జిల్లా బరంపురంలోని ఎంకేసీజీ మెడికల్ కాలేజీ గ్రౌండ్‌లో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఆ ఇద్దరు నేతల్లో ఒకరు బరంపురం అసెంబ్లీ స్థానం నుంచి అధికార పార్టీ బీజేడీ టిక్కెట్‌పై పోటీ చేస్తున్న రమేశ్ చంద్ర చియావు పట్నాయక్, మరొకరు బరంపురం బీజేపీ అభ్యర్థి ప్రదీప్ పాణిగ్రాహి.

### 10 మంది అభ్యర్థులతో కాంగ్రెస్ జాబితా

న్యూఢిల్లీ: వచ్చే లోక్‌సభ ఎన్నికలకు గాను ఢిల్లీ, పంజాబ్‌లోని పలు స్థానాలకు కాంగ్రెస్ పార్టీ ఆదివారం 10 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. జలంధర్(ఎస్సీ) టిక్కెట్‌ను పంజాబ్ మాజీ సీఎం చరణ్‌జీత్ సింగ్ చన్నీకి కేటాయించింది. సీనియర్ నేత జేపీ అగర్వాల్‌కు చాందినీ చౌక్, యువ నేత కన్హయ్య కుమార్‌కు ఈశాన్య ఢిల్లీ టిక్కెట్టిచ్చింది. వాయవ్య ఢిల్లీ స్థానం నుంచి మాజీ ఎంపీ ఉదిత్ రాజ్ పోటీ చేయనున్నారు. తాజాగా ఆప్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎంపీ ధరమ్‌వీర్ గాంధీకి పటియాలా లోక్‌సభ స్థానం కేటాయించింది. వీటితోపాటు ఒడిశా అసెంబ్లీ ఎన్నికలకు గాను 75 అభ్యర్థుల పేర్లతో మరో జాబితాను కాంగ్రెస్ పార్టీ విడుదల చేసింది.

## రాచరిక మాంత్రికుడు రాహుల్: మోదీ

హోషంగాబాద్/సాక్షి బెంగళూరు: ఒక్క దెబ్బతో దేశంలోని పేదరికాన్ని నిర్మూలించవచ్చంటూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను ప్రధాని నరేంద్ర మోదీ తప్పుపట్టారు. రాహుల్‌ను రాచరిక మాంత్రికుడిగా అభివర్ణించారు. ఆయన వ్యాఖ్యలను ఎవరూ పట్టించుకోవడం లేదని చెప్పారు. ఆదివారం మధ్యప్రదేశ్‌లో హోషంగాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని పిపారియా పట్టణంలో ఎన్నికల ప్రచార ర్యాలీలో ప్రధాని మోదీ ప్రసంగించారు. "ఒక్కదెబ్బతో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించవచ్చని కాంగ్రెస్ రాజకుమారుడు ప్రకటించారు. నిజంగా నవ్వొస్తోంది. ఆ రాజరిక మాంత్రికుడు ఇన్నాళ్లు ఎక్కడికెళ్లారు. ఆయన నాన్నమ్మ 50 ఏళ్ల క్రితం గరీబీ హటావో అంటూ నినాదం ఇచ్చారు. పేదరికం మాత్రం పోలేదు. అందుకే ఆ రాజకుమారుడి మాటలను జనం పట్టించుకోవడం లేదు. ఆ కుటుంబ(సోనియా గాంధీ) సభ్యులు 2014 కంటే ముందు పదేళ్లపాటు రిమోట్ కంట్రోల్‌తో ప్రభుత్వాన్ని నడిపించారు. అప్పుడు పేదరికం గుర్తుకురాలేదు. ఇప్పుడు హఠాత్తుగా పేదరికాన్ని నిర్మూలించే మంత్రం కనిపెట్టారు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతూ నవ్వులపాలవుతున్నారు. పేదరికంపై జోక్‌లు వేయొద్దని కోరుతున్నా'' అని మోదీ స్పష్టం చేశారు.

## ఇజ్రాయెల్‌పై ఇరాన్ మెరుపుదాడి

- 300కుపైగా క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడిన ఇరాన్
- దాదాపు అన్నింటిని మిత్రదేశాల సాయంతో కూల్చేశామన్న ఇజ్రాయెల్
- పశ్చిమాసియాలో ముసురుకున్న యుద్ధమేఘాలు !

జెరూసలేం: అనుకున్నంతా అయింది. సిరియాలో తమ ఎంబసీపై ఇజ్రాయెల్ దాడికి ప్రతీకారంగా ఇజ్రాయెల్‌పై ఇరాన్ మెరుపుదాడికి దిగింది. ఆదివారం తెల్లవారుజామునే 300కుపైగా క్షిపణులు, డ్రోన్లు, బాలిస్టిక్ మిస్సైల్స్‌తో భీకరదాడికి తెగబడింది. ఇరాన్ తన భూభాగం నుంచి నేరుగా ఇజ్రాయెల్‌పై సైనిక చర్యకు దిగడం ఇటీవలి కాలంలో ఇదే తొలిసారి. మధ్యధరా సముద్రంలో సిద్ధంగా ఉన్న అమెరికా యుద్ధనౌకల నుంచి ప్రతిగా ప్రయోగించిన క్షిపణులు, ఇజ్రాయెల్ ప్రయోగించిన క్షిపణులు ఈ ఇరాన్ మెరుపుదాడిని విజయవంతంగా ఎదుర్కొన్నాయి. ఫ్రాన్స్, బ్రిటన్, జోర్డాన్ దేశాలు ఈ విషయంలో ఇజ్రాయెల్‌కు సాయపడ్డాయి. లెబనాన్, జోర్డాన్ గగనతలాల మీదుగా దూసుకొచ్చిన వాటిల్లో దాదాపు 90 శాతం క్షిపణులు, డ్రోన్లు, బాలిస్టిక్ మిస్సైళ్లను గాల్లోనే తుత్తునియలు చేశామని ఇజ్రాయెల్ ప్రకటించింది. అయితే కొన్ని బాలిస్టిక్ క్షిపణులు మాత్రం ఇజ్రాయెల్ భూభాగాన్ని తాకాయి. దక్షిణ ఇజ్రాయెల్‌లోని ఇజ్రాయెల్ ఐడీఎఫ్ సైనిక స్థావరం దెబ్బతింది. బెడోయిన్ అరబ్ పట్టణంలో పదేళ్ల చిన్నారి తీవ్రంగా గాయపడిందని ఇజ్రాయెల్ సైన్యం అధికార ప్రతినిధి రియర్ అడ్మిరల్ డేనియల్ హగేరీ చెప్పారు. ఇరాన్ దాడితో ఇజ్రాయెల్‌లో చాలా ప్రాంతాల్లో హెచ్చరిక సైరన్లు వినిపించాయి. జనం భయంతో వణికిపోయారు.

**అండగా ఉంటామన్న అమెరికా**

ఇరాన్ దాడిపై అమెరికా అధ్యక్షుడు బైడెన్ మాట్లాడారు. " ఉక్కుకవచంలా ఇజ్రాయెల్‌కు రక్షణగా నిలుస్తాం. అన్నివిధాలుగా అండగా ఉంటాం' అని అన్నారు. దాడి నేపథ్యంలో జాతీయ భద్రతా మండలిని సమావేశపరిచి వివరాలు అడిగి తెల్సుకున్నారు. అమెరికా స్పందనపై ఐక్యరాజ్య సమితిలోని ఇరాన్ మిషన్ ఘాటుగా స్పందించింది. " మా దాడికి ప్రతిదాడి చేసేందుకు ఇజ్రాయెల్ ప్రయత్నిస్తే పరిణామాలు దారుణంగా ఉంటాయి. ఈ సమస్య పశ్చిమాసియాకే పరిమితం. ఉగ్ర అమెరికా ఇందులో తలదూర్చొద్దు'' అని హెచ్చరించింది. ఇంతటితో మా ఆపరేషన్ ముగిసిందని ఇరాన్ సైన్యం చీఫ్ ఆఫ్ స్టాఫ్ జనరల్ మొహమ్మద్ హుస్సేన్ బఘేరీ ప్రకటించారు. "దాడిని మేం అడ్డుకున్నాం. మిత్రదేశాల సాయంతో విజయం సాధించాం' అని దాడి తర్వాత ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ 'ఎక్స్'లో పోస్ట్‌చేశారు.

### ఖండించిన ప్రపంచదేశాలు

ఇరాన్ దాడిని ప్రపంచదేశాలు ఖండించాయి. " ఈ శత్రుత్వాలకు వెంటనే చరమగీతం పాడండి. లేదంటే ఈ ఉద్రిక్త పరిస్థితి పశ్చిమాసియాను పెను ప్రమాదంలోకి నెట్టేస్తుంది. పరస్పర సైనిక చర్యలకు దిగకండి' అని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ వేడుకున్నారు. భారత్, కెనడా, బ్రిటన్ సహా పలు దేశాలు ఇరాన్ సైనికచర్యను తప్పుబట్టాయి.



ఇరాన్ ప్రయోగించిన క్షిపణులు జెరూసలేం వైపుగా దూసుకొస్తున్న దృశ్యం

### పౌరుల భద్రతపై భారత్ ఆందోళన

ఇజ్రాయెల్‌లో ఉంటున్న భారతీయపౌరుల భద్రతపై భారత విదేశాంగ శాఖ ఆందోళన వ్యక్తంచేసింది. అక్కడి ఎంబసీలు మన పౌరులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారంటూ మరో ముఖ్య అడ్వైజరీని విడుదలచేసింది. 'అనవసరంగా బయటికి వెళ్లకండి. మీ పేర్లను సమీప ఎంబసీల్లో రిజిస్టర్ చేసుకోండి. శాంతంగా ఉంటూ భద్రతా సూచనలు పాటించండి' అని సూచించింది. హార్మూజ్ జలసంధి వద్ద ఇజ్రాయెల్ కుబేరుడికి చెందిన నౌకను ఇరాన్ బలగాలు హైజాక్‌చేసిన ఘటనలో అందులోని 17 మంది భారతీయ సిబ్బంది విడుదల కోసం చర్చలు జరుపుతున్నట్లు పేర్కొంది. ఇరాన్ గగనతల దాడి నేపథ్యంలో ఇజ్రాయెల్‌లోని టెల్‌అవీవ్ నగరానికి ఢిల్లీ నుంచి విమానసర్వీసులను నిలిపేస్తున్నట్లు ఎయిర్ ఇండియా ప్రకటించింది.

## హౌసింగ్ సొసైటీల్లోనూ పోలింగ్ బూత్‌లు

యూపీ సీఈవో నవదీప్ రిన్వా వెల్లడి

లక్నో: కేంద్ర రాజకీయాల్లో కీలకమైన ఉత్తరప్రదేశ్‌లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఎన్నికల కమిషన్ పలు చర్యలు తీసుకుంటోంది. పట్టణ ప్రాంతాల్లోని హౌసింగ్ సొసైటీల్లో సైతం 200కు పైగా పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనుంది. రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ నవదీప్ రిన్వా పీటీఐకిచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను వివరించారు. 'యూపీలోని పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం స్వల్పంగా ఉంటోంది. ఈసారి ఎలాగైనా ఓటింగ్ శాతంలో మొదటి స్థానం సంపాదించాలనేదే మా లక్ష్యం'అని ఆయన వివరించారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో ఓటింగ్ శాతం 59.11 మాత్రమేనన్నారు. ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకునేలా ప్రోత్సహించే చర్యల్లో భాగంగా ప్రతి రెండు కిలోమీటర్ల పరిధిలో ఒక పోలింగ్ బూత్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. "తక్కువ ఓటింగ్ నమోదయ్యే గేటెడ్ కమ్యూనిటీలు, బహుళ అంతస్తుల హౌసింగ్ సొసైటీల్లో ఈసారి పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేస్తాం. ఇలాంటి మొత్తం 200పైగా బూత్‌లలో ఎక్కువ భాగం నోయిడాలోనే ఉంటాయి. ఆ తర్వాత లక్నో, కాన్పూర్, బరేలీ, మథురలోనూ ఇవి ఉంటాయి. ఈసారి ఓటింగ్ శాతం 60పైగా ఉంటుందన్న నమ్మకముంది'' అని అన్నారు.

## సరబ్‌జీత్ హంతకుడు హతం



సర్ఫరాజ్

లాహోర్: సరబ్‌జీత్ సింగ్ అనే భారతీయుడిని జైలులో చంపిన పాకిస్తానీ మాఫియా నేత అమిర్ సర్ఫరాజ్ అలియాస్ టంబా గుర్తు తెలియని వ్యక్తుల కాల్పుల్లో హతమయ్యాడు. లాహోర్‌లోని ఇస్లాంపుర ప్రాంతంలో ఉన్న ఇతడిపై ఆదివారం బైక్‌పై వచ్చిన దుండగులు కాల్పులు జరిపారు. తీవ్రంగా గాయపడిన సర్ఫరాజ్ ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచినట్లు మీడియా తెలిపింది. లష్కరే తోయిబా వ్యవస్థాపకుడు హఫీజ్ సయీద్‌కు సన్నిహితుడిగా పేరున్న సర్ఫరాజ్ మరికొందరు కలిసి 2013లో జైలులో ఉన్న సరబ్‌జీత్‌పై దాడి చేసి చంపారు. అయితే, సాక్ష్యాలు లేవంటూ కోర్టు సర్ఫరాజ్‌ను ఆ తర్వాత విడుదల చేసింది. గూఢచర్యం ఆరోపణలతోపాటు, పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో 1990లో పేలుడుకు పంజాబ్‌కు చెందిన సరబ్జీతే కారణమంటూ అక్కడి కోర్టు మరణ శిక్ష విధించింది. ఈ ఆరోపణలను భారత ప్రభుత్వంతోపాటు సరబ్జీత్ కుటుంబం ఖండించింది. సరబ్‌జీత్‌ను జైలు నుంచి విడుదల చేయించేందుకు సోదరి దల్బీర్ ప్రయత్నించి విఫలమయ్యారు.

## కెనడాలో కాల్పులు

భారతీయ విద్యార్థి దుర్మరణం



చిరాగ్

ఒట్టావా: విదేశాల్లో భారతీయ విద్యార్థుల మరణాల ఘటనలు ఆగట్లేవు. తాజాగా కెనడాలో గుర్తు తెలియని వ్యక్తులు జరిపిన కాల్పుల్లో 24 ఏళ్ల భారతీయ విద్యార్థి చిరాగ్ అంటిల్ ప్రాణాలు కోల్పోయారు. వాంకోవర్ సిటీ పరిధిలో 12వ తేన రాత్రి ఈ దుర్ఘటన జరిగింది. వాంకోవర్ సిటీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రెండేళ్ల క్రితం ఉన్నత చదువుల కోసం హరియాణాలోని సోనిపట్ నుంచి చిరాగ్ కెనడాకు వచ్చారు. విద్యార్థి వీసా మీద కెనడాకు వచ్చి ఎంబీఏ చేసి ఇక్కడే తాత్కాలిక ఉద్యోగంలో చేరారు. ఏప్రిల్ 12వ తేదీన చిరాగ్ తన కారులో ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరిపారు. తుపాకీ కాల్పుల శబ్దం విని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చేసరికి చిరాగ్ తన కారులో విగతజీవిగా పడి ఉన్నారు. ఈ ఘటనలో ఇంకా ఎవరినీ అరెస్ట్‌చేయలేదు. చిరాగ్ మృతదేహాన్ని భారత్‌కు తరలించేందుకు భారత సర్కార్ సాయపడాలంటూ చిరాగ్ కుటుంబం ప్రధాని మోదీ, విదేశాంగ మంత్రి జైశంకర్‌కు విజ్ఞప్తిచేసింది.

## సల్మాన్ ఖాన్ నివాసం వద్ద కాల్పుల కలకలం

ముంబై: బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ నివాసం వెలుపల ఆదివారం ఉదయం జరిగిన కాల్పుల ఘటన కలకలం రేపింది. ముంబైలోని బాంద్రా ప్రాంతంలో ఉన్న గెలాక్సీ అపార్ట్‌మెంట్స్ వెలుపల ఇద్దరు వ్యక్తులు తుపాకీలతో నాలుగు రౌండ్లు కాల్పులు జరిపి పారిపోయారని పోలీసులు తెలిపారు. బాంద్రా పోలీసులు గుర్తు తెలియని వ్యక్తులపై హత్యాయత్నం నేరం కింద కేసు నమోదు చేశారు. దుండగులు ఉపయోగించినట్టుగా భావిస్తున్న బైక్‌ను అక్కడికి కిలో మీటర్ దూరంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాల్పుల ఘటన తెలిసిన వెంటనే సల్మాన్‌తో ఫోన్‌లో మాట్లాడినట్లు సీఎం షిండే చెప్పారు.

**ఇది ట్రైలర్ మాత్రమే: అన్‌మోల్ బిష్ణోయ్**

సల్మాన్ నివాసం వద్ద కాల్పుల ఘటనకు తమదే బాధ్యతంటూ గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ సోదరుడు అన్‌మోల్ బిష్ణోయ్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించుకున్నాడు. ఇది కేవలం ప్రారంభం మాత్రమేనంటూ హెచ్చరించాడు. 'మేం శాంతిని కోరుకుంటున్నాం. సల్మాన్.. మీరు మా శక్తి సామర్థ్యాలను తక్కువగా అంచనా వేస్తున్నారు. అలా చేయొద్దని చెప్పడానికి ఇప్పుడు ట్రైలర్ మాత్రమే చూపించాం. ఇదే మొదటి, చివరి హెచ్చరిక. దీని తర్వాత, ఇంటి బయట మాత్రమే కాల్పులు జరపబోం. మీరు దేవుళ్లుగా భావించే దావూద్ ఇబ్రహీం, చోటా షకీల్ అనే వారి పేర్లతో మా వద్ద కుక్కలు ఉన్నాయి. ఎక్కువ మాట్లాడే అలవాటు నాకు లేదు'అని అందులో ఉంది. గ్యాంగ్‌స్టర్లు లారెన్స్ బిష్ణోయ్, గోల్డీ బ్రార్‌లు గతంలోనూ పలుమార్లు సల్మాన్‌కు బెదిరింపులు పంపారు. 2022లో సల్మాన్ ఖాన్‌కు గుర్తు తెలియని వ్యక్తి బెదిరింపు లేఖ పంపాడు.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
సోమవారం । 15 । ఏప్రిల్ । 2024






### భక్తిశ్రద్ధలతో సూర్యోపాసన సేవ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సర్వ మానవాళికి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం సూర్యోపాసన సేవ నిర్వహించారు.



### భక్తిశ్రద్ధలతో కేరళ ఉగాది

మచిలీపట్నంటౌన్: నగరంలోని రాబర్ట్‌సన్ పేటలో ఉన్న రామలింగేశ్వరుని ఆలయ ప్రాంగణంలో ఆదివారం కేరళ ఉగాది పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



### 190 కేజీల గంజాయి స్వాధీనం

విజయవాడ రూరల్ మండలం గూడవల్లిలోని ఎన్నికల చెక్‌పోస్టు వద్ద ఆదివారం మినీ లారీలో తరలిస్తున్న 190 కేజీల గంజాయిను పోలీసులు స్వాధీన పరుచుకున్నారు. -8లో▸

## న్యూస్‌రీల్

### వైభవం.. కల్యాణోత్సవం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో షష్టిని పురస్కరించుకుని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారి కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై ఉత్సవ మూర్తులకు ఆలయ వైదిక కమిటీ సభ్యుడు యజ్ఞనారాయణ శర్మ, అర్చకులు కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ ఈవో కేఎస్ రామరావు, పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కల్యాణోత్సవం అనంతరం స్వామి వారికి తలంబ్రాలను సమర్పించగా, ఆ తర్వాత తలంబ్రాలను భక్తులకు పంపిణీ చేశారు. ఆ తర్వాత ఉత్సవ మూర్తులకు నిర్వహించిన పల్లకీ సేవలో పాల్గొనేందుకు భక్తులు పోటీ పడ్డారు. సేవలో పాల్గొన్న ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ మార్గం ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

### అత్యుత్తమ విద్యాసంస్థ 'ఇగ్నో'

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రపంచంలోనే అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలను పాటించే విద్యాసంస్థల్లో ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) మొదటిదని ఆ సంస్థ విజయవాడ ప్రాంతీయ కేంద్రం సీనియర్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ డీఆర్ శర్మ అన్నారు. కేబీఎస్ కళాశాల ఇగ్నో స్టడీ సెంటర్ నూతన విద్యార్థుల ఇండక్షన్ మీటింగ్ ఆదివారం ఆ కళాశాల ప్రాంగణంలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ డీఆర్ శర్మ మాట్లాడుతూ ఉన్నత విద్యారంగంలో ఇగ్నోకు ప్రత్యేక స్థానముందన్నారు. డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బి.ప్రసాద్‌బాబు మాట్లాడుతూ ఇగ్నో అనుసరించే బోధనా పద్ధతులు, ఇతర నిర్వహణ తదితర అంశాల ద్వారా యూజీజీ నాక్ నుంచి ఏ డబుల్‌ప్లస్ గ్రేడ్‌ను సాధించి ప్రమాణాల విషయంలో అగ్రగామిగా ఉందన్నారు. స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ ఎస్. సాంబశివరావు, అసిస్టెంట్ కోఆర్డినేటర్లు డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, రీజనల్ సెంటర్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పీఎల్ రమేష్ పాల్గొన్నారు.

### కార్టూన్లు సామాజిక చైతన్యం కలిగించాలి



విజయవాడ కల్చరల్: కార్టూన్లు సామాజిక చైతన్యం కలిగించాలని దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ఈవో కేఎస్ రామరావు అన్నారు. పాలపర్తి రాజగోపాల్ ఉమాదేవి స్మారక కమిటీ, ఎస్‌సీఎఫ్ విశాఖపట్నం ఆధ్వర్యంలో సూర్యారావుపేటలోని విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ప్రాంగణంలోని ఎమెస్కో సాహిత్య వేదికపై ఆదివారం ఉగాది కొసమెరుపు మినీ హాస్యకథల పోటీ, కార్టూన్ల పోటీ విజేతలకు బహుమతి ప్రదానోత్సవం జరిగింది. అలాగే నాగిశెట్టి కార్టూన్లు ఆవిష్కరణ, 2024 సంవత్సరానికి గానూ సాహితీవేత్త భావరాజు పద్మినీ ప్రియదర్శినికి బంగార్తల్లి పురస్కార ప్రదానం చేశారు. రామారావు మాట్లాడుతూ కార్టూన్లు హాస్యానికి పెద్దపీట వేస్తూ సామాజిక చైతన్యం కలిగించాలని సూచించారు. కేబీఎస్ కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ టి. శ్రీనివాస్ మాట్లాడుతూ కవులు రచయితలు సమాజాన్ని అధ్యయనం చేయాలని సూచించారు.

### ఆధునిక చిత్రకళలో మార్పులను స్వాగతించాలి



విజయవాడకల్చరల్: ఆధునిక చిత్రకళలో వస్తున్న మార్పులను స్వాగతించాలని ప్రపంచ తెలుగు చిత్రకారుల సమాఖ్య అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎస్ఎం పీరాన్ అన్నారు. చిత్రకారుల సమాఖ్య ఆధ్వర్యాన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా స్వరాజ్య మైదానంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద చిత్ర కళాంజలి పేరుతో చిత్ర కళా ప్రదర్శన, చిత్రకారులకు సన్మానం, విగ్రహ రూప శిల్పి శివప్రసాద్ ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. చిత్రకారుడు పీరాన్ చిత్ర కళా ఆధునికత అంశంగా ప్రసంగించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి కె.బాలయోగి మాట్లాడుతూ భారతీయ చిత్రకళ ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. జాయింట్ సెక్రటరీ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రపంచ తెలుగు చిత్రకారుల సమాఖ్య ద్వారా బాల బాలికలకు శిక్షణనిస్తున్నట్లు తెలిపారు. చిత్ర కళావర్క్‌షాప్‌లో 30 మంది చిత్రకారులు పాల్గొన్నారు.

# జైత్రయాత్రకు కృష్ణా సిద్ధం

**నేడు సీఎం వైఎస్ జగన్ బస్సు యాత్ర పునఃప్రారంభం**

- గన్నవరం, గుడివాడ నియోజకవర్గాల్లో రోడ్డు షో
- గుడివాడలోని వైఎస్సార్ కాలనీ సమీపంలో బహిరంగ సభ
- ఇప్పటికే పూర్తయిన ఏర్పాట్లు
- జననేతకు స్వాగతం పలికేందుకు 'మేమంతా సిద్ధం' అంటున్న జనాలు



మేమంతా సిద్ధం సభా ప్రాంగణంలో ఏర్పాట్లు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్రకు కృష్ణా జిల్లా ముస్తాబైంది. సోమవారం ఉదయం కేసరపల్లి రాత్రి బస నుంచి బయలు దేరి గన్నవరం, హనుమాన్‌జంక్షన్ మీదుగా గుడివాడకు సీఎం చేరుకోనున్నారు. గుడివాడ–ఏలూరు రోడ్డు నాగవరప్పాడు వైఎస్సార్ కాలనీకి సమీపంలో సిద్ధం సభ ఏర్పాటు చేస్తున్నారు. కృష్ణా జిల్లాకు చెందిన ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ప్రజలు ఈ సభకు హాజరు కానున్న నేపథ్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. వేదిక ముందు భాగంలో పార్టీ గుర్తు ఫ్యాన్ ఆకారంలో వాక్ ర్యాంపును ఏర్పాటు చేశారు. స్టేజికి ఇరువైపుల ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు. దీంతో పాటు సభా ప్రాంగణం వద్ద భారీ కటౌట్‌లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. భారీ జనసందోహంతో సభను సక్సెస్ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు స్థానిక ఎమ్మెల్యే కొడాలి నాని పేర్కొన్నారు.

**ఎదురుచూపులు..**

వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం సభల పేరిట ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు సభలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండగా ప్రజలకు చేసిన మేలును వివరించడంతో పాటు ప్రజల కోసం పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వంపై ప్రతిపక్షాల మూకుమ్మడి కుట్రను వివరించారు. ఆ సభలు చరిత్రలో నిలిచేలా విజయవంతమైన విషయం తెలిసిందే. ఇదే ఉత్సాహంతో మేమంతా సిద్ధం పేరిట ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం దాకా బస్సు యాత్ర చేపట్టారు. ఆయన రాకకోసం పార్టీ శ్రేణులు, అభిమానులు, లక్షలాది మంది ప్రజలు ఎదురుచూస్తున్నారు.

**కదనోత్సాహంలో అభిమానులు..**

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రచారానికి రావడంతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో కదనోత్సాహం కనిపిస్తోంది. గత ఎన్నికల్లో ఉమ్మడి కృష్ణా జిల్లాలో 16 స్థానాల్లో 14 స్థానాలను గెలుచుకొంది. ఐదేళ్ల సంక్షేమ, అభివృద్ధి పాలన చూసిన ప్రజలు మరోసారి వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేసేందుకు ఉత్సాహంగా ఉన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో అన్ని స్థానాలకు క్లీన్ స్వీప్ చేసే దిశగా వైఎస్సార్ సీపీ అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో సీఎం వైఎస్ జగన్ బస్సుయాత్ర జరిగే దారి మార్గంలో స్వాగతం పలికేందుకు గన్నవరం, గుడివాడ నియోజకవర్గంలోని అభిమానులు సమాయత్తమవుతున్నారు.

**నేడు యాత్ర షెడ్యూల్ ఇలా..**

మేమంతా సిద్ధం 15వ రోజు సోమవారం ఈ యాత్రలో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉదయం 9గంటల నుంచి కేసరపల్లి రాత్రి బస నుంచి బయలు దేరతారు. గన్నవరం, ఆత్కూర్, వీరవల్లి క్రాస్, హనుమాన్‌జంక్షన్, పుట్టుగుంట, మీదుగా జొన్నపాడు వద్దకు చేరుకొని భోజన విరామం తీసుకుంటారు. అనంతరం జొన్నపాడు జనార్దనపురం మీదుగా గుడివాడ సమీపంలోని బహిరంగ సభ ప్రాంతానికి చేరుకుంటారు. సభ అనంతరం హనుమాన్ జంక్షన్ జాతీయ రహదారి, గుండుగొలను మీదుగా నారాయణపురం రాత్రి బస శిబిరానికి చేరుకుంటారు.

### సీఎం పర్యటన సందర్భంగా భద్రతా ఏర్పాట్ల పరిశీలన

గన్నవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సుయాత్ర సందర్భంగా పోలీస్ ఉన్నతాధికారులు ఆదివారం ముందస్తు భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి నేతృత్వంలో భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. భద్రత పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు, సిబ్బందికి డీఐజీ, ఎస్పీ సూచనలు ఇచ్చారు. భద్రత లోపాలు లేకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. అనంతరం బస్సు యాత్ర జరిగే రూట్‌లో కాన్వాయ్‌తో ట్రయల్ రన్ నిర్వహించారు. గన్నవరం సీఐ వర ప్రసాద్, పలువురు అధికారులు పాల్గొన్నారు.



కాన్వాయ్ ట్రయల్ రన్ నిర్వహిస్తున్న అధికారులు



సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బారికేడ్లు

### దుర్గమ్మ సేవలో దేవదాయ శాఖ కమిషనర్



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దేవదాయ శాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణ ఆదివారం దుర్గమ్మను దర్శించుకున్నారు. వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ ఈవో రామరావు అమ్మవారి ప్రసాదాలను బహూకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రంలో కమిషనర్ సత్యనారాయణ భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.

**తిరుపతమ్మ సన్నిధిలో దేవదాయశాఖ ఆర్జేసీ**



పెనుగంచిప్రోలు: తిరుపతమ్మవారిని ఆదివారం దేవదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్, డెప్యూటీ కమిషనర్(డీసీ) కాకినాడ జోన్‌కు చెందిన మేడిపల్లి విజయరాజు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. వేద ఆశీర్వచనం అనంతరం ఆలయ అధికారులు ఆయనను అమ్మవారి శేష వస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

### నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి విశాఖపట్నానికి చెందిన భక్తులు ఆదివారం రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. విశాఖపట్నం సీతమ్మధారకు చెందిన రవిశంకర్, యమునల కుటుంబం అమ్మవారిని దర్శనానికి ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ. 1,01,116 విరాళాన్ని అందజేశారు. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. ప్రసాదాలు అందజేశారు.

# రగిలిన గుండెలు



గన్నవరంలో చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



సింగ్‌నగర్‌లో రోడ్డుపై నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- సీఎం వైఎస్ జగన్‌పై హత్యాయత్నాన్ని ఖండిస్తూ ఆందోళనలు
- కూటమి కుట్రలపై మండిపడ్డ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యే అభ్యర్థులు
- నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపిన పార్టీ శ్రేణులు




గంగూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న మంత్రి జోగి రమేష్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రజా బాంధవుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై రాయితో దాడి.. ఆయన నుదుటిపై నెత్తుటి ధార చూసిన గుండె కన్నీటి గాయంతో విలవిల్లాడుతోంది. ఆ గాయం ఎంత సలుపుతున్నా.. నొప్పిని పంటి బిగువున అణచుకుంటూ షెడ్యూల్‌ప్రకారం యాత్రను పూర్తి చేసిన జననేత తత్వాన్ని చూసిన అభిమాని అంతులేని ఆవేదనను మిగిల్చింది. తమ బాధను, ఆక్రందనను రోడ్డెక్కి వెలిబుచ్చారు. మేమంతా సిద్ధం బస్సు యాత్రలో విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నాన్ని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు ఆందోళన చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా నిరసనలు మిన్నంటాయి. క్యాండిల్ ర్యాలీలు చేపట్టారు. నల్లదుస్తులు ధరించి పార్టీ నాయకులు నిరసనలు తెలిపారు. ప్రజాభిమానంతో ఎదుర్కోలేని చంద్రబాబు హత్య రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. కూటమి కుట్రలు తిప్పికొడతామని ప్రతినబూనారు.

- జగ్గయ్యపేట పట్టణంలో ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఆధ్వర్యంలో నల్ల కండువాలు ధరించి నిరసన తెలిపారు. కూటమి కుట్రలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గాయంతో ఉన్న వైఎస్ జగన్ ఫొటోలను ప్రదర్శించారు. ఉదయభాను సతీమణి సామినేని విమలభాను, ఏపీ నెడ్ క్యాప్ చైర్మన్ వేల్పుల రవికుమార్, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఇంటూరి రాజగోపాల్ పాల్గొన్నారు.
- విజయవాడ పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ ఆధ్వర్యంలో సితార సెంటర్ వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ పార్టీ నాయకులు నినాదాలు చేశారు.
- విజయవాడ సెంట్రల్‌లోని పార్టీ కార్యాలయం వద్ద పార్టీ శ్రేణులు ఆందోళన చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే బోండా ఉమాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఘటనకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, కార్పొరేటర్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు. సింగ్‌నగర్‌లోని వివేకానంద స్కూల్ వద్ద వైఎస్సార్‌సీపీ వికలాంగ విభాగం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు.
- విజయవాడ తూర్పు నియోజకవర్గంలో పెద్ద ఎత్తున ఆందోళనలు జరిగాయి. 15, 17, 20 డివిజన్లలో కార్పొరేటర్లు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఎన్టీఆర్ సర్కిల్ వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. గుణదల బెత్లెహం నగర్‌లో ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ ప్రెస్‌మీట్ నిర్వహించి సీఎంపై జరిగిన హత్యాయత్నాన్ని ఖండించారు.
- సీఎం జగన్‌పై జరిగిన దాడికి నిరసనగా గన్నవరం వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద ఆ పార్టీ నాయకులు చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ ఎలిజబెత్ రాణి విలేకరులతో మాట్లాడారు. పార్టీ నాయకులు మేచినేని బాబు, నీలం ప్రవీణ్ కుమార్, జలసూత్రం రామ్మోహన్ రావు, దీపు, అరుణ పాల్గొన్నారు.
- పెనమలూరు నియోజకవర్గంలోని గంగూరులో గల వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు కార్యాలయ ప్రాంగణంలో నిరసన చేపట్టారు. నల్లబ్యాడ్జీలు ధరించి దాడి ఘటనను తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, టిడ్కో డైరెక్టర్ పి.రాఘవరావు, నాయకులు పాల్గొన్నారు.

**ప్రజలే బుద్ధి చెబుతారు..**



రాష్ట్రంలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి కనీవినీ ఎరుగని రీతిలో సంక్షేమం, అభివృద్ధి చేశారు. ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారు. సిద్ధం సభలకు జనం తండోపతండాలుగా రావడం చూసిన ప్రత్యర్థులు ఓర్వలేక ఇలాంటి పనికిమాలిన పనులను చేయిస్తున్నారు. వారికి ప్రజలే బుద్ధి చెబుతారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి.

– ఆచార్య గాజుల పల్లి రామచంద్రారెడ్డి, అధికార భాషా సంఘం సభ్యుడు

**అవే కాపాడాయి..**



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి సభలలో దేవుని దయ, ప్రజల చల్లని దీవెనలు ఉన్నాయని చెబుతారు. ఈ రాళ్ల దాడిలో కూడా కచ్చితంగా ఆయనను ఆ దేవుడే కాపాడారు. ప్రజల దీవెనెలు కూడా మెండుగా ఉన్నాయి కాబట్టే ఎవరు ఎన్ని కుయుక్తులు చేసినప్పటికీ జగన్‌మోహన్‌రెడ్డి సురక్షితంగా ఉంటారు. రానున్న ఎన్నికల్లో గెలుపు జెండా ఎగురవేస్తారు.

– బాయన వెంకట్రావు, ఏపీ ఎంఎస్ఎంఈ ఇండస్ట్రీస్ అసోసియేషన్ అధ్యక్షుడు

**చాలా ఆందోళనకరం..**



సీఎం జగన్ గత ఐదు సంవత్సరాలుగా పేదలను అన్ని విధాలుగా ఆదుకుంటున్నారు. అంతే కాకుండా కంటికి రెప్పలా పేదలను కాపాడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకనే ఇలాంటి సంఘటనలకు పాల్పడుతున్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటివి చాలా ఆందోళనకరం.

– త్రినాథ్, స్థానిక నివాసి, ఆటోనగర్

# గొప్ప దార్శనికుడు అంబేడ్కర్

**ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు**

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గొప్ప దార్శనికుడని, రాజ్యాంగ నిర్మాణంలో ఆయన పోషించిన పాత్ర మరువరానిదని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. ఆదివారం స్వరాజ్ మైదాన్‌లోని 204 అడుగుల భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహా శిల్పం ప్రాంగణంలో భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ పి. సంపత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం అన్నారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి. సంపత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అంబేడ్కర్ గొప్పతనాన్ని వివరించారు. అనంతరం సందర్శకులు, ప్రాజెక్ట్ విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బందికి అల్పాహారాన్ని పంపిణీ చేశారు.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహా శిల్పం వద్ద కేక్ కట్ చేసి తినిపిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

- కలెక్టరేట్‌లో బీఆర్ అంబేడ్కర్ 133వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

# ఈవీఎంలకు పటిష్ట భద్రత

**కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ**

చిలకలపూడి (మచిలీపట్నం): ఈవీఎంలకు పటిష్ట భద్రత ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. ఆదివారం రాత్రి వైఎస్సార్ సీపీ, టీడీపీ, ఐఎన్‌సీ, సీపీఐ, బీజేపీ బీఎస్పీ పార్టీల ప్రతినిధులు సిలార్ దాదా, ఎం. దాసు, మతిన్, కొడాలి శర్మ, గజేంద్రరావు, బాలాజీల సమక్షంలో పార్లమెంటు, శాసనసభ నియోజకవర్గాల ఈవీఎంల గోదాములకు కలెక్టరేట్ సిబ్బంది కలెక్టర్ డీకే బాలాజీ నేతృత్వంలో తాళాలు వేసి సీల్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల మొదటి రాండమైజేషన్ పూర్తి చేసి, జిల్లాలోని ఏడు శాసనసభ నియోజకవర్గాలకు తరలించిన నేపథ్యంలో జిల్లా స్థాయిలోని ఈవీఎంలను గోదాములో యథాతథంగా భద్రపరుస్తూ సీలు వేసినట్లు తెలిపారు. ఈవీఎంలను సజావుగా ఆయా శాసనసభ నియోజకవర్గాలకు ప్రత్యేక కంటైనర్ వాహనాలలో తరలించేందుకు రాత్రింబవళ్లు కృషి చేసిన ఈవీఎం నోడల్ అధికారిని, బృందాన్ని, రిటర్నింగ్ అధికారులు, సిబ్బందిని, జిల్లా ఎన్నికల అధికారి అభినందించారు. డీఆర్ఓ కె. చంద్రశేఖర రావు, ఈవీఎం నోడల్ అధికారి, మార్కెటింగ్ ఏడీ నిత్యానందం, కలెక్టరేట్ సమన్వయ అధికారి దుర్గా కిశోర్ పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### అలరించిన నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వసంత నవరాత్రోత్సవాలు పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ధర్మపథం వేదికపై నందికొట్కూరుకు చెందిన డి.సాయిలక్షిత బృందం ప్రదర్శించిన నృత్యం భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం వేదికపై శ్రీదుర్గ వైభవాన్ని నృత్య రూపకంగా ప్రదర్శించారు. ఈ ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. నృత్య కళాకారులకు ఈవో కె.ఎస్.రామరావు ప్రసాదాలను ఇచ్చారు.

### టీడీపీ 'బీసీల ఆత్మీయ సమావేశం' అట్టర్‌ఫ్లాప్



జి.కొండూరు: మైలవరం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వసంత వెంకటకృష్ణప్రసాద్‌కు షాకులు మీద షాకులు తగులుతున్నాయి. గ్రామాల్లో ఆత్మీయ సమావేశాల పేరుతో నిర్వహిస్తున్న సభల్లో దేవినేని ఉమా వర్గం రూపంలో నిరసన సెగ తగులుతుండటంతో పాటు ఆదివారం రాత్రి మైలవరంలో నిర్వహించిన నియోజకవర్గ బీసీల ఆత్మీయ సమావేశానికి స్పందన కరువైంది. టీడీపీకి చెందిన జిల్లా బీసీ నేతలు సైతం ఈ సమావేశానికి హాజరవుతున్నారని ప్రచారం చేసినా స్పందన రాలేదు. అసలు సమావేశానికి హాజరైన కొద్ది మందిలో కూడా బీసీలు కాకుండా ఇతర కులాలకు చెందిన నాయకులు, కార్యకర్తలే ఉన్నట్లు సమాచారం. కేవలం పరువు దక్కించుకునేందుకే కులాలకతీతంగా పార్టీ శ్రేణులను ఆహ్వానించినట్లు తెలుస్తోంది. మైలవరంలో లక్షా ముప్పై వేలకు పైగా ఓటర్లతో నిర్ణయాత్మక శక్తులుగా ఉన్న బీసీ సామాజిక వర్గాల నుంచి టీడీపీతో పాటు వసంత వెంకటకృష్ణప్రసాద్‌కు వ్యతిరేక పవనాలు వీస్తున్నట్లు ఘటనతో తేలిపోయింది.

### బస్సు ఢీకొని ఆటోడ్రైవర్ మృతి

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ ఆటోడ్రైవర్ దుర్మరణం చెందాడు. ఘటన కృష్ణలంక పీఎస్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగింది. బత్తుల కృష్ణ(40) రాణిగారి తోటలోని పుష్కర్ ఘాట్ సమీపంలో నివసిస్తున్నాడు. అతను ఆటోడ్రైవర్. ఆయనకు భార్య ఎల్లమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆదివారం రాత్రి 9.30 గంటల సమయంలో అతను రాణిగారితోట, ఫీడర్‌రోడ్డులోని యూబీఐ సమీపంలో బందరు కాలువ వైపు నుంచి ఫీడర్ రోడ్డుకు వెళ్లేందుకు జాతీయ రహదారిని దాటుతున్నాడు. ఆ సమయంలో బెంజిసర్కిల్ వైపు నుంచి బస్టాండ్‌కు వేగంగా వెళ్తున్న భీమవరం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు రహదారిని దాటుతున్న కృష్ణను బలంగా ఢీకొట్టింది. దీంతో అతను కిందపడిపోయి రోడ్డుకు ఢీకొనడంతో గాయాలపాలయ్యాడు. తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు పోలీసులు తెలిపారు.

# అంబేడ్కర్ భావజాలమే స్ఫూర్తి

**సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి కె.హర్షవర్ధన్**



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హర్షవర్ధన్, కలెక్టర్ ఢిల్లీరావు తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భావజాలం, ఆలోచన విధానాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ సెక్రటరీ కె. హర్షవర్ధన్ అన్నారు. లెనిన్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో ఆదివారం సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యాన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 133వ జయంతి రాష్ట్ర స్థాయి మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సంక్షేమ శాఖ కార్యదర్శి కె.హర్షవర్ధన్, డైరెక్టర్ విజయ్ కృష్ణన్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఎండీ ఎస్.చినరాములు, లిడ్క్యాప్ మేనేజింగ్ డైరెక్టర్ డోలాశంకర్.. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. హర్షవర్ధన్ మాట్లాడుతూ అంబేడ్కర్ స్ఫూర్తితో జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. జాతీయ సమైక్యతకు అంబేడ్కర్ సింబల్‌గా నిలుస్తారన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఓర్పుతో జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకున్నారన్నారు. కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ పట్టుదల కలిగిన వ్యక్తి బీఆర్ అంబేడ్కర్ అని పేర్కొన్నారు. జేసీ సంపత్ కుమార్ మాట్లాడుతూ అంబేడ్కర్‌బాటలో అందరూ నడవాలన్నారు. తొలుత భవన ప్రాంగణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సాంఘిక సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ కృష్ణమోహన్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి విజయభారతి, సంఘ నాయకులు సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహ విద్యార్థులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎస్పీ నయీమ్‌అస్మీ

**చరిత్ర పుటల్లో చెరగని ముద్ర అంబేడ్కర్‌ది**

కోనేరుసెంటర్: చరిత్ర పుటల్లో చెరగని ముద్ర డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ది అని కృష్ణా ఎస్పీ అద్నాన్ నయీమ్‌అస్మీ అన్నారు. భారత రాజ్యాంగ రూపకర్త, ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎస్పీ ఇతర అధికారులతో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలు భారతదేశం వైపు చూసేలా చేసిన గొప్ప మేధావి అంబేడ్కర్ అని కొనియాడారు. ఎన్నో వివక్షల నడుమ విద్యాభ్యాసాన్ని పూర్తిచేసి ప్రపంచంలోనే ఎవరు అందుకోనన్ని డిగ్రీలు తీసుకుని విద్యారంగంలో ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా, రాజకీయవేత్తగా, సామాజిక సంస్కర్తగా అనేక ఉద్యమాలు చేసి అణగారిన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) వెంకటేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ ప్రసాద్, బందరు డీఎస్పీ సుభాని, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## దుర్గగుడిలో అంతర్గత బదిలీలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై పలువురు అధికారులు, సిబ్బందికి అంతర్గత బదిలీలు చేస్తూ ఆలయ ఈవో కె.ఎస్.రామరావు ఆదేశాలు జారీ చేశారు. బదిలీలు అయిన అధికారులు, సిబ్బంది వెంటనే తమకు కేటాయించిన స్థానాల్లో విధులు నిర్వహించాలని ఈవో ఆదేశించారు. సూపరిండెంటెంట్ వి. నగేష్‌కు కొలనుకొండలోని పట్టాభిరామ స్వామి దేవస్థాన నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. సీనియర్ అసిస్టెంట్ జి.సతీష్ కుమార్ సెక్రటేరియట్ నుంచి ఈవో పేషీ సీసీగా విధులు కేటాయించారు. సీనియర్ అసిస్టెంట్ కె. సీతారామయ్య అన్నవరం దేవస్థానం నుంచి బదిలీపై రాగా ఆయనకు లడ్డూ తయారీ, స్టోర్స్ ఫైల్ నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. బి.నాగరాజుకు లడ్డూ తయారీ నుంచి అన్నదానం విభాగంలో ఫైల్స్ నిర్వహణ, ఐటీ రిటన్స్, డోనర్ సెల్ బాధ్యతలు అప్పగించారు. జె.కామేశ్వరికి అన్నదానం విభాగం నుంచి దత్తత దేవాలయాలు, కనకదుర్గప్రభ ధర్మపథం నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. పి.శిరీషకు దత్తత దేవాలయాలు, శానిటరీ, చీరల విభాగం నుంచి దత్తత దేవాలయాల విధులు తప్పించారు. పీవీ రమణకు ట్రాన్స్‌పోర్ట్ విభాగ విధులతో పాటు ఇంజినీరింగ్ విభాగం ఈ–1 నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. జూనియర్ అసిస్టెంట్ ఎస్వీ దుర్గారావును ఇంజినీరింగ్ విభాగం ఈ1 నుంచి సర్వీసు రిజిస్టర్, సిబ్బంది ఐటీ రిటన్స్, రికవరీ రిజిస్టర్ నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. పెనుగంచిప్రోలు నుంచి బదిలీపై వచ్చిన ఎ.జ్యోతికి అన్నదానం హాల్ నిర్వహణ, నగదు పుస్తక నిర్వహణ బాధ్యతలు ఇచ్చారు. టి.లక్ష్మణ్‌కుమార్‌కు పూజల విభాగానికి, ఎ.సుభాకర్‌కు మహా మండపం దిగువన దర్శన టికెట్ల జారీ పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. కనకదుర్గ ప్రభలో విధులు నిర్వహిస్తున్న ఆర్. శ్రీలతకు మహా మండపం దిగువన రూ. 500 టికెట్ల విక్రయ కౌంటర్‌కు బదిలీ చేశారు. టీఎస్. రామ్‌జీకి ట్రస్ట్ బోర్డు నుంచి డోనర్ సెల్, దేవస్థాన యూ ట్యూబ్ నిర్వహణ బాధ్యతలు ఇచ్చారు. రికార్డు అసిస్టెంట్ పీజీ రాజుకు రూ. 500 టికెట్ పంచింగ్ కౌంటర్, కె.వీ రబాబుకు మహా మండపం ట్రోల్‌ఫీ కౌంటర్, కర్రే రమేష్‌కు రైల్వే స్టేషన్ ప్రసాదాల కౌంటర్‌కు బదిలీ చేశారు. ఎన్ఎంఆర్ పీసీహెచ్ఎస్ఎన్ అప్పారావును ఇంజినీరింగ్ విభాగానికి, ఎస్. వెంకటరెడ్డిని రూ. 500 టికెట్ స్కానింగ్ పాయింట్‌కు, సీహెచ్. నాగస్వామిని రూ. 500 టికెట్ పంచింగ్ పాయింట్‌కు బదిలీ చేశారు.

## ముగిసిన సువార్త ఉజ్జీవ మహా సభలు

గుంటూరు రూరల్: ఏసుక్రీస్తు ప్రపంచంలోని పాపులను రక్షించడానికి భూమిపై పుట్టిన దేవుడని కృపా మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రదర్ మ్యాథ్యూస్ పేర్కొన్నారు. గత నాలుగు రోజులుగా నల్లపాడు రోడ్డులో జరుగుతున్న 18వ వార్షిక సువార్త ఉజ్జీవ మహా సభలు ఆదివారంతో ముగిశాయి. కార్యక్రమంలో బ్రదర్ మ్యాథ్యూస్ క్రీస్తు సందేశాన్ని భక్తులకు వివరిస్తూ ఏసుక్రీస్తు మార్గం శాంతి, ప్రేమ, దయ మార్గమని, ఆయన మార్గంలో రక్షణ పొందవచ్చునన్నారు.

### అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

అన్నవరం(జగ్గయ్యపేట): అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందిన ఘటన గ్రామంలో ఆదివారం జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం ఎస్సీ కాలనీకి చెందిన యర్రం రమాదేవి (32)కి స్థానికుడు రాంబాబుతో పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి బాబు, పాప ఉన్నారు. రెండేళ్లుగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావటంతో పెద్దలు సర్దిచెబుతున్నారు. ఈ క్రమంలో కొంత కాలంగా ఆమె పుట్టింటి వద్ద, భర్త తెలంగాణలోని తన సోదరి వద్ద ఉంటున్నాడు.


ఈ క్రమంలో శనివారం రాత్రి వరకు ఆమె ఇంట్లోనే ఉంది. ఆదివారం ఉదయం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతం వద్ద మృతి చెంది కనిపించడంతో స్థానికులు గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. సీఐ జానకిరామ్ అక్కడికు వచ్చి మృతదేహాన్ని పరిశీలించి శరీరంపై గాయాలున్నట్లు గుర్తించామన్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి తల్లి జగదీశ్వరి మాట్లాడుతూ శనివారం రాత్రి సమయంలో తన కుమార్తె బాగానే ఉందని అల్లుడు రాంబాబు హత్య చేసి అటవీ ప్రాంతంలో పడేశాడని పోలీసులకు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి మృతదేహాన్ని తరలించారు.

### 190 కేజీల గంజాయి స్వాధీనం



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం గూడవల్లిలోని ఎన్నికల చెక్ పోస్టు వద్ద ఆదివారం మినీ లారీలో తరలిస్తున్న 190 కేజీల గంజాయిను పోలీసులు స్వాధీనపరుచుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా నుంచి బెంగుళూరు వెళ్తున్న మినీ లారీని వీఆర్వో శ్రీనివాసరావు, ఎస్ఐ సతీష్ సిబ్బందితో కలిసి చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహించారు. వీటిలో గుట్టుచప్పుడు కాకుండా సంచుల్లో తరలిస్తున్న 190 కేజీల గంజాయిని పోలీసులు గుర్తించారు. దీని విలువ రూ.25 లక్షలు ఉంటుంది. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని పట్టుబడిన గంజాయిను పటమట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### మొక్కజొన్న ట్రాక్టర్ దగ్ధం



రామచంద్రునిపేట(జగ్గయ్యపేట): ప్రమాదవశాత్తు మొక్కజొన్న లోడు ట్రాక్టర్ దగ్ధమైన ఘటన మండలంలోని రామచంద్రునిపేటలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తుడు పుట్టం రామకృష్ణ అనే రైతు మొక్కజొన్న పంటను మిల్లు ఆడించేందుకు ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ ఇంజిన్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయి. గమనించిన రైతు సమీపంలోని గ్రామస్తులను పిలుచుకుని వచ్చేలోగా ట్రాక్టర్ పూర్తిగా దగ్ధమైంది. గ్రామస్తులు ఇచ్చిన సమాచారంతో ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే ట్రాక్టర్ పూర్తిగా కాలింది. ఘటనపై ట్రాక్టర్ యజమాని చుక్కా రోజాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనలో రూ. రెండు లక్షల విలువైన పంట నష్టంతో పాటు రూ.ఆరు లక్షల విలువ చేసే ట్రాక్టర్ దగ్ధమైందని బాధితులు తెలిపారు.

# భగవంతుని దయతో తప్పిన ప్రమాదం

- సీఎం వైఎస్ జగన్‌పై ఒక అజ్ఞాతశక్తి దాడి చేయించింది
- గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడ టౌన్: భగవంతుని దయతో, ప్రజాశీస్సులతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పెను ప్రమాదం తప్పిందని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) చెప్పారు. కృష్ణా జిల్లా గుడివాడలోని తన ఎన్నికల కార్యాలయంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. శనివారం రాత్రి విజయవాడ సింగ్‌నగర్‌లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని హతమార్చేందుకు గురిచూసి నవరుగంత మీద తగిలేలా రాళ్లతో దాడిచేయించారన్నారు. ఆనాడు విశాఖ ఎయిర్ పోర్టులో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మెడమీద కత్తితో పొడవాలని ప్రయత్నిస్తే భగవంతుని దయతో అది భుజానికి తగిలి పెనుప్రమాదం తప్పిందని గుర్తుచేశారు. ఈ రోజు ఒక రాయితో పకడ్బందీగా వ్యూహం ప్రకారం గురిచూసి నవరుగంతను కొట్టాలని ప్రయత్నించారన్నారు. బస్సు అటు ఇటు కదులుతుండటంతో గురి తప్పిందని, లేకపోతే పెను ప్రమాదం జరిగేదని ఆందోళన వ్యక్తం చేశారు. దాన్ని ఖండించాల్సిన కొంతమంది పెద్దలు సంస్కారహీనంగా మాట్లాడుతూ జగన్ మోహన్‌రెడ్డి దాడిచేయించుకున్నారని, సానుభూతి కోసమే ఈ దాడికి తెరలేపారని అనడం నీచాతినీచమని ఆగ్రహం వ్యక్తంచేశారు. జగన్‌మోహన్‌రెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేక, కుట్రలకు తెరలేపారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పది సంస్థలు సర్వేలు చేస్తే తొమ్మిది సంస్థలు జగన్‌మోహన్‌రెడ్డి 125 పైబడి ఎమ్మెల్యే స్థానాలు, 20 పైగా ఎంపీ స్థానాలు గెల్చి ప్రభుత్వం ఏర్పాటుచేస్తారని చెపుతున్నారన్నారు. దీంతో పాటు విజయవాడ నడిబొడ్డున డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్న కక్షతో కొన్ని సామాజిక వర్గాలు ఈ రోజు జగన్‌మోహన్‌రెడ్డిపై దాడి చేశారని తాను అభిప్రాయపడుతున్నానన్నారు. ఒక ముఖ్యమంత్రి మీద దాడి చెయ్యాలంటే దమ్ము, ధైర్యం ఉండాలన్నారు. ముఖ్యమంత్రి ప్రాణాలు తీయాలి అనే ప్రక్రియకు సామాన్యుడు సిద్ధపడరన్నారు. దీని వెనుక పెద్ద నేతల అండ, వారిచ్చిన ధైర్యం, సొమ్ముతో ఇంత పెద్ద సాహసం చేశారని తాను విశ్వసిస్తున్నానన్నారు. శనివారం మధ్యాహ్నం తుళ్లూరులో చంద్రబాబు నాయుడు ప్రసంగాన్ని తాను విన్నానన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని రాళ్లతో కొట్టాలని చంద్రబాబు నాయుడు సూచించారని, ఆ వీడియోలు ఉన్నాయని పేర్కొన్నారు.

**కుట్ర పన్నారు**

జగన్‌మోహన్‌రెడ్డిని రాళ్లతో కొట్టండి, అతను దుర్మార్గుడు, దున్నపోతు, సైకో రాళ్లతో దాడి చెయ్యండి అని చంద్రబాబు చెబితే ఈ దుర్మార్గులు, పచ్చకుక్కలు, తెలుగు తమ్ముళ్లు, పిచ్చి పరాకాష్టకు చేరిన కులగజ్జి పట్టిన కుక్కలు చంద్రబాబు మాటలు విని జగన్‌మోహన్‌రెడ్డిని చంపడానికి కుట్ర పన్నారన్నారు. ఒక రాయి చేతితో విసిరితే తగిలే దెబ్బకాదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డికి నుదురు మీద చిట్లి అదే రాయి తిరిగి వెల్లంపల్లికి గాయం జరిగిందంటే అది ఎంత ఫోర్స్‌గా వచ్చిందో అర్థం చేసుకోవాలని తెలిపారు. చేత్తో కొడితే అంత వేగంగా రాదన్నారు. కొందరు టీడీపీ కుక్కలు జగన్‌మోహన్‌రెడ్డి కరెంటు తీయిస్తున్నాడని విమర్శించడాన్ని తప్పుపట్టారు. ఒక ముఖ్యమంత్రిగానీ ప్రధాన మంత్రిగానీ బస్సు యాత్ర చేస్తుంటే కరెంటు తీయడం ఆనవాయితీ అన్నారు. చంద్రబాబు నాయుడు బస్సు యాత్ర చేసినప్పుడు కరెంటు తియ్యలేదా అని ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడు ప్రణాళికతో జగన్‌మోహన్‌రెడ్డి మీద గత ఎన్నికల ముందు, ఈ ఎన్నికల ముందు దాడి చేయించారని విమర్శించారు. ఆయనకు బ్లాక్ క్యాట్ సెక్యూరిటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పనికిమాలిన వెధవలకు బ్లాక్ క్యాట్ సెక్యూరిటీ ఇస్తున్నారని, 420గాళ్లకు సెక్యూరిటీ పెంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు.. సానుభూతి కోసం జగన్‌మోహన్‌రెడ్డి దాడులు చేయించుకుంటున్నారనడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. తిరుపతి అలిపిరి వద్ద బాంబు దాడి జరిగి 18 అడుగులు ఎత్తు ఎగిరి పడి చేతులకు కాళ్లకు కట్లు కట్టుకుని సానుభూతి కోసం ఎన్నికలకు వెళితే ప్రజలు నీకెందుకు ఓటు వెయ్యలేదని ప్రశ్నించారు. 46 సీట్లకే నిన్నెందుకు పరిమితం చేశారన్నారు. మంచి పనులు చేస్తే ప్రజల హృదయాలను దోచుకుంటే ఓట్లు పడతాయిగానీ ఉల్లిపాయ బాంబులు పేల్చుకుని వేషాలు వేస్తే ఓట్లు రావన్నారు. ఈ చంద్రబాబు నాయుడు మాటలు దాడి చేసిన వారిని పట్టుకోమనకుండా దాడి చేసిన వారిని పట్టుకోలేక పోయిన పోలీసు అధికారుల మీద చర్యతీసుకోవాలని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాననడం దుర్మార్గమని తెలిపారు. తక్షణమే ఈ కుట్ర వెనుక దాగి ఉన్న వ్యక్తులను పట్టుకోవాలి. జగన్‌మోహన్‌రెడ్డికి బ్లాక్ క్యాట్ సెక్యూరిటీ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

## కనులపండువగా పుష్పార్చన



దుర్గగుడిలో అమ్మవారికి పుష్పార్చన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై వసంత నవరాత్రోత్సవాల్లో ఆరో రోజైన ఆదివారం దుర్గగుడిలో అమ్మవారికి కాగడా మల్లెలు, జాజులతో అర్చన చేశారు. తొలుత ఆలయ ఈవో కె.ఎస్.రామరావు దంపతులు, ఏఈవో ఎస్. రమేష్‌బాబు, స్థానాచార్య శివప్రసాద్‌శర్మ, వైదిక కమిటీ సభ్యులు రంగావజ్ఝల శ్రీనివాసశాస్త్రి, మురళి, ఇతర అర్చకులు అమ్మవారికి అర్చన చేయిఅంచే పుష్పాలతో అంతరాలయంలోని మూలవిరాట్‌ను దర్శించుకున్నారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా పుష్పార్చన వేదిక వద్దకు చేరుకున్నారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛారణ చేస్తుండగా, అర్చకులు పుష్పాలతో అమ్మవారికి అర్చన నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పంచహారతుల సేవ జరిగింది. అర్చన చేసిన పుష్పాలను భక్తులకు పంపిణీ చేశారు. భక్తులతో లక్ష్మీ గణపతి ప్రాంగణం సందడిగా మారింది. పుష్పార్చనను వీక్షించేందుకు విచ్చేసిన భక్తులకు ఈవో రామరావు సౌభాగ్య ఆధ్యాత్మిక పుస్తకాలను పంపిణీ చేశారు.

## వెలంపల్లికి పరామర్శ



వెలంపల్లిని పరామర్శిస్తున్న సజ్జల, అయోధ్యరామిరెడ్డి, లేళ్ల అప్పిరెడ్డి



వెలంపల్లిని పరామర్శిస్తున్న 'పశ్చిమ' అభ్యర్థి షేక్ ఆసిఫ్, కేశినేని నాని కుమార్తె శ్వేత

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విజయవాడ నగరంలో శనివారం జరిగిన దాడిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు గాయపడిన ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావును పలువురు ప్రముఖులు ఆదివారం పరామర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, నూజివీడు ఎమ్మెల్యే ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు తదితరులు వెలంపల్లి ఇంటికి చేరుకొని ఆయన్ను పరామర్శించారు. ఈ సందర్భంగా దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ దాడి వెనుక కచ్చితంగా కుట్ర కోణం ఉందన్నారు. దీనిపై ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఘటనపై లోతైన విచారణ జరగాలని డిమాండ్ చేశారు. వెలంపల్లిని పార్టీ పశ్చిమ అభ్యర్థి షేక్ ఆసిఫ్, ఎంపీ కేశినేని నాని కుమార్తె శ్వేత పరామర్శించారు.

## వెలంపల్లిపై అనుచిత వ్యాఖ్యలు

**టీడీపీ నేతలపై కేసు నమోదు**

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఎన్నికల కోడ్ ఉల్లంఘించి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుపై నిరాధార ఆరోపణలు, అసభ్యకర వ్యాఖ్యలు చేసిన టీడీపీ నాయకులపై ఎన్నికల కమిషన్ ఆదేశాలతో రెండు రోజుల క్రితం ఎస్ఎన్ పురం పీఎస్‌లో కేసు నమోదైంది. వివరాల ప్రకారం ఈ ఏడాది మార్చి 26న సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ నేతలు దూండి రాకేష్, తుమ్మలపెంట శ్రీనివాసరావు మాట్లాడారు. ఎమ్మెల్యే వెలంపల్లిపై దుర్భాషలాడుతూ ఆయన సామాజిక వర్గానికి తప్పుడు సంకేతాలు వెళ్లేలా మాట్లాడటంతో పాటు ఆయనపై అసత్య ఆరోపణలతో కూడిన కరపత్రాలను ముద్రించి సత్యనారాయణపురంలోని పలు ప్రాంతాల్లో పంపిణీ చేశారు. దీనిపై వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్ కుంచెం యోహాను సెంట్రల్ ఎలక్షన్ కంప్లైంట్ సెల్‌లో ఆధారాలతో ఫిర్యాదు చేశారు. దీంతో జోనల్ కమిషనర్, ఎంసీసీ టీం, ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేశారు. అందులో ప్రింటింగ్ ప్రెస్ అడ్రస్, కాపీల సంఖ్య వంటి వివరాలు లేకుండా ఎమ్మెల్యే వెలంపల్లిపై తప్పుడు ఆరోపణలతో కరపత్రాలను ముద్రించి పంపిణీ చేసినట్లు గుర్తించారు. ఇది ఎన్నికల కోడ్ ఉల్లంఘనే అని, దీనికి పాల్పడిన ఇద్దరు టీడీపీ నేతలపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఎస్ఎన్‌పురం పోలీసులకు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## జగన్‌పై కూటమి కుట్ర



సీఎం జగన్‌పై దాడికి గొల్లపూడిలో నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కుట్రేనని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త తలశిల రఘురాం కార్యాలయం ముందు ఆదివారం సాయంత్రం నిరసన కార్యక్రమం చేశారు. మేమంతా సిద్ధం పేరుతో పదమూడు రోజులుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న బస్‌యాత్రలో భాగంగా శనివారం సాయంత్రం విజయవాడ నగరంలో జరుగుతున్న బస్ యాత్రలో టీడీపీ కూటమికి చెందిన గూండాలు జగనన్నపై రాళ్ల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావడం తథ్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గొల్లపూడి గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### పథకాలు కొనసాగేందుకు వైఎస్సార్ సీపీని ఆశీర్వదించండి



కృష్ణలంక(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గత ఐదేళ్లలో ప్రతి ఇంటా సంక్షేమ ఫలాలు అందాయని, భవిష్యత్‌లో కూడా అవి కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ విజ్ఞప్తి చేశారు. కృష్ణలంక, 22వ డివిజన్‌లోని స్వర్గపురి వీధుల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గత ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు వివరించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో నవరత్నాలు అమలు పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సుపరిపాలన అందించారని కొనియాడారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటేసి తనను ఎమ్మెల్యేగా, కేశినేని శ్రీనివాస్(నాని)ను ఎంపీగా అత్యధిక మెజారిటీతో గెలిపించి మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో 22వ డివిజన్ కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా అయ్యప్పస్వామి పూజ



కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణలంక, మెట్లబజార్‌లోని కోదండ రామాలయంలో శ్రీ అయ్యప్పస్వామి పూజ, భజన 42వ వార్షికోత్సవం గురుస్వామి శరత్ స్వామి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు, భిక్ష స్వీకరించారు. అనంతరం పడిపాట నిర్వహించారు. ఈ సందర్భంగా శరత్‌స్వామి మాట్లాడుతూ గత 42 సంవత్సరాలుగా తమకు అన్ని విధాలుగా సహకరిస్తున్న స్వాములకు, గురుస్వాములకు, భక్తులకు ధన్యవాదాలు తెలిపారు. గురుస్వాములు దీపక్, చిరంజీవి, కుమార్, రామకృష్ణ, వాసు, ఎన్.సుబ్బారావు పాల్గొన్నారు.

### స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వేసవిలో స్వచ్ఛంద సేవా సంస్థలు చలివేంద్రాలను ఏర్పాటు చేసి పాదచారులకు నీరు, మజ్జిగను పంపిణీ చేయడం అభినందనీయమని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. సూర్యసత్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సాయిరాం థియేటర్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మేయర్ భాగ్యలక్ష్మి ఆదివారం ప్రారంభించారు. అనంతరం చలివేంద్రంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి పేదలకు మందులను అందిస్తున్నారని, చలివేంద్రం ఏర్పాటు చేసి పాదచారులకు మజ్జిగ పంపిణీ వంటి సేవా కార్యక్రమాలను చేయడం అభినందనీయమన్నారు. ట్రస్ట్ చైర్మన్ రాజగిరి సోమేశ్వరరావు, సురకాశి ఈశ్వరరావు, బెవర సూర్యనారాయణ, సాయిరాం థియేటర్ యజమాన్యం సత్యనారాయణ, వేముల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

**హరివిల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో..**

హరివిల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం చిట్టినగర్, కలరా హాస్పిటల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పాదచారులకు, వాహన చోదకులకు మజ్జిగ పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు ఎస్‌కే మొహమ్మద్ రఫీ మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా పాదచారులకు మజ్జిగ పంపిణీ చేస్తున్నామన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ శరత్‌కుమార్, సహాయ కార్యదర్శి యు.కనకారావు, శ్రీనివాస కుమార్, కొమెర రాజు, కానూరి చంద్రశేఖర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్):అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో ఆదివారం శ్రీధర్మ పరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పూర్ణఫల అర్చన నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చన, శ్రీ చక్రార్చనలు శాస్త్రోక్తంగా చేశారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు. అలాగే శ్రీశివజ్ఞాన పీఠంలో వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అక్షరాంభికకు పలు రకాల పుష్పాలతో అర్చనలు నిర్వహించారు.

# సీఎం వైఎస్ జగన్‌పై దాడి హేయమైన చర్య

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్
- నియోజకవర్గ వ్యాప్తంగా పెల్లుబికిన నిరసనలు



గుణదలలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న అవినాష్, నాయకులు

గుణదల(విజయవాడతూర్పు): ప్రజా క్షేత్రంలో సీఎం వైఎస్ జగన్‌కు పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక తెలుగుదేశం నాయకులు ఆయనపై దాడికి పాల్పడ్డారని ఇది అత్యంత హేయమైన చర్య అని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ అన్నారు. గుణదల బెత్లహేం నగర్ కమ్యూనిటీ హాల్ వద్ద ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాక్షేత్రంలో సీఎం జగన్‌కు ఆదరణ పెరుగుతోందన్నారు. గత రెండు వారాలుగా రాష్ట్రంలో జరుగుతున్న మేమంతా సిద్ధం బస్సు యాత్రతో ఇది స్పష్టమైందన్నారు. టీడీపీ నాయకులకు ఓటమి భయం పట్టుకుందని చెప్పారు. అందుకే సీఎం జగన్‌ను ఎన్నికలకు దూరంగా ఉంచాలనే దురాలోచనతో ఉద్దేశ పూర్వకంగా దాడి చేయించారని పేర్కొన్నారు. చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ కనుసన్నలలోనే ఈ దాడి జరిగిందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే దిశగా కుట్రలు పన్నుతున్న టీడీపీ నాయకులపై ఎన్నికల అధికారులు అనర్హత వేటు వేయాలని కోరారు.

**చంద్రబాబు ఖబడ్దార్..**

చంద్రబాబు, లోకేషలు ఇకనైనా కుట్రపూరిత రాజకీయాలు మానుకోవాలని అవినాష్ హితవు పలికారు. చంద్రబాబు సమక్షంలో జరిగిన ఈ దాడి కారణంగా ఆ పార్టీ వచ్చే ఎన్నికల్లో భూస్థాపితం అవుతుందన్నారు. ప్రజలు తమ ఓటుతో సరైన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ వైఎస్సార్ సీపీ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఇది కచ్చితంగా టీడీపీ నాయకుల పనేనని, టీడీపీ నేతలే ఈ ఘటనకు బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో 2వ డివిజన్ కార్పొరేటర్ అంబడిపూడి నిర్మలకుమారి, నాయకులు చందా కిరణ్ తేజ, కోటి నాగులు, రవిప్రకాష్, అలంకార్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

**లబ్బీపేటలో నిరసన**

లబ్బీపేట(విజయవాడతూర్పు): మేమంతా సిద్ధం బస్సు యాత్రలో ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దాడి టీడీపీ కుట్రేనని పలువురు పేర్కొన్నారు. దాడిని నిరసిస్తూ లబ్బీపేట చెన్నుపాటి పెట్రోలు బంకు వద్ద వైఎస్సార్ సీపీ నేతలు ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా టీడీపీ గుండాయిజం నశించాలని, విజయవాడలను టీడీపీ రౌడీయిజాన్ని అరికట్టాలని నినదించారు. రానున్న ఎన్నికల్లో అలాంటి వారికి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. 19వ డివిజన్ కార్పొరేటర్ రెహానా నాహీద్, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అలీం, చింతగుంట విజయ్ ఆనంద్‌కుమార్, బుర్రి జగ్జీవన్‌రావు, ఎస్‌కే సుభానీ తదితరులు పాల్గొన్నారు.

### ముఖ్యమంత్రిపై దాడి అమానుషం

కృష్ణలంక(విజయవాడతూర్పు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై దాడి అమానుషమని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధికార ప్రతినిధి పులిపాటి దుర్గారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణలంక, 20వ డివిజన్‌లోని నల్లగేటు డౌన్‌లో దుర్గారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. సీఎంపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. టీడీపీ అరాచక రౌడీ రాజకీయాలు అంతమొందించేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారన్నారు. వక్ఫ్ బోర్డు డైరెక్టర్ మీర్ హుస్సేన్, రాష్ట్ర ట్రేడ్ యూనియన్ సెక్రటరీ గొర్ల గోవింద్, రాష్ట్ర మహిళా విభాగం నాయకురాలు నిమ్మల జ్యోతిక, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ ప్రెసిడెంట్ సుభాని, ఐటీ వింగ్ నగర అధ్యక్షుడు పంతాల సాయి, నాయకులు, కార్యకర్తలు బాషా, శాస్త్రీ, సతీష్, కొండా, అజయ్‌బాబు, జోగా రమణ, మద్దెల సునీల్, మర్రె అనీల పాల్గొన్నారు.

**రామలింగేశ్వరనగర్‌లో నిరసన**

ఆటోనగర్(విజయవాడతూర్పు): సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై జరిగిన దాడికి నిరసనగా ఆదివారం 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్ పడవల రేవు సెంటరులో వైఎస్సార్ సీపీ నేత, మాజీ డిప్యూటీ మేయర్ ఆళ్ల చెల్లారావు ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సీఎం జగన్‌కు రోజు రోజుకు వస్తున్న ఆదరణ చూచి ఓర్వలేక చంద్రబాబు కుట్ర చేయించారని ఆరోపించారు. డివిజన్ అధ్యక్షుడు వెంకటరెడ్డి, బాలాజీ, సూరి, రాజు, కామేష్, వెంకయ్య నాయుడు, విష్, నాని, నారాయణ, జయకృష్ణ, సత్యన్నారాయణ, సుబ్బారావు, ప్రసాద్, కేశవులు పాల్గొన్నారు.

**ముఖ్యమంత్రిపై దాడి కుట్రపూరిత చర్య**

కృష్ణలంక(విజయవాడతూర్పు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దాడి కుట్రపూరిత చర్య అని, ఇది చాలా బాధాకరమని 17వ డివిజన్ కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి అన్నారు. రాణిగారితోటలోని 17వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి వైట్ హౌస్ సెంటర్ వరకు ఆదివారం నల్లబ్యాడ్జీలు ధరించి, నిరసన ర్యాలీ నిర్వహించి బైఠాయించారు. కూటమి గుండాలను తరిమి కొట్టే రోజులు దగ్గరపడ్డాయని రామిరెడ్డి అన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శాప్ డైరెక్టర్ కె.దామోదర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### పక్కా పథకం ప్రకారమే దాడి

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన దాడి పక్కా పథకం ప్రకారమే జరిగినట్లు అర్థమవుతుందని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మెహబూబ్ షేక్ అన్నారు. ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరి ఆదరాభిమానాలు చూరగొన్న వైఎస్ జగన్‌పై దాడి చేయడం అంటే, రాష్ట్ర ప్రజలందరిపై, ప్రజాస్వామ్యంపై దాడి చేయడమేనన్నారు. దీని వెనుక ఎవరు ఉన్నారు, ఎవరు కుట్రలు చేశారనేది ఎన్నికల కమిషన్, పోలీసులు నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. దాడి విషయంలో టీడీపీ నేతలు చేస్తున్న అసత్య ప్రచారం చూస్తుంటే, పలు అనుమానాలు కలుగుతున్నారని మండిపడ్డారు. ఈ దాడి వెనుక లోకేష్, చంద్రబాబు కుట్రలు దాగి ఉన్నాయన్నారు.



రాణిగారితోటలో నిరసన తెలుపుతున్న కార్పొరేటర్ రామిరెడ్డి, పార్టీ శ్రేణులు



ఎంజీ రోడ్డులో నిరసన తెలుపుతున్న నాయకులు



పడవలరేవు సెంటర్‌లో..



కృష్ణలంకలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



ఎన్టీఆర్ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

### రేపు సిద్ధార్థలో మాగ్నోవా 2కే24



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ కోర్సు చదువుతున్న విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు మాగ్నోవా–2కే24 పేరుతో ఈ నెల 16వ తేదీ మంగళవారం సిద్ధార్థ ఆడిటోరియంలో రాష్ట్ర స్థాయిలో పోటీలను నిర్వహిస్తున్నామని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ చెప్పారు. మాగ్నోవా 2కే24 కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం కళాశాల ఆవరణలోని సెమినార్ హాల్‌లో ఆదివారం జరిగింది. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. రెండు దశాబ్దాలుగా మాగ్నోవా పేరుతో పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 30 కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కెనరా బ్యాంక్ విజయవాడ జనరల్ మేనేజర్ పి.రవివర్మ హాజరవుతారని చెప్పారు. కళాశాల బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి కేవీ.రమేష్ చంద్ర మాట్లాడుతూ బిజినెస్ బ్రెయిన్ బ్యాటిల్, మార్కెట్ మేకర్స్, మాస్టర్ మైండ్స్ (యంగ్ మేనేజర్), బిజ్ బ్లాస్ట్(బిజినెస్ ప్లాన్), మిస్టర్ అండ్ మిస్ మాగ్నోవా, ఐపీఎల్ ఆక్షన్, లెట్స్ రీల్ ఇట్(రీల్ మేకర్) వంటి అంశాల్లో పోటీలు జరుగుతాయన్నారు. అదే రోజు సాయంత్రం పోటీల విజేతలకు బహుమతులను అందజేస్తామని చెప్పారు. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ ప్రొఫెసర్ రాజేష్ సి.జంపాల, ప్రోగ్రామ్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు కె.విజయ్, కె.శ్రీనివాసులు, పి.కిషోర్, విద్యార్థులు పాల్గొన్నారు.

### సీఎం వైఎస్ జగన్‌కు కేంద్రం భద్రత పెంచాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కేంద్ర ప్రభుత్వం భద్రత పెంచాలని జాతీయ కాపు సమాఖ్య అధ్యక్షుడు నరహరిశెట్టి శ్రీహరి డిమాండ్ చేశారు. విజయవాడలో పర్యటిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిపై దాడికి పాల్పడటం అత్యంత దారుణమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను విఘాతం కలిగించేందుకు తెలుగుదేశం పార్టీ ఈ విధమైన దాడులకు తెగబడుతుందని ప్రజలందరూ భావిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో అరాచక పరిస్థితులను సృష్టించి తద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్న ప్రతిపక్షాలను ప్రజలు అసహ్యించుకుంటున్నారని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఈ విధమైన సంఘటనలకు తావు లేదన్నారు.

# గొప్ప దార్శనికుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

### వాడవాడలా అంబేడ్కర్ జయంతి



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న అవినాష్, నాయకులు

గుణదల(విజయవాడతూర్పు): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ భీమ్‌రావ్ అంబేడ్కర్ గొప్ప దార్శనికుడు అని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ అన్నారు. గుణదల బెత్లహేంనగర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కర్ జయంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాటుపడ్డారని తెలిపారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు డేవిడ్‌రాజు, అలంకార్‌బాబు, ప్రకాష్, కిరణ్ పాల్గొన్నారు.

**బందెలదొడ్డి సెంటర్‌లో..**

లబ్బీపేట(విజయవాడతూర్పు): సామాజిక, ఆర్థిక అసమానతలు లేని సమాజ రూపకల్పనే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయమని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు నత్తా యోనారాజు అన్నారు. అంబేడ్కర్ జయంతి వేడుకలను ఆదివారం మొగల్రాజపురం బందెలదొడ్డి సెంటర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ పాల ఝాన్సీలక్ష్మితో కలిసి నత్తా యోనారాజు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై దాడి అత్యంత హేయమైన చర్యగా పేర్కొన్నారు. బస్సుయాత్రకు ప్రజాదరణచూసి ఓర్వలేకే ఇలాంటి దాడులకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తోట శ్రీనివాసరావు, నాయకుడు కాపుదేశి రాజస్తస్, బాపట్ల అనీల్, నత్తా ప్రవీణ్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు. ఎస్సీ యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో జార్జిపేటలో అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఫ్రంట్ అధ్యక్ష కార్యదర్శులు బుర్రి బాబూరావు, జగ్జీవన్‌రావు పాల్గొన్నారు. ఏడవ డివిజన్ బాడవపేటలోని అంబేడ్కర్ విగ్రహానికి కార్పొరేటర్ మెరకనపల్లి మాధురి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంపత్, ఉదయ్, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

**అంబేడ్కర్ జీవితం ఆదర్శనీయం**

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితం అందరికీ ఆదర్శనీయమని జనశిక్షణ సంస్థాన్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డి.కోటేశ్వరరావు చెప్పారు. స్థానిక రావిచెట్టుసెంటర్‌లో ఉన్న జనశిక్షణ సంస్థాన్ కార్యాలయం ఆవరణలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జనశిక్షణ సంస్థాన్ సిబ్బంది, శిక్షణార్థులు పాల్గొని అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న ఎస్‌బీఐ డీజీఎం మహేష్‌కుమార్ సింగ్



15వ డివిజన్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

- మనువాద, మతోన్మాదుల చేతిలో నుంచి భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని కుల వివక్ష వ్యతిరేఖ పోరాట సంఘం జాతీయ కమిటీ సభ్యుడు వీ.శ్రీనివాసరావు చెప్పారు. స్థానిక సున్నపుబట్టీల సెంటర్‌లో ఉన్న పూలే అంబేడ్కర్ భవనంలో కులవివక్ష వ్యతిరేఖ పోరాట సంఘం(కేవీపీఎస్) ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి కార్యక్రమం ఆదివారం జరిగింది. వచ్చే ఎన్నికల్లో బీజేపీ నాయకులను ఓడించాలన్నారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి, ఉపాధ్యక్షుడు దడాల సుబ్బారావు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

**15వ డివిజన్‌లో**

ఆటోనగర్(విజయవాడతూర్పు): 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్ గాంధీకాలనీలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి మాజీ డెప్యూటీ మేయర్ ఆళ్ల చెల్లారావు ముఖ్య అతిథిగా హాజరై, అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పండు, భాస్కరరావు, శ్రీను, అశోక్, రంగా, నాగేశ్వరరావు, నాయుడు పాల్గొన్నారు.

**ఎస్‌బీఐ ఆధ్వర్యంలో..**

కృష్ణలంక(విజయవాడతూర్పు): డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ జయంతి వేడుకలు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. బ్యాంక్ డీజీఎం మహేష్‌కుమార్ సింగ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్‌కేసీవీ ట్రస్ట్, అమ్మ ప్రేమ ట్రస్ట్‌కు నిత్యావసర వస్తువులు అందజేశారు. సీఎం హెచ్‌ఆర్ నాగేశ్వరరావు, బ్యాంక్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

**నగర వ్యాప్తంగా..**

విజయవాడస్పోర్ట్స్: సమాజంలోని సామాజిక అసమానతలు నిర్మూలించేందుకు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చేసిన కృషి అభినందనీయమని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకులు అన్నారు. అంబేడ్కర్ జయంతి వేడుకలు విజయవాడ ఎంపీ కేశినేని నాని కార్యాలయంలో ఆదివారం ఘనంగా జరిగాయి. పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. వివక్ష లేని, సామరస్య పూర్వకమైన సమాజాన్ని నిర్మించడమే అంబేడ్కర్‌కు మనం అర్పించే నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో పార్టీ విజయవాడ పార్లమెంట్ కో ఆర్డినేటర్ లింగమనేని శివరాంప్రసాద్, మాజీ డెప్యూటీ మేయర్ గోగుల రమణారావు, ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు టి.సుందర్‌ప్రసాద్, వి.శ్రీనివాసరావు, జిల్లా ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ పోలిమెట్ల శరత్‌బాబు, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి రుద్ర శంకర్, పచ్చిగళ్ల రమేష్, చేకూరి శ్రీను, తిప్పబత్తిన బాల, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఇంద్ర, సిటీ అధ్యక్షుడు బుదాల శ్రీను, కార్యదర్శి దొడ్డ సురేష్, స్టేట్ ఎస్టీ సెల్ కార్యదర్శి మేడ రమేష్, డివిజన్ అధ్యక్షులు మేకల మరియబాబు, కండెల డేవిడ్, పల్లె బాబు, అరెం కళ్యాణ్, నాయకురాలు రుద్రపాటి స్రవంతి, నన్నం దుర్గా దేవి పాల్గొన్నారు.

**ఏపీసీపీడీసీఎస్ కార్యాలయంలో..**

ఏపీసీపీడీసీఎల్ కార్యాలయంలో జరిగిన అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో ఆ సంస్థ చైర్మన్, ఎండీ కె.సంతోషరావు పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపు నిచ్చారు. టెక్నికల్ డైరెక్టర్ బి.జయభారతరావు, ఎస్ఈ ఎ.మురళీమోహన్, అధికారులు పాల్గొన్నారు.

**అల్ మునీర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..**

లబ్బీపేటలోని అల్‌మునీర్ ఫౌండేషన్ కార్యాయలంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు జరిగాయి. అంబేడ్కర్ చిత్రపటానికి ఫౌండేషన్ చైర్మన్ షేక్ మునీర్‌అహ్మద్ పూలమాల వేసి నివాళులర్పించారు. అడ్వకేట్స్ అసోసియేషన్ కార్యదర్శి అబ్దుల్ మతీన్, కోశాధికారి ఖలీలుల్లా, షఫీ అహ్మద్, ఎండీ ఇంతియాజ్, హుస్సేన్ పాల్గొన్నారు.

**పోలీస్ కమిషనరేట్‌లో..**

ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఆదివారం అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఇన్‌చార్జ్ అడ్మిన్ డీసీపీ కృష్ణమూర్తినాయుడు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏడీసీపీలు కనకరాజు, కె.ఆర్.ప్రసాద్, ఏసీపీ పార్థసారథి పాల్గొన్నారు.



మొగల్రాజపురంలో నివాళులర్పిస్తున్న యోనారాజు, పాల ఝాన్సీలక్ష్మి తదితరులు



పూలే అంబేడ్కర్ భవనంలో..



ఎంపీ కేశినేని నాని కార్యాలయంలో నివాళులు

### పలు చర్చిల్లో అవినాష్ ప్రత్యేక ప్రార్థనలు



ఆటోనగర్(విజయవాడతూర్పు): నియోజకవర్గంలోని పలు చర్చిల్లో వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విజయవాడలోని స్టేట్ గెస్ట్ హౌస్ సమీపంలోని సీఎస్ఐ చర్చిలో పాస్టర్ దిలీప్ నిర్వహించిన ప్రార్థనలో అవినాష్ పాల్గొన్నారు. అనంతరం 20వ డివిజన్‌లోని పెంతుకోస్తు చర్చి, ఆటోనగర్‌లోని మెస్సీయ ఫెలోషిప్ చర్చిలో పాస్టర్ సజ్జా రత్నకుమార్ చేత అవినాష్ ప్రత్యేక ప్రార్థనలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ.. దేవుని దీవెనలతో రానున్న ఎన్నికల్లో ఘన విజయం సాధించే విధంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేయాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని)లకు ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేయాలని అవినాష్ అభ్యర్థించారు.

### సీఎం జగన్‌పై దాడికి నిరసన



మధురానగర్(విజయవాడసెంట్రల్): పేదల పెన్నిధి, బడుగు బలహీన వర్గాలు, క్రైస్తవుల ఆశాజ్యోతి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై దాడిని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ బందెల దయానందం ఖండించారు. స్థానిక అంబేడ్కర్ కాలనీలో ఆదివారం సాయంత్రం ఆయన సీఎంపై దాడిని ఖండిస్తూ పలువురు పాస్టర్లతో కలిసి కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు చూపిన శాంతి, దయ, క్షమాగుణంతో జనరంజకంగా పాలన సాగిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై దాడి విచారకరమన్నారు. వైఎస్ జగన్ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అన్ని చర్చిల్లో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశామని చెప్పారు. సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తొలుత భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. రెవరెండ్ డాక్టర్ కనపర్తి ప్రభాకర్, పాస్టర్లు పాల్గొన్నారు.

# అది ప్రాణాలు తీసేంత దాడే

## సీఎం వైఎస్ జగన్‌పై పదునైన వస్తువుతో బలంగా దాడి

- అత్యంత వేగంగా వచ్చి చర్మాన్ని ఛిద్రం చేసింది
- కణతపై తగిలి ఉంటే పెను ప్రమాదం.. అక్కడి ఎముక విరిగి మెదడుకు గుచ్చుకుంటే ప్రాణాపాయమే
- అక్కడ ఉండే పెద్ద రక్తనాళం తెగితే భారీగా రక్తస్రావం
- కుడి చేయి చచ్చుబడి.. మాట పడిపోయే ప్రమాదం
- మెదడులోపల రక్తస్రావం అయ్యుంటే ప్రాణాలకే ముప్పు
- తల వెనుక భాగంలో తగిలినా ప్రాణాలకు ప్రమాదం

'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూలో ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ కేవీఆర్ శాస్త్రి



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దాడి ప్రాణాలు తీసేంత తీవ్రమైనదేనని ప్రముఖ న్యూరో సర్జన్ డా. కేవీఆర్ శాస్త్రి చెప్పారు. అదృష్టవశాత్తు ఎడమ కనుబొమ్మ పై భాగంలో తగలడంతో తీవ్రగాయంతో సరిపోయిందని, అదే ఎడమ కణతపై లేదా తల వెనుక భాగంలో తగిలితే కుడి చేయి చచ్చుబడటం, మాట పడిపోవడంతోపాటు ప్రాణాపాయం సంభవించేందుకు కూడా ఎక్కువగా అవకాశాలున్నాయని ఆయన విస్పష్టంగా పేర్కొన్నారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ - న్యూరో సైన్సెస్ (నిమ్‌హాన్స్- బెంగళూరు)లో న్యూరాలజీ విభాగాధిపతిగా చేసిన ఆయన 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం తీవ్రతను పలు కోణాల్లో విశ్లేషించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే... - సాక్షి, అమరావతి

### వైద్యుల పర్యవేక్షణ అవసరం

సీఎం వైఎస్ జగన్‌పై పదునైన రాయి లాంటి వస్తువుతో బలంగా దాడి చేశారు. ఎడమ కనుబొమ్మ పై భాగంలో బలంగా తగలడంతో చర్మం ఛిద్రమై తీవ్ర గాయమైంది. దాంతోనే కుట్లు వేయాల్సి వచ్చింది. ఆయన కొన్ని రోజులు వైద్యుల పర్యవేక్షణలో ఉండాలి. ప్రస్తుతం ఆయన ఒకట్రెండు రోజుల విశ్రాంతి తరువాత రోజువారి పనుల్లో నిమగ్నమైనప్పటికీ, వైద్యులు తరచూ పర్యవేక్షిస్తూ ఉండాలి.

### కణతపై తగిలి ఉంటే..


ఆ పదునైన రాయి లాంటి వస్తువు కాస్త పక్కన ఎడమ కణతపై తగిలి ఉంటే పెనుముప్పు సంభవించేది. ఆ భాగంలో ఎముక సున్నితంగా ఉంటుంది. పదునైన ఆ వస్తువు బలంగా తగిలితే ఆ ఎముక విరిగి లోపలే ఉండిపోయేది. ఆ ఎముక లోపల మెదడు భాగానికి గుచ్చుకుంటే ప్రాణాలకే ముప్పు వాటిల్లేది. ఇక ఎడమ కణత భాగంలోనే పెద్ద రక్తనాళం ఉంటుంది. ఆ నాళం తెగి భారీగా రక్తస్రావం అయ్యేది. కుడి చేయి చచ్చుబడటం, మాట పడిపోయే ప్రమాదానికి దారి తీసి ఉండేది. మెదడులోనే రక్తస్రావమైనా, మెదడుకు రక్త సరఫరాకు ఇబ్బంది కలిగి ప్రాణాపాయం సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

### తల వెనుకభాగంలో తగిలితే..

ఇక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కుడివైపు ఉన్న ప్రజలను చూసి అభివాదం చేస్తూ ఉండటంతో ఎడమ వైపు నుంచి బలమైన రాయి లాంటి పదునైన వస్తువుతో దాడి చేశారు. ఆ సమయంలో ఆయన వెనక్కి తిరిగి ఉన్నారు. ఆ వస్తువు తల వెనుక కింద భాగంలో తగిలి ఉంటే మెదడుకు తీవ్ర గాయమయ్యేది. మెదడులో రక్తస్రావం అయి ప్రాణాలకు ముప్పు వాటిల్లేది. అదృష్టవశాత్తూ అది ఎడమ కనుబొమ్మ పై భాగంలో తగలడంతో తీవ్ర గాయంతో సరిపోయింది. అయినప్పటికీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైద్యులు కొన్నిరోజులపాటు పర్యవేక్షిస్తూ ఉండాల్సిన అవసరం ఉంది.

## కణతపై తగిలి ఉంటే ప్రాణాపాయం

- కణత వద్దే పుర్రెలో సున్నిత భాగం
- మెదడుకు రక్తప్రసరణ ప్రధాన నరం అక్కడే
- 'సాక్షి'తో న్యూరోసర్జన్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డి




సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: సీఎం వైఎస్ జగన్‌పై హత్యాయత్నానికి సంబంధించి ఆయన తలలో అత్యంత సున్నిత ప్రాంతంలో గాయమైందని.. గాయమైన చోటు నుంచి సుమారు ఒకటిన్నర - రెండున్నర సెంటిమీటర్లు వెనుక భాగాన అదే దెబ్బ తగిలి ఉంటే ఊహకు అందని రీతిలో ప్రాణాపాయం సంభవించేదని గుంటూరు జీజీహెచ్ మాజీ అసిస్టెంట్ ప్రొఫెసర్, సీనియర్ న్యూరో సర్జన్ డాక్టర్ భవనం హనుమ శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం 'సాక్షి'తో మాట్లాడుతూ.. కపాలం(తల) ప్రధానంగా నాలుగు భాగాలైన ఎముకలతో కూడి ఉంటుందన్నారు. ఇందులో నుదురు భాగం (Frontal Bone), వెనుక భాగం (Parietal Bone).. మెడను కలుపుతూ దిగువ భాగాన టెంపోరల్ బోన్ (Temporal Bone).. ఈ మూడింటికి మధ్యలో అన్నింటిని కలుపుతూ స్ఫెనాయిడ్ బోన్ (Sphenoid Bone) ఉంటాయని తెలిపారు. మొత్తం కపాలంలో కల్లా బలహీనమైంది.. టెరియన్ (Pterion) అని వివరించారు. ఈ భాగాన్నే వాడుకలో కణతగా పిలుస్తుంటారన్నారు. ఇక్కడే మెదడుకు రక్తాన్ని తీసుకెళ్లే అతి ముఖ్యమైన ప్రధాన రక్తనాళం ఉంటుందన్నారు. దీన్నే మిడిల్ మెనింజియల్ ఆర్టరీ (Middle Meningeal Artery) అంటారని వివరించారు. ఇక్కడ ఒక మోస్తరు దెబ్బ తగిలినా.. మెదడుకు రక్తాన్ని తీసుకెళ్లే ప్రధాన రక్తనాళానికి ప్రమాదం సంభవిస్తుందన్నారు. దీంతో తీవ్ర రక్తస్రావం జరుగుతుందని చెప్పారు. మెదడు లోనూ రక్తస్రావం అవుతుందన్నారు. దీన్నే ఎపిడ్యూరల్ హెమటోమా (Epidural Hematoma) అంటారని తెలిపారు. ఇలా జరిగితే మెదడుకు రక్తప్రసరణ ఆగిపోతుందని.. కణత వద్ద దెబ్బ తగిలితే వెంటనే స్పృహ కోల్పోయి కోమాలోకి జారుకోవచ్చన్నారు. ప్రాణాపాయం కూడా సంభవించే ప్రమాదం ఉంటుందన్నారు. సీఎం జగన్‌కు గాయమైన చోట నుంచి కేవలం ఒకటిన్నర- రెండున్నర సెంటిమీటర్ల వెనకభాగాన కణత వద్ద అదే దెబ్బ తగిలి ఉంటే ప్రమాద తీవ్రత అంచనాకు అందకుండా ఉండేదని వివరించారు. ఎందుకంటే సాధారణంగా నుదిటి భాగాన చర్మం బిగుతుగా ఉంటుందన్నారు. ఆ ప్రాంతంలో ఎముక తప్ప కండ ఉండదని చెప్పారు. అక్కడే అంత లోతున రక్తగాయం అయ్యిందంటే.. అదే దెబ్బ కణత వద్ద తాకి ఉంటే పెద్ద ప్రమాదం తలెత్తేదని వివరించారు.

### దోషుల్ని శిక్షించాలి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో అర్హులైన ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందడం చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు ఇటువంటి పనులు చేస్తున్నాయి. ఆయన్ని హత్యచేయాలనే ప్రణాళిక ప్రకారం దాడిచేశారు. ఇది ప్రతిపక్షాల కుట్రే. దీనివెనుక ఎంతటి పెద్దవారున్నా పూర్తిస్థాయిలో విచారించి దోషులను కఠినంగా శిక్షించాలి.
– చిర్ల జగ్గిరెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే

### చంద్రబాబు చెప్పడంతోనే..



జగన్‌మోహన్‌రెడ్డిని రాళ్లతో కొట్టమని శనివారం మధ్యాహ్నం తుళ్లూరులో చంద్రబాబు తన ప్రసంగంలో సూచించారు. ఆ వీడియోలు ఉన్నాయి. జగన్‌ను రాళ్లతో కొట్టండి, అతడు దుర్మార్గుడు, దున్నపోతు, సైకో రాళ్లతో దాడి చేయండి అని.. చంద్రబాబు చెబితే ఈ దుర్మార్గులు, పచ్చకుక్కలు, తెలుగుతమ్ముళ్లు, పిచ్చి పరాకాష్టకు చేరిన కులగజ్జి పట్టిన కుక్కలు సీఎం జగన్‌ను చంపడానికి కుట్ర పన్నారు. చంద్రబాబునాయుడు ప్రణాళికతో జగన్‌మోహన్‌రెడ్డి మీద గత ఎన్నికల ముందు, ఈ ఎన్నికల ముందు ఈ దారుణం చేయించారు. తక్షణమే ఈ కుట్ర వెనుక ఉన్న వ్యక్తులను పట్టుకోవాలి. – కొడాలి నాని, ఎమ్మెల్యే

### ఉసిగొల్పుతున్న చంద్రబాబు



ఇటీవల ఎన్నికల ప్రచారసభల్లో చంద్రబాబు తెలుగుదేశం పార్టీ శ్రేణులను రెచ్చగొట్టి దురాగతాలకు ఉసిగొల్పుతున్నారు. చంద్రబాబు ప్రసంగాల వీడియో క్లిప్‌లు పరిశీలిస్తే వాస్తవం ఇట్టే అర్థమవుతుంది. జగన్‌పై హత్యాయత్నం ప్రతిపక్షాల కుట్రలో భాగమే. జగన్ ఇటువంటి వాటికి భయపడే వ్యక్తి కాదు. చంద్రబాబు ఇలాంటి సిగ్గుమాలిన రాజకీయాలు మానుకోవాలి. – కురసాల కన్నబాబు, ఎమ్మెల్యే

### జగన్‌ను చంపాలనే..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని హత్యచేయాలనే ప్రయత్నించారు. రాష్ట్ర ప్రజల అదృష్టం బాగుండి ముఖ్యమంత్రికి ఏమీకాలేదు. కుల ఆధిపత్యంతో, అసూయతో ఇలా చేశారు. ఈ కుట్రను ప్రధాని నరేంద్రమోదీ వెలికి తీయించాలి. పొత్తులతోను, డబ్బుతోను అధికారం చేజిక్కించుకోవాలనుకున్న చంద్రబాబు వ్యూహం ఫలించదని తెలియడంతో ఈ కుట్ర చేశారు.
– రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఎమ్మెల్యే

### చంద్రబాబు, నాదెండ్ల మనోహర్ కుట్ర



ముఖ్యమంత్రిపై హత్యాయత్నం వెనుక చంద్రబాబు, నాదెండ్ల మనోహర్ కుట్ర ఉంది. వారిద్దరి దుర్మార్గపు ఆలోచనతోనే సీఎంపై హత్యాయత్నం జరిగింది. సీఎం జగన్‌పై ప్రజల్లో రోజురోజుకు పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేకే ఈ దారుణానికి పాల్పడ్డారు.
– సింహాద్రి రమేష్‌బాబు, ఎమ్మెల్యే

### నైతికంగా దెబ్బతీయాలని..



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజాభిమానం అధికంగా ఉండడం గమనించి, ఆయన్ని నైతికంగా దెబ్బతీయాలనే హత్యాయత్నం చేశారు. వైఎస్సార్ సీపీకి గ్రాఫ్ పెరుగుతోందని గ్రహించి ఓర్వలేక ఈ దారుణానికి తెగబడ్డారు. గతంలో విజయవాడలో వంగవీటి మోహన రంగా హత్య వంటివి చూస్తే.. ఎదుటి వ్యక్తులను కుట్రలతో దెబ్బతీయడం టీడీపీకి అలవాటేనని అర్థమవుతోంది. – జక్కంపూడి రాజా, ఎమ్మెల్యే

### బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జనం నీరాజనం పడుతుంటే ఓర్వలేక ప్రతిపక్ష పార్టీలు ఇలాంటి దుర్ఘటలకు పాల్పడడం దారుణం. దాడిచేసిన వారిని గుర్తించి, అందుకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.
– శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే

### ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు



ప్రజానాయకుడిపై హత్యాయత్నం ప్రజాస్వామానికి గొడ్డలిపెట్టు. పేదల పెన్నిధి, విద్య, వైద్యం, సంక్షేమం అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌పై హత్యాయత్నం దుర్మార్గం. గాయపడిన జగన్‌కు ప్రథమ చికిత్స చేశా. ఆయనలో ఎలాంటి భయం లేదు.
– డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, వైఎస్సార్‌సీపీ మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి

### కఠిన చర్యలు తీసుకోవాలి



ముఖ్యమంత్రిపై హత్యాయత్నం హేయం. ఈ సంఘటనపై లోతైన దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. – దగ్గుబాటి పురందేశ్వరి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు

### ఇంటెలిజెన్స్‌పై చర్యలు తీసుకోవాలి



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం చేయడం తప్పు. దీన్లో పోలీస్, ఇంటెలిజెన్స్ వైఫల్యం ఉంది. ఎలక్షన్ కమిషన్ ఇంటెలిజెన్స్ మీద చర్యలు తీసుకోవాలి. – వంగవీటి రాధా, మాజీ ఎమ్మెల్యే

# పథకం ప్రకారమే సీఎంపై హత్యాయత్నం

## ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను అంతమొందించడమే ఆగంతకుల లక్ష్యం

- అదృష్టం బాగుండి సీఎం జగన్ బయటపడ్డారు
- క్యాటర్ బాల్ కంటే శక్తివంతమైన ఆయుధాన్ని వాడి ఉండొచ్చు
- గురి తప్పకుండా కాల్చగల షార్ప్ షూటర్లే ఇలాంటివి చేస్తారు
- శక్తివంతమైనవారి మద్దతు లేకుండా వీరు ఆ పనిచేసి ఉండరు
- అనుకున్నది జరగలేదు కాబట్టే టీడీపీ తప్పించుకుంటోంది
- ఇంతటి దుర్ఘటనను కూడా డ్రామాగా కొట్టిపారేయడం దారుణం
- ఎవరైనా తన సునిశిత శరీర భాగంలో దాడి చేయించుకుంటారా?
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను అంతమొందించడమే లక్ష్యంగా పక్కా పథకం ప్రకారం హత్యాయత్నం చేశారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. ఈ ఘటనలో క్యాటర్ బాల్ కంటే శక్తివంతమైన ఆయుధాన్ని వాడి ఉండొచ్చన్నారు. గురి తప్పకుండా కాల్చగల షార్ప్ షూటర్లే ఇలాంటి పనులు చేస్తారని చెప్పారు. ఎవరో శక్తివంతమైన వ్యక్తుల మద్దతు లేకుండా ఆగంతకులు ఈ పనిచేయరన్నారు. ఈ దారుణ ఘటనలో అదృష్టం బాగుండి సీఎం జగన్ బయటపడ్డారని తెలిపారు. తాము అనుకున్నది జరగలేదు కాబట్టే టీడీపీ తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. ఇంతటి దుర్ఘటనను కూడా ఆ పార్టీ డ్రామాగా కొట్టిపారేయడం దారుణమన్నారు. ఎవరైనా తమ సునిశిత శరీర భాగంలో దాడి చేయించుకుంటారా అని నిలదీశారు. చంద్రబాబును చేయించుకోమనండి చూద్దామన్నారు. ఈ మేరకు ఆదివారం గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సజ్జల రామకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా జగన్‌పై దాడి చేయాలని టీడీపీ శ్రేణులను రెచ్చగొడుతూ చంద్రబాబు చేసిన పలు ప్రసంగాల వీడియో క్లిప్పులను మీడియాకు ప్రదర్శించారు. సజ్జల ఇంకా ఏమన్నారంటే..

### చంద్రబాబు రెచ్చగొట్టే వ్యాఖ్యల వల్లే..

సీఎం జగన్‌పై దాడిని దేశవ్యాప్తంగా పలు పార్టీల నేతలు ముక్తకంఠంతో ఖండించారు. ఇక్కడ చంద్రబాబు ఖండించినా.. ఆయన తనయుడు లోకేశ్, టీడీపీ నేతలు డ్రామా అంటూ హేళన చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. అసలు వీళ్లు మనుషులేనా అని అనిపిస్తోంది.. రాక్షసుల్లా ప్రవర్తిస్తున్నారు. మేమంతా సిద్ధం బస్సు యాత్రకు జనం ప్రభంజనంలా తరలివస్తున్నారు. ఇది చూసి తట్టుకోలేక చంద్రబాబు రగిలిపోతున్నారు. ముఖ్యమంత్రిని అసభ్య పదజాలంతో దూషిస్తూ ఉక్రోషాన్ని వెళ్లగక్కుతున్నారు. రెండు రోజుల క్రితం కూడా 'రాళ్లతో కొట్టి, ఫ్యాన్ గుర్తు లేకుండా చేయండి.. జగన్‌ను మసి చేయండి.. టీడీపీ మీతో ఉంటుంది' అని చంద్రబాబు వ్యాఖ్యలు చేశారు. దీన్నిబట్టి సీఎం జగన్‌పై ఆయన హత్యాయత్నానికి పురిగొలిపినట్టనిపిస్తోంది. ఇవన్నీ ఎన్నికల సంఘానికి నివేదించి.. దాడులకు పురిగొలిపేలా చంద్రబాబు వ్యాఖ్యలు చేయడాన్ని తక్షణం అడ్డుకోవాలని కోరాం. గతంలో చంద్రబాబు అలిపిరి ఘటనను తానే చేసుకుని, సానుభూతి పొంది ఎన్నికలకు వెళ్లాలని చూశారా?.. నాడు చంద్రబాబు విషయంలో ఇలాంటి చిల్లర మాటలు ఎవరూ మాట్లాడలేదు. ఇప్పుడు సీఎం జగన్‌ను అనడానికి నోరెలా వస్తుంది? గతకొద్ది రోజులుగా చంద్రబాబు నిరాశ, నిస్పృహలతో సీఎం జగన్‌పై విద్వేషపూరిత, రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారు. దీనివల్లే విజయవాడ సింగ్‌నగర్‌లో సీఎం జగన్‌పై 'ప్రీమెడిటేటెడ్ కోల్డ్ బ్లడెడ్ అటెంప్ట్' జరిగింది. ఇది రాష్ట్రం మొత్తాన్ని కుదిపేసింది. అంతా షాక్‌కు గురయ్యారు. ఆగంతకుడు విసిరిన పదునైన వస్తువు తగిలి సీఎం జగన్‌కు ఎడమ కనుబొమ పైభాగాన తీవ్ర గాయమైంది. అదే కొంచెం కింద తగిలి ఉంటే కంటి చూపే పోయేది. కణతకు తగిలితే ప్రాణానికే ప్రమాదం జరిగేది. అదృష్టం బాగుండి సీఎం జగన్ బయటపడ్డారు.



### బురదజల్లడమే టీడీపీ, జనసేన పని..

ప్రభుత్వంపై టీడీపీ, జనసేన బురదజల్లడమే పనిగా పెట్టుకున్నాయి. ముఖ్యమంత్రిపై హత్యాయత్నం జరిగితే దానికి కూడా వక్రభాష్యం చెబుతున్నాయి. ఎన్నికలు కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి రోజువారీ కార్యకలాపాల నుంచి ప్రభుత్వం దూరం జరిగింది. చంద్రబాబులా మేమెప్పుడూ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిని బెదిరించి, దబాయించ లేదు. ఇలాంటప్పుడు ఎవరినీ ప్రభావితం చేసి, ప్రలోభపెట్టే అవకాశమే లేదు. రాత్రి 8 గంటల సమయంలో సీఎం జగన్‌పై హత్యాయత్నం జరిగితే.. గంటన్నర తర్వాత ఫొటోలు బయటకు ఇచ్చాం. ఇది ఆకతాయిల పనికాదని గాయం తీవ్రత చూశాకే తెలిసింది.

### షార్ప్ షూటర్లతోనే ఇలాంటివి సాధ్యం..

సీఎం జగన్‌పై జరిగిన హత్యాయత్నానికి సంబంధించి పదునైన వస్తువును చేతితో విసరడం, క్యాటర్ బాల్ వాడటం కంటే మరేదో శక్తివంతమైన ఆయుధాన్ని ఉపయోగించి ఉండొచ్చు. సీఎంను అంతమొందించే కుట్రతోనే కణతను లక్ష్యంగా చేసుకుని పదునైన వస్తువుతో హత్యాయత్నం చేశారు. గురి తప్పకుండా కొట్టగలిగే షార్ప్ షూటర్లు మాత్రమే ఇలాంటివి చేయగలరు. దీనికి శక్తివంతమైనవారి మద్దతు ఇవ్వకుండా ఇదంతా సాధ్యపడదు. సింగ్‌నగర్ ప్రాంతంలో సీఎం జగన్ యాత్ర వెళ్తుందని తెలుసుకుని.. పక్కా ప్రణాళిక ప్రకారం ఓ ప్రైవేటు పాఠశాల వెనుక నక్కిన ఆగంతకులు సీఎం కణతపై గురిపెట్టి పదునైన వస్తువుతో హత్యాయత్నం చేశారు. సీఎం జగన్ టక్కున తల తిప్పడంతో ప్రాణాపాయం తప్పింది. పదునైన వస్తువు చాలా వేగంగా రావడంతోనే సీఎం ఎడమ కనుబొమ పైభాగాన బలంగా తగిలి.. పక్కనే ఉన్న వెలంపల్లి శ్రీనివాస్ ఎడమ కంటికీ తీవ్ర గాయమైంది. వెలంపల్లి కంటి కార్నియాకు బలంగా తాకడంతో 48 గంటలు అబ్జర్వేషన్‌లో ఉండాలని వైద్యులు సూచించారు. ఒక వస్తువు ఇద్దరు వ్యక్తులను బలంగా గాయపరిచిందంటే.. ఎంతటి శక్తివంతమైన ఆయుధాన్ని ఉపయోగించారో తెలుస్తోంది. ఇవన్నీ దర్యాప్తులో బయటపడతాయి.

### నిందితులను పట్టుకోవాలని ప్రతిపక్ష నేతలెవరూ కోరలేదు

సీఎం జగన్‌పై హత్యాయత్నానికి పాల్పడిన నిందితులను పట్టుకోవాలని ప్రతిపక్ష నాయకులు ఎవరూ కోరట్లేదు. చంద్రబాబు సైతం సీఎం త్వరగా కోలుకోవాలని కాకుండా అధికారులపై చర్యలు తీసుకోవాలంటున్నారు. సీఎం తన రోడ్‌షోలో కరెంటు తీయించుకుని ఆయనే చేతులారా ఈ ఘటనకు కారణమయ్యారని టీడీపీ నేతలు అనడం దారుణం. రోడ్‌షోల్లో చంద్రబాబు బస్సు ఎక్కినా కరెంట్ తీస్తారు.. లేదంటే ప్రమాదం జరిగి ప్రాణాలు పోయే ప్రమాదం ఉంటుంది. సీఎం జగన్‌పై హత్యాయత్నాన్ని భద్రతా వైఫల్యంగా చిత్రీకరించే ప్రయత్నం చేయడం దుర్మార్గం. ఆ విషయాన్ని పోలీసు శాఖ, ప్రభుత్వం చూసుకుంటుంది. చంద్రబాబుపై అలిపిరి ఘటన సమయంలో వైఎస్ రాజశేఖరరెడ్డి సంఘీభావంగా వెళ్లి మౌన దీక్ష చేశారు. ఏ రాజకీయ పార్టీ అయినా ప్రజాస్వామ్యంలో చర్చల ద్వారా విభేదించాలి తప్ప ఇలాంటి ఘటనలను ప్రోత్సహించకూడదు. కానీ, టీడీపీ వ్యవహారశైలి పూర్తి భిన్నంగా ఉంది. ఇలాంటి దుశ్చర్యలను సీఎం జగన్ ధైర్యంగా ఎదుర్కొంటూ ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటారు. సోమవారం నుంచి యథావిధిగా బస్సుయాత్ర ఉంటుంది. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మరోసారి అఖండ విజయం సాధిస్తుంది.

## ఎన్నికల సంఘానికి, డీజీపీకి వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై దాడి ఘటనలో టీడీపీ సోషల్ మీడియా చేస్తున్న దుష్ప్రచారంపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆదివారం సచివాలయంలో ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. టీడీపీ సోషల్ మీడియా, ఐటీడీపీ.. వివేకం సినిమా సీన్లను పోస్టు చేసి దుష్ప్రచారం చేస్తున్నాయని.. వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై హత్యాయత్నం ఘటనకు సంబంధించి దోషులను తక్షణమే పట్టుకోవాలని డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ కోరింది. ఈ మేరకు ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయంలో డీజీపీని వైఎస్సార్‌సీపీ నేతల బృందం కలిసి ఫిర్యాదు చేసింది. అనంతరం ఎమ్మెల్యే మల్లాది విష్ణు మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదన్నారు. ముఖ్యమంత్రిని కించపరిచేలా ఫొటోలు మార్ఫింగ్ చేయడం, గొడ్డలితో పోస్టులు పెట్టడం, టీడీపీ పాటలు సహా పలు అంశాలపై డీజీపీకి ఫిర్యాదు చేశామని తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రజలకు టీడీపీ చేస్తున్న ఫోన్ కాల్స్, వాయిస్ మెసేజ్‌లు, బల్క్ మెసేజ్‌ల గురించి డీజీపీ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి సీఎం, వైఎస్సార్‌సీపీపై చేస్తున్న దుష్ప్రచారాన్ని కట్టడి చేయాలని కోరామని తెలిపారు. సీఎం జగన్‌పై జరిగిన హత్యాయత్నం వెనుక టీడీపీ గూండాల హస్తం ఉందని ఆరోపించారు. నేర చరిత్ర కలిగిన టీడీపీ నేతలు పక్కా ప్రణాళికతో ఈ దారుణానికి పాల్పడ్డారన్నారు. రాష్ట్రంలో హింసను ప్రేరేపించేలా చంద్రబాబు పదేపదే చేస్తున్న బహిరంగ వ్యాఖ్యలు హత్యాయత్నానికి మూలకారణమన్నారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నేతలు నందిగం సురేష్, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, లేళ్ల అప్పిరెడ్డి, రావెల కిశోర్‌బాబు, మనోహర్‌రెడ్డి ఎ.నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



డీజీపీకి ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, రావెల కిశోర్‌బాబు, మనోహర్‌రెడ్డి

## ఇటు ఖండన.. అటు హేళన

మొదటి పేజీ తరువాయి

టీడీపీ నేతలు మాత్రం జుగుప్సాకరంగా కామెంట్లు చేయటాన్ని ప్రజలు అసహ్యించుకుంటున్నారు. తమకు రాజకీయాలు మినహా మానవత్వం అనేదే లేదని టీడీపీ నేతలు మరోసారి రుజువు చేసుకున్నారు. ఏం జరిగిందో తేల్చే పనిలో పోలీసులుంటే ఈలోపే తమకు నచ్చినట్లు ఊహించుకుని వక్రీకరించేందుకు పచ్చమూక పడుతున్న తాపత్రయం అంతా ఇంతా కాదు. వైఎస్ జగన్‌కు రాజకీయంగా ఎక్కడ లబ్ధి చేకూరుతుందోననే భయంతో ఆయనే దాడి చేయించుకున్నట్లు టీడీపీ నేతలు నీచాతినీచంగా దుష్ప్రచారం చేయడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది.

**నేను ఖండిస్తా.. మీరు హేళన చేయండి**

'ఈ ఘటనను నేను ఖండిస్తా.. మీరు, మన మీడియా, సోషల్ మీడియా బృందాలు మాత్రం ఈ అంశాన్ని పూర్తిగా పక్కదోవ పట్టించాలి' అని టీడీపీ పరివారానికి చంద్రబాబు సూచించినట్లు తెలుస్తోంది. దాని ప్రకారం శనివారం రాత్రి 11.30 గంటల నుంచి వారంతా ఇదే పనిలో నిమగ్నమయ్యారు. నిజానికి దాడి జరిగిన రెండు గంటల వరకు టీడీపీ నేతలు, ఎల్లో మీడియా స్పందించలేదు. రాత్రి 11 గంటల తర్వాత దుష్ప్రచారాన్ని ప్రారంభించారు. అప్పటివరకు ఎల్లో మీడియా ఛానళ్లు సీఎంపై జరిగిన దాడి ఘటనను ప్రసారం చేయలేదు. చంద్రబాబు తన ఎక్స్ ఖాతాలో సీఎం జగన్‌పై దాడి ఘటనను ఖండించగా అదే సమయంలో టీడీపీ ఖాతాలో మాత్రం 2019లో విశాఖ ఎయిర్‌పోర్టులో జరిగిన హత్యాయత్నంతో పోలుస్తూ పోస్టులు పెట్టారు. ఇక అక్కడి నుంచి వరుసగా టీడీపీ నేతలు వక్రీకరిస్తూ పత్రికా ప్రకటనలు, వాయిస్ వీడియోలను విడుదల చేశారు. చంద్రబాబు ఖండించిన సమయంలోనే టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, లోకేష్ తదితరులు హేళన చేస్తూ పోస్టులు పెట్టడం చర్చనీయాంశమైంది. సీఎం జగన్‌పై దాడి తర్వాత దాన్ని ఎలా తప్పుదోవ పట్టించాలనే వ్యూహాన్ని ఖరారు చేయడానికి చంద్రబాబు రెండు గంటల పాటు తర్జనభర్జన పడినట్లు వెల్లడవుతోంది. టీడీపీ నేతలు, ఆ పార్టీ కార్యాలయ ఆస్థాన విద్వాంసులు చంద్రబాబు ఆదేశాల మేరకు తమ నైపుణ్యాన్ని రంగరించి మరీ అక్కసు వెళ్లగక్కారు.

**పచ్చ కామెర్ల రోగిలా..**

సీఎంపై హత్యాయత్నం జరిగితే ఇంత దారుణంగా వక్రీకరిస్తున్న చంద్రబాబు తన విషయంలో మాత్రం అందుకు విరుద్ధంగా ప్రవర్తించడాన్ని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. అసెంబ్లీలో తన భార్యను అవమానించారంటూ మీడియా సమావేశం పెట్టి మరీ భోరున ఏడ్చి సానుభూతి కోసం ప్రణాళిక రచించారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని చెప్పుకునే నేత మీడియా ముందు ఏడవడం ద్వారా తన పరువును తానే బజారుకు ఈడ్చుకున్నారు. పచ్చ కామెర్ల వాడికి లోకమంతా పచ్చగా కనిపించినట్లు అందరూ తన మాదిరిగానే డ్రామాలు ఆడతారని భావిస్తూ చంద్రబాబు కుటిల రాజనీతిని ప్రదర్శించారు.

### సీఎంపై హత్యాయత్నం దారుణం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దాడి దారుణం. హత్యా రాజకీయాలను ప్రజలు ముక్తకంఠంతో ఖండించాలి. అధికార దాహంతో ఒక పార్టీ అధినేతను హత్యచేయాలనుకోవడం ప్రతిపక్షాలకు తగదు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా జగన్‌మోహన్‌రెడ్డి విజయాన్ని ఎవరూ ఆపలేరు. రాష్ట్రంలో ప్రతి పేదవాడు కడుపు నిండా భోజనం చేస్తున్నాడంటే అది సీఎం జగన్ వల్లే సాధ్యమైంది. పేదల పక్షపాతి జగన్‌పై దాడులకు తెగబడటాన్ని ప్రజలు చూస్తూ ఊరుకోరు.
– ముద్రగడ పద్మనాభం, కాపు ఉద్యమ నేత

### జగనన్న రక్తం కళ్లజూశారు



బస్సుయాత్రకు తండోపతండాలుగా తరలివస్తున్న జనాన్ని చూసిన చంద్రబాబు కడుపుమంటే జగనన్నపై హత్యాయత్నానికి కారణం. ఎన్నికల పోరుకు అన్ని పార్టీలను కలుపుకొని వచ్చినా, కుటుంబంలో చిచ్చుపెట్టినా ఫలితం లేకపోవడంతో చంద్రబాబు అండ్ కో ఫ్రస్ట్రేషన్‌కు లోనయ్యారు. జగనన్న రక్తాన్ని చూసిన ప్రజలు తమ ఓటుతో కొట్టే దెబ్బకు చంద్రబాబు రక్తం గడ్డకట్టడం ఖాయం. – ఆర్.కె.రోజా, పర్యాటకశాఖ మంత్రి

### ప్రజాదరణ చూసి ఓర్వలేకే..



సీఎం వైఎస్ జగన్ నిర్వహిస్తున్న బస్సుయాత్రకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేనితనంతోనే ఆయనపై హత్యాయత్నం చేశారు. ఇది పిరికిపంద చర్య. హత్యాయత్నం చేసినవారిని, చేయించినవారిని కఠినంగా శిక్షించాలి. ముఖ్యమంత్రికి భద్రత మరింత పెంచాలి. – వైఎస్ అవినాశ్‌రెడ్డి, ఎంపీ

### ప్రతిపక్షాల కుట్ర



ప్రతిపక్షాల కుట్రలో భాగంగానే సీఎం వైఎస్ జగన్‌పై హత్యాయత్నం జరిగింది. అరచేతిని అడ్డుపెట్టి సూర్యోదయాన్ని ఆపడం సాధ్యంకాదు. అలాగే వైఎస్ జగన్ జనప్రభంజనాన్ని ఆపడం కూడా ఎవరితరం కాదు. – ఎం.వి.రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ

### అల్లరిమూకల్ని శిక్షించాలి



సీఎం వైఎస్ జగన్‌పై టీడీపీ దుండగుల హత్యాయత్నం హేయం. బస్సుయాత్రకు వస్తున్న అనూహ్య స్పందనను జీర్ణించుకోలేక టీడీపీ అల్లరిమూకలు ఈ దారుణానికి దిగాయి. ప్రజాస్వామ్యంలో ఇటువంటి చర్యలను ఎవరూ ప్రోత్సహించకూడదు. ఇలాంటి అల్లరి మూకలను కఠినంగా శిక్షించాలి. – రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే

## సీఎం జగన్‌పై హత్యాయత్నం

# అత్యంత హేయం

- తీవ్రంగా ఖండించిన నేతలు
- సమగ్ర దర్యాప్తుతో కుట్ర కోణాన్ని ఛేదించాలి
- దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలి

**సాక్షి, అమరావతి:** సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం అత్యంత హేయమని వివిధ సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండించిన నేతలు.. ఇంత దుర్మార్గంగా భౌతిక దాడులకు పాల్పడే వారిని ఉపేక్షించకూడదన్నారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేయాలని.. దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

### ఇది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలపై దాడి



సీఎం వైఎస్ జగన్‌పై హత్యాయత్నం రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలపై దాడిగా భావిస్తున్నాం. సీఎం వైఎస్ జగన్ ప్రభంజనాన్ని తట్టుకోలేక ఓటమి భయంతోనే టీడీపీ ఈ దుశ్చర్యకు పాల్పడింది. దేశంలో మరెక్కడా లేనివిధంగా సీఎం వైఎస్ జగన్ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలను విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారు. ఓర్వలేని టీడీపీ తన అడ్రస్ గల్లంతవుతుందనే కంగారుతో భౌతిక దాడులకు దిగింది. టీడీపీ ప్రోద్బలంతో ఇప్పుడు విసిరిన రాళ్లనే మే 13 పోలింగ్ రోజున ఓట్లుగా మార్చి సీఎం వైఎస్ జగన్‌కు అఖండ మెజార్టీ ఇచ్చి ప్రజలే సమాధానం చెబుతారు. ప్రజల మద్దతు, ప్రేమాభిమానాలు ఉన్నంత వరకు సీఎం జగన్‌పై పచ్చ కుట్రలు, కుతంత్రాలు ఏమీ చేయలేవు.

– ఆర్.కృష్ణయ్య, రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు

### అక్కసుతోనే కూటమి మూకల దుశ్చర్య



సీఎం వైఎస్ జగన్‌పై గెలవలేకపోతున్నామనే అక్కసుతో కూటమి నేతలు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారు. సీఎం వైఎస్ జగన్‌ను అంతమొందించాలనే కుట్రతో హత్యాయత్నానికి ఒడిగట్టిన టీడీపీ, జనసేన, బీజేపీలకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు.

– పి.గౌతంరెడ్డి, అధ్యక్షుడు, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్

### దోషులను కఠినంగా శిక్షించాలి



అత్యంత రక్షణ వలయం మధ్య ఉండే ముఖ్యమంత్రిపై హత్యాయత్నం జరగడం అమానుషం. రాజకీయాల్లో ఇలా భౌతిక దాడులకు దిగడం సరికాదు. విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలి.

– వి.శ్రీనివాసరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి

### పథకం ప్రకారమే హత్యాయత్నం

సీఎం వైఎస్ జగన్‌కు వస్తున్న ప్రజాదరణ ఓర్వలేని టీడీపీ గూండాలు పథకం ప్రకారం హత్యాయత్నం చేశారు. బస్సు యాత్ర 14 రోజుల్లో ఎక్కడా ఇటువంటి ఘటన జరగలేదు. విజయవాడలో టీడీపీ నేతలు ఉన్మాదంతో రౌడీలను రెచ్చగొట్టి సీఎం జగన్‌పై హత్యాయత్నానికి ఒడిగట్టడం దుర్మార్గం.

– షేక్ గౌస్‌లాజమ్, చైర్మన్, ఏపీ హజ్ కమిటీ

### కూటమి కుతంత్రాలు



ఓటమి భయంతోనే టీడీపీ దాడులకు తెగబడుతోంది. సీఎం జగన్ చేపట్టిన మేమంతా సిద్ధం బస్సుయాత్రకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తుండటాన్ని జీర్ణించుకోలేక టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కుతంత్రాలు చేస్తోంది.

– వడిత్యా శంకర్ నాయక్, జాతీయ అధ్యక్షుడు, గిరిజన ప్రజా సమాఖ్య

### ఈ ఘటన అమానుషం



పేదల గుండె చప్పుడైన సీఎం వైఎస్ జగన్‌పై హత్యాయత్నం అమానుషం. ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా ఎన్నికల సంఘం పటిష్ట చర్యలు చేపట్టాలి.

– ఎస్.మారేష్, మెంబర్, ఏపీ బీసీ కమిషన్

### హత్యా రాజకీయాలకు టీడీపీ ఊతం



బెజవాడలో టీడీపీ తొలినుంచీ హత్యా రాజకీయాలు చేస్తోంది. సీఎం వైఎస్ జగన్‌పై హత్యాయత్నంతో టీడీపీ తన మార్కు రాజకీయాలకు తెరలేపింది. హత్యాయత్నానికి కారణమైన వారిని పోలీసులు తక్షణం గుర్తించి కఠినంగా శిక్షించాలి.

– నత్తా యోనారాజు, జాతీయ అధ్యక్షుడు, మాల మహానాడు

### టీడీపీ నేతల తీరు అసహ్యించుకునేలా ఉంది

సీఎం వైఎస్ జగన్‌పై పక్కా పథకం ప్రకారమే హత్యాయత్నం జరిగింది. ఘటన జరిగిన వెంటనే టీడీపీ నేతలు స్పందించిన తీరు ప్రజలు అసహ్యించుకునేలా ఉంది. టీడీపీ నేతల కుట్రపై గల బలమైన అనుమానాలపై పోలీస్ దర్యాప్తులో నిగ్గు తేల్చాలి.

– షేక్ దస్తగిరి, అధికార ప్రతినిధి, వైఎస్సార్‌సీపీ స్టేట్ మైనార్టీ సెల్

### బాబువి కుటిల రాజకీయాలు



సీఎం వైఎస్ జగన్‌పై హత్యాయత్నం అమానుషం. తన వల్ల మంచి జరిగి ఉంటేనే ఓటు వేయాలని అడుగుతున్న దమ్మున్న నాయకుడు వైఎస్ జగన్. చంద్రబాబు కుటిల రాజకీయాలకు ప్రజలే బుద్ధి చెబుతారు.

– పవిత్ర మురళీకృష్ణ, చైర్‌పర్సన్, ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్

### సీఎం వైఎస్ జగన్‌ను ప్రజల నుంచి దూరం చేయలేరు

తన సంక్షేమ పాలనలో ప్రతి గడపకు మేలు చేసిన సీఎం వైఎస్ జగన్‌ను ప్రజల నుంచి దూరం చేయడం టీడీపీ రౌడీల వల్ల కాదు. టీడీపీ, దాని తోక పార్టీలకు రానున్న ఎన్నికల్లో ప్రజలే గట్టిగా బుద్ధి చెబుతారు.

– బందన పూర్ణచంద్రరావు, ఉపాధ్యక్షుడు, జాతీయ మత్స్యకార సంఘం

### దుష్ట శక్తుల పన్నాగమిది




ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం హేయమైన చర్య. కోట్లాదిమంది ప్రజల అభిమానం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కింది. దానిని చూసి ఓర్వలేక కొన్ని దుష్ట శక్తులు ఆయన్ని అంతమొందించేందుకు పన్నాగం పన్నాయి.

– దేరంగుల ఉదయకిరణ్, అధ్యక్షుడు, జాతీయ బీసీ సంఘం

## సీఎం జగన్‌కు హైసెక్యూరిటీ కల్పించాలి

**ఆల్ ఇండియా నేషనల్ బీసీ ఫ్రంట్ కన్వీనరు కేఎంఎల్**



**రాజంపేట:** ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి హైసెక్యూరిటీ కల్పించాలని దేశ ప్రధాని మోదీ, కేంద్ర హోం శాఖను కోరినట్లు ఆల్ ఇండియా నేషనల్ బీసీ ఫ్రంట్ కన్వీనరు కేఎంఎల్ నరసింహులు తెలిపారు. ఆదివారం ఆయన అన్నమయ్య జిల్లా రాజంపేటలో మాట్లాడారు. విజయవాడలో మేమంతా సిద్ధం కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న బస్సుయాత్రలో సీఎం జగన్ ప్రజలకు అభివాదం చేస్తుండగా రాయితో దాడి చేసిన ఘటన యావత్తు దేశంలోని ప్రజాప్రతినిధులను కలవరపాటుకు గురిచేసిందన్నారు. రోజురోజుకు జగన్‌కు పెరుగుతున్న జనాదరణను చూసి ఓర్వలేని ప్రత్యర్థుల ప్రోత్సాహంతో ఈ దాడి జరిగిందని జనం నమ్ముతున్నారని చెప్పారు. ఈ మేరకు ప్రధాని, హోంశాఖ మెయిల్‌కు వివరాలు పంపించానని తెలిపారు.



విశాఖలో మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న మహిళలు



చంద్రగిరిలో ర్యాలీ చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి



సత్తెనపల్లిలో నిరసన ప్రదర్శనలో మంత్రి అంబటి రాంబాబు, నాయకులు

# టీడీపీ హత్యా రాజకీయాలపై..

# ఎగసిన నిరసన

**జననేతకు సంఘీభావం తెలుపుతూ రాష్ట్రవ్యాప్తంగా అభిమానులు, వైఎస్సార్‌సీపీ నేతలు నల్లబ్యాడ్జీలతో ర్యాలీలు**



గుంటూరులో విప్ లేళ్ల అప్పిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, ప్రజలు



తణుకు నరేంద్ర సెంటర్‌లో నిరసన తెలుపుతున్న మంత్రి కారుమూరి, పార్టీ శ్రేణులు

**సాక్షి, అమరావతి/నెట్‌వర్క్:** సీఎం వైఎస్ జగన్‌పై హత్యాయత్నానికి తెగబడటాన్ని నిరసిస్తూ ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. స్కూలు పిల్లల నుంచి వృద్ధులు, అభిమానులు, మహిళలు, పార్టీ నేతలు పెద్దఎత్తున నల్లబ్యాడ్జీలు ధరించి ర్యాలీలు నిర్వహించారు. టీడీపీ అధినేత చంద్రబాబు, లోకేశ్, జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ప్రోద్బలంతోనే ఈ హత్యాయత్నం జరిగిందని మండిపడ్డారు. ప్రజాక్షేత్రంలో జగన్‌ను ఎదుర్కోలేక.. మేమంతా సిద్ధం బస్సు యాత్రకు వస్తున్న ప్రజా స్పందనను చూసి ఓర్వలేక.. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘనవిజయం సాధించడం ఖాయమనే అక్కసుతోనే సీఎంపై హత్యాయత్నానికి పురిగొలిపారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అనేకచోట్ల చంద్రబాబు దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. ఇందులో భాగంగా.. సీఎంపై హత్యాయత్నాన్ని ఖండిస్తూ ఆదివారం తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి మండలం యర్నగూడెంలో హోంమంత్రి తానేటి వనిత నేతృత్వంలో పార్టీ శ్రేణులు నిరసన ర్యాలీ నిర్వహించారు. ముఖ్యమంత్రిని రాజకీయంగా ఎదుర్కోలేకే దాడిచేయడం బాధాకరమని మంత్రి అన్నారు. దండకున్న తీగ గుచ్చుకుని గాయమైనట్లు కొంతమంది వక్రీకరిస్తున్నారని.. తీగ గుచ్చుకుని గాయమైతే వెనుకనున్న ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్‌కు ఎలా గాయమైందని ప్రశ్నించారు. ఏలూరు జిల్లా దెందులూరు ఎమ్మెల్యే కార్యాలయం వద్ద జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, నాయకులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కుక్కునూరు మండలం కివ్వాక గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. భీమడోలు మండలం కోడేరుపాడు గ్రామంలో ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలం మర్రితిప్ప వద్ద చీఫ్ విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కాకినాడ రూరల్ మండలంలో పార్టీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ప్రత్తిపాడులో ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు, పెద్దాపురం నియోజకవర్గ అభ్యర్థి దవులూరి దొరబాబు సామర్లకోటలో, పి.గన్నవరంలో జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే అభ్యర్థి వేణుగోపాలరావు, జగ్గంపేట, తునిలో పార్టీ శ్రేణులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. హత్యాయత్నానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కురసాల కన్నబాబు డిమాండ్ చేశారు.

### జగన్‌ను టచ్ చేశారు పుట్టగతులుండవు : మంత్రి ‘కొట్టు’

సీఎం జగన్‌ని దాడి ద్వారా టచ్ చేశారు, ఈ కుట్రకు పాల్పడిన వారికి పుట్టగతులుండవని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ హెచ్చరించారు. తాడేపల్లిగూడెంలో ఆయన నల్లరిబ్బన్లు ధరించి విలేకరులతో మాట్లాడారు. సీఎం జగన్‌ను ఎదుర్కోలేక పిరికిపంద చర్యలకు పాల్పతున్నారన్నారు. ఆయనకు వస్తున్న జనాదరణను తట్టుకోలేక ఇలాంటి దురాగతాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఇక సీఎంపై దాడి ముమ్మాటికీ చంద్రబాబు పనేనని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తణుకులో ఆరోపించారు. పేదలకు సంక్షేమం, విద్య, వైద్యం ఉచితంగా అందిస్తున్నందుకు జగన్‌పై దాడులు చేయిస్తావా చంద్రబాబూ అని నిలదీశారు. వంగవీటి రంగాను అత్యంత కిరాతకంగా చంద్రబాబు అంతమొందించాడని, నేడు అదే కోవలో ప్రయత్నాలు చేస్తున్నాడని మండిపడ్డారు. విజయనగరంలో శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జామి మండలంలోని పీతలపాలెంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, పార్వతీపురం మన్యం జిల్లాలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, పాలకొండలో ఎమ్మెల్యే కళావతి నల్లబ్యాడ్జీలు ధరించి శాంతియుతంగా నిరసన తెలిపారు. సీఎంపై జరిగిన దాడి అమానుషమని, ప్రజాస్వామ్యంలో ఇటువంటి చర్యలు హేయమైనవని కోలగట్ల అన్నారు. సీఎం జగన్‌పై జరిగిన దాడికి నిరసనగా శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసలో స్పీకర్ తమ్మినేని సీతారాం, నరసన్నపేటలో ధర్మాన కృష్ణదాస్‌లు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. సోంపేటలో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, కొత్తూరులో ఎమ్మెల్యే రెడ్డిశాంతి నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

### చంద్రబాబు కేడర్‌ను రెచ్చగొడుతున్నారు

ఇక సీఎం జగన్‌పై దాడికి నిరసనగా ప్రకాశం జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్దఎత్తున నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాలు నిర్వహించాయి. ఒంగోలులో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మేయర్ గంగాడ సుజాత.. సింగరాయకొండలో మంత్రి ఆదిమూలపు సురేష్, చీమకుర్తిలో మంత్రి మేరుగ నాగార్జున, కంభంలో ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి, మార్కాపురంలో ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా రాంబాబు, కనిగిరిలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. చంద్రబాబు పదేపదే తన కేడర్‌ను రెచ్చగొడుతున్నారని, ఇది హేయమైన చర్య అని బాలినేని, ఆదిమూలపు, మేరుగ నాగార్జున ఆరోపించారు. చీరాల, అద్దంకి, పర్చూరు, అధికార పార్టీ అభ్యర్థులు కరణం వెంకటేష్, పానెం హనిమిరెడ్డి, ఎడం బాలాజీ, వేమూరు అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు జరిగాయి. ఎంపీ మోపిదేవి వెంకటరమణ, బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి, రేపల్లె అభ్యర్థి ఈవూరి గణేష్‌లు ముఖ్యమంత్రిపై జరిగిన దాడిని ఖండించారు.

### ఉమ్మడి విశాఖలో ఆగ్రహ జ్వాలలు..

ఉమ్మడి విశాఖ జిల్లా మర్రిపాలెంలో వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్, ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు రాస్తారోకో, మానవహారం నిర్వహించారు. మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. ఎండాడలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, ఎమ్మెల్సీ రవీంద్రబాబు ఆధ్వర్యంలో మౌన దీక్ష నిర్వహించగా.. విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కేకే రాజు ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. గాజువాకలో మంత్రి అమర్‌నాథ్ ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. చంద్రబాబు నీచరాజకీయాలు చెల్లవని.. ఇలాంటి దాడులను తాము సహించబోమన్నారు. అనకాపల్లి జిల్లా మునగపాకలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ఆధ్వర్యంలో రాస్తారోకో, మానవహారం నిర్వహించారు. పాయకరావుపేటలో ఎమ్మెల్యే అభ్యర్థి, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, పార్టీ శ్రేణులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు.

### ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల వ్యాప్తంగా..

జగ్గయ్యపేటలో ఎమ్మెల్యే, విప్ సామినేని ఉదయభాను, తిరువూరులో ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు, మైలవరంలో ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు యాదవ్, విజయవాడ పశ్చిమంలో ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్, సెంట్రల్ నియోజకవర్గంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్లు, విజయవాడ తూర్పు నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఇక మచిలీపట్నం, అవనిగడ్డ, గన్నవరం, గుడివాడ, పామర్రు, పెడన, పెనమలూరు నియోజకవర్గాలోనూ నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. పెనమలూరు మండలం గంగూరులో మంత్రి జోగి రమేష్, పామర్రులో ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. గుంటూరులో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ఆధ్వర్యంలో.. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, ఇక్కడి ప్రస్తుత అభ్యర్థి షేక్ నూరిఫాతిమా ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. పొన్నూరులో ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ, గుంటూరులో ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, మచిలీపట్నం పోర్టు ట్రస్టు ఎండీ మేకతోటి దయాసాగర్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇతర మండలాల్లోనూ నల్లబ్యాడ్జీలతో నిరసనలు చేశారు. అలాగే, సత్తెనపల్లిలో మంత్రి అంబటి రాంబాబు నాయకత్వంలో నల్లకండువాలు ధరించి ర్యాలీ నిర్వహించారు. మాచర్లలో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, నరసరావుపేటలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, అమరావతిలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు రాస్తారోకోలు, కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహించారు. రొంపిచర్ల, వినుకొండలోనూ ఆందోళనలు చేశారు.

### ఇది ముమ్మాటికీ కూటమి కుట్రే

ఇదిలా ఉంటే.. సీఎంపై హత్యాయత్నం ముమ్మాటికీ ప్రతిపక్ష పార్టీల కుట్రేనని తుడా చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆరోపించారు. చంద్రగిరిలో ఆయన కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఇందులో పాల్గొన్నారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి లక్ష్మీ, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి కూడా హాజరయ్యారు. అలాగే, హత్యాయత్నాన్ని ఖండిస్తూ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్, మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ ఆధ్వర్యంలో తిరుపతిలో నల్ల కండువాలు, నల్లబ్యాడ్జీలు ధరించి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. జగనన్నకు హాని జరిగితే సంక్షేమ పథకాలన్నీ ఆగిపోతాయని వారన్నారు. ఇక అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరులో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. సీఎంపై హత్యాయత్నం వెనుక కుట్రకోణం ఉందన్నారు. వైఎస్సార్ జిల్లా వేంపల్లెలో శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ సతీష్‌కుమార్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. మరోవైపు.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నాన్ని ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలు కూడా తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆదివారం రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ, తాడిపత్రి, శింగనమల, గుంతకల్లు, అనంతపురం, రాప్తాడు నియోజకవర్గాల్లో భారీఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అలాగే శ్రీసత్యసాయి జిల్లాలోని పుట్టపర్తి, ధర్మవరం, కదిరి, హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లోనూ నిరసనలు జరిగాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు నల్లబ్యాడ్జీలు ధరించి శాంతియుత ఆందోళనలు జరిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోనూ జనాగ్రహం పెల్లుబికింది. ఆత్మకూరు పట్టణంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో.. ఉదయగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నల్లరిబ్బన్లను ధరించి నిరసన వ్యక్తంచేశారు. నెల్లూరు నగరంలోనూ నిరసన ర్యాలీలను నిర్వహించారు.

# తెలుగుదేశందే కుట్ర

### ప్రజాదరణ చూసి ఓర్వలేకే..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం వెనుక కుట్ర ఉంది. అందుకు టీడీపీ నాయకుడు లోకేశ్ వ్యాఖ్యలే నిదర్శనం. లోకేశ్ ట్విటర్‌లో 2019లో కోడికత్తి, 2024లో రాయిదాడి అని పెట్టారు. లోకేశ్ వ్యాఖ్యలను గమనిస్తే ఈ హత్యాయత్నం వెనుక టీడీపీ కుట్ర ఉందని తెలుస్తోంది. ప్రజాదరణను చూసి ఓర్వలేక సీఎం వైఎస్ జగన్‌పై ఈ దారుణానికి పాల్పడ్డారు. సిద్ధం సభలు, బస్సుయాత్రలో సీఎం వైఎస్ జగన్‌కు వస్తున్న ప్రజాదరణ ప్రతిపక్షాలకు మింగుడుపడడంలేదు. చంద్రబాబు, లోకేశ్, పవన్‌కళ్యాణ్, పురందేశ్వరి అంతా నైరాశ్యంలో ఉన్నారు. బస్సుయాత్రకు వస్తున్న స్పందన చూసి కూటమి నేతలు కుట్రకు తెరతీశారు.

– పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మంత్రి

### కడుపుమంటతోనే దారుణానికి ఒడిగట్టారు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న బస్సుయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతుండటంతో.. ఎలాగైనా దాన్ని ఆపాలనే కుట్రతోనే ఈ హత్యాయత్నం చేశారు. కూటమి నేతల సభలు జనం లేక వెలవెలబోతున్నాయి. కదిలి రా అని ఎంత పిలిచినా జనం కదలడం లేదు. ఇదే సమయంలో వైఎస్ జగన్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక కడుపుమంటతో ఈ దారుణానికి పాల్పడ్డారు. ఇలాంటి దిగజారుడు రాజకీయాలు చేయడం బాబుకు కొత్త కాదు.

– ఎస్‌బి అంజద్‌బాషా, ఉప ముఖ్యమంత్రి

### సీఎం జగన్‌పై హత్యాయత్నం చేసింది టీడీపీ గూండాలే..



ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధిని ప్రజలకు చెప్పేందుకు మేమంతా సిద్ధం బస్సుయాత్ర ద్వారా ప్రజల్లోకి వస్తుంటే చూసి ఓర్వలేక తెలుగుదేశం పార్టీ గూండాలే ఆయనపై హత్యాయత్నం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఎన్ని కూటములు కట్టినా ప్రజాగళంసభలు వెలవెలబోతున్నాయి. దీంతో ఏం చేయాలో తెలియక నిరాశ, నిస్పృహలతో టీడీపీ గుండాలు ఈ అరాచకానికి పాల్పడ్డారు. ఇటువంటి వాటితో జగన్ మనోధైర్యాన్ని దెబ్బతీయలేరు.

– విశ్వరూప్, రవాణాశాఖ మంత్రి

### ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలి



సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై విజయవాడలో జరిగిన హత్యాయత్నాన్ని ప్రజాస్వామ్యవాదులందరూ తీవ్రంగా ఖండించాలి. ప్రజాస్వామ్యంలో ప్రజల కోసం పనిచేసే పాలకులపై దాడులు చేయించే విషసంస్కృతిని ప్రతిపక్షాలు పెంచి పోషిస్తున్నాయి. ప్రజల్లో అత్యంత విశ్వాసం కలిగిన నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి బస్సుయాత్రలో ప్రజలు సంద్రం మాదిరిగా ఆయన వెంట రావడం చూసి ఓర్వలేక ఈ దుశ్చర్యకు పాల్పడ్డారు. ఆ వస్తువు కొంచెం కిందకు తగిలితే సీఎం జగన్ కన్ను దెబ్బతినేది. దీనిపై విజ్ఞులైన ప్రజలందరూ ఆలోచించాలి.

– చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ, బీసీ సంక్షేమశాఖ మంత్రి

### హింసను ప్రేరేపిస్తున్న బాబు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం వెనుక చంద్రబాబు కుట్ర ఉంది. గతంలో చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు విశాఖపట్నం విమానాశ్రయంలో జగన్‌మోహన్‌రెడ్డిపై కత్తితో దాడి జరిగింది. అబద్ధాలు చెప్పడం, హింసను ప్రేరేపించడం, అధర్మాన్ని పాటించడం ద్వారా మరోసారి అధికారంలోకి రావచ్చని చంద్రబాబు భ్రమిస్తున్నారు. ఆయన ఇప్పటికీ గుణపాఠాలను నేర్చుకోకపోవడం శోచనీయం.

– విజయసాయిరెడ్డి, ఎంపీ, వైఎస్సార్‌సీపీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి


### ఎన్నికల కమిషన్ సత్వర చర్యలు తీసుకోవాలి



సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నంపై ఎన్నికల కమిషన్ తక్షణమే చర్యలు తీసుకోవాలి. హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలి. 15 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రచారం చేస్తున్న జగన్‌కు లభిస్తున్న ప్రజాదరణను చూసి టీడీపీ నేతలు ఓర్వలేకపోతున్నారు. 2019 ఎన్నికల ముందు జగన్‌పై టీడీపీ అభిమాని విశాఖ ఎయిర్‌పోర్టులో కత్తితో దాడిచేశాడు.

– వై.వి.సుబ్బారెడ్డి, ఎంపీ, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల కోఆర్డినేటర్

### ప్రతిపక్షాల ప్రకటనలు దారుణం



సంక్షేమ పథకాలతో పేదల గుండెల్లో నిలుస్తూ, ప్రజాభిమానంతో అప్రతిహతంగా సాగుతున్న బస్సుయాత్రలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకే ఆయనపై హత్యాయత్నం చేశారు. ఇది రాజకీయ కుట్రే. ఈ హత్యాయత్నంపై ప్రతిపక్షాల ప్రకటనలు దారుణం. అధికారుల వైఫల్యం అనటం అర్థంలేని మాట. సమగ్రంగా విచారించి దోషులను పట్టుకున్న తరువాత వారికి ప్రతిపక్షాలు మద్దతుగా నిలవకుండా ఉండాలి. అప్పుడే ఇటువంటి చర్యలు పునరావృతం కావు.

– పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎంపీ, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్

### సీఎం జగన్ జోలికి వస్తే అంతు చూస్తాం



పోరాటాలతో పుట్టిన వైఎస్సార్‌సీపీకి యుద్ధం కొత్త కాదు. ఇటువంటి ఉడత బెదిరింపులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భయపడరు. జగనన్న జోలికి వస్తే అంతు చూస్తాం. ప్రజాగ్రహంలో ప్రతిపక్షాలు కొట్టుకుపోతాయి. రాజకీయాల్లో సింహలా గర్జిస్తూ ముందుకు సాగుతున్న సీఎం జగనన్నను చూసి తట్టుకోలేక ఆయనపై టీడీపీ హత్యాయత్నం చేయించింది. నేను తలుచుకుంటే నువ్వు ఏమైపోతావో జగన్.. అంటూ ఇటీవల చంద్రబాబునాయుడు చేసిన వ్యాఖ్యల అంతరార్థం ఇదేనేమో. ఇటువంటి దుర్మార్గులకు అధికారం దక్కకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది.

– విడదల రజిని, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి

## క్లుప్తంగా...

### సామాజిక న్యాయసాధకుడు బీఆర్ అంబేడ్కర్
గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్


బీఆర్ అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్

సాక్షి, అమరావతి: దేశ ప్రజలకు సమాన హక్కులు కల్పించిన మహనీయుడు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా విజయవాడ రాజ్‌భవన్‌లో ఆయన చిత్రపటానికి గవర్నర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా పోరాడి సమాజంలో అణగారినవర్గాల అభ్యున్నతికి పాటుపడిన సామాజిక న్యాయసాధకుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని గవర్నర్ కొనియాడారు.

### దార్శనికుడు బాబాసాహెబ్ అంబేడ్కర్
ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి,అమరావతి: సమాజంలో అంటరానితనం నిర్మూలనకు అక్షరమనే ఆయుధాన్ని ఎక్కుపెట్టిన దార్శనికుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనియాడారు. నిరుపేద, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన అంబేడ్కర్‌పై గౌరవాన్ని ఇనుమడింపజేస్తూ భావి తరాలకు గుర్తుండేలా విజయవాడలో మన ప్రభుత్వం 206 అడుగుల స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్‌ను ఏర్పాటు చేయడం రాష్ట్రానికే కాదు, దేశానికీ తలమానికం. ఈ రోజు ఆ మహనీయుడి జయంతి సందర్భంగా ఘన నివాళులు.. అంటూ సీఎం జగన్ సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ చేశారు.


### నిమ్న వర్గాల్లో చైతన్యం తెచ్చిన నాయకుడు అంబేడ్కర్
ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్

సాక్షి, న్యూఢిల్లీ: నిమ్న వర్గాల్లో చైతన్యం తెచ్చిన నాయకుడు అంబేడ్కర్ అని ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్ అన్నారు. ఆదివారం ఏపీ భవన్‌లో అంబేడ్కర్ 133వ జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అగర్వాల్ నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ భావాలను అందరూ ఆచరించాలని తెలిపారు.

# మళ్లీ వడగాడ్పుల దడ

**నేటి నుంచి మరింత తీవ్రం ● మూడు రోజులపాటు 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు**

సాక్షి, విశాఖపట్నం: ఇటీవల తగ్గుముఖం పట్టిన వడగాడ్పులు మళ్లీ దడ పుట్టించనున్నాయి. అధిక ఉష్ణోగ్రతలతో ఎండలు మరింత తీవ్రం కానున్నాయి. నాలుగైదు రోజుల క్రితం ద్రోణి, ఆవర్తనాల ప్రభావంతో రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని, ఫలితంగా ఉష్ణతాపం తగ్గుతుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. అయితే.. మారిన వాతావరణ పరిస్థితులతో అవి రాష్ట్రంపై ప్రభావం చూపించకపోవడంతో వానలు ఊరించి ఉసూరుమనిపించాయి. దీంతో ఉష్ణోగ్రతల పెరుగుదల మొదలై వడగాడ్పులు మళ్లీ ఉధృతమవుతున్నాయి. సోమవారం నుంచి ఇవి తీవ్రరూపం దాల్చనున్నాయి. ఆదివారం రాష్ట్రంలో ఆదివారం 35 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 67 మండలాల్లో వడగాడ్పులు వీచాయి. సోమవారం 31 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 139 మండలాల్లో వడగాడ్పులు, మంగళవారం 33 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 113 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. రానున్న మూడు రోజులు పలుచోట్ల 41నుంచి 44 డిగ్రీలు, కొన్నిచోట్ల 45 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని




అంచనా వేసింది. పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో 45 డిగ్రీలు, విజయనగరం జిల్లాలో 44, శ్రీకాకుళం, ఎన్టీఆర్, పల్నాడు, ఏలూరు జిల్లాల్లో 43, అనకాపల్లి, తూర్పు గోదావరి, కాకినాడ, కర్నూలు, నంద్యాల, అనంతపురం, వైఎస్సార్, నెల్లూరు జిల్లాల్లో 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావచ్చని పేర్కొంది. కాగా.. ఆదివారం కర్నూలు జిల్లా గోనవరంలో అత్యధికంగా 42.3 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది.

**రాష్ట్రంలోని ప్రధాన నగరాలు, పట్టణాల్లో ఆదివారం నమోదైన ఉష్ణోగ్రతల వివరాలు (డిగ్రీ సెల్సియస్‌లలో)**

| నగరం/పట్టణం | గరిష్టం | కనిష్టం |
|---|---|---|
| రెంటచింతల | 42.4 | 26.2 |
| కర్నూలు | 41.3 | 27.7 |
| రాజమహేంద్రవరం | 40.0 | 24.0 |
| తిరుపతి | 40.0 | 22.0 |
| కడప | 39.5 | 27.8 |
| నెల్లూరు | 39.2 | 28.2 |
| విజయనగరం | 39.0 | 35.0 |
| ఏలూరు | 39.0 | 26.0 |
| గుంటూరు | 39.0 | 26.0 |
| విజయవాడ | 39.0 | 26.0 |
| అనకాపల్లి | 39.0 | 24.5 |
| విశాఖపట్నం | 38.0 | 24.2 |
| శ్రీకాకుళం | 34.0 | 25.0 |

## అంబేడ్కర్ ఆశయాలను నెరవేరుస్తున్న సీఎం జగన్


బీఆర్ అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి, తదితరులు

- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి
- పార్టీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా అంబేడ్కర్ జయంతి

సాక్షి, అమరావతి: అందరికీ ఆమోదయోగ్యమైన భారత రాజ్యాంగాన్ని రచించి భిన్న సంస్కృతులకు వేదికగా ఉన్న భారతదేశాన్ని సమైక్యంగా ఉంచడంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కృషి మరవలేనిదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. అంబేడ్కర్ కలలుగన్న ప్రజాస్వామ్య, సామ్యవాద సమాజాన్ని నిర్మించే దిశగా సీఎం జగన్ పరిపాలన సాగిస్తున్నారని అన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను ఆదివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా సీఎం వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారని తెలిపారు. పేదరిక నిర్మూలన దిశగా చిత్తశుద్ధితో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. కీలక రంగాలపై దృష్టి పెట్టి ఐదేళ్లలో ఎంతో అభివృద్ధి సాధించారని తెలిపారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపేలా సీఎం జగన్ విప్లవాత్మక చర్యలు చేపట్టారని వివరించారు. మూస ధోరణిలో సాధారణ రాజకీయ నేతల మాదిరి కాకుండా విశ్వసనీయతే ప్రాతిపదికగా అనేక సంస్కరణలు తీసుకువచ్చి గొప్ప మార్పుల దిశగా అడుగులు వేశారని చెప్పారు. ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాలవారు తమ నిర్ణయాలు తాము తీసుకుని, తమ కాళ్లపై తాము నిలబడేలా చేశారని పేర్కొన్నారు. శాసన మండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలోనే ఎత్తయిన అంబేడ్కర్ విగ్రహాన్ని విజయవాడలో ఏర్పాటు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు దక్కుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పోతుల సునీత, మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు, పార్టీ నేతలు పడమట సురేష్‌బాబు, కె.రాజశేఖర్, కొమ్మూరి కనకారావు మాదిగ, బత్తుల బ్రహ్మానంద రెడ్డి, నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఇంగ్లిష్ పోటీల్లో ఏపీ విద్యార్థుల ప్రతిభ

▶ మొదటి పేజీ తరువాయి
మూడో తరగతి విద్యార్థి బి.రేవంత్‌కుమార్ రెండో స్థానం, ఐదో తరగతి విద్యార్థి అనిల్‌కుమార్ బాణావత్ మూడో స్థానంలో నిలిచారు. విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలను అంచనా వేసేందుకు జాతీయ వర్డ్ పవర్ చాంపియన్‌షిప్ దేశంలోనే అతిపెద్ద పోటీ కార్యక్రమం. ఈ పోటీలో ఏపీ నుంచి ఐదుగురు విద్యార్థులు పాల్గొనగా, ఇద్దరు విద్యార్థులు రెండు, మూడు స్థానాల్లో నిలవడం విశేషం. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను, విజేతలను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్, సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ డాక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి అభినందించారు.


రేవంత్ కుమార్ (రెండో స్థానం)


అనిల్ కుమార్ (మూడో స్థానం)

**ఈఎల్పీ ద్వారా శిక్షణ**

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థుల్లో ఆంగ్ల భాష నైపుణ్యాలను పెంపొందించేందుకు 2021లో ప్రభుత్వం ఇంగ్లిష్ లిటరసీ ప్రోగ్రామ్(ఈఎల్పీ)ను ప్రారంభించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా, ఎస్సీఈఆర్టీతో విభా, లీప్ ఫార్వర్డ్ సంస్థలు కలిసి పనిచేస్తున్నాయి. ఈ ప్రోగ్రామ్ ద్వారా 2, 3, 4, 5 తరగతుల విద్యార్థులకు ఇంగ్లిష్ పదాలను సులభంగా పలకడం, చదవడం నేర్పిస్తున్నారు. కనిమెర్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లో బహుమతులు సాధించడంతో ప్రభుత్వం చేపట్టిన ఈఎల్పీ సత్ఫలితాలు ఇస్తోందని స్పష్టమవుతోంది.

## డిప్యూటీ రీజినల్ కో–ఆర్డినేటర్‌గా ఎస్వీ మోహన్‌రెడ్డి

**కర్నూలు పార్లమెంట్ స్థానానికి వైఎస్సార్‌సీపీ ప్రకటన**

సాక్షి, అమరావతి: కర్నూలు పార్లమెంట్ స్థానానికి వైఎస్సార్‌సీపీ డిప్యూటీ రీజినల్ కో–ఆర్డినేటర్‌గా మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఆయన సంబంధిత రీజినల్ కో–ఆర్డినేటర్ ఆధ్వర్యంలో పనిచేస్తారని వెల్లడించింది.

## కాంగ్రెస్ అధికారంలోకొస్తే రాష్ట్రానికి పదేళ్ల పాటు ప్రత్యేక హోదా

**పీసీసీ చీఫ్ షర్మిల**

రేణిగుంట/వరదయ్యపాళెం(తిరుపతి జిల్లా): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఏపీకి పదేళ్లపాటు ప్రత్యేక హోదా ఇస్తామని పీసీసీ చీఫ్ షర్మిల అన్నారు. 'న్యాయ్‌యాత్ర' పేరుతో ఆమె చేపడుతున్న బస్సుయాత్ర ఆదివారం తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి చేరుకుంది. తొలుత ఆమె ఆర్టీసీ బస్టాండు సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని బేరివారి మండపం వద్ద బహిరంగ సభలో మాట్లాడారు. రాష్ట్రానికి సంజీవని వంటి ప్రత్యేక హోదా ఇస్తామని బీజేపీ ప్రజలను దగా చేసిందని, గతంలో చంద్రబాబు, ప్రస్తుత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇద్దరూ బీజేపీకి బానిసలుగా మారి ప్రత్యేక హోదా మాటే ఎత్తలేదన్నారు. తాము అధికారంలోకి వచ్చాక రాహుల్‌గాంధీ ప్రధాని హోదాలో ఏపీకి పదేళ్ల ప్రత్యేక హోదాపై తొలి సంతకం చేస్తారని చెప్పారు. కాగా, తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో షర్మిల పర్యటిస్తుంటే శ్రీకాళహస్తిలో జరిగిన సభకు కాంగ్రెస్ తిరుపతి పార్లమెంట్ అభ్యర్థి చింతా మోహన్ హాజరుకాలేదు. ఆమె సభ జరుగుతున్న చోట కొందరు మహిళలు మహిళా రిజర్వేషన్ పాటించాలి.. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే టికెట్ జంగాలపల్లి అన్నపూర్ణమ్మకు కేటాయించాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఇదిలా ఉండగా, సత్యవేడు నియోజకవర్గానికి ప్రాతినిథ్యం వహించి టీడీపీలోకి వలస వెళ్లిన సిట్టింగ్ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, ఆయన తనయుడు సుమన్‌ల అక్రమాలకు అవధుల్లేకుండా పోయాయని సత్యవేడు సభలో షర్మిల ఆరోపించారు. వైఎస్సార్‌సీపీలో ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆదిమూలం కోట్లకు పడగలెత్తారని, ఆ డబ్బుతో ఇప్పుడు టీడీపీలోకి వెళ్లి మరలా ఆ పార్టీ నుంచే అభ్యర్థిగా నియోజకవర్గ దోపిడీకి మరోమారు మీ ముందుకొస్తున్నారని, బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు.


తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో జరిగిన సభలో షర్మిల

### కుట్రదారులు బాబు అండ్ కో



సీఎం వైఎస్ జగన్‌పై హత్యాయత్నానికి పాల్పడిన కుట్రదారులు చంద్రబాబు అండ్ కోనే. జగనన్నపై దుండగుల హత్యాయత్నంతో నరరూపరాక్షసుడైన చంద్రబాబు నిజస్వరూపాన్ని దేశం యావత్తు తెలుసుకుంది. బస్సుయాత్ర దిగ్విజయంగా సాగుతుంటే బాబు అండ్ కో కడుపు మంటతో సీఎం జగన్‌పై కుట్రతో ఈ దారుణం చేయించారు. కుట్రలు, దాడులు చేయించటం చంద్రబాబుకు వెన్నతోపెట్టిన విద్య.
– జోగి రమేష్, గృహనిర్మాణశాఖ మంత్రి

### వెన్నుపోటుదారుల కుట్ర



సీఎం వైఎస్ జగన్‌పై హత్యాయత్నం ముమ్మాటికీ టీడీపీ మూకల పనే. వెన్నుపోటుదారుల కుట్రలో భాగంగానే ఇది జరిగింది. ఓటమి తప్పదని గ్రహించిన దొంగల ముఠాలన్నీ ఒకే తాటిమీదకు చేరి ముఖ్యమంత్రిపై హత్యాయత్నం చేశాయి. దుర్గమ్మ దీవెనలతో సీఎం జగన్ త్వరగా కోలుకోవాలి.
– అడపా శేషు, కాపు కార్పొరేషన్ చైర్మన్

**జిల్లా వార్తలు**

# దర్యాప్తు ముమ్మరం

- సీఎంపై హత్యాయత్నం
- ఘటనా స్థలిలో సీసీ ఫుటేజీ పరిశీలిస్తున్న పోలీసులు
- అనుమానితుల కదికలపై పూర్తిస్థాయి నిఘా
- పక్కా ప్రణాళికతోనే హత్యాయత్నమని ప్రాథమిక నిర్ధారణ
- ఆరు పోలీసు బృందాలతో దర్యాప్తు వేగవంతం


విజయవాడ సింగ్‌నగర్ వివేకానంద స్కూల్ వద్ద సీఎం జగన్‌పై జరిగిన దాడి అనంతరం ఆ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా, పోలీసులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ/అజిత్‌సింగ్‌నగర్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఎన్టీఆర్ జిల్లా విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ డాబాకొట్ల సెంటర్ సమీపంలో శనివారం జరిగిన హత్యాయత్నంపై.. పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు అజిత్‌సింగ్‌నగర్ పీఎస్‌లో ఐపీసీ 307 సెక్షన్ కింద హత్యాయత్నం కేసుగా నమోదు చేశారు. ఘటన జరిగిన ప్రాంతాన్ని శనివారం రాత్రి నుంచి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా సీపీ టి.కె.రాణా ఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారు. ఆ ప్రాంతంలో అనుమానాస్పద వ్యక్తులను విచారణ చేస్తున్నారు. దాడి చేసిన తర్వాత ఆగంతకుడు ఎటువైపు పారిపోయి ఉంటాడనే దానిపై పోలీసులు అంచనాకు వచ్చారు. క్లూస్ టీమ్స్, కాల్ డేటా, చుట్టుపక్కల సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. ఆ ప్రాంతంలో నేరచరితుల కదలికలపై దృష్టి పెట్టారు. ప్రధానంగా టీడీపీ నేత బొండా ఉమా అనుచరుల్లో పలువురు నేర చరిత్ర ఉన్నవారు ఆ ప్రాంతంలో ఉన్నట్లుగా స్థానికులు చెబుతున్నారు. ఘటనాస్థలానికి కిలోమీటరు పరిధిలో ఉన్న సీసీ, డ్రోన్ ఫుటేజీలతోపాటు స్థానికులు తమ సెల్‌ఫోన్లలో తీసిన వీడియోలను సేకరించి విశ్లేషిస్తున్నారు. కొంత మంది అనుమానితులను గుర్తించి, వారు గత 24 గంటల్లో ఏమి చేశారు, ప్రస్తుతం ఎక్కడా ఉన్నారు అనే వివరాలను కూపీలాగుతున్నారు. ముఖ్యమంత్రిపై జరిగిన హత్యాయత్నానికి సంబంధించి ఇప్పటికే కొంత మందిని పిలిపించి విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. దర్యాప్తులో వెలుగులో చూసిన అంశాలను క్షేత్రస్థాయి వాస్తవాలను క్రోడీకరించి దర్యాప్తు ఓ కొలిక్కి తేవాలని పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

**భద్రత కట్టుదిట్టం**

ముఖ్యమంత్రిపై హత్యాయత్నం నేపథ్యంలో అజిత్‌సింగ్ నగర్‌తోపాటు, నగరంలో పోలీసులు అప్రమత్తమై భద్రతను కట్టుదిట్టం చేశారు. అవసరం మేరకు ప్రత్యేక పోలీసు బలగాలు అజిత్‌సింగ్ నగర్‌లో మోహరించారు. దీంతోపాటు నగరంలోకి వచ్చే వారి రాకపోకలపై కన్నేశారు. సీఎంపై దాడి జరిగిన ప్రాంతం, దాడి వెనుక ఉన్నవారు ఎవరు? ప్రత్యక్షంగా దాడి చేసినవారు ఎవరు? ఎటువంటి పదునైన ఆయుధంతో దాడి చేశారు? అనే కోణంలోకూడా దర్యాప్తు చేస్తున్నారు. టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తును వేగవంతం చేశారు.

**పక్కా ప్రణాళికలతోనే**

పక్కా ప్రణాళికతోనే దాడి జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. జగన్‌ను అంతం చేయాలని ప్రొఫెషనల్స్‌తో చంద్రబాబే దాడి చేయించారనే భావన స్థానికంగా వ్యక్తమవుతోంది.


ఇక్కడ నుంచే సీఎం జగన్‌పై హత్యాయత్నం చేసి ఉండొచ్చని అనుమానిస్తున్న పోలీసులు

అది అప్పటికప్పుడు చేసిన దాడి కాదని పక్కా పన్నాగంతో చేసిన దాడేనని స్పష్టం చేస్తున్నారు.

**దాడి ఘటనపై అనుమానాలు**

ప్రాథమికంగా స్కూలుకు, దేవాలయానికి మధ్య ఉన్న ఖాళీ ప్రదేశం నుంచి సీఎంపై దాడి జరిగినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. బస్సుకు 25 మీటర్ల దూరం నుంచి ఆగంతకుడు రాయితో దాడి చేసినట్లు పోలీసులు గుర్తించారు. రాయి విసిరితే వేగంగా వెళ్లదని, ఒక వ్యక్తికి తగిలితే తగిలిన వెంటనే తర్వాత కింద పడేదని, పక్కన ఉన్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ కంటికి గాయం కావటంతో ఇది రాయి దాడి కాదనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మనిషి కణతకు తగిలితే స్పాట్‌లో ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది కాబట్టి ప్రొఫెషనల్స్ దాడిలో పాల్గొనట్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. షార్ట్‌గన్, సింగిల్, డబుల్ బ్యారెక్ మజిల్ లోడింగ్ వెపన్ వాడి ఉంటారనే భావనను పలువురు వ్యక్తం చేస్తున్నారు. పక్షులు, జంతువులు వేటాడే వేటగాళ్లు, ఫైర్ ప్రాక్టీస్‌లో అనుభవం ఉన్నవారిని అద్దెకు తెచ్చుకొని వినియోగించారనే కోణాన్ని పరిశీలిస్తున్నారు. బస్సుపైనే ఉన్న ప్రత్యక్ష సాక్షులు ఎంపీ కేశినేని నాని ఘటన జరిగినప్పుడు టప్‌మని శబ్దం వచ్చిందని చెప్పడం, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను సైతం దాడి జరిగినప్పుడు పెద్ద శబ్దం వచ్చిందని చేసిన వ్యాఖ్యలు దీనికి ఊతం ఇస్తున్నాయి. అంబేడ్కర్ విగ్రహం ప్రారంభం నుంచి ఓ సామాజిక వర్గం వారు ముఖ్యమంత్రి పైన కక్షపెంచుకోవడంతోపాటు, విజయవాడలో బస్సుయాత్రలో వచ్చిన జనాదరణ చూసి తట్టుకోలేక ఈ దుశ్చర్యకు ఒడికట్టినట్లు, ఇందులో చంద్రబాబు, చినబాబుతోపాటు బొండా ఉమా పాత్ర ఉంటుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల టీడీపీ నాయకులు చేసిన వ్యాఖ్యలు ఈ దాడికి ఊతం ఇచ్చేలా ఉన్నాయి. ఇటీవల కొంత మంది టీడీపీ నేతలు విజయవాడలో సీక్రెట్‌గా తిరిగి వెళ్లినట్లు నిఘా వర్గాలు గుర్తించి వారి కదిలికలను నిశితంగా పరిశీలిస్తున్నాయి. వివేకానంద స్కూల్ యజమాన్యంలో టీడీపీ సానుభూతిపరులు ఇద్దరు డైరెక్టర్‌లుగా ఉన్నారు. వారి పాత్రపైన ఆరాతీస్తున్నారు. టీడీపీ కార్యాలయంలో కూత వేట దూరంలో ఉండటం, బొండా ఉమా, అతని అనుచరులకు నేర చరిత్ర ఉన్న నేపథ్యంలో పోలీసులు వారి కదిలికలపైన దృష్టి పెట్టారు. మొత్తం మీద పోలీసులు కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

**మూడు సెల్‌ఫోన్ టవర్ల డేటా సేకరణ**

దాడి జరిగిన ప్రదేశానికి చుట్టుపక్కల ఉన్న మూడు సెల్‌ఫోన్ల టవర్‌ల నుంచి పోలీసులు డేటా సేకరించినట్లు తెలిసింది. సుమారు 20 వేల ఫోన్లు ఆ సమయంలో యాక్టివ్‌గా ఉన్నాయని వీటిని పోలీసులు విచారణ చేస్తున్నారు. అలాగే కొన్ని నివాసాల ముందు స్థానికులు ఏర్పాటుచేసుకున్న సీసీ కెమెరాలు, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వచ్చిన సమయంలో తీసిన వీడియోలను పరిశీలిస్తున్నారు.

## క్రీడలతో వైద్యులకు ఒత్తిడి దూరం

**హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ బాబ్జీ**

గుంటూరు మెడికల్: ఆధునిక యుగంలో వైద్యులు వృత్తి జీవితంలో చాలా ఒత్తిడికి గురవుతున్నారని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ కోరుకొండ బాబ్జీ పేర్కొన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) ఆధ్వర్యంలో ఇటీవల గుంటూరు నగరంలో వైద్యులకు క్రీడా పోటీలు జరిగాయి. గుంటూరుకు చెందిన బ్రిందా బ్రెయిన్స్ వైద్యుల బృందం షటిల్‌లో విన్నర్స్‌గా, క్రికెట్‌లో రన్నర్స్‌గా నిలిచారు. వీరిని సన్మానించేందుకు బ్రిందా బ్రెయిన్స్ చాంపియన్స్ మీట్ స్థానిక బ్రాడీపేటలోని గ్రాండ్ నాగార్జున హోటల్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వీసీ డాక్టర్ బాబ్జీ మాట్లాడుతూ క్రీడల ద్వారా వైద్యుల్లో ఉన్న ఒత్తిడి దూరమవుతుందన్నారు. వైద్యులు నిత్యం రోగుల ఆరోగ్యంపైనే కాకుండా కొంత సమయాన్ని తమ ఆరోగ్యం కోసం వెచ్చించాలని సూచించారు. బ్రింద బ్రెయిన్స్ టీమ్ వైద్యులు క్రీడల్లో బాగా రాణిస్తున్నారని, వైద్యులను ప్రోత్సహిస్తున్న టీమ్ లీడర్, బాహుబలి న్యూరో సర్జన్ డాక్టర్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డిని అభినందించారు. సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ వేమూరి రామతారక్‌నాథ్ మాట్లాడుతూ వైద్యులకు క్రీడలు ఎంతో ఉపయోగం చేస్తాయని చెప్పారు. టీమ్ లీడర్ డాక్టర్ భవనం హనుమశ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వైద్యులంతా ఐక్యంగా ఉండి క్రీడా స్ఫూర్తి కలిగి ఉన్నారని, అందువల్లే తాము షటిల్ విన్నర్స్‌గా నిలిచామని తెలిపారు. ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఆవుల శ్రీనివాస్ మాట్లాడుతూ వైద్యుల్లో క్రీడా నైపుణ్యాలను పెంపొందించేందుకు ఐఎంఏ ఎల్లప్పుడు ముందుంటుందన్నారు. విజేతలకు బహుమతులను డాక్టర్ బాబ్జి, డాక్టర్ రామతారక్ నాథ్ అందజేశారు. అతిథులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ కె.కల్యాణ్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ సుబ్బరాయన్, సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ అయ్యప్ప, డాక్టర్ సత్యప్రవీణ్, డాక్టర్ ఫణి పాల్గొన్నారు.


వీసీ డాక్టర్ బాబ్జీని సన్మానిస్తున్న వైద్యులు

## విరామ వేళ.. వలకు భరోసా


మంగినపూడి వద్ద సముద్ర తీరంలో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ వద్ద ఒడ్డుకు చేరిన బోట్లు

**సముద్రంలో చేపల వేటపై నేటి నుంచి నిషేధం**

- జూన్ 14 అర్ధరాత్రి వరకు అమలు
- మత్స్యకారులను ఆదుకోనున్న ప్రభుత్వం
- వైఎస్సార్ మత్స్యకార భరోసా కింద ఒక్కో కుటుంబానికి రూ.10వేల సాయం
- బోట్లు, మత్స్యకారుల గుర్తింపునకు సిద్ధమైన అధికారులు

సాక్షి, మచిలీపట్నం: సముద్ర జలాలపై సాగించే చేపల వేటకు విరామం లభించింది. గంగపుత్రులు రెండు నెలల పాటు తమ వలలకు విశ్రాంతి ప్రకటించనున్నారు. మత్స్యసంపద పెరిగే కాలం కావడంతో 61 రోజుల పాటు సముద్రంలో చేపల వేటపై ప్రభుత్వం నిషేధం అమలు చేస్తోంది. ఈ నేపథ్యంలో చేపల వేట సాగించే మత్స్యకారులు నిషేధ కాలంలో ఇంటి పట్టునే ఉండనున్నారు. దీంతో వీరికి ప్రభుత్వం వైఎస్ఆర్ మత్స్య భరోసా కింద ఆర్థిక సహాయం అందించనుంది. దీనికి సంబంధించి ఆ శాఖ అధికారులు ఇప్పటికే చర్యలు చేపట్టారు.

**61 రోజులు బ్రేక్..**

సముద్రంలో చేపల పునరుత్పత్తి సమయం కావడంతో కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం బంగాళాఖాతంలో వేటకు విరామం ఇవ్వాలి. ఏటా ఏప్రిల్ 15వ నుంచి నిషేధం అమలు చేస్తున్నారు. తూర్పు తీరంలోని పశ్చిమ బెంగాల్ నుంచి తమిళనాడులోని కన్యాకుమారి వరకూ సముద్రంలో చేపల వేటపై నిషేధం ఆదివారం అర్ధరాత్రి నుంచే అమల్లోకి వస్తుంది. జూన్ 14వ తేదీ అర్ధరాత్రి వరకూ (61 రోజులు) ఇది అమల్లో ఉంటుంది. ఈ నేపథ్యంలో సోమవారం నుంచి చేపల వేట నిషేధం అమలుకు పోలీసుల సహకారంతో మత్స్యశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే జిల్లాలోని మత్స్యకారులు సముద్రంలో వేట ముగించుకుని తమ బోట్లతో ఒడ్డుకు చేరుకున్నారు.

**వేట విరామ భృతి..**

సముద్రంలో చేపల వేటపై నిషేధం కారణంగా ఉపాధి కోల్పోనున్న మత్స్యకారులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేట విరామ భృతిని అందిస్తోంది. ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున సాయం చేస్తోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వేట నిషేధ భృతి కేవలం రూ.4 వేలు మాత్రమే ఉండగా దీనిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం రూ.10వేలకు పెంచి, వైఎస్సార్ మత్స్యకార భరోసా పేరిట 2019 నుంచి అందిస్తోంది. ఈ ఏడాది కూడా సాయం అందించేందుకు మత్స్యశాఖ అధికారులు చేపల వేట సాగించే బోట్లకు ఫొటోలు తీసుకుని, లబ్ధిదారుల వివరాలు నమోదు చేసే చర్యలు చేపట్టనున్నారు.

**సాయం చేసేందుకు గుర్తింపు..**

వైఎస్సార్ మత్స్యకార భరోసా పేరిట సాయం అందించేందుకు 18 మీటర్ల వరకూ పొడవు ఉన్న మెకనైజ్డ్ బోట్‌కు యజమాని మినహా 8 మందికి, మోటరైజ్డ్ బోట్లకు యజమానితో కలిపి ఆరుగురికి, సంప్రదాయ బోట్లకు ముగ్గురు చొప్పున మత్స్యకారులను అర్హులుగా ఎంపిక చేస్తారు. ప్రభుత్వ సాయం పొందేందుకు బోట్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, ఫిషింగ్ లైసెన్స్, ఆధార్ కార్డు, రైస్ కార్డు, బ్యాంక్ అకౌంట్, సెల్ నంబర్ వివరాలను అందజేయాల్సి ఉంటుంది.

**కృష్ణా జిల్లా వివరాలు..**

- సముద్ర తీరప్రాంత మండలాలు: మచిలీపట్నం, నాగాయలంక, కృత్తివెన్ను, కోడూరు
- సముద్ర తీరం: సుమారు 111 కిలోమీటర్లు
- మత్స్యకార ఆవాసాలు : 64
- మత్స్యకారుల జనాభా: 85వేలు
- సముద్రంలో చేపల వేట సాగిస్తున్న వారు: 12వేలు
- మొత్తం బోట్లు : 2,256
- వీటిలో మెకనైజ్డ్ బోట్లు : 92
- మోటరైజ్డ్ బోట్లు: 2,091
- సంప్రదాయ బోట్లు : 73
- ఏటా మత్స్య సంపద టర్నోవర్: 40,600 టన్నులు చేపలు, 11,390 టన్నుల రొయ్యలు
- మత్స్య సంపద విలువ: సుమారు రూ.510కోట్లు

**లబ్ధిదారుల గుర్తించే చర్యలు చేపట్టాం..**



నేటి నుంచి సముద్రంలో చేపల వేటపై నిషేధం అమలులోకి వచ్చింది. మత్స్యకార భరోసా సాయం అందించేందుకు లబ్ధిదారులను గుర్తించేందుకు చర్యలు చేపట్టాం. వేట నిషేధాన్ని ఎవరైనా ఉల్లంఘిస్తే ఆంధ్రప్రదేశ్ మెరైన్ రెగ్యులేషన్ చట్టం–1994 ప్రకారం చర్యలు తీసుకుంటాం. చేపలు, పడవలు స్వాధీనం చేసుకుని జరిమానా విధిస్తాం. తీరంలో చేపలు అమ్మకాలు, ప్యాకింగ్ చేయరాదు. వేట నిషేధంపై మత్స్యకారులు, వ్యాపారులకు నోటీసులు అందించాం. వీటిపై అవగాహన కల్పిస్తున్నాం.
– వి. శివ సాంబరాజ్యం, జిల్లా మత్స్యశాఖ అధికారి(జేడీఎఫ్), కృష్ణా జిల్లా

మంచిమాట

# ధర్మం అంటే..?

**ప్రకృతి ఎలా ప్రవర్తించాలి, ప్రాణి కోటి ఎలా ప్రవర్తించాలో తెలియజేసేదే ధర్మం. అది మార్పు చెందే ప్రసక్తే ఉండదు. మనిషికి ఆధ్యాత్మికోన్నతి అందించేదే ధర్మం. మానవ ధర్మాల్లో ముఖ్యమైనవి- నిగ్రహం, ప్రేమ, సంతృప్తి, త్యాగం, అలాగే మనిషిని దహింప జేసేవి- అత్యాశ, ద్వేషం, పరదూషణ, పగ. మనిషి ఆధ్యాత్మిక కర్మలను ధర్మబద్ధంగా ఆచరించినప్పుడే తనను, సమాజాన్ని, ఇతర ప్రాణుల్ని, ప్రకృతిని, ప్రపంచాన్ని రక్షించగలుగుతాడు. ధర్మం అనేది లేకపోతే పై వాటికి రక్షణ లేదు.**

మానవునికి ధర్మాచరణ ముఖ్యం, తాను జీవిస్తున్న సమాజ భద్రతకు, తన జీవన క్రమశిక్షణకు మానవుడు విధిగా ఆచరించవలసిన కొన్ని విశేష ధర్మాలను భాగవతం చెప్పింది. సత్యనిష్ఠ, దయాగుణం, తపస్సు, మనోనిగ్రహం, ఇంద్రియ నిగ్రహం, త్యాగం, నిజాయితీ, నిష్కపటం, ఓర్పు, వినయం మొదలైనవి ప్రతి వ్యక్తి పాటించవలసిన ఉత్తమ ధర్మాలు. ఇవి వ్యక్తిగతంగా తనకే గాక తాను జీవిస్తున్న సమాజానికి, సర్వమానవాళికి కూడా శ్రేయస్సును కలిగిస్తాయి.

మానవులకు, జంతువులకు, వస్తువులకు పరమాత్మ ధర్మాలను నిర్దేశించాడు. వినయం, సహనం, ఆచారం, పరాక్రమం మనిషికి సంస్కారం అందించే సాధనాలు. తనకు నచ్చని అంశాలను పరులమీద రుద్దకుండా చేయటం ధర్మం. తన దారిలో ఎవరి మాట వినకుండా ముందుకు నడవడం అధర్మం.



అగ్ని వేడిని, నీరు చల్లదనాన్ని అందిస్తాయి. సింహం గర్జిస్తుంది. అటు ఇటూ పరుగెత్తుతూ చపలత్వాన్ని ప్రదర్శించడం లేడి లక్షణం. ఈ రకంగా ప్రతిదీ తన ధర్మాన్ని పాటింపజేయడం కేవలం పరమాత్మ సృజన. ఆయన సంకల్పం లేనిదే మానవ ధర్మం మృగ్యమే. ప్రతి పనిలో మనిషి అభివృద్ధిని ఆశిస్తాడు. అది సాధించాలంటే కఠోర సాధన అవసరం. సాధనే ధర్మం. అది మనిషిని పతనం కానివ్వకుండా కాపాడుతుంది.

ధర్మాచరణ వ్యక్తి మనఃస్థితిని బట్టి ఆధారపడి వుంటుంది. తన వ్యక్తిగత ధర్మాన్ని విడిస్తే అది అభివృద్ధిని నిరోధిస్తుంది. అటువంటి వ్యక్తికి సుఖ సంతోషాలు, శాంతి లభించవు. ప్రతి వ్యక్తి ధర్మాన్ని రక్షించాలి. ప్రతి పనినీ ధర్మబద్ధంగా చేయాలి. ధర్మాచరణను కొనసాగించాలి. 'ధర్మో రక్షతి రక్షితః'. ధర్మాన్ని ఎవరు రక్షిస్తాడో, అట్టి వ్యక్తిని ధర్మమే కాపాడుతుంది. ధర్మానికి హాని చేసేవాడిని ధర్మమే హత మారుస్తుంది.

కొలిమిద్వారా పుట్టిన వేడివల్ల ఇనుము వేడెక్కుతుంది. బంగారం శుద్ధి అవుతుంది. అట్లే ధర్మాచరణ వ్యక్తిని, మనసును శుద్ధిపరుస్తుంది.

ఎవరూ వేలెత్తి చూపకుండా ఉండేలా చేసుకోవాలి గాని అధర్మం చేస్తూ ఇతరులను భయపెట్టకూడదు. ఎంత సంపాదించినా పైకి తీసుకొని పోయేటపుడు కేవలం పాపపుణ్యాలే కాని మణి మాణిక్యాలు కావు. మన తర్వాత ఉన్నవాళ్లు మనం సంపాదించింది తింటారో తినరో వారికే విధంగా విధి రాసి ఉందో తెలియదు. వారికి భగవంతుడే విధంగా తినే ప్రాప్తిని రాసి పెట్టాడో వారు అలానే ఉంటారు. కనుక రాబోయే తరాలకు నువ్వు సంపాదించి ఇచ్చే తాపత్రయం పెంచుకోకూడదు.

ధర్మం అంటే పరస్పర రక్షణ. దాన్ని ఆచరించి, రక్షించే ఉత్తమ యోగ్యతనీ బాధ్యతనీ మనిషికి భగవంతుడు ప్రసాదించాడు. ధర్మాన్ని ఎవరు రక్షిస్తారో వారిని ధర్మం రక్షిస్తుంది. అదే ధర్మో రక్షతి రక్షితః. ధర్మం వల్ల అన్నీ సాధ్యమౌతాయి:

ధర్మాచరణ వలన అర్థ ప్రాప్తి, ధర్మాచరణం వల్లనే సుఖం, ధర్మం వల్లనే సమస్తం సాధించవచ్చని ధర్మ సారమే ఈ విశ్వమన్న సత్యం మనకు తెలుస్తోంది.

స్వధర్మానికి బాధ కలిగించేది-విధర్మం, ఇతరుల ప్రేరణచే ఇతరుల ధర్మాన్ని ఆచరించేది - పరధర్మం, భగవంతుడి పట్ల విశ్వాసరహితులైన వారు చేసేది, చెప్పేది - ఉపధర్మం. తన ధర్మాన్ని నిర్లక్ష్యం చేయడం, చెప్పబడిన ధర్మానికి విపరీతార్థాలను తీసి వివరించడం అనే అయిదు 'అధర్మాలు' త్యజించవలసినవిగా వేదవ్యాసుడు పేర్కొన్నాడు. కరుణ, ఆదర్శ గృహస్థ జీవనం, నిత్యకర్మాచరణశీలత లోక కల్యాణకారకాలు, భగవద్భక్తి మార్గ నిర్దేశాలు. వీటిని మరవడం మన ధర్మాన్ని మనం మరచిపోవడమేనన్నది సత్యం.

– తరిగొప్పుల వీఎల్లెన్ మూర్తి

ధర్మరాజు యుద్ధంలో 'అశ్వత్థామ హతః' అని చెప్పడం, యుద్ధంలో భీమసేనుడు దుర్యోధనుణ్ణి గదతో తొడలపై మోదడం, కర్ణుడు నేలపై ఉండగా సంహరించడం, ధర్మవిరుద్ధాలు కావా అనే సందేహం కలుగుతుంది. ధర్మాన్ని ధర్మంతో, అధర్మాన్ని అధర్మంతో ఎదుర్కోవాలని భగవద్గీతలో శ్రీ కృష్ణుడు తెలియజెప్పాడు. శాస్త్రోక్తమైన ధర్మాచరణ చేసేవారే మహాత్ములని శంకరులు తమ భాష్యంలో తెలిపారు. ఈ లోకంలో అచంచలమైనది, స్థిరమైనది ధర్మం ఒక్కటే అన్నారు వివేకానంద. ధర్మం సారమే ఈ జగత్తు అన్నాడు గౌతమ బుద్ధుడు.

బౌద్ధవాణి

# నిద్రకు దూరం చేసే పనులు

ఈర్ష్య, అసూయ, ద్వేషం- ఈ మూడు దుర్గుణాలు మూర్తీభవించినవాడు చలమదీప్తుడు. తానే పెద్ద తత్వవేత్తననీ, తన కంటే గొప్ప ప్రబోధకుడు ఎవరూ లేరని, తాను గురువులకే గురువని భ్రమించేవాడు. ఇతరుల్ని ఎవ్వరినీ గౌరవించేవాడు కాదు. అతని శిష్యుడు అహితుడు అన్నింటా గురువుని మించిన శిష్యుడే! రాజగృహ నగరానికి ఉత్తర దిక్కులో ఉన్న ఒక పర్వతంపై అతని నివాసం. తనకంటే బుద్ధునికి ఎక్కువ కీర్తి ప్రతిష్ఠలు కలగడం అతనిలో కోపాన్ని పెంచింది. కుటిలత్వాన్ని రేపింది. బుద్ధుణ్ణి ఇబ్బందుల పాలు చేయాలనీ, అపకీర్తి కలిగించాలనీ పథకం వేశాడు. అలా చేస్తే తనకు అధిక గౌరవ మర్యాదలు కలుగుతాయని నమ్మాడు. వెంటనే తన ప్రియ శిష్యుడు అహితుణ్ణి పిలిచి, తన మనస్సులోని పథకాన్ని చెప్పాడు. అహితుడు అందుకు అంగీక రించి, నగరంలోకి నడిచాడు.

ఆరోజు ఒక రాజపురోహితుడు బుద్ధునికీ, బుద్ధ సంఘానికీ ఆతిథ్యం ఇచ్చాడు. బుద్ధుడు భిక్ష స్వీకరించాక ధర్మోపదేశం ప్రారంభించాడు. ఆ సమయానికి అహితుడు అక్కడికి చేరాడు. ఉపదేశానంతరం బుద్ధునికి నమస్కరించి "భగవాన్! నన్నూ మీ భిక్షుసంఘంలో చేర్చుకోండి" అని వేడుకున్నాడు. బుద్ధుడు అంగీకరించాడు.

కొన్నాళ్ళు గడిచింది. ఒకరోజు బుద్ధుడు తన భిక్షుసంఘంతో కలసి నగరంలో భిక్షార్థం బయలుదేరాడు. తన భిక్షా పాత్రను తీసుకోవడానికి చేశాడు. అది కనిపించలేదు. ఆరామం బయట ద్వారం దగ్గర నిలబడిన అహితుడు అటూ ఇటూ చూస్తూ–"భగవాన్! మీ భిక్షాపాత్ర కోసం నేను వెదకనా?" అని అడిగి ఆరామం నలుమూలలా చూశాడు. బుద్ధుడు అతని వంక చూసి, చిరునవ్వు నవ్వాడు. "అహితా! వెదకనవసరం లేదు. పద" అంటూ బయటకు నడచాడు. బుద్ధుని వెనకే అహితుడు నడచాడు. భిక్షు సంఘం రాజగృహ నగరానికి వెళ్ళే దారిలో ఒక తటాకం ఉంది. బుద్ధుడు ఆ తటాకం వైపు నడచాడు. అది చూసి అహితుడు. 'నేను ఆ భిక్షాపాత్రను, పగులగొట్టి, ఈ తటాకంలో పడవేసిన విషయం బుద్ధునికి తెలిసింది' అని భయపడ్డాడు.

బుద్ధుడు తటాకం లో దిగి విశాలమైన తామరాకుని తుంచి, దాన్ని, శుభ్రపరిచాడు. దాని అంచులు గిన్నెలా మలిచాడు. ఆరోజు బుద్ధుని భిక్షాపాత్ర అది! మరో రెండు రోజులు గడిచాయి.

ఒకరోజు రాత్రి బుద్ధుడు పడుకోడానికి తన సంఘాటి (దుప్పటి) కోసం చూశాడు. అది కనిపించలేదు. బుద్ధుడు అలా వెదకడం గమనిస్తూనే, లోలోపల నవ్వుకుంటున్నాడు అహితుడు. అంతలో... "అహితా!" అనే బుద్ధుని పిలుపు విని ఉలిక్కిపడ్డాడు అహితుడు. "భగవాన్! సెలవియ్యండి" అన్నాడు అతివినయంగా "నీకు సంఘాటి ఉందిగా" అని అడిగాడు.

"భగవాన్! ఉంది" "నీవు పక్క పరుచుకొని పడుకో" అని, నేలను శుభ్రం చేసుకుని, తన చీవరాన్ని పక్కగా పరచుకుని బుద్ధుడు పడుకున్నాడు. ఆ రాత్రి బుద్ధునితో సహా భిక్షువులందరూ హాయిగా నిద్రపోయారు. అహితునికి కంటిమీద కునుకే రాలేదు. వేకువ కాకముందే లేచి, తన గురువు చలమదీప్తుని దగ్గరకు వెళ్లి చేరాడు. తెల్లారింది. "అహితుడు ఏమయ్యాడు?" అని అందరూ ఆలోచించసాగారు.



ఇంతలో... "అదిగో... అటు చూడండి. అహిత భిక్షు ఎవరినో తీసుకుని వస్తున్నాడు" అన్నాడు ఒక భిక్షువు. అహితుడు తన గురువును వెంటబెట్టుకుని వచ్చాడు. ఇద్దరూ బుద్ధుని పాదాలకు నమస్కరించారు. "భగవాన్! మీ మీద క్రోధంతో, అసూయ తో వచ్చాను. మీ భిక్షాపాత్ర నేనే పగులగొట్టాను. మీ సంఘాటిని తుప్పల్లో దాచాను. ఆ విషయం మీరు గ్రహించారు. అయినా నన్ను మందలించలేదు. అందరిముందు అవమానం చేయలేదు. ఈ పనులు చేసిన రెండుసార్లూ నేను నిద్రకు దూరమయ్యాను. మనశ్శాంతి కోల్పోయాను. తప్పు తెలుసుకున్నాను. ద్వేషం కంటే ప్రేమ గొప్పదని తెలుసుకున్నాను. వెళ్ళి మా గురువు గారికి విషయం చెప్పాను. మేమిద్దరం తప్పు తెలుసుకున్నాం. మీ శరణు వేడుకుంటున్నాం" అన్నాడు అహితుడు.

బుద్ధుడు ప్రేమతో వారిని దగ్గరకు పిలిచి భిక్షు దీక్ష ఇచ్చాడు.

– డా. బొర్రా గోవర్ధన్

గృహస్థాశ్రమ వైశిష్ట్యం

# స్నాతక పాఠం అంటే..?

ఒక వయసులో ఒక స్త్రీ ఒక పురుషుడికి నచ్చిందనీ, ఒక పురుషుడు ఒక స్త్రీకి నచ్చాడనీ...కాబట్టి కలసి జీవించడం... అనేది శాస్త్ర సమ్మతం కాదు. కాలం గడిచేకొద్దీ ధనం వెళ్ళిపోతుంది, నీ వాళ్ళనుకున్న వాళ్ళు వెళ్లిపోతారు, అధికారం పోతుంది, జ్ఞాపకశక్తి కూడా పోతుంది.. అన్నీ పోతాయి... అలాగే యవ్వనం కూడా. కానీ మిగిలిపోయేది ఏదయినా ఉంటే.. ఆ వ్యక్తి ధార్మికంగా బతికాడా..అన్నదే! పెళ్ళి ఎందుకు చేస్తున్నారు, వారిద్దర్నీ ఎందుకు కలుపుతున్నారు... ప్రస్థానం అంటే వారిద్దరూ కలిసి ఏం చేయాలి? అన్న దాని గురించి అవగాహన కల్పించడం కోసం గృహస్థాశ్రమ స్వీకారానికి ముందు గురువుని తీసుకొచ్చి మంచి విషయాలు చెప్పిస్తారు. దానిని స్నాతక పాఠం అంటారు. స్నాతక పాఠంగా కాకపోయినా పెద్దల్ని తీసుకొచ్చి "మీరు వివాహం చేసుకోవాలి. ఇద్దరూ అన్యోన్యంగా బతకడం మీద ఎన్నో జీవితాల అభ్యున్నతి ఆధారపడి ఉంది. ఈ ఏర్పాటు మీ వ్యక్తిగత జీవితం కోసం మాత్రమే కాదు సుమా! మీ పెద్దల కీర్తి ప్రతిష్ఠలు, నీ తోబుట్టువుల తృప్తి, మీ బిడ్డల భవిష్యత్తు.. ఇలా చాలా ముడిపడి ఉన్నాయి. ఇది తొందరపడి తీసుకునే నిర్ణయం కాదు. దీనిని మీరు లోతుగా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది" అని అవగాహనపరిచే ప్రయత్నం చేస్తారు. అది సనాతన ధర్మానికి ఉన్న గొప్పదనం.



అన్నపానీయాలుగానీ, మరేవయినాగానీ వాటిని సంస్కరించకుండా స్వీకరించం. అటువంటి ఒక ఏర్పాటును నీవు జీవితంలోకి ఆహ్వానిస్తున్నావు.. ఇక అక్కడి నుంచి నీ జీవితం పండవలసిన అవసరం ఉంది. ఇది బ్రహ్మచర్యం అన్న కట్టువిప్పి గృహస్థాశ్రమం అన్న కొత్త కట్టు వేయడం కాదు. బ్రహ్మచర్యం అన్న కట్టు విప్పేయడం అన్నమాట ఉండదు. కారణం – ఆ ఆశ్రమంలో క్రమశిక్షణ, విద్యాభ్యాసం, గురువుపట్ల చూపే గౌరవమర్యాదలు ...ఇవన్నీ ఉన్నాయి.

గృహస్థాశ్రమంలోకి వచ్చినప్పుడు ఆ కట్టుబాటు ఎటు పోయింది? ఎటూ పోలేదు. దాని మీద మరో కట్టు వచ్చి చేరింది. కట్టుమీద కట్టు. పొలంలో పచ్చిగడ్డికోసి మోపు కట్టిన తండ్రిని చూసి కొడుకు "మోపు గట్టిగా కట్టలేదు" అంటే తండ్రి బాధపడతాడని... "అది వదులుగా ఉన్నట్లుంది. ఎందుకైనా మంచిది, మరో కట్టు వేస్తాను" అని మోపును మోకాళ్ళతో అదిమి గట్టిగా కట్టి తలమీద పెట్టుకుని ఇంటి బాట పడతాడు. తండ్రి వేసిన కట్టును విప్పి ఆయనను అగౌరవ పరచలేదు. ఆ కట్టు వదులుగా ఉన్నందువల్ల ఎక్కడో దానంతట అదే జారిపోయింది. అంతే.గృహస్థాశ్రమం అన్న కట్టు వేసినప్పుడు బ్రహ్మచర్య నియమాలు జారిపోతాయి తప్ప బ్రహ్మచర్యంలో ఏ బంధాలున్నాయో అవి, అక్కడ అలవర్చుకున్న సంస్కారం మాత్రం జీవితాంతం ఉంటాయి. ఎప్పటికప్పుడు ఎలా సంస్కరిస్తే వ్యక్తి జీవితాన్ని పండించుకుంటాడో దానికి అవసరమయిన విషయాలను అందించి ఆశ్రమాన్ని మారుస్తారు.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

## సినిమా

# పంచుకో...




● రాశీఖన్నా, తమన్నా

తమిళ చిత్ర పరిశ్రమలో 'అరణ్మనై' సూపర్ హిట్ ఫ్రాంచైజీగా నిలిచింది. ఈ ఫ్రాంచైజీలో రూపొందిన తాజా చిత్రం 'అరణ్మనై 4'. సుందర్ సి. లీడ్ రోల్‌లో నటించి, దర్శకత్వం వహించారు. తమన్నా, రాశీఖన్నా హీరోయిన్లుగా నటించారు.

అవ్ని సినిమాక్స్‌పై ఖుష్బు సుందర్, ఏసీఎస్ అరుణ్ కుమార్ నిర్మించారు. ఈ మూవీని 'బాక్' పేరుతో ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎల్ఎల్‌పీ తెలుగులో విడుదల చేస్తోంది. ఈ నెల 26న 'బాక్'ని రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. హిప్‌హాప్ తమిళ సంగీతం అందించారు. కాగా ఈ సినిమాలో తమన్నా, రాశీఖన్నాలపై చిత్రీకరించిన 'పంచుకో...' అంటూ సాగే తెలుగు వెర్షన్ ప్రోమో వీడియో సాంగ్‌ని రిలీజ్ చేశారు. ఈ పాటకి సాహితి లిరిక్స్ రాయగా, రాఘవి పాడారు. తమన్నా, రాశీఖన్నాల గ్లామర్ ఈ పాటకు మరింత అందాన్ని తీసుకొచ్చాయి.

"హారర్ కామెడీ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'బాక్'. ఇటీవల ఈ మూవీ నుంచి విడుదల చేసిన అన్ని ప్రధాన పాత్రల ఫస్ట్ లుక్ పోస్టర్‌లకు అనూహ్య స్పందన వచ్చింది. సినిమా కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉంది" అని చిత్రబృందం పేర్కొంది. 'వెన్నెల' కిషోర్, శ్రీనివాసులు, ఢిల్లీ గణేష్, కోవై సరళ కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి కెమెరా: ఇ.కృష్ణమూర్తి అకా కిచ్చ.

# కుటుంబ కథాచిత్రం



● రాజేంద్ర ప్రసాద్

రాజేంద్ర ప్రసాద్, బ్రహ్మానందం, 'శుభలేఖ' సుధాకర్ కీలక పాత్రల్లో రామ్ కిరణ్, మేఘా ఆకాష్ జంటగా నటిస్తున్న చిత్రం 'సఃకుటుంబానాం'. ఉదయ్ శర్మ దర్శకత్వం వహిస్తున్నారు. హెచ్ఎన్‌జీ సినిమాస్‌పై హెచ్ మహాదేవ గౌడ్ నిర్మిస్తున్న ఈ మూవీ ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ఈ సందర్భంగా ఉదయ్ శర్మ మాట్లాడుతూ– "రేషన్ కార్డులాగా ఉన్న ఫస్ట్ లుక్‌కి చాలా మంచి స్పందన వచ్చింది. మా సినిమాలో చాలా మంచి కంటెంట్ ఉంది. ఎంతో మంది సీనియర్స్ నటిస్తున్నారు. ఈ సినిమాకి మణిశర్మగారి మ్యూజిక్ హైలెట్" అన్నారు. "సఃకుటుంబానాం' మంచి క్రియేటివిటీతో కూడిన కుటుంబ కథా చిత్రం అవుతుందనే నమ్మకం ఉంది" అన్నారు మహాదేవ గౌడ్. ఈ చిత్రానికి కెమెరా: మధు దాసరి.

# గ్రీన్‌సిగ్నల్

మలయాళ చిత్రం 'డియర్ స్టూడెంట్స్' సినిమాకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు నయనతార. మలయాళ నటుడు నివిన్ పౌలి నటించనున్న చిత్రం 'డియర్ స్టూడెంట్స్'. ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటించనున్నారామె. ఈ విషయాన్ని మేకర్స్ అధికారికంగా ప్రకటించి, 'డియర్ స్టూడెంట్స్' చిత్రంలో నయనతార నటిస్తున్నట్లు ఓ మోషన్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. సందీప్ కుమార్ అండ్ జార్జ్ ఫిలిప్ రాయ్ ద్వయం ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నారు. నివిన్ పౌలికి చెందిన పౌలి జూనియర్ పిక్చర్స్, కర్మ మీడియా నెట్‌వర్క్ ఎల్ఎల్‌పీ, రౌడీ పిక్చర్స్ అండ్ అల్ట్రా కలిసి 'డియర్ స్టూడెంట్స్' చిత్రాన్ని నిర్మించనున్నాయి.



● నయనతార

# మాటలు రావడం లేదు!

"అమర్‌సింగ్ చంకీల' సినిమా అద్భుతంగా ఉంది. అమర్‌సింగ్ పాత్రలో దిల్జిత్ దొసాంజ్ ఒదిగిపోయారు. ఎంత అద్భుతంగా నటించారో చెప్పడానికి మాటలు రావడం లేదు" అన్నారు 'యానిమల్' మూవీ ఫేమ్ త్రిప్తి దిమ్రి. పంజాబీ గాయకుడు అమర్ సింగ్ చంకీల(27 ఏళ్లకే హత్య చేయబడ్డారు) బయోపిక్‌గా రూపొందిన చిత్రం 'అమర్‌సింగ్ చంకీల'. ఇంతియాజ్ అలీ దర్శకత్వం వహించిన ఈ మూవీలో పరిణీతీ చోప్రా, దిల్జిత్ దొసాంజ్ లీడ్ రోల్స్ చేశారు. ఈ నెల 12న నెట్‌ఫ్లిక్స్‌లో 'అమర్‌సింగ్ చంకీల' విడుదలైంది. అయితే బాలీవుడ్ సినీతారల కోసం ముంబయ్‌లో స్పెషల్ స్క్రీనింగ్ ఏర్పాటు చేశారు. ఈ చిత్రాన్ని వీక్షించిన అనంతరం త్రిప్తి దిమ్రి మాట్లాడుతూ–"చాలా రోజుల తర్వాత నేను చూసిన ఉత్తమ చిత్రమిది. అమర్ జ్యోత్ పాత్రకి పరిణీతి చక్కగా సరిపోయారు. ఇలాంటి మంచి సినిమాని మాకు అందించినందుకు ఇంతియాజ్‌కి థ్యాంక్స్" అన్నారు.



● త్రిప్తి దిమ్రి

# ఆలోచింపజేసే కాప్



● రవిశంకర్

ప్రముఖ నటుడు, డబ్బింగ్ ఆర్టిస్ట్ రవిశంకర్ ప్రధాన పాత్రలో, నిఖిల్, రాజశేఖర్, తేజ హీరోలుగా రూపొందిన చిత్రం 'కాప్'. రాధా సురేష్ సమర్పణలో మాధవన్ సురేష్ నిర్మించారు. బి. సోము సుందరం దర్శకత్వం వహించిన ఈ చిత్రం ట్రైలర్‌ని తిరుపతి ఎస్వీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో విడుదల చేశారు. ఎస్వీ కాలేజ్ డైరెక్టర్ డా.యస్. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ– "మా కళాశాల విద్యార్థి మాధవన్ సురేష్ యూఎస్ వెళ్లి అంచలంచెలుగా ఎదిగి సినిమా నిర్మించే స్థాయికి రావడం హ్యాపీ. నితిన్ కూడా మా కాలేజ్ కుర్రాడే" అన్నారు. "శత్రుపురం, మన్యం రాజు' చిత్రాల తర్వాత నేను డైరెక్ట్ చేసిన మూడో చిత్రం ఇది" అన్నారు సోము సుందరం. "మా సినిమాని హిట్ చేయాలి" అన్నారు రాధా సురేష్. "పొలిటికల్ సెటైర్‌తో పాటు కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ చిత్రంలో మంచి సందేశం ఉంది" అన్నారు మాధవన్ సురేష్.

# కొత్త సంవత్సరం.. కొత్త ఉత్సాహం

**తమిళ నూతన సంవత్సరాది (ఏప్రిల్ 14) సందర్భంగా కోలీవుడ్‌లో కొత్త ఉత్సాహం కనిపించింది. స్టార్ హీరో సినిమాల కొత్త లుక్‌లు, సరికొత్త అనౌన్స్‌మెంట్‌లతో తమిళ చిత్ర పరిశ్రమ కళకళలాడింది. ఈ విశేషాలపై కథనం..**



● కమల్‌హాసన్

### భారతీయుడు వస్తున్నాడు

భారతీయుడు మళ్లీ వస్తున్నాడు. హీరో కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో తెరకెక్కిన 'ఇండియన్' (తెలుగులో 'భారతీయుడు') సినిమా 1996లో విడుదలై బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. తాజాగా 'ఇండియన్' సినిమాకు సీక్వెల్స్‌గా 'ఇండియన్ 2', 'ఇండియన్ 3' చిత్రాలను రూపొందించారు కమల్‌హాసన్, శంకర్. లైకా ప్రొడక్షన్స్, రెడ్ జెయింట్ మూవీస్ పతాకాలపై సుభాస్కరన్ నిర్మించారు. 'ఇండియన్ 2' ('భారతీయుడు 2') చిత్రానికి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ శరవేగంగా జరుగుతున్నాయి. మే నెలాఖరులో 'ఇండియన్ 2' ట్రైలర్, జూన్‌లో సినిమా రిలీజ్‌కి సన్నాహాలు చేస్తున్నామని చిత్ర యూనిట్ పేర్కొంది. తాజాగా ఈ సినిమా కొత్త పోస్టర్స్‌ను విడుదల చేశారు మేకర్స్. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటించిన 'ఇండియన్ 2' చిత్రంలో సిద్ధార్థ్, రకుల్‌ప్రీత్ సింగ్, ప్రియాభవానీ శంకర్, ఎస్‌జే సూర్య, బాబీ సింహా కీలక పాత్రల్లో నటించారు. ఈ మూవీకి అనిరుధ్ సంగీతం అందించారు.



● సూర్య



● రాయన్ పోస్టర్



● రాఘవా లారెన్స్



● విజయ్

### ఈ ఏడాదే కంగువ

సూర్య హీరోగా నటించిన పీరియాడికల్ సోషియో ఫ్యాంటసీ యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'కంగువ'. శివ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాలో దిశా పటానీ, బాబీ డియోల్, యోగిబాబు కీలక పాత్రల్లో నటించారు. కేఈ జ్ఞానవేల్‌రాజా, వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ చిత్రం ఈ ఏడాదిలోనే విడుదల కానున్నట్లు చిత్రయూనిట్ స్పష్టం చేసింది. డిఫరెంట్ టైమ్‌లైన్స్‌లో జరిగే ఈ చిత్రంలో సూర్య నాలుగైదు గెటప్స్‌లో కనిపిస్తారనే ప్రచారం సాగుతోంది. తాజాగా ఈ సినిమా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ సినిమాకు దేవి శ్రీ ప్రసాద్ మ్యూజిక్ డైరెక్టర్.

### విజిల్ పోడు

విజయ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్'. ఈ చిత్రంలో మీనాక్షీ చౌదరి ఓ హీరోయిన్‌గా నటిస్తున్నారు. విజయ్ ద్విపాత్రాభినయం చేస్తున్న ఈ సినిమాకు వెంకట్ ప్రభు దర్శకత్వం వహిస్తున్నారు. యువన్ శంకర్ రాజా సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'విజిల్ పోడు..' అనే పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు మేకర్స్. మదన్ కర్కే లిరిక్స్ అందించిన ఈ పాటను విజయ్, వెంకట్ ప్రభు, యువన్ శంకర్ రాజా, ప్రేమ్‌గీ ఆలపించారు. ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మిస్తున్న ఈ చిత్రం సెప్టెంబరు 5న విడుదల కానుంది.

### రాయన్ రెడీ

ధనుష్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'రాయన్'. నార్త్ చెన్నై బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ చిత్రంలో సందీప్ కిషన్, కాళిదాసు జయరాం లీడ్ రోల్స్ చేయగా, సెల్వరాఘవన్, ప్రకాష్‌రాజ్, దుషారా విజయన్, అపర్ణా బాలమురళి, వరలక్ష్మి శరత్‌కుమార్ కీలక పాత్రల్లో నటించారు. తాజాగా ఈ సినిమా నుంచి కొత్త పోస్టర్‌ను విడుదల చేసి, త్వరలోనే పాటలను రిలీజ్ చేయనున్నట్లుగా చిత్రయూనిట్ పేర్కొంది. సన్‌పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రం ధనుష్ కెరీర్‌లో 50వ చిత్రం కావడం విశేషం. ఏఆర్ రెహమాన్ సంగీతం అందించిన 'రాయన్' చిత్రం ఈ ఏడాదే విడుదల కానుందని కోలీవుడ్ సమాచారం.

### డబుల్ ధమాకా

తమిళ కొత్త సంవత్సరంలో జోష్ పెంచారు రాఘవా లారెన్స్. ఆయన హీరోగా రెండు కొత్త సినిమాలను ప్రకటించారు. వాటిలో ఒక మూవీకి 'హంటర్' అనే టైటిల్ ఖరారైంది. రాఘవా లారెన్స్ కెరీర్‌లో 25వ సినిమాగా తెరకెక్కనున్న ఈ యాక్షన్ అడ్వెంచరస్ ఫిల్మ్‌కు వెంకట్ మోహన్ దర్శకత్వం వహిస్తారు. గోల్డ్‌మైన్ టెలీ ఫిలింస్, మనీష్ షా, సత్య జ్యోతి ఫిలింస్ నిర్మించనున్న ఈ సినిమాకు దేవి శ్రీ ప్రసాద్ మ్యూజిక్ డైరెక్టర్. అలాగే 'బెంజ్' అనే కొత్త సినిమాకు కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు లారెన్స్. దర్శకుడు లోకేష్ కనగరాజ్ ఈ సినిమాకు కథ అందించారు. బక్కియరాజ్ కన్నన్ దర్శకత్వం వహించనున్న ఈ మూవీని సుధన్ సుందరం, లోకేష్ కనగరాజ్, జగదీష్ పళనిస్వామి నిర్మించనున్నారు. త్వరలోనే ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుంది.

**తమిళ నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని మరికొన్ని సినిమాల అప్‌డేట్స్ కూడా వచ్చాయి.**



## షూటింగ్‌లో భారత్‌కు 20వ ఒలింపిక్ బెర్త్

పారిస్ ఒలింపిక్స్ షూటింగ్ ఈవెంట్‌లో భారత్‌కు 20 బెర్త్ ఖరారైంది. రియో డి జనీరోలో జరుగుతున్న చివరి ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీలో మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో భారత షూటర్ పలక్ గులియా కాంస్య పతకం సాధించింది. తద్వారా భారత్‌కు ఒలింపిక్ బెర్త్‌ను అందించింది. ఎనిమిది మంది షూటర్లు పోటీపడ్డ ఫైనల్లో ఆసియా క్రీడల స్వర్ణ పతక విజేత, 18 ఏళ్ల హరియాణా అమ్మాయి పలక్ 217.6 పాయింట్లతో మూడో స్థానాన్ని దక్కించుకుంది. భారత్‌కే చెందిన మరో షూటర్ సంయమ్ 176.7 పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచింది.

## జీవన్-అర్జున్ జోడీకి డబుల్స్ టైటిల్

మొరెలోస్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్-75 టెన్నిస్ టోర్నీలో భారత్‌కు చెందిన జీవన్ నెడుంజెళియన్-అర్జున్ ఖడే జోడీ విజేతగా నిలిచింది. మెక్సికోలో జరిగిన ఈ టోర్నీ పురుషుల డబుల్స్ ఫైనల్లో జీవన్-అర్జున్ ద్వయం 7-6 (7/5), 6-4తో రెండో సీడ్ మటుస్‌జెవ్‌స్కీ (పోలాండ్)-రోమియోస్ (ఆస్ట్రేలియా) జంటపై గెలిచింది. జీవన్-అర్జున్ జోడీకి 4,665 డాలర్ల (రూ. 3 లక్షల 89 వేలు) ప్రైజ్‌మనీ, 75 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.



# ముంబైకి ముకుతాడు



రోహిత్ శర్మ

- ‘చాంపియన్స్’ సమరంలో చెన్నైదే విజయం
- 20 పరుగులతో ఓడిన ముంబై
- మెరిపించిన రుతురాజ్, దూబే, ధోని
- 4 వికెట్లతో పతిరణ విజృంభణ
- రోహిత్ శర్మ శతకం వృథా



దూబే, రుతురాజ్

**ముంబై:** ఐపీఎల్ ‘ఫైవ్ స్టార్’ చాంపియన్ల సమరంలో ముంబై ఇండియన్స్‌పై డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్‌కింగ్స్ (సీఎస్‌కే) పైచేయి సాధించింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ పతిరణ (4/28) తన పేస్‌తో ముంబైని కోలుకోలేని దెబ్బ తీశాడు. తొలుత బ్యాటింగ్ చేపట్టిన చెన్నై 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 206 పరుగుల భారీస్కోరు చేసింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (40 బంతుల్లో 69; 5 ఫోర్లు, 5 సిక్స్‌లు), శివమ్ దూబే (38 బంతుల్లో 66; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు) దంచేశారు. అనంతరం ముంబై 20 ఓవర్లలో 6 వికెట్లకు 186 పరుగులే చేసి ఓడింది. రోహిత్ శర్మ (63 బంతుల్లో 105 నాటౌట్; 11 ఫోర్లు, 5 సిక్స్‌లు) తన టి20 కెరీర్‌లో ఎనిమిదో శతకం చేసినా ఫలితం లేకపోయింది.

**దూబే, రుతురాజ్ ఫిఫ్టీ–ఫిఫ్టీ**

ఓపెనర్ రహానే (5) అవుటయ్యాక రచిన్ రవీంద్రకు జతయిన కెప్టెన్ రుతురాజ్ ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లాడు. పవర్‌ప్లేలో 48/1 స్కోరు చేయగా... కాసేపటికి రచిన్ (16 బంతుల్లో 21; 2 ఫోర్లు, 1 సిక్స్) నిష్క్రమించాడు. శివమ్ దూబే వచ్చాక చెన్నై స్కోరు, జోరు పెరిగాయి. దూబే బౌండరీలతో, రుతురాజ్ భారీ సిక్సర్లతో విరుచుకుపడటంతో 12వ ఓవర్లో చెన్నై స్కోరు 100 దాటింది. ముందుగా గైక్వాడ్ 33 బంతుల్లో, తర్వాత దూబే 28 బంతుల్లో ఫిఫ్టీలు పూర్తి చేసుకున్నారు. హార్దిక్ బౌలింగ్‌లో రుతురాజ్ అవుటవడంతో మూడో వికెట్‌కు 90 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. మిచెల్ (17) పెద్దగా మెరిపించలేదు.



పతిరణ

**ధోని 6,6,6,2....**

ప్రేక్షకుల కరతాళధ్వనుల మధ్య ఆఖరి ఓవర్లో బ్యాటింగ్‌కు దిగిన ధోని... చెన్నై ఇన్నింగ్స్‌నే కాదు తన మునుపటి శైలి సిక్సర్లతో మొత్తం వాంఖెడేను మోతెక్కించాడు. 20వ ఓవర్‌లో మిగిలిపోయిన 4 బంతుల్ని ఆడిన ధోని వరుసగా 6, 6, 6, 2లుగా బాదేయడంతో హార్దిక్ పాండ్యా వేసిన ఈ ఓవర్లో మొత్తం 26 పరుగులు వచ్చాయి.

**రోహిత్ ఒక్కడే...**

లక్ష్యానికి తగిన వేగాన్ని ఆరంభం నుంచి జతచేసిన ముంబై ఓపెనర్లు ఇషాన్ (15 బంతుల్లో 23; 3 ఫోర్లు, 1 సిక్స్), రోహిత్‌లు పవర్ ప్లే (63/0)లో ఓవర్‌కు పది పరుగుల చొప్పున సాధించారు. కానీ 8వ ఓవర్ వేసిన పతిరణ తొలి బంతికి కిషన్‌ను, మూడో బంతికి హిట్టర్ సూర్య (0)ను అవుట్ చేసి చెన్నై శిబిరాన్ని ఆనందంలో ముంచాడు. కానీ అవతలివైపు రోహిత్ 30 బంతుల్లో అర్ధసెంచరీ సాధించాడు. తిలక్ వర్మ (20 బంతుల్లో 31; 5 ఫోర్లు) వేగానికీ పతిరణే కళ్లెం వేశాడు. హార్దిక్ (2) వచ్చివెళ్లగా, రెండు సిక్సర్లతో ఇన్నింగ్స్‌కు ఊపు తెచ్చిన డేవిడ్ (13), షెఫర్డ్ (1) వెంటవెంటనే అవుట్ కాగానే ముంబై ఆశలు ఆవిరయ్యాయి.

**స్కోరు వివరాలు**

**చెన్నై సూపర్‌కింగ్స్ ఇన్నింగ్స్:** రహానే (సి) పాండ్యా (బి) కొయెట్జీ 5; రచిన్ (సి) ఇషాన్ (బి) శ్రేయస్ గోపాల్ 21; రుతురాజ్ (సి) నబీ (బి) పాండ్యా 69; దూబే (నాటౌట్) 66; మిచెల్ (సి) నబీ (బి) పాండ్యా 17; ధోని (నాటౌట్) 20; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 206. వికెట్ల పతనం:** 1-8, 2-60, 3-150, 4-186. **బౌలింగ్:** నబీ 3-0-19-0, కొయెట్జీ 4-0-35-1, బుమ్రా 4-0-27-0, ఆకాశ్ 3-0-37-0, శ్రేయస్ గోపాల్ 1-0-9-1, పాండ్యా 3-0-43-2, రొమారియో షెఫర్డ్ 2-0-33-0.

**ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్:** రోహిత్ (నాటౌట్) 105; ఇషాన్ కిషన్ (సి) శార్దుల్ (బి) పతిరణ 23; సూర్యకుమార్ (సి) ముస్తఫిజుర్ (బి) పతిరణ 0; తిలక్ వర్మ (సి) శార్దుల్ (బి) పతిరణ 31; హార్దిక్ (సి) జడేజా (బి) తుషార్ 2; టిమ్ డేవిడ్ (సి) రవీంద్ర (బి) ముస్తఫిజుర్ 13; షెఫర్డ్ (బి) పతిరణ 1; నబీ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 186. వికెట్ల పతనం:** 1-70, 2-70, 3-130, 4-134, 5-148, 6-157. **బౌలింగ్:** తుషార్ 4-0-29-1, ముస్తఫిజుర్ 4-0-55-1, శార్దుల్ 4-0-35-0, జడేజా 4-0-37-0, పతిరణ 4-0-28-4.

### ఐపీఎల్‌లో నేడు

బెంగళూరు × హైదరాబాద్
వేదిక: బెంగళూరు
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం



ధోని

## హంపికి తొలి విజయం

**టొరంటో:** క్యాండిడేట్స్ చెస్ టోర్నీ మహిళల విభాగంలో భారత నంబర్‌వన్, ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి ఖాతాలో తొలి గెలుపు చేరింది. భారత్‌కే చెందిన గ్రాండ్‌మాస్టర్ వైశాలితో జరిగిన ఎనిమిదో రౌండ్ గేమ్‌లో హంపి 63 ఎత్తుల్లో గెలుపొందింది. ఓపెన్ విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్ గుకేశ్ మూడో విజయాన్ని అందుకున్నాడు. భారత్‌కే చెందిన విదిత్‌తో జరిగిన ఎనిమిదో రౌండ్ గేమ్‌లో గుకేశ్ 38 ఎత్తుల్లో నెగ్గాడు. అలీరెజా (ఫ్రాన్స్)తో జరిగిన గేమ్‌ను భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద 40 ఎత్తుల్లో ‘డ్రా’ చేసుకున్నాడు. .

## భారత రెజ్లర్లకు 4 పతకాలు

**బిష్కెక్:** ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్ మహిళల ఫ్రీస్టయిల్ విభాగంలో ఆదివారం భారత రెజ్లర్లు నాలుగు పతకాలు సొంతం చేసుకున్నారు. అంజూ (53 కేజీలు), హర్షిత (72 కేజీలు) రజత పతకాలు ... మనీషా (62 కేజీలు), అంతిమ్ కుండు (65 కేజీలు) కాంస్య పతకాలు గెల్చుకున్నారు.



సాల్ట్

# సూపర్ సాల్ట్...

- 47 బంతుల్లో 14 ఫోర్లు, 3 సిక్స్‌లతో 89 నాటౌట్
- లక్నోపై 8 వికెట్లతో కోల్‌కతా ఘనవిజయం

**కోల్‌కతా:** మిచెల్ స్టార్క్ (3/28) నిప్పులు చెరిగే బౌలింగ్... ఓపెనర్ ఫిల్ సాల్ట్ (47 బంతుల్లో 89 నాటౌట్; 14 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపులు... వెరసి ఐపీఎల్‌లో మాజీ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) అలవోక విజయంతో మళ్లీ గెలుపుబాట పట్టింది. ఈడెన్ గార్డెన్స్‌లో ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో శ్రేయస్ అయ్యర్ బృందం 8 వికెట్ల తేడాతో లక్నో సూపర్ జెయింట్స్‌పై జయభేరి మోగించింది. ముందుగా సూపర్‌జెయింట్స్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 161 పరుగులు చేసింది. టాపార్డర్‌లో ఒక్క కెప్టెన్ రాహుల్ (27 బంతుల్లో 39; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) మాత్రమే మెరుగ్గా ఆడాడు. డికాక్ (10) ఇంపాక్ట్, వన్‌డౌన్‌లో దీపక్ హుడా (8)ను దించిన ఎత్తుగడలేవీ ఫలించలేదు. స్టొయినిస్ (10) కూడా నిరాశపరిచాడు. ఆయుశ్ బదోని (27 బంతుల్లో 29; 2 ఫోర్లు, 1 సిక్స్), నికోలస్ పూరన్ (32 బంతుల్లో 45; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు)లు చేసిన పరుగులతో లక్నో 150 పైచిలుకు స్కోరు చేసింది. బ్యాట్‌తో చెలరేగిపోతున్న సునీల్ నరైన్ (4-0-17-1) బంతితో లక్నోను కట్టిపడేశాడు. అనంతరం కోల్‌కతా 15.4 ఓవర్లలోనే రెండే వికెట్లు కోల్పోయి 162 పరుగులు చేసి గెలిచింది. అయితే లక్ష్యఛేదనకు దిగగానే కోల్‌కతాను మోసిన్ కష్టాల్లో పడేశాడు. ఓపెనర్ నరైన్ (6), రఘువంశీ (7)లను వరుస ఓవర్లలో పెవిలియన్ చేర్చాడు. అప్పటికి జట్టు స్కోరు 42/2 మాత్రమే! ఈ దశలో ఓపెనర్ సాల్ట్, అయ్యర్ లక్నో బౌలింగ్‌ను తుత్తునియలు చేస్తూ బ్యాటింగ్ కొనసాగించారు. మరో వికెట్ తీసే అవకాశమే ఇవ్వకుండా అభేద్యమైన మూడో వికెట్‌కు 120 పరుగుల్ని వేగంగా జతచేయడంతో నైట్‌రైడర్స్ 16వ ఓవర్ పూర్తవకముందే గెలిచింది. ‘ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్’ సాల్ట్ 26 బంతుల్లోనే అర్ధసెంచరీ సాధించాడు.

**స్కోరు వివరాలు**

**లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్:** డికాక్ (సి) నరైన్ (బి) వైభవ్ 10; రాహుల్ (సి) రమణ్‌దీప్ (బి) రసెల్ 39; హుడా (సి) రమణ్‌దీప్ (బి) స్టార్క్ 8; బదోని (సి) రఘువంశీ (బి) నరైన్ 29; స్టొయినిస్ (సి) సాల్ట్ (బి) వరుణ్ 10; పూరన్ (సి) సాల్ట్ (బి) స్టార్క్ 45; కృనాల్ పాండ్యా (నాటౌట్) 7; అర్షద్ ఖాన్ (బి) స్టార్క్ 5; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 161. వికెట్ల పతనం:** 1-19, 2-39, 3-78, 4-95, 5-111, 6-155, 7-161. **బౌలింగ్:** స్టార్క్ 4-0-28-3, వైభవ్ 3-0-34-1, హర్షిత్ 4-0-35-0, సునీల్ నరైన్ 4-0-17-1, వరుణ్ చక్రవర్తి 4-0-30-1, రసెల్ 1-0-16-1.

**కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్:** ఫిల్ సాల్ట్ (నాటౌట్) 89; నరైన్ (సి) స్టొయినిస్ (బి) మోసిన్ 6; రఘువంశీ (సి) రాహుల్ (బి) మోసిన్ 7; శ్రేయస్ అయ్యర్ (నాటౌట్) 38; ఎక్స్‌ట్రాలు 22; **మొత్తం (15.4 ఓవర్లలో 2 వికెట్లకు) 162. వికెట్ల పతనం:** 1-22, 2-42. **బౌలింగ్:** జోసెఫ్ 4-0-47-0, మోసిన్ 4-0-29-2, కృనాల్ 1-0-14-0, యశ్ 2-0-25-0, అర్షద్ 2-0-24-0, బిష్ణోయ్ 2.4-0-17-0.

### ఐపీఎల్ పాయింట్ల పట్టిక

| జట్టు | ఆ | గె | ఓ | పా | నె.ర.రే |
|---|---|---|---|---|---|
| రాజస్తాన్ | 6 | 5 | 1 | 10 | 0.767 |
| కోల్‌కతా | 5 | 4 | 1 | 8 | 1.688 |
| చెన్నై | 6 | 4 | 2 | 8 | 0.726 |
| హైదరాబాద్ | 5 | 3 | 2 | 6 | 0.344 |
| లక్నో | 6 | 3 | 3 | 6 | 0.038 |
| గుజరాత్ | 6 | 3 | 3 | 6 | -0.637 |
| పంజాబ్ | 6 | 2 | 4 | 4 | -0.218 |
| ముంబై | 6 | 2 | 4 | 4 | -0.234 |
| ఢిల్లీ | 6 | 2 | 4 | 4 | -0.975 |
| బెంగళూరు | 6 | 1 | 5 | 2 | -1.124 |

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

## భవిత



కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

# విద్య, ఉద్యోగ సమాచారం

### యూపీఎస్సీ-కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ ఎగ్జామ్-2024

**యూనియన్** పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ).. వివిధ విభాగాల్లో మెడికల్ ఆఫీసర్/జీడీఎంవో పోస్టుల భర్తీకి కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2024 నిర్వహిస్తోంది. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 827

**పోస్టుల వివరాలు**

» **కేటగిరీ-1:** మెడికల్ ఆఫీసర్స్ గ్రేడ్(జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్స్ సబ్-క్యాడర్ ఆఫ్ సెంట్రల్ హెల్త్ సర్వీస్)-163 పోస్టులు.
» **కేటగిరీ-2:** అసిస్టెంట్ డివిజనల్ మెడికల్ ఆఫీసర్(రైల్వే)-450 పోస్టులు, జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్(న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్)-14 పోస్టులు, జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ గ్రేడ్ 2(ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్)-200 పోస్టులు.
» **అర్హత:** ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి. **వయసు:** 01.08.2024 నాటికి 32 ఏళ్లు మించకూడదు.
» **పే స్కేల్:** నెలకు రూ.56,100 నుంచి 1,77,500.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష (500 మార్కులు), ఇంటర్వ్యూ/పర్సనాలిటీ టెస్ట్(100 మార్కులు), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.04.2024.
» **దరఖాస్తుల సవరణకు చివరితేది:** 07.05.2024.
» **రాతపరీక్ష తేది:** 14.07.2024.
» **వెబ్‌సైట్:** https://upsc.gov.in

### యూపీఎస్సీ-ఐఈఎస్/ఐఎస్ఎస్ఈ-2024

**యూనియన్** పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. ఇండియన్ ఎకనామిక్స్ సర్వీస్/స్టాటిస్టికల్ సర్వీసుల్లో.. జూనియర్ టైం స్కేల్ ఖాళీల భర్తీకి సంబంధించి ఇండియన్ ఎకనామిక్ సర్వీస్/ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్ ఎగ్జామినేషన్-2024 నోటిఫికేషన్ విడుదల చేసింది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 48.
» **పోస్టుల వివరాలు:** ఇండియన్ ఎకనామిక్ సర్వీస్-18, ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్-30.
» **అర్హత:** ఎకనామిక్ సర్వీస్‌కు పీజీ(ఎకనామిక్స్/అప్లైడ్ ఎకనామిక్స్/బిజినెస్ ఎకనామిక్స్/ఎకనామెట్రిక్స్), స్టాటిస్టికల్ సర్వీస్‌కు డిగ్రీ(స్టాటిస్టిక్స్/మ్యాథమేటికల్ స్టాటిస్టిక్స్/అప్లైడ్ స్టాటిస్టిక్స్)లేదా పీజీ(స్టాటిస్టిక్స్/మ్యాథమేటికల్ స్టాటిస్టిక్స్/అప్లైడ్ స్టాటిస్టిక్స్) ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.08.2024 నాటికి 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష(1000 మార్కులు), ఇంటర్వ్యూ/పర్సనాలిటీ టెస్ట్(200 మార్కులు), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.04.2024.
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 01.05.2024 నుంచి 07.05.2024 వరకు
» **రాతపరీక్ష తేది:** 21.06.2024.
» **వెబ్‌సైట్:** https://upsc.gov.in

### స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో ఉపాధి కోర్సుల్లో శిక్షణ

**యాదాద్రి** భువనగిరి జిల్లా జలాల్‌పూర్ గ్రామంలో స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ.. ఉపాధి ఆధారిత సాంకేతిక శిక్షణ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. తెలంగాణ రాష్ట్ర గ్రామీణ ప్రాంత అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత శిక్షణ, భోజనం, వసతి కల్పిస్తారు.

**ఉపాధి కోర్సుల వివరాలు**

» **బేసిక్ కంప్యూటర్స్(డేటా ఎంట్రీ ఆపరేటర్):** కోర్సు వ్యవధి: 3 నెలలు. అర్హత: ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులవ్వాలి.
» **అకౌంట్స్ అసిస్టెంట్(ట్యాలీ):** కోర్సు వ్యవధి: 3 నెలలు. అర్హత: బీకాం ఉత్తీర్ణులవ్వాలి.
» **కంప్యూటర్ హార్డ్‌వేర్ సాఫ్ట్‌వేర్:** కోర్సు వ్యవధి: 3 నెలలు. అర్హత: ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులవ్వాలి.
» **ఆటోమొబైల్-టూ వీలర్ సర్వీసింగ్:** కోర్సు వ్యవధి: 3 నెలలు. అర్హత: పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి.
» **సెల్‌ఫోన్-ఎలక్ట్రానిక్ డివైజ్ రిపేర్:** కోర్సు వ్యవధి: 4 నెలలు. అర్హత: పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి.
» **ఎలక్ట్రీషియన్(డొమెస్టిక్):** కోర్సు వ్యవధి: 5 నెలలు. అర్హత: పదో తరగతి, ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి.
» **సోలార్ సిస్టమ్ ఇన్‌స్టాలేషన్/సర్వీస్:** అర్హత: పదో తరగతి, ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి.
» గ్రామీణ అభ్యర్థులై ఉండాలి. చదువు మధ్యలో ఉన్నవారు అర్హులు కాదు.
» **వయసు:** 18 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆసక్తి ఉన్న అభ్యర్థులు అర్హత కలిగిన ఒరిజనల్ సర్టిఫికేట్‌లు, జిరాక్స్ సెట్, పాస్ట్‌పోర్ట్ ఫోటోలు, ఆధార్‌కార్డు, రేషన్ కార్డులతో సంస్థ చిరునామాకు సంప్రదించాలి.
» **సంస్థ చిరునామా:** స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ, జలాల్‌పూర్(గ్రామం), పోచంపల్లి(మండలం), యాదాద్రి భువనగిరి జిల్లా.
» **సంస్థలో ప్రవేశాలు:** 15.04.2024 ఉదయం 10 గంటలకు
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.srtri.com

» 3,712 పోస్టుల భర్తీకి ఎస్ఎస్‌సీ నోటిఫికేషన్
» డేటా ఎంట్రీ ఆపరేటర్, ఎల్‌డీసీ, జేఎస్ఏ ఉద్యోగాలు
» ఇంటర్ అర్హతతోనే దరఖాస్తుకు అవకాశం
» పే లెవల్-2, 4, 5లతో ప్రారంభ వేతనం

# ఇంటర్‌తోనే కేంద్ర కొలువు

**స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ).. కంబైన్డ్ హయ్యర్ సెకండరీ లెవల్ ఎగ్జామినేషన్ (సీహెచ్ఎస్ఎల్)-2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిద్వారా కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో మొత్తం 3,712 పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. ఈ పోస్టులకు ఇంటర్ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. రాత పరీక్షలో ఎంపికైతే ప్రారంభంలోనే పే లెవల్ 2, 4, 5లతో వేతనం అందుకోవచ్చు!! ఈ నేపథ్యంలో.. ఎస్ఎస్‌సీ సీహెచ్ఎస్ఎల్-2024 వివరాలు, పోస్ట్‌లు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, ప్రిపరేషన్ తదితర వివరాలు..**



ఎస్ఎస్‌సీ సీహెచ్ఎస్ఎల్-2024

**మొత్తం 3,712 పోస్ట్‌లు**

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ తాజాగా విడుదల చేసిన సీహెచ్ఎస్ఎల్ నోటిఫికేషన్ ద్వారా మొత్తం 3,712 పోస్ట్‌లకు ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నారు. వీటిల్లో లోయర్ డివిజన్ క్లర్క్(ఎల్‌డీసీ)/జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్ (జేఎస్ఏ), డేటాఎంట్రీ ఆపరేటర్, డేటాఎంట్రీ ఆపరేటర్ గ్రేడ్-ఎ పోస్టులు ఉన్నాయి.

**విద్యార్హత**

ఆగస్ట్ 1, 2024 నాటికి ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత ఉండాలి. కన్స్యూమర్ అఫైర్స్, ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్, మినిస్ట్రీ ఆఫ్ కల్చర్‌లలో పోస్ట్‌లకు మాత్రం ఇంటర్మీడియెట్‌లో మ్యాథమెటిక్స్‌ను ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి.

**వయసు**

ఆగస్ట్ 1, 2024 నాటికి 18-27 ఏళ్లు ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు పదేళ్లు చొప్పున గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు ఇస్తారు.

**వేతనం**

- ఆయా పోస్ట్‌లకు పే లెవల్-2, 4, 5లతో ప్రారంభ వేతనం లభిస్తుంది.
- ఎల్‌డీసీ/జేఎస్ఏలకు పే లెవల్-2(వేతన శ్రేణి రూ.19,900-రూ.63,200); డేటా ఎంట్రీ ఆపరేటర్/డేటాఎంట్రీ ఆపరేటర్ గ్రేడ్-ఎకు పే లెవల్-4(వేతన శ్రేణి రూ.25,500-రూ.81,100), అదే విధంగా కొన్ని శాఖల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్స్‌కు పే లెవల్-5(వేతన శ్రేణి రూ.29,200-రూ.92,300)తో ప్రారంభ వేతనం లభిస్తుంది.

**రెండు దశల ఎంపిక ప్రక్రియ**

సీహెచ్ఎస్ఎల్ ద్వారా పలు శాఖల్లో ఎల్‌డీసీ/జేఎస్ఏ/డేటాఎంట్రీ ఆపరేటర్, డేటాఎంట్రీ ఆపరేటర్ గ్రేడ్-ఎ పోస్ట్‌ల భర్తీకి రెండు దశల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. టైర్-1, టైర్-2 పేరుతో రాత పరీక్షలు ఉంటాయి. అదే విధంగా టైర్-2 దశలో స్కిల్ టెస్ట్‌ను నిర్వహిస్తారు.

**200 మార్కులకు టైర్-1**

ఎంపిక ప్రక్రియలో తొలిదశ టైర్-1 పరీక్ష.. పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో, బహుళైచ్ఛిక ప్రశ్నలతో నిర్వహిస్తారు. మొత్తం నాలుగు విభాగాల నుంచి 100 ప్రశ్నలు-200 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఇంగ్లిష్ లాంగ్వేజ్ 25 ప్రశ్నలు-50 మార్కులు, జనరల్ ఇంటెలిజెన్స్ 25 ప్రశ్నలు-50 మార్కులు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 25 ప్రశ్నలు -50 మార్కులు, జనరల్ అవేర్‌నెస్ 25 ప్రశ్నలు-50 మార్కులకు ఉంటాయి. పరీక్ష ఆన్‌లైన్ విధానంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా నిర్వహిస్తారు. పరీక్షకు కేటాయించిన సమయం ఒక గంట. నెగెటివ్ మార్కింగ్ నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి అర మార్కు తగ్గిస్తారు.

**రెండో దశ పరీక్ష టైర్-2**

తొలిదశ టైర్-1 పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా నిర్దిష్ట కటాఫ్ నిబంధనల ప్రకారం-మెరిట్ జాబితా రూపొందిస్తారు. అందులో నిలిచిన వారికి రెండో దశ.. టైర్-2 పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్ష రెండు సెషన్‌లు, మూడు సెక్షన్లు, ప్రతి సెక్షన్‌లో రెండు మాడ్యూల్స్ విధానంలో జరుగుతుంది.

**స్కిల్ టెస్ట్.. 2 మాడ్యూల్స్**

టైర్-2 సెషన్-3 మాడ్యూల్-2లో పేర్కొన్న స్కిల్ టెస్ట్/టైపింగ్ టెస్ట్ మాడ్యూల్‌ను పార్ట్-ఎ, పార్ట్-బిలుగా విభజించారు. పార్ట్-ఎ ప్రకారం-డేటాఎంట్రీ ఆపరేటర్ పోస్ట్‌ల అభ్యర్థులకు 15 నిమిషాల వ్యవధిలో స్కిల్ టెస్ట్ నిర్వహిస్తారు. పార్ట్-బి ప్రకారం-ఎల్‌డీసీ, జేఎస్ఏ పోస్ట్‌ల అభ్యర్థులకు పది నిమిషాల వ్యవధిలో టైపింగ్ టెస్ట్ ఉంటుంది. స్కిల్ టెస్ట్, టైపింగ్ టెస్ట్ మాడ్యూల్ మినహా మిగతా విభాగాల్లోని ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటాయి. డేటాఎంట్రీ ఆపరేటర్ పోస్ట్‌లకు నిర్వహించే స్కిల్ టెస్ట్‌లో గంటకు 8000 క్యారెక్టర్స్‌ను కంప్యూటర్‌పై టైప్ చేయాల్సి ఉంటుంది. ఎల్‌డీసీ, జేఎస్ఏ పోస్ట్‌లకు నిర్వహించే టైపింగ్ టెస్ట్‌లో.. ఇంగ్లిష్ టైపింగ్‌లో నిమిషానికి 35 పదాలు, హిందీ టైపింగ్‌లో నిమిషానికి 30 పదాలు టైప్ చేయాల్సి ఉంటుంది. డేటాఎంట్రీ ఆపరేటర్ పోస్ట్‌ల అభ్యర్థులకు ఏదైనా ఒక ఇంగ్లిష్ ప్యాసేజ్‌ను ఇచ్చి కంప్యూటర్‌పై టైప్ చేయమని అడుగుతారు. అభ్యర్థులు దరఖాస్తు సమయంలోనే తమ టైపింగ్ టెస్ట్ మీడియంను పేర్కొనాల్సి ఉంటుంది.

**ముఖ్య సమాచారం**

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, మే 7
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం:** 2024 మే 10, 11 తేదీల్లో
- **టైర్-1(పేపర్-1) పరీక్ష తేదీలు:** జూలై 1, 2, 3, 4, 5, 8, 9, 10, 11, 12 తేదీల్లో
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://ssc.gov.in

### బెస్ట్ స్కోర్‌కు మార్గం ఇలా

**ఇంగ్లిష్ లాంగ్వేజ్**

ఈ విభాగంలో స్కోర్ కోసం బేసిక్ గ్రామర్‌పై పట్టు సాధించాలి. అదే విధంగా యాంటానిమ్స్, సినానిమ్స్, ఇడియమ్స్ అండ్ ఫ్రేజెస్, సెంటెన్స్ ఇంప్రూవ్‌మెంట్, యాక్టివ్/ప్యాసివ్ వాయిస్, డైరెక్ట్-ఇన్ డైరెక్ట్ స్పీచ్, స్పెల్లింగ్స్, స్పాటింగ్ ద ఎర్రర్స్ వంటి అంశాలపై పట్టు సాధించాలి.

**జనరల్ ఇంటెలిజెన్స్**

వెర్బల్, నాన్ వెర్బల్ రీజనింగ్ నుంచి ప్రశ్నలు అడిగే విభాగం ఇది. సిరీస్ (నంబర్/ఆల్ఫాన్యూమరిక్), అనాలజీస్, ఆడ్ మెన్ ఔట్, సిలాజిజమ్, మ్యాట్రిక్స్, డైరెక్షన్, వర్డ్ ఫార్మేషన్, బ్లడ్ రిలేషన్స్, నాన్ వెర్బల్(వాటర్ ఇమేజ్, మిర్రర్ ఇమేజ్), కోడింగ్ డీకోడింగ్ అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

**క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్**

ఈ విభాగంలో అర్థగణిత అంశాలైన సింపుల్ ఇంట్రెస్ట్, కంపౌండ్ ఇంట్రెస్ట్, లాభ నష్టాలు, ప్రాఫిట్ అండ్ లాస్, శాతాలను ప్రాక్టీస్ చేయాలి. అదే విధంగా, త్రికోణమితి, అల్జీబ్రా, జామెట్రీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్, టైం అండ్ వర్క్, టైం అండ్ డిస్టెన్స్‌లకు సంబంధించిన ప్రశ్నలను కూడా ప్రాక్టీస్ చేయాలి.

**జనరల్ అవేర్‌నెస్**

జనరల్ అవేర్‌నెస్‌లో జాతీయ, అంతర్జాతీయ సమకాలీన అంశాలు మొదలు జనరల్ సైన్స్, ఎకానమిక్స్, హిస్టరీ, జాగ్రఫీ, పాలిటీ విభాగాలపై దృష్టి పెట్టాలి. హిస్టరీకి సంబంధించి ఆధునిక భారత దేశ చరిత్ర, స్వాతంత్ర్యోద్యమ ఘట్టాలపై ఫోకస్ చేయాలి. జాగ్రఫీలో సహజ వనరులు, నదులు, పర్వతాలు వంటి వాటి గురించి తెలుసుకోవాలి. ఎకనామిక్స్‌కు సంబంధించి ఇటీవల కాలంలో ఆర్థిక వాణిజ్య రంగాల్లో కీలక పరిణామాలపై దృష్టి పెట్టాలి. ఆయా విభాగాలకు సంబంధించి ముఖ్యమైన పదజాలంపైనా పట్టు సాధించాలి. సీహెచ్ఎస్ఎల్ అభ్యర్థులు కరెంట్ అఫైర్స్‌ను కీలకంగా భావించాలి. ముఖ్యంగా ఇటీవల కాలంలో ప్రాధాన్యం సంతరించుకున్న సమకాలీన పరిణామాలను ప్రత్యేక శ్రద్ధతో చదవాలి. స్టాక్ జీకేలో ముఖ్యమైన వ్యక్తులు, తేదీలు, సదస్సులు, సమావేశాలు, వాటి తీర్మానాలు, అవార్డులు-విజేతలు వంటి సమాచారాన్ని తెలుసుకోవాలి.

**కంప్యూటర్ నాలెడ్జ్**

కంప్యూటర్‌కు సంబంధించి హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, ఆఫీస్ అప్లికేషన్ టూల్స్‌పై అవగాహన పెంచుకోవాలి. ముఖ్యంగా కంప్యూటర్ వినియోగంలో నిత్యం కనిపించే సాధనాల(సీపీయూ, మౌస్, మానిటర్, వీజీఏ కేబుల్ తదితర) గురించి తెలుసుకోవాలి. అదే విధంగా అప్లికేషన్స్‌కు సంబంధించి ఎంఎస్ ఆఫీస్ అప్లికేషన్ టూల్స్‌పై పట్టు సాధించాలి. కీబోర్డ్ షార్ట్ కట్స్, బేసిక్ మెయింటనెన్స్‌లపైనా పట్టు సాధించాలి.

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
15-4-2024

**స్టాక్ మార్కెట్లు** (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

| సూచీ | మార్పు | ముగింపు |
|---|---|---|
| సెన్సెక్స్ ▽ | 793 | 74,245 |
| నిఫ్టీ ▽ | 234 | 22,519 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

| సూచీ | ముగింపు | | మార్పు |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 16,175 | ▽ | 267 |
| డోజోన్స్ | 37,983 | ▽ | 476 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,936 | △ | 72 |
| డాక్స్ | 17,930 | ▽ | 24 |
| షాంఘై | 3,019 | ▽ | 15 |
| నికాయ్ | 39,524 | △ | 81 |

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

**ఫారెక్స్ రేట్లు** రూ. లలో

| | కరెన్సీ | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఒకటి | 83.04 | 84.05 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఒకటి | 104.22 | 106.77 |
| € | యూరో | ఒకటి | 89.38 | 91.74 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఒకటి | 54.64 | 55.87 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఒకటి | 53.98 | 55.90 |
| S$ | సింగపూర్ డాలర్ | ఒకటి | 59.51 | 64.17 |
| SAR | సౌదీ రియాల్ | ఛామనవుర్క్ | 21.32 | 22.87 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | ఛామనవుర్క్ | 21.79 | 23.57 |
| ¥ | చైనా యువాన్ | ఛామనవుర్క్ | 10.39 | 12.47 |

# పసిడి పరుగు ఎందాక?

## సెంట్రల్ బ్యాంకుల భారీ కొనుగోళ్లు

ఆర్‌బీఐదీ ఇదే దారి ● విదేశీ మారక నిల్వల్లో ప్రాధాన్యం

భౌగోళిక ఉద్రిక్తతలు, కరెన్సీ అస్థిరతలు ● ఫెడ్ రేట్ల కోతపై సందేహాలు

● మధ్య, దీర్ఘకాల పెట్టుబడులకు అనుకూలం



పసిడి అందకుండా పరుగెడుతోంది. జీవితకాల గరిష్ట ధరల్లో ట్రేడ్ అవుతూ, ఎప్పటికప్పుడు సరికొత్త రికార్డులను తిరగరాస్తోంది. ఈ ఏడాది ఆరంభం నుంచి చూస్తే ఇప్పటికే మూడు నెలల్లో సుమారు 20 శాతం బంగారం విలువ ప్రియంగా మారింది. కరోనా సంక్షోభం నుంచి చూస్తే 70 శాతం ఎగసింది. 10 గ్రాముల బంగారం ధర రూ.74,500 దాటింది. భారతీయులకు బంగారం అంటే సహజంగానే ఎంతో మక్కువ. పేద వారి నుంచి, ధనికుల వరకు ఎవరి స్థాయిలో వారు బంగారం కలిగి ఉంటారు. ధర ఇలా పెరిగిపోతుంటే, ఇక తాము కొనలేని స్థాయికి బంగారం చేరుకుంటుందా? అన్న గుబులు కొందరిలో మొదలైంది. ఈ తరుణంలో అసలు పసిడెందుకు ఇలా పరుగులు తీస్తోంది? ఇది ఎంత వరకు? దీనిపై మార్కెట్ అనలిస్టుల విశ్లేషణ చూద్దాం.

### ఆర్‌బీఐ దూకుడు

గత ఏడాది 2023 ఏప్రిల్ నుంచి 2024 ఫిబ్రవరి నాటికి ఆర్‌బీఐ 13 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసినట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. దీంతో ఆర్‌బీఐ నిర్వహణలోని బంగారం నిల్వలు 817 టన్నులకు చేరాయి. విదేశీ మారక నిల్వల్లో వైవిధ్యానికి వీలుగా, రిస్క్ తగ్గించుకునేందుకు బంగారం నిల్వలను ఆర్‌బీఐ పెంచుకుంటోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆర్‌బీఐ 6 టన్నుల బంగారం నిల్వలు పెంచుకుంది. అంతకు ముందు జనవరిలో 8.7 టన్నులను కొనుగోలు చేసింది. 2022 జూలై తర్వాత ఒక నెలలో గరిష్ట కొనుగోళ్లు ఇవి. ప్రపంచ స్వర్ణ మండలి నివేదిక ప్రకారం సెంట్రల్ బ్యాంక్‌లు అన్నీ కలసి ఫిబ్రవరిలో 19 టన్నుల బంగారం కొనుగోలు చేశాయి. అత్యధికంగా చైనా 12 టన్నులు కొంది. జనవరిలో టర్కీ 11.8 టన్నులు, చైనా 10 టన్నులు, కజకిస్థాన్ 6.2 టన్నుల చొప్పున బంగారం కొన్నాయి. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరిలో సెంట్రల్ బ్యాంక్‌లు 64 టన్నుల బంగారం కొన్నాయి. 2023 మొదటి 2 నెలలతో పోలిస్తే 43% తక్కువ కాగా, 2022 మొదటి 2 నెలలతో పోల్చితే 4 రెట్లు అధికం. ఇక ముందూ సెంట్రల్ బ్యాంక్‌ల నుంచి డిమాండ్ కొనసాగొచ్చన్నది అనలిస్టుల అంచనా. అదే సమయంలో మార్కెట్ అంచనా వేసినట్టు ఫెడ్ రేట్ల కోత జూన్ లేదా సమీప కాలంలో లేకపోతే, అది బంగారం ధరల ర్యాలీకి బ్రేక్ వేయవచ్చని టీడీ సెక్యూరిటీస్ కమోడిటీ స్ట్రాటజీస్ హెడ్ వార్ట్ మెలెక్ పేర్కొన్నారు. కాకపోతే మధ్య కాలం నుంచి దీర్ఘకాలానికి పసిడిలో రాబడికే అవకాశాలు ఉంటాయన్నది అనలిస్టుల అభిప్రాయం.




### మన దగ్గర కొంచెం ఎక్కువే

దేశీయ మార్కెట్ అనే కాదు, అంతర్జాతీయంగానూ బంగారం ధరలు పెరుగుతున్నాయి. ఔన్స్ బంగారం (31.10 గ్రాములకు సమానం) ధర 2,400 డాలర్లకు చేరింది. రూపాయల్లోకి మార్చి చూస్తే దేశీయ మార్కెట్లో తులం (10 గ్రాములు) బంగారం ధర రూ.64,370గానే ఉండాలి. కానీ, ఇంతకంటే అధికంగా మన మార్కెట్లో ట్రేడ్ అవుతోంది. బంగారం దిగుమతి చేసుకునే లోహం. కనుక డాలర్లలో చెల్లించాల్సి ఉంటుంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ దిగుమతి ధరలను నిర్ణయిస్తుందన్న విషయాన్ని మర్చిపోకూడదు. రూపాయి విలువ క్షీణిస్తున్న కొద్దీ, అంతర్జాతీయ మార్కెట్‌తో పోలిస్తే దేశీయ మార్కెట్లో బంగారం ధర మధ్య అంతరం పెరుగుతూ వెళుతుంది. దీనికి తోడు బంగారం దిగుమతులపై కేంద్ర సర్కారు కస్టమ్స్ సుంకాన్ని కూడా వసూలు చేస్తుంటుంది. బంగారం, వెండిపై ప్రస్తుతం ఈ సుంకం 15 శాతంగా ఉంది. ఇవన్నీ కలిసి దేశీయ మార్కెట్లో బంగారం ధర అధికంగా ఉండేలా చేస్తున్నాయి.



బంగారం, వెండి ధరలు ఆకాశమే హద్దుగా ర్యాలీ చేస్తుండడం వెనుక పలు కారణాలను మార్కెట్ నిపుణులు, అనలిస్టులు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం అంతర్జాతీయంగా అమెరికా సహా అన్ని ప్రముఖ దేశాల్లోనూ వడ్డీ రేట్లు గరిష్ట స్థాయిల్లోనే చలిస్తున్నాయి. ఇక్కడి నుంచి తగ్గడమే కానీ, పెరగడానికి అవకాశాల్లేవు. సమీప కాలంలోనే వడ్డీ రేట్ల తగ్గింపు మొదలవుతుందన్న అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా యూఎస్ ఫెడ్ జూన్ నుంచే రేట్ల కోతను మొదలు పెడుతుందని అంచనాలు ఏర్పడ్డాయి. ''పసిడి ధర మరో రికార్డు స్థాయికి చేరింది. డాలర్ ఇండెక్స్ బలంగానే ఉన్నప్పటికీ బంగారం ర్యాలీ కొనసాగుతోంది. యూఎస్ ఫెడ్ మానిటరీ పాలసీని సులభతరం చేస్తుందన్న అంచ



### ఎందుకంటే..?

నాలు పెరిగాయి. మధ్య ప్రాచ్యంలో భౌగోళిక ఉద్రిక్తతలు మరింత క్షీణించడం కూడా కారణమే. బంగారం, వెండి ధరలు ఇటీవల ర్యాలీకి చైనా దూకుడైన కొనుగోళ్లు సైతం మద్దతునిస్తున్నాయి. సెంట్రల్ బ్యాంకులు స్థిరంగా బంగారాన్ని కొనుగోలు చేస్తూ వస్తున్నాయి. ఈ ఏడాది ప్రముఖ దేశాల్లో ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయనే దానిపై అనిశ్చితి కూడా ఒక కారణమే. ఈ పరిస్థితుల్లో బంగారం సురక్షిత సాధనంగా ఆకర్షిస్తోంది''అని ఎస్ఎస్ వెల్త్ స్ట్రీట్ వ్యవస్థాపకురాలు సుగంధ సచ్‌దేవ తెలిపారు. ఇజ్రాయెల్ తన దాడులను లెబనాన్‌లోని హిజ్బుల్లా స్థావరాలపైకి విస్తరించింది. ఇది కూడా బంగారం ధరల ఆజ్యానికి కారణమైనందన్నది కొందరు విశ్లేషకుల అంచనాగా ఉంది.

### ఎంత వరకు..?

మొత్తం మీద బంగారం ధరల ధోరణి బుల్లిష్‌గా ఉన్నట్టు, మధ్యలో ధరలు తగ్గితే కొనుగోళ్లకు అవకాశంగా చూడొచ్చని సుగంధ సచ్‌దేవ పేర్కొన్నారు. స్థూల ఆర్థిక గణాంకాలు, భౌగోళిక రాజకీయ అంశాలు ఏ విధంగా మారుతున్నాయనే దానిపై దృష్టి సారించాలన్నారు. ''బంగారం ధర సాంకేతికంగా రూ.69,600ను ఛేదించి అంతకుపైన ముగిసింది. ఇది పసిడి ర్యాలీకి మద్దతునిచ్చేది. ఇక్కడి నుంచి పసిడి ధర తగ్గితే మధ్య కాలం నుంచి దీర్ఘకాలం కోసం ఇన్వెస్ట్ చేయాలనుకునే వారు అవకాశంగా చూడొచ్చు''అని ప్రభుదాస్ లీలాదర్ టెక్నికల్ రీసెర్చ్ అనలిస్ట్ షిజు కూత్తుపలక్కల్ సూచించారు.



ఆర్థిక అనిశ్చితుల్లో, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల సమయంలో బంగారానికి డిమాండ్ సాధారణ రోజులతో పోలిస్తే అధికమవుతుంది. ఈక్విటీలు, డాలర్ తదితర సాధనాల నుంచి అంతర్జాతీయ ఇన్వెస్టర్లు బంగారంలోకి పెట్టుబడులు మళ్లిస్తుంటారు. చారిత్రకంగా చూస్తే ఇతర సాధనాల కంటే బంగారంలో అస్థిరతలు తక్కువ. అందుకే ఆ సమయంలో ఇన్వెస్టర్లు పసిడిని నమ్ముకుంటారు. వడ్డీ రేట్లు తగ్గినప్పుడల్లా బంగారం ర్యాలీ చేస్తుండడం సహజంగానే కనిపిస్తుంది. వడ్డీ రేట్లు తగ్గడం వల్ల అది ద్రవ్యోల్బణం పెరిగేందుకు దారితీస్తుంది. పైగా ముడి చమురు ధరలు మరోసారి పెరగడం మొదలైంది. ఇది కూడా ద్రవ్యోల్బణం పెరగడానికి దారితీస్తుంది. ద్రవ్యోల్బణం సమయంలో పెట్టుబడుల విలువ కాపాడుకునేందుకు హెడ్జింగ్‌గా బంగారం మించిన సాధనం లేదు. చారిత్రకంగా చూస్తే



### సురక్షిత సాధనం

ఎక్కువ సందర్భాల్లో ఈక్విటీలు ర్యాలీ చేసినప్పుడు బంగారం ధరలు తగ్గేవి. కానీ, ఈ విడత ఈక్విటీలతో పాటు బంగారం కూడా ర్యాలీ చేయడానికి ప్రధానంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలకు తోడు, డాలర్ విలువ స్థిరత్వం విషయంలో సెంట్రల్ బ్యాంకుల్లో నమ్మకం సడలడమే ఒక కారణంగా కనిపిస్తోంది. యూఎస్ ద్రవ్యలోటు 6.2 శాతానికి, రుణం జీడీపీలో 120 శాతానికి చేరడం కూడా బంగారం ధరల ఆజ్యానికి కారణాల్లో ఒకటి. అమెరికా జీడీపీలో రుణ వడ్డీ వ్యయాలు 2015–2020 కాలంలో సగటున 1.4 శాతంగా ఉంటే, ఇప్పుడు 2.4 శాతానికి చేరాయి. ఈ వడ్డీ వ్యయాలు తగ్గించుకునేందుకు, గడువు తీరిన రుణాలను తక్కువ రేటుపై రీఫైనాన్స్ చేసుకునేందుకు వీలుగా ఫెడ్ నుంచి రేట్ల కోత రూపంలో సాయాన్ని అమెరికా ప్రభుత్వం ఆశిస్తున్న విషయాన్ని విస్మరించరాదు.

### రేట్ల కోత

ఫిబ్రవరి మధ్య నుంచి ర్యాలీ ఫలితంగా బంగారం సాంకేతికంగా రూ.70,000 మార్క్ (10 గ్రాములు), ఔన్స్ 2,300 డాలర్లను దాటింది. రేట్ల కోతపై యూఎస్ ఫెడ్ మిశ్రమ సంకేతాలే ఇచ్చినప్పటికీ, అమెరికా ఆర్థిక వ్యవస్థలో ధరల ఒత్తిళ్లను తగ్గించేందుకు జూన్‌లోనే రేట్ల కోతను చేపట్టొచ్చన్న అంచనాలు మార్కెట్లో నెలకొన్నాయిఅని సుగంధ సచ్‌దేవ తెలిపారు. ముఖ్యంగా ఇటీవలే వెలువడిన అమెరికా నాన్ ఫార్మ్ పేరోల్ డేటా అంచనాలకు మించి ఉందని (తగ్గిన నిరుద్యోగం), ఇదే బంగారం, వెండి ధరల తాజా ట్రిగ్గర్‌కు దారితీసినట్టు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీ అండ్ కరెన్సీ హెడ్ అనుజ్ గుప్తా వెల్లడించారు.






సెంట్రల్ బ్యాంక్‌లతోపాటు, వడ్డీ రేట్ల కోతపై అంచనాలతో ఇనిస్టిట్యూషన్లు (ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్‌లు, పెన్షన్ ఫండ్స్, సావరీన్ వెల్త్ ఫండ్స్) బంగారంపై ఇన్వెస్ట్ చేస్తున్నాయి. వ్యక్తులు, ప్రైవేటు ఇన్వెస్టర్ల కొనుగోళ్లు కూడా డిమాండ్‌కు మద్దతుగా నిలుస్తున్నాయి. సెంట్రల్ బ్యాంక్‌లు అంతర్జాతీయంగా కరెన్సీని పెద్ద ఎత్తున ప్రింట్ చేస్తున్నాయి. ఇది వాటి కరెన్సీ

### కొనేది ఎవరు?

విలువలకు ప్రతికూలం. పైగా భౌగోళిక ఉద్రిక్తతల ఫలితంగా నాన్ డాలర్ వాణిజ్య చెల్లింపుల వైపు కొన్ని దేశాలు మొగ్గు చూపుతున్నాయి. ఇది డాలర్‌కు ప్రతికూలం. ఈ పరిస్థితుల్లో విదేశీ మారకం నిల్వల్లో ఎక్కువ భాగం కరెన్సీ రూపంలోనే కలిగి ఉండడం అంత శ్రేయస్కరం కాదని ఆర్‌బీఐ సహా వర్ధమాన దేశాల సెంట్రల్ బ్యాంక్‌లు భావిస్తున్నాయి. కరెన్సీలతో పోలిస్తే బంగారమే స్థిరత్వాన్ని ప్రదర్శిస్తుండడం గమనించాలి. మన దేశంలో ఇప్పటికీ అధిక శాతం మంది బంగారాన్ని విలువైన, పొదుపు సాధనంగా చూస్తున్నారు. బంగారం విలువ ఎప్పటికీ పెరిగేదే కానీ, తరిగేది కాదని, కష్టాల్లో ఆదుకుంటుందని ఎక్కువ మంది నమ్ముతుంటారు. ఫలితంగా దేశీయంగా బంగారానికి బలమైన డిమాండ్ కొనసాగుతూనే ఉంది.

### అవసరమా–పెట్టుబడా?

పెరిగే ధరలు చూసి పసిడి వెంట పరుగులు తీయడం కాకుండా, ఎందుకు కొనుగోలు చేయాలన్న ప్రశ్న వేసుకోవాలి. రాబడి కోసం అయితే అది పెట్టుబడి అవుతుంది. తమ మొత్తం పెట్టుబడుల్లో బంగారానికి చేసే కేటాయింపులు 5–10% మించకూడదన్నది నిపుణుల సూచన. పైగా పెట్టుబడులు భౌతిక బంగారంపై ఉండకూడదు. గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్)లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. లేదంటే సావరీన్ గోల్డ్ బాండ్స్ (ఎస్‌జీబీ)లో ఇన్వెస్ట్ చేసుకుంటే, పెరిగే విలువకు అదనంగా ఏటా 2.5 శాతం వడ్డీ లభిస్తుంది. ఈ రెండు సాధనాల్లోనూ క్రమానుగత పెట్టుబడులు చేసుకోవచ్చు. ఎస్‌జీబీలను ఆర్‌బీఐ ఏటా పలు విడతలుగా జారీ చేస్తుంటుంది. ఈటీఎఫ్‌లను రోజువారీ స్టాక్ మార్కెట్ నుంచి కొనుగోలు చేసుకోవచ్చు. ఆభరణాల కోసం అయితే తమకు కావాల్సినంత మేర బంగారాన్ని కొనుగోలు చేసుకోవచ్చు.




### వెండి సంగతి?




చారిత్రకంగా బంగారంతోపాటే వెండి పయనం కూడా సాగుతుంది. కానీ, ఇటీవలి కాలంలో బంగారం స్థాయిలో వెండి ధరల పెరుగుదల లేదు. ఈ ఏడాది ఆరంభం నుంచి ఏప్రిల్ 8 నాటికి వెండి ధరలు 11 శాతం ర్యాలీ చేశాయి. పెట్టుబడుల కోణంలోనే కాకుండా, పారిశ్రామికంగానూ వెండి వినియోగం ఉంటుంది. ఎలక్ట్రిక్ వాహనాలు, సోలార్ తదితర పునరుత్పాదక ఇంధన ఎక్విప్‌మెంట్, ఎలక్ట్రానిక్స్‌లో వెండి వినియోగిస్తుంటారు. చైనా మార్కెట్ కోలుకుంటుందన్న అంచనాలు వెండి ర్యాలీకి జోష్‌నిస్తున్నాయి. వెండి విషయంలో తాము బలమైన సానుకూలతతో ఉన్నట్టు మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థ ప్రకటించింది. కిలో వెండి తగ్గితే రూ.75,000 వరకూ కొనుగోలు చేసుకోవచ్చని, మధ్య కాలం నుంచి దీర్ఘకాలానికి రూ.92,000–1,00,000 వరకు పెరుగుతుందని అంచనా వేస్తున్నట్టు ఇటీవలే నోట్‌ను విడుదల చేసింది.

## డైరెక్ట్, రెగ్యులర్ ప్లాన్ల మధ్య వ్యత్యాసం ఎందుకు?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్



**మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులను వేరొకరికి బహుమతిగా ఇవ్వొచ్చా?**

– జయలలిత

మ్యూచువల్ ఫండ్స్ పథకంలోని యూనిట్లు ఒకరికి బదిలీ చేయడం కానీ, బహుమతిగా ఇవ్వడం కానీ కుదరదు. ఇన్వెస్టర్ తన పేరిట ఉన్న యూనిట్లు వేరొకరికి బదిలీ చేయడం అన్నది కేవలం.. ఇన్వెస్టర్ మరణించిన సందర్భాల్లోనే చోటు చేసుకుంటుంది. అటువంటి సందర్భంలో నామినీ క్లెయిమ్ దాఖలు చేసుకోవాల్సి ఉంటుంది. మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులను పిల్లలకు బహుమతిగా ఇవ్వాలని అనుకుంటే నేరుగా వారి పేరుతో ఇన్వెస్ట్ చేయడం ఒక్కటే మార్గం. పిల్లల వయసు 18 ఏళ్లలోపు ఉన్నా ఇది సాధ్యపడుతుంది. అటువంటప్పుడు పిల్లలు మేజర్ అయ్యే వరకు తల్లిదండ్రులే సంబంధిత పెట్టుబడులపై సంరక్షకులుగా నిర్ణయాధికారం కలిగి ఉంటారు. పిల్లల పుట్టిన తేదీ సర్టిఫికెట్‌తో పాటు, గార్డియన్ కేవైసీ వివరాలను మ్యూచువల్ ఫండ్ సంస్థ అడుగుతుంది. పిల్లల పేరిట (మైనర్లు) ఉన్న మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులను విక్రయించగా వచ్చిన ఆదాయం.. తల్లిదండ్రుల ఆదాయానికి కలిపి చూపించాల్సి ఉంటుంది. ఒకవేళ పిల్లల వయసు 18 ఏళ్లు నిండిన తర్వాత పెట్టుబడులను వెనక్కి తీసుకుంటే అది వారి వ్యక్తిగత ఆదాయం కిందకే వస్తుంది. మీ పేరిట ఉన్న పెట్టుబడులను విక్రయించేసి, వచ్చిన మొత్తాన్ని పిల్లల బ్యాంకు ఖాతాకు బదిలీ చేయాలి. ఆ తర్వాత వారి పేరిట కొనుగోలు చేసుకోవాలి. మూడో వ్యక్తి (థర్డ్ పార్టీ) నుంచి పెట్టుబడిని ఫండ్స్ సంస్థలు ఆమోదించవు. మ్యూచువల్ ఫండ్స్ యూనిట్లు కొనుగోలు చేస్తున్న వ్యక్తి స్వయంగా ఆ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. కనుక బహుమతిగా ఇవ్వాలనుకునే వారికి నగదు బదిలీ చేసి, కొనుగోలు చేసుకోవడం ఒక్కటే మార్గం.

**మ్యూచువల్ ఫండ్స్‌లో రెగ్యులర్ ప్లాన్, డైరెక్ట్ ప్లాన్ ఎన్ఏవీకి మధ్య వ్యత్యాసం ఎందుకు ఉంటుంది?**

– శ్యామ్ బెనర్జీ

మీరు అడిగింది నిజమే. మ్యూచువల్ ఫండ్ రెగ్యులర్, డైరెక్ట్ ప్లాన్ల నెట్ అస్సెట్ వ్యాల్యూ (ఎన్ఏవీ) వేర్వేరుగా ఉంటాయి. కారణం ఏమిటంటే..? ఒక ఫండ్ ఎన్ఏవీని నిర్ణయించేవి రెండు అంశాలు. ఆ పథకం పోర్ట్‌ఫోలియోతోపాటు, ఎక్స్‌పెన్స్ రేషియో. కనుక ఒక పథకం పోర్ట్‌ఫోలియో, ఎక్స్‌పెన్స్ రేషియో అనేవి భిన్నంగా ఉండొచ్చు. కనుక ఎన్ఏవీలో మార్పు ఉండొచ్చు. అయితే, ఒక పథకం రెగ్యులర్, డైరెక్ట్ ప్లాన్లకు సంబంధించి పోర్ట్‌ఫోలియో ఒకటే ఉంటుంది. కాకపోతే ఎక్స్‌పెన్స్ రేషియో మాత్రం వేర్వేరుగా ఉంటుంది. కనుక ఎన్ఏవీపై దీని ప్రభావం పడుతుంది. రెగ్యులర్ ప్లాన్లకు పంపిణీదారుల కమీషన్ కూడా కలుస్తుంది. కనుక రెగ్యులర్ ప్లాన్ల ఎన్ఏవీ అధికంగా ఉంటుంది. డైరెక్ట్ ప్లాన్లలో ఎలాంటి పంపిణీదారుల కమీషన్ ఉండదు. కనుక వాటి ఎన్ఏవీ తక్కువగా ఉంటుంది. ఒక పథకంలో ఇన్వెస్టర్ పెట్టుబడికి ఎన్ని యూనిట్లు వస్తాయనేది.. యూనిట్ ఎన్ఏవీపైనే ఆధారపడి ఉంటుంది. ఇన్వెస్టర్ మొత్తం పెట్టుబడిని, ఎన్ఏవీతో భాగిస్తే ఎన్ని యూనిట్లు వస్తాయో తెలుస్తుంది. ఒక పథకం రెగ్యులర్ ప్లాన్ ఎన్ఏవీ రూ.11గా ఉండి.. రూ.10,000 పెట్టుబడి పెడుతున్నారని అనుకుందాం. అప్పుడు ఈ పెట్టుబడికి 909.09 యూనిట్లు వస్తాయి. డైరెక్ట్ ప్లాన్ ఎన్ఏవీ రూ.10 ఉందనుకుందాం. అప్పుడు అదే రూ.10,000 పెట్టుబడికి 1,000 యూనిట్లు లభిస్తాయి.

**కోడిగుడ్లు** (హోల్‌సేల్‌–నెక్ / 100కు రూ.లలో)

15-4-2024 ఫామ్ ధర...

| | |
|---|---|
| విశాఖ | 418–00 |
| చిత్తూరు | 468–00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 404–00 |
| విజయవాడ | 404–00 |
| రిటైల్ ధర (డజను) | 60.00 |
| హైదరాబాద్ | 395–00 |
| వరంగల్ | 397–00 |
| రిటైల్ ధర | 4.55 |

## మెర్సిడెస్ బెంజ్ రికార్డు విక్రయాలు..




న్యూఢిల్లీ: లగ్జరీ కార్ల తయారీ దిగ్గజం మెర్సిడెస్ బెంజ్ గత ఆర్థిక సంవత్సరంలో నెలవారీ, త్రైమాసికాలవారీ, పూర్తి సంవత్సరంవారీగా రికార్డు అమ్మకాలు నమోదు చేసింది. జనవరి–మార్చి త్రైమాసికంలో అత్యధికంగా 5,412 వాహనాలను విక్రయించింది. గత మార్చి త్రైమాసికంలో నమోదైన 4,697 యూనిట్లతో పోలిస్తే ఇది 15 శాతం అధికం. ఇక ఆర్థిక సంవత్సరం వారీగా అమ్మకాలు 10 శాతం పెరిగి 16,497 యూనిట్ల నుంచి 18,123 యూనిట్లకు చేరాయి. నెలవారీ అమ్మకాలకు సంబంధించి మార్చిలో అత్యధిక స్థాయిలో విక్రయించినట్లు సంస్థ ఎండీ సంతోష్ అయ్యర్ తెలిపారు. 30 ఏళ్ల క్రితం భారత్‌లో తాము కార్యకలాపాలు ప్రారంభించినప్పటి నుంచి ఇవి అత్యుత్తమ గణాంకాలని వివరించారు. 2024లో 9 కొత్త వాహనాలను ఆవిష్కరిస్తున్నట్లు, వీటిలో 3 బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనాలు ఉండనున్నట్లు చెప్పారు.

## స్టార్‌లింక్‌కు అనుమతులు వేగవంతం




న్యూఢిల్లీ: అమెరికన్ వ్యాపార దిగ్గజం ఎలాన్ మస్క్‌కు చెందిన శాటిలైట్ ఇంటర్నెట్ సేవల సంస్థ స్టార్‌లింక్‌కు దేశీయంగా లైసెన్సు జారీ చేసే ప్రక్రియను టెలికం శాఖ (డాట్) వేగవంతం చేసినట్లు సమాచారం. త్వరలోనే కంపెనీకి లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్‌వోఐ) జారీ చేయడంతో పాటు కమ్యూనికేషన్ సర్వీసుల కోసం ట్రయల్ స్పెక్ట్రం కూడా కేటాయించవచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి. భద్రతాపరమైన అంశాలపై అంతర్‌మంత్రిత్వ శాఖలతో డాట్ చర్చలు జరుపుతున్నట్లు వివరించాయి. ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ టెస్లా చీఫ్ కూడా అయిన మస్క్ త్వరలో భారత పర్యటనకు రానున్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. ఏప్రిల్ 21, 22 తారీఖుల్లో ఆయన భారత్ రానున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇక్కడ టెస్లా కార్ల తయారీ, పెట్టుబడి ప్రణాళికలు తదితరాలపై ప్రధాని మోదీతో చర్చించనున్నట్లు పేర్కొన్నాయి.

## మార్కెట్‌లోకి హెచ్‌పీ నుంచి కొత్త ఏఐ ల్యాప్‌టాప్‌లు




హైదరాబాద్: ఎన్‌పీయూ ఫీచర్ ఉన్న ఏఐ ఆధారిత గేమింగ్ ల్యాప్‌టాప్ ఒమెన్ ట్రాన్సెండ్ 14, ఎన్‌వీఎక్స్ 360 14 మోడల్‌ను హెచ్‌పీ మార్కెట్లో విడుదల చేసింది. ఇవి వేగంగా, సమర్థంగా పనిచేస్తూ వినియోగదారుల అవసరాలను తీరుస్తాయని హెచ్‌పీ ఇండియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్, ఎండీ ఇప్సితా దాస్‌గుప్తా చెప్పారు. ల్యాప్‌టాప్‌ల్లో ఏఐ వర్క్‌లోడ్స్ సాఫీగా, అంతరాయం లేకుండా పనిచేయటానికి న్యూరల్ ప్రాసెసింగ్ యూనిట్ (ఎన్‌పీయూ) అమర్చుతున్నారు. సీపీయూ, జీపీయూతోపాటు ఎన్‌పీయూ సైతం వీటిలో వాడుతున్నారు. దాంతో ఈ ల్యాప్‌టాప్‌లు హైబ్రిడ్ వర్క్‌కల్చర్‌కు తగ్గట్టు వేగంగా, సమర్థంగా పనిచేస్తాయని తెలిపారు.

**సాక్షి స్టాక్స్**

| దీపక్ నైట్రైట్ | జేఎమ్ ఫైనాన్షియల్ | కొనొచ్చు |
|---|---|---|

ప్రస్తుత ధర: రూ. 2,321 టార్గెట్: రూ. 2,565



ఎందుకంటే: నాలుగేళ్ల(2027 కేలండర్ ఏడాది)లో పూర్తయ్యే విస్తరణ ప్రాజెక్టులపై రూ. 14,000 కోట్ల పెట్టుబడులను వెచ్చించేందుకు అవగాహనా ఒప్పందం(ఎంవోయూ) కుదుర్చుకున్న నేపథ్యంలో దీపక్ నైట్రైట్‌పట్ల సానుకూల అంచనాకు వచ్చాం. దీనిలో ముడిసరుకుగా వినియోగించుకోగల ఫినాల్, ఎసిటోన్ తయారీ(డౌన్‌స్ట్రీమ్) యూనిట్లపై రూ. 12,500 కోట్లు, స్పెషాలిటీ కెమికల్స్ కోసం మరో రూ. 1,500 కోట్లు కేటాయించనుంది. తద్వారా కంపెనీ కోవెస్ట్రో, ఎవోనిక్, హంట్స్‌మాన్ తదితర గ్లోబల్ కెమికల్ దిగ్గజాల సరసన చేరనుంది. అంతేకాకుండా బల్క్ కెమికల్స్(అనిలిన్, బిస్ఫెనోల్ ఏ, పాలీకార్బొనేట్, ఎంఎంఏ) సామర్థ్యాలు అందుబాటులోకి రానున్న కారణంగా డౌన్‌స్ట్రీమ్ స్పెషాలిటీ కెమికల్స్ తయారీలో కంపెనీ అత్యుత్తమ లబ్ధిని పొందే వీలుంది. వెరసి అనిలిన్‌మినహా దేశీయంగా పూర్తిస్థాయిలో దిగుమతులకు ప్రత్యామ్నాయంగా కంపెనీ యూనిట్లు నిలవనున్నాయి. ఫినాల్, ఎసిటోన్ డౌన్‌స్ట్రీమ్ పెట్టుబడుల ఫలితంగా 2029–30 ఆర్థిక సంవత్సరానికల్లా కంపెనీ రూ. 2,300–3,300 కోట్ల నిర్వహణ లాభం(ఇబిటా) సాధించగలిగే స్థాయికి చేరుతుందని భావిస్తున్నాం. ఇదేవిధంగా స్పెషాలిటీ ఇన్వెస్ట్‌మెంట్ ద్వారా మరో రూ. 400–500 కోట్ల ఇబిటాకు అవకాశముంది. అంటే 2030కల్లా రూ. 3,800 కోట్ల అదనపు ఇబిటాను సాధించే వీలుంది. 2025–26లో రూ. 1,900 కోట్ల ఇబిటా అంచనాలకు ఇది అదనం. వాణిజ్య ప్రాతిపదికన విస్తరణ ప్రాజెక్టులు ప్రారంభమైతే 2030కల్లా రూ. 5,700 కోట్ల ఇబిటాను సాధించవచ్చని అంచనా.

| బాలకృష్ణ ఇండస్ట్రీస్ | ఐసీఐసీఐ సెక్యూరిటీస్ | కొనొచ్చు |
|---|---|---|

ప్రస్తుత ధర: రూ. 2,396 టార్గెట్: రూ. 2,820



ఎందుకంటే: ఆఫ్‌హైవే టైర్ల(ఓహెచ్‌టీ) విభాగంలో పేరొందిన బాలకృష్ణ ఇండస్ట్రీస్ దేశీ ఎగుమతుల ద్వారా లబ్ధి పొందనుంది. 2024 జనవరిలో ఓహెచ్‌టీ ఎగుమతులు వార్షికంగా 13 శాతం ఎగసి 15.1 కోట్ల డాలర్లను తాకాయి. గత కేలండర్ ఏడాది(2023)లో సగటున నమోదైన నెలవారీ ఎగుమతులు 13.9 కోట్ల డాలర్లతో పోలిస్తే పుంజుకున్నాయి. ఇందుకు ఓహెచ్‌టీకి యూరోపియన్ యూనియన్(ఈయూ), యూఎస్ వ్యవసాయ మార్కెట్ల నుంచి పెరిగిన డిమాండ్ ప్రభావం చూపింది. ఇక మొత్తంగా వ్యవసాయ విభాగపు ఎగుమతులు 17 శాతం జంప్‌చేశాయి. వీటిలో ఆఫ్‌ద రోడ్ టైర్ల(ఓటీఆర్) ఎగుమతులు 6 శాతం బలపడ్డాయి. ప్రధానంగా జనవరి నుంచి యూఎస్‌లో పరిస్థితులు సానుకూలంగా మారాయి. ఫలితంగా వ్యవసాయం, ఓటీఆర్ విభాగాలు జోరందుకోనున్నాయి. వార్షికంగా వ్యవసాయ విభాగం 32 శాతం, ఓటీఆర్ 23 శాతం చొప్పున పుంజుకోనున్నట్లు అంచనా. ఈ బాటలో గతేడాది చివరి నుంచి ఊపందుకున్న ఈయూ నుంచి సైతం 23 శాతం, 5 శాతం చొప్పున వృద్ధి నమోదయ్యే వీలుంది. వెరసి నెలవారీ సగటు 13.9 కోట్ల డాలర్లతో పోలిస్తే ఈ ఏడాది(2024) దేశీ ఓహెచ్‌టీ ఎగుమతులు వార్షికంగా 10 శాతం బలపడవచ్చునని అంచనా. ఈ నేపథ్యంలో కంపెనీ ఎగుమతులు మరింత అధికంగా 12 శాతం పురోగమించే అవకాశముంది. అయితే కీలక మార్కెట్లలో రిటైల్ అమ్మకాలు మందగిస్తే కంపెనీ అమ్మకాల పరిమాణంపై ప్రతికూల ప్రభావం పడవచ్చు. ప్రత్యర్థి కంపెనీల నుంచి పోటీ, ముడి వ్యయాలు వంటి అంశాలు 28 శాతం నిర్వహణ లాభాలు ఆర్జించడంలో ప్రతిబంధకంగా మారవచ్చు.

## 21న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

**సాక్షి, అమరావతి:** ఏపీ మోడల్ స్కూల్స్ (ఆదర్శ పాఠశాలలు)లో 2024–25 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశాల కోసం ఉద్దేశించిన ప్రవేశ పరీక్ష ఈ నెల 21న నిర్వహించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష ఐదో తరగతి స్థాయిలో ఉంటుందని, తెలుగు లేదా ఇంగ్లిష్ మాధ్యమాల్లో రాయవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల హాల్ టికెట్లు https://cse.ap.gov.in/ లేదా https://apms.apcfss.in/StudentLogin.do వెబ్‌సైట్ల నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

## 18 నుంచి ఇంటర్ 'సప్లిమెంటరీ' ఫీజు చెల్లింపు

**రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్‌కు కూడా అవకాశం**

**సాక్షి, అమరావతి:** ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల కోసం ఈనెల 18 నుంచి 24 వరకు ఫీజు చెల్లించాలని ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి సౌరభ్ గౌర్ ఓ ప్రకటనలో తెలిపారు. మార్కులు తక్కువగా వచ్చిన విద్యార్థులు రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం ఇదే తేదీల్లో ఫీజు చెల్లించాలని సూచించారు. జవాబు పత్రాల (ఒక్కో పేపర్) రీ వెరిఫికేషన్‌కు రూ.1300, రీకౌంటింగ్‌కు రూ.260 చెల్లించాలన్నారు. సప్లిమెంటరీ పరీక్షల కోసం ఇంటర్మీడియట్ మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులు పేపర్లతో సంబంధం లేకుండా రూ.550, ప్రాక్టికల్స్‌కు రూ.250, బ్రిడ్జి కోర్సులకు రూ.150 చొప్పున చెల్లించాలని పేర్కొన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో అన్ని పేపర్లు ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఇంప్రూవ్‌మెంట్ కోసం రూ.550 పరీక్ష ఫీజుతో పాటు పేపర్‌కు రూ.160 చొప్పున చెల్లించాలి. మొదటి, రెండో సంవత్సరం ఇంప్రూవ్‌మెంట్ రాయాలనుకుంటే.. సైన్స్ విద్యార్థులు రూ.1440, ఆర్ట్స్ విద్యార్థులు రూ.1240 చెల్లించాల్సి ఉంటుంది. పూర్తి వివరాలకు తమతమ కళాశాలల్లో సంప్రదించాలని సూచించారు. కాగా, మే 25 నుంచి జూన్ 1 వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నామని, ఫీజు చెల్లింపునకు మరో అవకాశం ఉండదని, ఈ విషయం అన్ని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ గుర్తించాలని సౌరభ్ గౌర్ విజ్ఞప్తి చేశారు.

## నేడు ప్రత్యేక కోర్టు ముందుకు కవిత

- ముగిసిన మూడురోజుల సీబీఐ కస్టడీ
- కేటీఆర్, అనిల్ భేటీ



**సాక్షి, న్యూఢిల్లీ:** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మూడు రోజుల కస్టడీ ముగియడంతో సీబీఐ అధికారులు సోమవారం ఆమెను ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరుపరచనున్నారు. ఉదయం పది గంటలకు న్యాయమూర్తి కావేరి బవేజా ముందు కవితను ప్రవేశ పెట్టనున్నారు. ఆదివారం విచారణలో భాగంగా ఆడిటర్ బుచ్చిబాబు ఫోను ద్వారా సేకరించిన చాట్‌లు, మహబూబ్‌నగర్‌లో భూమి ఒప్పందం, ఆప్ నేతలకు ప్రాక్సీ ద్వారా సొమ్ములు చేర్చడం, ఈ క్రమంలో బెదిరింపులకు పాల్పడడం తదితర అంశాలపై కవితను ప్రశ్నించినట్లు తెలిసింది. కాగా సీబీఐ కార్యాలయంలో ఉన్న కవితతో ఆమె భర్త అనిల్, సోదరుడు, మాజీ మంత్రి కేటీఆర్, న్యాయవాది మోహిత్‌రావులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో తాజా రాజకీయ పరిణామాలు, కోర్టులో అనుసరించాల్సిన వైఖరి తదితర అంశాలు చర్చించినట్లు సమాచారం. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో మార్చి 15న ఈడీ అధికారులు కవితను అరెస్టు చేయగా, ప్రత్యేక కోర్టు మధ్యంతర బెయిలు నిరాకరించింది. రెగ్యులర్ బెయిలుపై ఈ నెల 16న విచారణ జరగనుంది. ఇటీవల సీబీఐ కూడా కవితను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. 

సాక్షి 2024

# చైత్రయాత్ర

సోమవారం
ఏప్రిల్, 15




## గుసగుస

### అయ్యన్నకు 20 కోట్లట!



రాజకీయ పార్టీల నేతలు తమ వారసుల రాజకీయ భవిష్యత్తు కోసం ఎంత ఖర్చుకైనా వెనుకాడరు. తమ ఆస్తులు పోగొట్టుకున్నా.. వారసుడు రాజకీయంగా ఎదిగితే చాలనుకుంటారు. చంద్రబాబులాంటి వారైతే రాష్ట్రం ఎటుపోయినా పర్లేదు.. తన కొడుకు రాజకీయ భవిష్యత్తు బాగుంటే చాలనుకుంటారు. అయితే ఉత్తరాంధ్రకు చెందిన మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడి వ్యవహారం మాత్రం అందుకు భిన్నంగా ఉందట. సీట్ల ఖరారుకు ముందు తనకు ఎమ్మెల్యే, తన కుమారుడు విజయ్‌కు అనకాపల్లి ఎంపీ సీటు కావాలంటూ పదేపదే అధినేతను సతాయించేవారు. తీరా బీజేపీ నేత సీఎం రమేష్‌కు అనకాపల్లి ఎంపీ సీటు కేటాయించాక అయ్యన్న మిన్నకుండిపోయారు. ఇందుకు రూ.20 కోట్లు చేతులు మారినట్లు పార్టీ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎవరైనా తమ వారసుడి రాజకీయ భవిష్యత్తును మరీ ఇంతగా అమ్ముకుంటారా? అని ఆక్షేపిస్తున్నారు.

### తలా రూ.కోటి!



ఉత్తరాంధ్రలో నిలకడలేని నేత గంటా శ్రీనివాసరావే‌నంటే అతిశయోక్తి కాదు. తొలిసారిగా ఆయన గతంలో పోటీ చేసిన భీమిలి నుంచే టీడీపీ తరఫున బరిలో నిలుస్తున్నారు. ఇప్పటి వరకు పోటీ చేసిన స్థానంలో పోటీ చేయకపోవడంతో గంటా రాజకీయ వ్యూహాలకు ఆ పార్టీ నేతలు తలొగ్గేవారు. ఇపుడు పాతకాపే కావడంతో స్థానిక నేతల డిమాండ్లు పెరిగాయట. గతంలో మాదిరి గెలిచాక ఇస్తామంటే కుదరదని, ముందుగానే ముట్టజెప్పాలని భీష్మించుక్కూర్చున్నారట. దీంతో కూటమి పొత్తులో భాగంగా సీటును త్యాగం చేసిన జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పంచకర్ల సందీప్‌కు రూ.2 కోట్లు చెల్లించి ఆయన ఆశల్ని 'కూల్'చేశారని సమాచారం. భీమిలి జెడ్పీటీసీ గాడు వెంకటప్పడుతోపాటు మరో ఇద్దరికి తలో రూ. కోటి చొప్పున గంటా తన పాత పద్ధతిలోనే ముడుపులిచ్చి బుజ్జగించారట. అధికారపక్షం నుంచి తనవైపు రప్పించుకున్న వారికీ ఇదే తరహాలో వల వేసినట్లు గుసగుసలు.


### 'ఉండి'పోవాల్సిందే..



రఘురామకృష్ణ రాజు(ఆర్‌ఆర్‌ఆర్)కు నర్సాపురం ఎంపీ ఆశలు అడియాశలైనట్లే. దీంతో ఉండి అసెంబ్లీ సీటుపై ఆశలు పెట్టుకున్న టీడీపీ నేత రామారాజు(రాంబాబు) కలలూ కల్లలవుతున్నాయి. రాంబాబు టికెట్ కోసం ఆ పార్టీ నేత తోట సీతామహాలక్ష్మి ఆధ్వర్యంలో జరుగుతున్న దీక్షలను పార్టీ అధినేత విరమింపజేశారు. ఇందుకు రాంబాబునే బుజ్జగించారట. వీటన్నింటి వెనుక బీజేపీ కేంద్ర పెద్దల నిర్ణయమే కారణమట. ఎమ్మెల్యే స్థానాల్లో ఎన్ని కుప్పిగెంతులేసుకున్నా మీ ఇష్టం, ఎంపీ స్థానాల్లో మాత్రం మార్పులకు ససేమిరా అన్నారట. గతంలో రెండుసార్లు(రెబల్‌స్టార్ కృష్ణంరాజు, గోకరాజు గంగరాజు) గెలిచిన స్థానం కావడంతో బీజేపీ పెద్దలు నర్సాపురాన్ని వదులుకునేందుకు సిద్ధంగా లేరు. దీంతో ఆర్‌ఆర్‌ఆర్ 'ఉండి'పోక తప్పని స్థితి. అయితే ఇన్నాళ్లూ తమను దారుణంగా తిట్టిన ఆర్‌ఆర్‌ఆర్‌కు ఎన్నికల్లో సహకరించేది లేదని స్థానిక టీడీపీ శ్రేణులు తేల్చిచెప్పాయట.

### ఆ 'ముప్పి'ఉంటేనా?

ఏదో సినిమాలో కోవై సరళ 30ని ముప్పి.. 70ని డెబ్బి అంటుంది. టీడీపీ అధినేత కూడా ఆ 'ముప్పి'కోట్లు లేకపోవడం వల్లే అనంతపురం అర్బన్ టికెట్‌ను మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరికి నిరాకరించినట్లు ఆయన అనుచరులు వాపోతున్నారట. ఎన్నికల్లో ఖర్చు పెట్టేందుకు రూ.30 కోట్లు చూపాలని అధినేత అడిగితే.. తన దగ్గర అంత నగదు లేదని, తన తరఫున రూ.20 కోట్ల వరకు ఖర్చు చేసేందుకు కొందరున్నారంటూ.. వారి పేర్లను ప్రభాకర్ చౌదరి చెప్పారట. దీంతో మరో ఆలోచన లేకుండా ఆయనకు సీటు నిరాకరించి, రాప్తాడు మాజీ ఎంపీపీ దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్‌కు ఖరారు చేయడంపై ప్రభాకర్ చౌదరి వర్గం గుర్రుగా ఉంది. గత ఐదేళ్లుగా నియోజకవర్గంలో పార్టీని కాపాడుకుంటూ వచ్చిన తమ నాయకుడిని కాదని, డబ్బుల్లేవన్న కారణంతో వేరేవారికి కేటాయిస్తే తామెలా ఊరకుంటామని, ఎన్నికల్లో తప్పక బుద్ధి చెప్తామని హెచ్చరిస్తున్నారట.







రాజకీయ రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే.. జనంతో మమేకమవుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు చేస్తూ.. ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజల్లో విశ్వసనీయతను చాటుకోవడం ఒక మార్గం.

పూటకో కుట్ర, రోజుకో కుతంత్రం పన్నుతూ.. రాజకీయంగా నీడనిచ్చిన వారికి వెన్నుపోటు పొడుస్తూ.. ప్రత్యర్థులను వర్గ శత్రువులుగా పరిగణించి మట్టుబెడుతూ రక్తపుటేరులు పారించడం రెండో మార్గం..

శకునిలోని కుటిలత్వం.. దుర్యోధనుడిలోని క్రూరత్వం.. దుశ్శాసనుడిలోని కిరాతకం.. ధృతరాష్ట్రుడిలోని కపటత్వం కలగలిసి దుష్టచతుష్టయ లక్షణాలను పుణికిపుచ్చుకున్న రెండున్నర ఎకరాల రైతు కుటుంబానికి చెందిన నారా చంద్రబాబునాయుడు రెండో మార్గాన్నే ఎంచుకున్నారు. విద్యార్థి దశలోనే ఏడుకొండలవాడి పాదాల చెంత ఎస్వీ యూనివర్సిటీని సం'కుల' సమరానికి వేదికగా మార్చారు.. కుల రాజకీయాలతో దాడులకు తెగబడ్డారు. విద్యార్థి నాయకుడి దశ నుంచి రాజకీయ నాయకుడిగా రూపాంతరం చెందాక.. కుట్రలు, కుతంత్రాలు, హత్యా రాజకీయాలతో రక్తపుటేరులకు కేరాఫ్‌గా మారారు. చంద్రబాబు 45 ఏళ్ల రాజకీయ జీవితంలో అడుగడుగునా రక్తపు మరకలే!

# నారాసురుడిది ఆది నుంచీ రక్తచరిత్రే

- సీఎం జగన్‌కు జనం బ్రహ్మరథం.. ఓర్వలేని చంద్రబాబు
- రాళ్లు.. చేతికి ఏది దొరికితే దానితో సీఎం జగన్‌పై దాడి చేయాలంటూ శనివారం తాడికొండలో టీడీపీ శ్రేణులను రెచ్చగొట్టిన వైనం
- విజయవాడ సింగ్‌నగర్‌లో డాబా కొట్ల సెంటర్‌లో అదే రోజు రాత్రి 8.10 గంటలకు సీఎం జగన్‌పై హత్యాయత్నం
- చంద్రబాబు ప్రోద్బలంతోనే ఈ హత్యాయత్నానికి తెగబడ్డారంటున్న వైఎస్సార్‌సీపీ నేతలు, రాజకీయ విశ్లేషకులు
- స్కిల్ స్కామ్‌లో రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి బెయిల్‌పై విడుదలయ్యాక.. చరిత్రలో ఏ రాజకీయ నాయకుడికి జరగని రీతిలో సీఎం జగన్‌ను దారుణంగా శిక్షిస్తానని రంకెలు
- ఆది నుంచి కుట్రలు, కుతంత్రాలు, అరాచకత్వం.. వెన్నుపోట్లు.. హత్యా రాజకీయాలే చంద్రబాబు సిద్ధాంతం
- విద్యార్థి దశలోనే కుల రాజకీయాలతో ఎస్వీ యూనివర్సిటీని భ్రష్టు పట్టించారు..
- అస్థిత్వం కోసం టీడీపీలో చేరి కుట్రలు, కుతంత్రాలు, హత్యా రాజకీయాలు.. తన దోపిడీ గుట్టును రట్టు చేస్తున్నారనే నెపంతో నాటి సీఎం ఎన్టీఆర్ వ్యక్తిగత కార్యదర్శి రాఘవేంద్ర రావును మట్టుబెట్టించడంతో రక్తదాహం ప్రారంభం
- టీడీపీపై పట్టు కోసం ఎన్టీఆర్‌పై మల్లెల బాబ్జీతో హత్యాయత్నం చేయించారని ఆరోపించిన మాజీ సీఎం నాదెండ్ల
- వంగవీటి రంగాను అంత మొందించడంలో చంద్రబాబుదే కీలకపాత్ర అని స్పష్టం చేసిన చేగొండి హరిరామజోగయ్య
- అధికారం కోసం పిల్లనిచ్చిన మామ ఎన్టీఆర్‌కే వెన్నుపోటు.. వైశ్రాయ్ హోటల్ వద్ద చెప్పులతో దాడి
- అవమాన భారం, మనస్థాపంతో మృతి చెందిన ఎన్టీఆర్
- ఎన్టీఆర్ మృతికి ప్రత్యక్ష కారకుడు చంద్రబాబేనని నాడూ, నేడూ చెబుతున్న రాజకీయ విశ్లేషకులు
- 1995 నుంచి 2004 మధ్య రాజకీయ ప్రత్యర్థులను వెంటాడి, వేటాడి మట్టుబెట్టించడమే ధ్యేయం
- రాజకీయ ప్రాబల్యం కోసం అత్యంత ప్రజాదరణ కలిగిన మహానేత వైఎస్ కుటుంబంపై కక్ష తీర్చుకునేందుకు ఎప్పటికప్పుడు కుట్రలు
- విశాఖ ఎయిర్‌పోర్టులో నాటి ప్రతిపక్ష నేత జగన్‌పై హత్యాయత్నం చేయించిన వైనం
- గత ఎన్నికలప్పుడు సాక్షాత్తు కేంద్ర హోంమంత్రి అమిత్ షాపైనే తిరుపతిలో రాళ్లతో దాడి చేయించిన బాబు
- ఇప్పుడు తన రాజకీయ జీవితానికి ముప్పు ఏర్పడటంతో అమిత్ షాతో కాళ్లబేరం
- దుష్టచతుష్టయంతో కలిసి అనునిత్యం కుట్రలే
- సీఎం జగన్‌పై హత్యాయత్నంతో చంద్రబాబు క్రూర స్వభావం మరోమారు బట్టబయలు

- పూర్తి వివరాలు IIIలో

భూ'దందు' పాళ్యం బ్యాచ్-1

# భూ బకాసురుడు

## రాజధాని పేరుతో బాబు సరికొత్త డ్రామా

- ఏలూరు.. నూజివీడు.. నాగార్జున వర్సిటీ అంటూ తొలుత లీకులు
- ఆయా ప్రాంతాల్లో పెరిగిన రియల్ ఎస్టేట్ లావాదేవీలు
- రూ.వందల కోట్లతో సామాన్య రియల్టర్లు, ప్రజలు.. భూములు, స్థలాల కొనుగోలు
- అంతకు ముందే అసలు రాజధాని ఎక్కడో తన వాళ్ల చెవిలో ఊదిన వైనం
- బాబు అండ్ గ్యాంగ్ మాత్రం ఆ 29 గ్రామాల పరిధిలో కారుచౌకగా భూముల కొనుగోలు
- ఆనక ఆ ప్రాంతానికి అమరావతి అని పేరుపెట్టి.. రాజధానిగా ప్రకటన
- ఈ కుట్రతో మోసపోయిన రియల్టర్లు, ప్రజలు
- సమిధలుగా మారిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రైతులు.. 1500 ఎకరాల అసైన్డ్, ప్రభుత్వ, లంక భూముల దోపిడీ
- ఆర్థికంగా దివాలా తీసిన పలువురు వ్యాపారులు
- లింగమనేని, నారాయణలకు మేలు చేసేలా రింగ్ రోడ్డు అలైన్‌మెంట్
- మేలు చేసిన బాబుకు లింగమనేని కరకట్ట నివాసం కానుక
- హెరిటేజ్ ఫుడ్స్‌కూ భూ బహుమానం..
- స్విస్ చాలెంజ్ పేరిట మాయలమరాఠీ ఒప్పందం
- నిర్మాణాల పేరిట అస్మదీయులకు కాంట్రాక్టులు
- నాసిరకం నిర్మాణాలతోనూ కమీషన్లు దండుకున్న బాబు



**తమ సొమ్ము సోమవారం.. ఒంటి పొద్దులుంటారు..
మంది సొమ్ము మంగళవారం... ముప్పొద్దుల తింటారు..**
అనే నానుడి చంద్రబాబు నాయుడికి అక్షరాలా సరిపోతుంది. శివరామకృష్ణన్ కమిటీ చెప్పినట్లు విశాఖపట్నం, దొనకొండ, తిరుపతి, శ్రీకాళహస్తిల్లో ఎక్కడో ఒక చోట రాజధానిని ఏర్పాటు చేస్తే తనకు మిగిలేదేముందనే దురాలోచన బాబు మెదడులో మొలకెత్తింది. ఇంకేముంది.. ఆ 29 గ్రామాల ప్రాంతంలో మూడు పంటలు పండే జరీ భూములపై కన్నేశారు. ఈ క్రమంలో తన సహచరుడు పొంగూరు నారాయణను ముందు పెట్టి సరికొత్త డ్రామాకు తెరలేపారు. తన పరివారం చెవిలో అసలు రాజధాని ఎక్కడొస్తుందో చెప్పేశారు. వారి ద్వారా ఆ ప్రాంతంలో భూములు కొనిపించి, ఆ భూములకు కోట్ల విలువ వచ్చేలా కుట్ర పన్నారు. బాబు అమరావతి నాటకంలో అసైన్డ్ భూముల్ని కోల్పోయిన ఎస్సీ, ఎస్టీ, బీసీలు సమిధలయ్యారు. బాబు అండ్ కో మాత్రం లక్షల కోట్ల విలువైన భూ కుంభకోణానికి పాల్పడింది.

సాక్షి, అమరావతి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత నవ్యాంధ్రప్రదేశ్‌లో రాజధాని ఎక్కడ ఏర్పాటు చేయాలనే విషయాన్ని నిర్ణయించేందుకు కేంద్ర ప్రభుత్వం శివరామకృష్ణన్ నేతృత్వంలో ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ రాష్ట్రమంతా పర్యటించి... భూముల లభ్యత, వ్యవసాయ అవసరాలు, భవిష్యత్తు ప్రయోజనాలను శాస్త్రీయంగా విశ్లేషించి సహేతుకమైన సిఫార్సులు చేసింది. ఉత్తరాంధ్రలోని విశాఖపట్నం, ప్రకాశం జిల్లాలోని దొనకొండ, రాయలసీమలోని తిరుపతి, శ్రీకాళహస్తి ప్రాంతాల్లో ఎక్కడైనా రాజధానిని ఏర్పాటు చేయవచ్చని సూచించింది. 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. శివరామకృష్ణన్ కమిటీ సిఫార్సులను బుట్టదాఖలు చేశారు. తన బినామీ, సన్నిహితుడైన మంత్రి పొంగూరు నారాయణ నేతృత్వంలో మరో కమిటీని నియమించి.. పలు నాటకీయ పరిణామాల మధ్య రాజధానిగా అమరావతిని ఖరారు చేశారు.

**సామాన్య రియల్టర్లను ముంచిన బాబు...**

అమరావతిలో భూ దోపిడీకి పాల్పడటానికి ముందు రాజధాని లీక్స్ పేరిట చంద్రబాబు రాష్ట్రంలోని సామాన్య రియల్టర్లు, సాధారణ ప్రజలను బురిడీ కొట్టించారు. రాజధానిగా ఏలూరు అని ఓసారి... నూజివీడు అని మరోసారి... కాదు కాదు... నాగార్జున యూనివర్సిటీ సమీపంలో అని ఇంకోసారి ప్రచారంలోకి తీసుకువచ్చారు. తన ఎల్లో మీడియా ద్వారా ఉద్దేశ పూర్వకంగా లీకులు ఇప్పించి వార్తలు రాయించారు. ఆ పచ్చమాటలు నమ్మి సాధారణ రియల్టర్లు అప్పులు చేసి మరీ ఆ ప్రాంతాల్లో భూములు కొనుగోలు చేశారు. మధ్య, ఎగువ మధ్య తరగతి వర్గాలకు చెందిన వారు కొద్దికొద్దిగా పొదుపు చేసిన మొత్తాలతో అక్కడ స్థలాలు కొన్నారు. చివరికి చంద్రబాబు ఆ మూడు ప్రాంతాల్లో కాకుండా గుంటూరు జిల్లాలోని


- మిగతా IIIలో

**అయ్యన్న.. అక్రమాలకు పసుపుచొక్కా, ఫ్యాంటూ వేస్తే వచ్చే జానాబెత్తెడు రూపం ఆయనది. ఆడవారిని అది.. దాన్ని.. ఎవర్తది.. లం.. ఇలాంటి పదాలతో సంబోధించే సంస్కారహీనుడెవరంటే గుర్తొచ్చేది ఆయనే.. ఉత్తరాంధ్రలో చింతకాయల అయ్యన్నపాత్రుడిగా కంటే.. 'చిత్తకార్తె' అయ్యన్నపాత్రుడిగానే పేరొందిన గొప్పోడు మరి.**

అయ్యన్న పేరు చెప్తే చాలు.. హన్నన్న నాకేంటి? అనే మాటే గుర్తుకొస్తుంది. నేల నుంచి చూస్తే పెద్ద ఎత్తేం కాదు. మందేసినా.. మందలో ఉన్నా.. ఆయన నోటి నుంచి వచ్చేది శుద్ధ గ్రాంధికమే..! ఆయన ఏ పని చేయాలన్నా, చేయకూడదన్నా.. 'మా మూలు'గా ఉండదు మరి. లేటరైట్ ఖనిజం పేరిట రూ.వందల కోట్లు దోచుకున్నా, కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు చేసినా, పంట కాల్వలను, ప్రభుత్వ భూములను కబ్జా చేసినా, అధికారులను, ప్రజాప్రతినిధులను అడ్డగోలుగా బెదిరించినా, మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించినా.. అయ్యన్నే సాటి.

### అయ్యన్న.. హన్నన్న..

ఓట్లా అభ్యర్థులు?



# నేరాల ప్రీతిపాత్రుడు

-వివరాలు IIలో

## ప్రజాస్వామ్యం కారాదు ధనస్వామ్యం



ఎన్నికల్లో అభ్యర్థులు ఓట్ల కొనుగోలుకు రూ.కోట్లు ఖర్చు చేస్తున్నారు. గెలిచాక ప్రజా సమస్యలు గాలికొదిలి చేసిన వ్యయాన్ని రాబట్టుకునేందుకు అక్రమ ఆదాయ మార్గాలను వెతుక్కుంటున్నారు. ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలిపోటులాంటిది. అధికారం కోసం ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చే పార్టీలను, నాయకులను నమ్మకూడదు. జన సంక్షేమం కోసం పాటుపడే వారికే పట్టంకట్టాలి. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే నేతలను తరిమికొట్టాలి. ప్రజలందరూ ప్రజాస్వామ్య స్ఫూర్తి రక్షణకు నడుంకట్టాలి.

- కర్రి శ్రీనివాసరెడ్డి, విశ్రాంత రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు, గొల్లలమామిడాడ, తూర్పుగోదావరి జిల్లా

## మీరూ స్పందించండి

పబ్లిక్ వాయిస్

ఎన్నికల గురించి మీరేం అనుకుంటున్నారు.. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య తేడా ఏమిటి? పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెరగాలంటే మీ సూచనలేంటి? అభివృద్ధికి మీరిచ్చే నిర్వచనం ఏమిటి? ప్రజలకు, రాజకీయ పార్టీలకు మీరేమైనా చెప్పాలనుకుంటున్నారా? ఇలా ఎన్నికలకు సంబంధించి ఏ అంశంపై అయినా సరే మీ అభిప్రాయాలను 73867 92224 నంబర్‌కు మీ ఫొటో సహా వాట్సాప్ ద్వారా పంపిస్తే ప్రచురిస్తాం.

## విశ్వసనీయతకే పట్టం



రాజకీయ పార్టీలు, నేతలు తమ విశ్వసనీయత చాటుకోవాలి. ఇచ్చిన హామీలు తూ.చా.తప్పకుండా అమలు చేయాలి. మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌లా భావించాలి. గత ప్రభుత్వం అస్తవ్యస్త విధానాలతో రాష్ట్రాన్ని నాశనం చేసింది. ఇచ్చిన హామీలన్నింటినీ అటకెక్కించింది. ప్రస్తుత ప్రభుత్వం వల్ల అట్టడుగు నిరుపేదవర్గాలకూ సంక్షేమ ఫలాలు అందుతున్నాయి. ఇంటి ముంగిటకే అన్ని రకాల సేవలూ ష్యూకడుతున్నాయి. మేనిఫెస్టోలో ఇచ్చిన అన్ని హామీలనూ వైఎస్సార్ సీపీ అమలు చేసింది. ఈ సర్కారు పాలన బాగుంది. అందరూ ఓటు హక్కును కచ్చితంగా వినియోగించుకునేలా నిర్బంధ ఓటు హక్కు చట్టం తేవాలి.

- రాజశేఖర్ గవరసాన, కాండ్రకోట, పెద్దాపురం నియోజకవర్గం, కాకినాడ జిల్లా

# వైఎస్ జగన్ పులిబిడ్డ



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎదుర్కొన్న కష్టాలు, చేసిన పోరాటాల నడుమ విజయం సాధించారని, ఇటీవలే ఆయన్ను వ్యక్తిగతంగా కలిసినప్పుడు ఒక పులి బిడ్డను చూసిన ఫీలింగ్ కలిగిందని జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్ వ్యాఖ్యానించారు. 'ఆయన నవ్వు, చూపిన అభిమానం పలకరింపులోని స్వచ్ఛత నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయి" అని చెప్పారు. అటు చదువు ఇటు ఆటల్లోనూ రాణిస్తూ పిన్న వయసులోనే అద్భుతాలు లిఖిస్తూ ఏ రికార్డు కైనా చిరునామా అన్నట్టుగా మారిన యువ క్రీడా సంచలనం నైనా 'సాక్షి'తో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌తో తన అనుబంధం గురించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విలక్షణ వ్యక్తిత్వంపై పలు విషయాలు పంచుకున్నారు ఆ విశేషాలు ఆమె మాటల్లోనే..

- కాన్ఫిడెన్స్, డైనమిజమ్ అవన్నీ ఆయనలో ఉన్నాయి
- ఆడుదాం.. ఆంధ్ర అద్భుతమైన కార్యక్రమం
- దీనిద్వారా మట్టిలో మాణిక్యాలు వెలికితీయొచ్చు
- ఇక్కడి మార్పులు స్వయంగా గమనించా
- అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి 'నైనా జైస్వాల్' కితాబు




ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల విజయవంతంగా అమలు చేసిన 'ఆడుదాం – ఆంధ్రా' కార్యక్రమం అద్భుతం. ఒక క్రీడాకారిణిగా ఔత్సాహిక క్రీడాకారులు ఎదుర్కొనే సమస్యలు నాకు తెలుసు. నాకు అన్ని విధాలుగా మా తల్లిదండ్రుల మద్దతు పుష్కలంగా ఉండడం వల్ల నేను పెద్దగా సమస్యలు ఎదుర్కోనప్పటికీ... నా ఈడు వాళ్లు ఆర్థికంగా, శిక్షణ, వసతుల పరంగా ఎన్ని కష్టాలు అనుభవించారో నాకు తెలుసు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వమే చొరవ తీసుకుని మట్టిలోని మాణిక్యాలను వెలికితీయడానికి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం చేపట్టడం హర్షణీయం.

### ఆంధ్రప్రదేశ్‌తో అల్లుకున్న అనుబంధం...

పుట్టింది హైదరాబాద్ అయినా కొంత కాలంగా ఆంధ్రప్రదేశ్‌తో నా అనుబంధం అనేక రకాలుగా పెనవేసుకుపోయింది. ఏపీలో అనేక క్రీడా పోటీల కోసం రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించాను. మోటివేషనల్ స్పీకర్‌గానూ ఇక్కడి కళాశాలల్లో, ఈవెంట్స్‌లో ప్రసంగించాను. ఆంధ్రప్రదేశ్ పోలీస్‌కి బ్రాండ్ అంబాసిడర్‌గా కూడా పనిచేశాను. అప్పుడు ఇక్కడ జరిగిన అభివృద్ధిని గమనించాను.

### ఆడపిల్లలకు 'దిశ'తో సంపూర్ణ రక్షణ

ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఆడపిల్లలపై ఎన్నో రకాల అఘాయిత్యాలు జరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో దిశ పేరుతో ఆంధ్రప్రదేశ్‌లో చట్టం తీసుకురావడం మంచి పరిణామం. అద్భుతమైన పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయడం...అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ దిశ యాప్‌ను రూపొందించడం ఇవన్నీ స్వాగతించదగ్గ మార్పులు.

## నవరత్నాలు.. మెరుపులు

అమ్మ ఒడి పథకం వచ్చిన తర్వాత పేదపిల్లలు చదువుకోవడం నేను గమనించాను. కేవలం పిల్లల్ని స్కూల్‌కి వచ్చేలా చేస్తే సరిపోదు. అందుకే నాడు నేడు ద్వారా స్కూల్స్‌ని కూడా అభివృద్ధి చేయడం కూడా దానికి అనుబంధమైన అవసరమైన ఆలోచన. ఈ పథకం విజయం గమనించిన తర్వాత మహిళల స్వయం ఉపాధి, చేయూత వంటి పథకాలు నాకు బాగా నచ్చాయి. ఇటీవల సీఎం వైఎస్ జగన్‌ని కలిసినప్పుడు ఆయన మాతో సంభాషించిన తీరు ఎంత చెప్పినా సరిపోదు. ఆయన్ను కలవడం నా జీవితంలో మ ర్చిపోలేని జ్ఞాపకం. ము ఖ్యంగా ఆయన నవ్వు..ఓ మెవస్ అని చెప్పాలి. మనం ఏ స్థాయికి చేరుకున్నా, ఎదుటివారిని చూసి అభి మానంగా నవ్వగలిగితే అదే వారికి మనం ఇచ్చే అందమైన బహుమతి. అలాగే కాన్ఫిడెన్స్, ఫైటింగ్ డెడికేషన్, డైనమిజమ్ వంటివన్నీ క్రీడాకారుల్లో కనిపించే లక్షణా లు. అవన్నీ ఆయనలో నాకు కనిపించాయి. క్రీడలు, మహిళల ఉపాధి వంటి విషయాల్లో నా అవసరం ఉంటే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి నేను సిద్ధం.

- సాక్షి, అమరావతి

## ఆ నియోజకవర్గాల్లో ఒక్కసారే ఎన్నికలు!



నియోజకవర్గాల పునర్విభజన కారణంగా చాలా ప్రాంతాల్లో కేవలం ఒక్క సారి మాత్రమే ఎన్నికలు నిర్వహించారు. వీటిలో 1952లో శ్రీకాకుళం జిల్లాలో హొంజరం ఒకటి. విజయనగరం జిల్లా నుంచి 1962లో పాచిపెంట(ఎస్టీ), రామతీర్థం(ఎస్టీ), బొద్దాం నియోజకవర్గాలు ఉన్నాయి. తూర్పు గోదావరిలో కరప, కోరుకొండ నియోజకర్గాల్లోను ఒక్కసారే ఎన్నికలు జరిగాయి. ఇక పశ్చిమ గోదావరిలో అలంపురం నియోజకవర్గం, కృష్ణా జిల్లాలో విజయవాడ నియోజకవర్గంలో 1952లో ఎన్నికలు నిర్వహించారు. గుంటూరు జిల్లాలో 1952లో ఏకంగా నాలుగు, అంటే అమృతలూరు, గుంటూరు, బెల్లంకొండ, పల్నాడు నియోజకవర్గాల్లో జరిగాయి. కర్నూలు జిల్లాలో 1955లో సిర్వేరు, 1955లో మిద్దూరు నియోజకవర్గాల్లో ఒక్కసారే ఎన్నికలు నిర్వహించారు. చిత్తూరు జిల్లాలో 1952లో చంద్రగిరి, పలమనేరు(జనరల్) నియోజకవర్గాల్లో, 1962లో యేర్పేడు నియోజకవర్గాల్లోను ఒక్కసారి మాత్రమే ఎన్నికలు జరిగాయి.

# అయ్యన్న.. హన్నన్నా.. లేటరైట్ ప్రీతిపాత్రుడు



## లేటరైట్‌ను దోచుకున్న మాజీ మంత్రి కుటుంబీకులు

- అధికారాన్ని అడ్డుపెట్టుకుని రూ.వందల కోట్ల అక్రమార్జన
- అప్పట్లో లేటరైట్ అనుమతులు రద్దు చేస్తూ ఇచ్చిన కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్
- పంట కాలువనూ కబ్జా చేసి అక్రమ నిర్మాణం
- విధుల్లో ఉన్న ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్‌పై దాడి
- కొండలనూ కొల్లగొట్టిన ఘనుడు

**సాక్షి, అనకాపల్లి:** ఏజెన్సీ ముఖద్వారమైన నర్సీపట్నం నియోజకవర్గంలోని నాతవరం మండల పరిధిలో వేలాది హెక్టార్లలో ఉన్న విలువైన ఖనిజం లేటరైట్. ఈ ఖనిజం అంటే మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత అయ్యన్నపాత్రుడికి ఎంతో ప్రీతి. టీడీపీ హయాంలో తన అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఖనిజ నిల్వలను అక్రమంగా తవ్వుకుని రూ.వందల కోట్లు ఆర్జించారు. ఇందులో ఆయన తనయుడు విజయ్ ప్రధాన భాగస్వామి. అప్పట్లో ఖనిజ సంపద తవ్వకాల అనుమతులు రద్దు చేస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలిచ్చినా అమలు కాలేదు. తవ్వకాలను వ్యతిరేకించిన గిరిజనులపై తప్పుడు కేసులు పెట్టించి తీవ్ర ఇబ్బందులకు గురి చేశారు. చివరికి శివపురంలోని పంట కాలువనూ అయ్యన్న వదల్లేదు. కాలువను ఆక్రమించి మరీ తన ఇంటి నిర్మాణం చేపట్టారు. తొలగించేందుకు వచ్చిన అధికార యంత్రాంగంపై దాడికి తెగబడ్డారు.

### అప్పటి సరుగుడు సర్పంచ్‌పై ఒత్తిడి

బమిడికలొద్ది ఏరియాలో 110 హెక్టార్ల లీజుదారుడైన జర్తా లక్ష్మణరావును తన బినామీకి 80 శాతం వాటా ఇవ్వాలని అయ్యన్న తనయుడు అప్పట్లో డిమాండ్ చేశారు. దీనికి ఆయన నిరాకరించాడు. దీంతో మైనింగ్ లీజు రద్దు చేయించేందుకు తీర్మానం చేయాలంటూ ప్రస్తుత ఎంపీపీ, అప్పటి సరుగుడు పంచాయతీ సర్పంచ్ లక్ష్మణ్ మూర్తిపై విజయ్ ఒత్తిడి చేశారు. దీంతో లక్ష్మణ్‌మూర్తి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే సరుగుడు పంచాయతీలో జర్తా లక్ష్మణరావుకు మైనింగ్ కోసం ఇచ్చిన పంచాయతీ తీర్మానం సరైనది కాదని, రికార్డులు తారుమారు చేశారంటూ అప్పటి మంత్రి అయ్యన్న పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. అంతటితో ఆగకుండా తక్షణ విచారణ చేపట్టాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. విచారణ చేపట్టిన జిల్లా అధికారులు పంచాయతీ తీర్మానానికి రెండు పుస్తకాలను వినియోగించటమే కాకుండా కొన్ని పొరపాట్లు చేశారని పంచాయతీరాజ్‌శాఖ ముఖ్య కార్యదర్శికి నివేదించారు. అయ్యన్న ఒత్తిడితో ఆ రోజు చేసిన తీర్మానాలన్నింటినీ రద్దు చేయాలని కలెక్టర్‌ను పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశించారు. అప్పటి కలెక్టర్ యువరాజ్ సరుగుడు ప్రాంతంలో మైనింగ్ తవ్వకాలు జరగకుండా చూడాలని తొమ్మిది శాఖల అధికారులను ఆదేశిస్తూ ఉత్తర్వులిచ్చారు.

> టీడీపీ హయాంలో లేటరైట్ అనుమతుల కోసం మైనింగ్ మాఫియా బినామీలైన సింగం భవాని పేరిట 5 హెక్టార్లు, కిల్లో లోవరాజు పేరుతో 35 హెక్టార్లలో లేటరైట్ తవ్వకాలకు ప్రభుత్వం నుంచి అనుమతులు పొందారు. చట్టంలో ఉన్న లొసుగులను ఆసరాగా చేసుకుని అయ్యన్న తనయుడు విజయ్ సహకారంతో కాకినాడకు చెందిన అబ్బాయిరెడ్డి, బుజ్జి, తోట నవీన్, శ్రీనివాస్ అలియాస్ నల్లశ్రీను ఏకమై తవ్వకాలు చేపట్టారు. రూ.300 కోట్ల నుంచి రూ.500 కోట్ల విలువైన ఖనిజాన్ని అక్రమంగా తవ్వి, సొమ్ము చేసుకున్నారన్న ఆరోపణలున్నాయి. కలెక్టర్ అనుమతులు రద్దు చేసినా నిరాటంకంగా తవ్వకాలు సాగించారు.

### అక్రమ నిర్మాణంపై ప్రశ్నిస్తే దౌర్జన్యం

నర్సీపట్నంలోని శివపురంలో 10 అడుగుల ఇరిగేషన్ పంట కాలువను అయ్యన్నపాత్రుడు కబ్జా చేసి, అక్రమంగా ఇంటిని నిర్మించారని జిల్లా అధికారులు గుర్తించారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఆక్రమణను తొలగించాలని నోటీసులిచ్చినా ఆయన స్పందించలేదు. దీంతో నిబంధనలు ఉల్లంఘించి చేపట్టిన నిర్మాణాన్ని తొలగించేందుకు 2022 జూన్ 20న అధికారులు ప్రయత్నించారు. దీన్ని అయ్యన్న కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. జేసీబీ ఆపరేటర్లను బెదిరించడంతో వారు జేసీబీ వదిలి వెళ్లిపోయారు. టీడీపీ కార్యకర్తలు భారీ ఎత్తున చేరుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్‌పై దాడి చేసి, అతని చేతిలో కెమెరా లాక్కున్నారు. జాయింట్ సర్వే చేయించి ఆక్రమణలు నిరూపిస్తే తామే తొలగిస్తామని అప్పటి ఆర్డీవో గోవిందరావుకు అయ్యన్న రెండో కొడుకు రాజేష్ వినతిపత్రం అందించారు. ఆర్డీవో ఆదేశాలతో రెవెన్యూ అధికారులు రీసర్వే చేపట్టారు. సర్వే చేస్తుండగా టీడీపీ కార్యకర్తలు సర్వేను అడ్డుకుని కొలత చెయిన్ లాక్కున్నారు. రికార్డులు పట్టుకుపోయారు. పోలీసుల హెచ్చరికలతో సర్వే రికార్డులను తిరిగి అప్పగించారు. టీడీపీ కార్యకర్తలు జేసీబీ అద్దాలు పగులగొట్టడంతోపాటు టైర్లలో గాలి తీసేశారు. ఇప్పటికీ ఆ జేసీబీ అక్కడే ఉత్సవ విగ్రహంలా దర్శనమిస్తోంది. ఈ గొడవ జరుగుతుండగానే అయ్యన్న కోర్టును ఆశ్రయించి అదే రోజు సాయంత్రానికి కోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారు. ప్రస్తుతం ఈ వివాదం కోర్టులో నలుగుతోంది.

### రేప్ కేసు సహా 23 ఎఫ్ఐఆర్‌లు

**అయ్యన్నపై ఇప్పటివరకూ రేప్ సహా 23 కేసులు నమోదయ్యాయి. బట్టలూడదీసి కొడతానని మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణిని ఉద్దేశించి చేసిన అనుచిత వ్యాఖ్యలపై 2020లో క్రైమ్ నెం. 777/2020 యు/ఎస్ 354(ఏ), 500, 504, 505(1)(బి), 505(2), 506, 509 ఐపీసీ కింద నర్సీపట్నం టౌన్ స్టేషన్‌లో రేప్ కేసు నమోదైంది.**

**దళితులను దూషించినందుకు క్రైమ్ నెం. 690/2020 యు/ఎస్ 3(ఐ)(ఆర్), 3(ఐ)(యు) ఆఫ్ ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది.**

**తప్పుడు డాక్యుమెంట్ సృష్టించి ఇరిగేషన్ కాలువను ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపట్టినందుకు అమరావతి సీఐడీ పోలీసులు క్రైమ్ నెం.64/2022 యు/ఎస్ 464, 467, 471, 474 ఆర్/డబ్ల్యూ 120-బి, 34 ఐపీసీ సెక్షన్ల కింద ఫోర్జరీ కేసు నమోదు చేశారు.**

**ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించటంపై క్రైమ్ నెం.542/2019 యు/ఎస్ 179, 186, 189, 353, 500, 504 ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.**

**పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించి వారి విధులకు ఆటంకం కలిగించినందుకు క్రైమ్ నెం. 10/2020 యు/ఎస్ 341, 188, 189, 504, 505,(1)(బి) ఐపీసీ కింద కేసు నమోదైంది.**

## చిత్రం సాక్షిగా

### ధూళిపాళ్లను చూడండివాళ..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల గ్రామ రూపు రేఖలు పూర్తిగా మారిపోయాయి. ఈ గ్రామంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతోంది. రూ.8.89 కోట్లతో ఈ పనులు శరవేగంగా పూర్తయ్యాయి.ఒకే గ్రామంలో నవరత్నాలు మాదిరిగా తొమ్మిది కార్యాలయాలు కొలువుదీరి కనువిందు చేయడంతో పల్లె ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కోట్ల వ్యయమంతా మా గ్రామానికే తరలివచ్చి మా కష్టాల్లో పాలు పంచుకుంటున్నాయని, గతంలో ఎన్నో ప్రభుత్వాలు వచ్చిపోయాయి కానీ ఇలా జరగలేదని ఆ గ్రామ పెద్దలు చెప్పడం గమనార్హం. ఈ గ్రామంలో 1359 కుటుంబాలు...5,468 మంది జనాభా ఉంది.

- సత్తెనపల్లి




రూ. 17.50 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం




రూ. 21.50 లక్షలతో రైతు భరోసా కేంద్రం



రూ.40 లక్షలతో సచివాలయ భవనం




రూ. 5 లక్షలతో బాలవికాస వాటర్ ప్లాంట్ భవనం



దేచవరం డొంక రోడ్డు



ధూళిపాళ్లలో నిర్మించిన సీసీ రోడ్డు



నాడు–నేడు ఫేజ్–1 కింద రూ. 23 లక్షలతో సర్వాంగ సుందరంగా ఎంపీపీ పాఠశాల

# భూ బకాసురుడు!

▶ మొదటి పేజీ తరువాయి

తుళ్లూరు, తాడేపల్లి, మంగళగిరి మండలాల పరిధిలోని 29 గ్రామాలను రాజధాని ప్రాంతంగా ఎంపిక చేసి అమరావతి అని నామకరణం చేశారు. చంద్రబాబు కుట్రను గ్రహించలేక ఏలూరు, నూజివీడు, నాగార్జున యూనివర్సిటీ సమీప ప్రాంతాల్లో వేలాది ఎకరాలను కొనుగోలు చేసిన రియల్టర్లు వందల కోట్ల రూపాయలు నష్టపోయి నిండా మునిగారు. వారిలో కొందరు ఆత్మహత్యలకు పాల్పడటం అందరినీ కలచివేసింది.

### సింగపూర్ ముసుగులో స్విస్ చాలెంజ్

- రాజధాని ప్రాంతంలో స్టార్టప్ ఏరియా అభివృద్ధి పేరిట చంద్రబాబు అంతర్జాతీయ భూ కుంభకోణానికి తెరతీశారు. సుప్రీంకోర్టు అభ్యంతరం తెలిపిన స్విస్ చాలెంజ్ విధానం ద్వారా భారీ కుంభకోణానికి తెగబడ్డారు.
- సింగపూర్ ప్రభుత్వంతో ఒప్పందం అని చెబుతూ... తన సన్నిహితుడైన సింగపూర్ మంత్రికి చెందిన ప్రైవేటు కంపెనీతో వ్యవహారం నడిపారు. రైతుల నుంచి సేకరించిన భూమిని సింగపూర్ కంపెనీకి అప్పగించి ప్రభుత్వమే రూ.5 వేల కోట్లతో మౌలిక వసతులను అభివృద్ధి చేస్తే.. సింగపూర్ కంపెనీ స్టార్టప్ ఏరియాను అభివృద్ధి చేస్తుందనే ఓ మాయామోహ ఒప్పందాన్ని తెరపైకి తెచ్చారు.
- భూములు, నిధులు కల్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి 48% వాటా.. సింగపూర్ కంపెనీకి 52% వాటా కల్పించేలా ఒప్పందాన్ని ఖరారు చేశారు. సింగపూర్ కంపెనీ ముసుగులో తమ కుటుంబం గుప్పిట్లోనే స్టార్టప్ ఏరియా ఉండేలా చంద్రబాబు కుతంత్రంతో రూ. 66 వేల కోట్ల దోపిడీకి పన్నాగం పన్నారు.
- కట్టని రాజధాని... అమరావతిలో నిర్మించని ఇన్నర్ రింగ్ (ఐఆర్ఆర్) రోడ్డు పేరిట చంద్రబాబు, నారాయణ ద్వయం తమ భూముల ధరలను అమాంతం పెంచేలా కుట్ర పన్నింది. ఇందుకు లింగమనేని రమేశ్ కుటుంబంతో క్విడ్ ప్రో కోకు పాల్పడింది.
- లింగమనేని, చంద్రబాబు, నారాయణ కుటుంబాలకు చెందిన భూములను ఆనుకుని నిర్మించేలా ఐఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను అష్ట వంకర్లు తిప్పింది. తద్వారా కృష్ణా నదికి అటు వైపు, ఇటువైపు ఉన్న తమ భూముల విలువ రూ.2 వేల కోట్లకుపైగా పెరిగేలా స్కెచ్ వేసింది. లింగమనేని కుటుంబానికి అడ్డగోలుగా ప్రయోజనం కల్పించినందుకు ప్రతిఫలంగా ఆ కుటుంబం నుంచి చంద్రబాబుకు కరకట్ట నివాసం, హెరిటేజ్ ఫుడ్స్‌కు భూములను పొంది క్విడ్ ప్రో కోకు పాల్పడ్డారు.

### ముందస్తు పన్నాగంతోనే...

- ➤ చంద్రబాబు పక్కా పన్నాగంతోనే గుంటూరు జిల్లాలోని తుళ్లూరు, తాడేపల్లి, మంగళగిరి మండలాల పరిధిలోని 29 గ్రామాల చుట్టుపక్కల ఆయన, తన సన్నిహితులు, బినామీలు అతి తక్కువ ధరలకు వేలాది ఎకరాలను కొనుగోలు చేశారు. అనంతరం ఆ ప్రాంతాన్ని రాజధానిగా టీడీపీ ప్రభుత్వం ప్రకటించే సరికి ఆ ప్రాంతంలో భూముల ధరలు అమాంతం పెరిగాయి. తద్వారా కేవలం రాజధాని ప్రకటనతోనే చంద్రబాబు రూ.లక్ష కోట్ల భూ దోపిడీకి పాల్పడ్డారు.
- ➤ రాజధాని కోసం భూ సమీకరణ పేరిట చంద్రబాబు బరితెగించి రైతుల భూములపై దండయాత్రకు పాల్పడ్డారు. రైతులను మ భ్య పెట్టి వారి భూములు కొల్లగొట్టడం... అసైన్డ్ భూముల దోపిడీ... ప్రభుత్వ భూ ముల కబ్జా... లంక భూముల ఆక్రమణ... ఇలా యథేచ్ఛగా దోపిడీకి బరితెగించారు. తద్వారా మరో రూ.లక్ష కోట్ల భూకుంభకోణానికి పాల్పడిన చంద్రబాబు తానొక భూబకాసురుడినని నిరూపించుకున్నారు.
- ➤ అమరావతి పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద రైతులను భయభ్రాంతులకు గురిచేసి, వారి అసైన్డ్ భూములను చంద్రబాబు ముఠా కొల్లగొట్టింది. భూ సమీకరణ కింద అసైన్డ్ భూములకు పరిహారం ఇవ్వబోమని బెదిరించి.. వాటినీ చెరబట్టింది. తర్వాత ఆ భూములకు భూ సమీకరణ ప్యాకేజీ ప్రకటించడం ద్వారా చంద్రబాబు ప్రభుత్వ అధినేత హోదాలోనే దాదాపు 1,500 ఎకరాల అసైన్డ్, ప్రభుత్వ, లంక భూముల దోపిడీకి పాల్పడ్డారు.

### నిర్మాణాలు తాత్కాలికం.. దోపిడీ శాశ్వతం

- మిడతల దండు దాడి చేసి పచ్చని పంటలను నాశనం చేసినట్టు చంద్రబాబుతో పాటు ఆయన కుటుంబ సభ్యులు, టీడీపీ ప్రభుత్వంలో మంత్రులు, టీడీపీ నేతలు, వారి బినామీలు అమరావతి భూములపై దాడికి తెగబడ్డారు. చంద్రబాబు, లోకేశ్‌లతో పాటు టీడీపీ నేతలు, నారాయణ, సుజనా చౌదరి, ప్రత్తిపాటి పుల్లారావు, మాగంటి మురళీమోహన్, కొమ్మాలపాటి శ్రీధర్, కోడెల శివప్రసాద్ కుమారుడు శివరామ కృష్ణ, ధూళిపాళ్ల నరేంద్ర, పయ్యావుల కేశవ్, బాలకృష్ణ వియ్యంకుడు ఎంఎస్‌పీ రామారావులతో కూడిన పచ్చ దండు భూములను కొల్లగొట్టింది.
- అమరావతిలో తాత్కాలిక రాజధాని భవనాల ముసుగులో టీడీపీ ప్రభుత్వ పెద్దలు అడ్డూ అదుపూ లేకుండా అవినీతికి పాల్పడ్డారు. శాసన మండలి, సచివాలయం, విభాగాధిపతుల భవనాలు, ఇతర నిర్మాణాల పేరిట అస్మదీయులకు అడ్డగోలుగా కాంట్రాక్టులు కట్టబెట్టారు. అంచనా వ్యయం కంటే భారీగా అధిక శాతానికి టెండర్లు ఖరారు చేసి భారీగా కమిషన్లు దండుకున్నారు. కాంట్రాక్టు సంస్థలు అత్యంత నాసిరకంగా తాత్కాలిక రాజధాని భవనాలను నిర్మించి చేతులు దులుపుకున్నాయి. చిన్నపాటి చినుకులకే కారిపోయేలా.. ఎక్కడికక్కడ పెచ్చులు, ఫ్లోరింగ్ ఊడిపోతూ ఉన్న ఆ భవనాలు చంద్రబాబు ప్రభుత్వ అవినీతికి అద్దం పడుతున్నాయి.
- రైతులను మభ్యపెట్టి తీసుకున్న అమరావతిలోని భూములను చంద్రబాబు తన అస్మదీయులకు అడ్డగోలుగా కేటాయించేశారు. ప్రభుత్వ రంగ సంస్థల భవనాలకు అధిక ధరలకు భూములు కేటాయించిన టీడీపీ ప్రభుత్వం.. ఆ పార్టీకి సన్నిహితులైన ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలకు మాత్రం కారుచౌకగా భూములు కేటాయించడం చంద్రబాబు వంటి కుంభకోణాల సామ్రాట్‌కే సాధ్యమైంది.

# ఇవిగో నవరత్నాల వెలుగులు

రాష్ట్రంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి పాలనలో అప్రతిహతంగా అమలవుతున్న నవరత్నాల పథకాల ద్వారా తమ బతుకులు ఎలా మెరుగుపడ్డాయో 'సాక్షి'తో పంచుకున్న అభిప్రాయాలు వారి మాటల్లోనే...

## మా బతుకులు మార్చిన దేవుడు



చిన్నపాటి వ్యాపారం చేసుకుని బతికే కుటుంబం మాది. ఇటీవలి కాలం వరకూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటలో చిన్న కిరాణా షాపు ద్వారా జీవనం సాగించాం. నా భర్త సుతావల్లి సత్రాజుకు వయసుమీరడం, వ్యాపారం తగ్గిపోవడంతో పాటు స్వల్ప అనారోగ్యానికి గురికావడంతో దుకాణం ఆపేశాం. దీంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. అటువంటి పరిస్థితుల్లో ఆపద్బాంధవునిలా వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టారు. ఎన్నో ఏళ్లుగా మంజూరు కాని వృద్ధాప్య పింఛను నా భర్తకు మంజూరైంది. నాకు ఈబీసీ నేస్తం కింద ఏడాదికి రూ.15 వేలు, ఇంటర్ చదువుతున్న మా అబ్బాయి శ్రీదత్త సాయి నాగపుష్యంత్‌కు అమ్మఒడి కింద రూ.15 వేలు ఆర్థిక సాయం ఏటా అందుతోంది. సుమారు రూ.3 లక్షల విలువైన ఇంటి స్థలం దక్కింది. వివిధ పథకాల ద్వారా అందిన ఆర్థిక సాయంతో రాజమహేంద్రవరంలో హోల్‌సేల్‌గా టీ పొడి, బిర్యానీ మసాలా సరుకులు కొనుగోలు చేసి తెచ్చుకుని, ఇంటి వద్ద ప్యాకెట్లుగా తయారుచేసి విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నాం. మా బతుకులు మార్చిన దేవుడికి ఎప్పటికీ రుణపడి ఉంటాం.

- సుతావల్లి సుబ్బలక్ష్మి, కొత్తపేట

(జగత శ్రీరామచంద్రమూర్తి, విలేకరి, కొత్తపేట)

## పస్తులు లేకుండా జీవిస్తున్నాం



నేను కూలి పనులు చేసుకుని కుటుంబాన్ని పోషించేవాడిని. నాకు వృద్ధాప్యం రావడంతో ఇప్పుడు పనులు చేయలేక పోతున్నాను. నా కుమార్తె పత్తి సైలేంద్రకు భర్త లేడు, ఆమె కొడుకు రాజశేఖర్ దివ్యాంగుడు. ముగ్గురం శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం మదనాపురం పంచాయతీ రామకృష్ణాపురంలో నివాసం ఉంటున్నాం. నా వయస్సు 80 సంవత్సరాలు, కూలి పనులకు వెళ్ళడానికి అవకాశం లేక పోవడంతో ఆదాయం లేక తినడానికి ఇబ్బందులు పడ్డాం. పింఛన్‌కోసం గత ప్రభుత్వం హయాంలో ఎన్నిమార్లు దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేకపోయింది. జగన్‌మోహన్‌రెడ్డి వచ్చిన తరువాత నా మనవడికి దివ్యాంగ పింఛన్ నెలకు మూడు వేలు, నాకు వృద్ధాప్య పింఛన్ వస్తోంది. ఈ మొత్తంతో జీవనోపాధి పొందుతున్నాం. జగనన్న పుణ్యమాని మా బతుకులు మారాయి. ఆయనే లేకుంటే మా కుటుంబం పస్తులుండాల్సి వచ్చేది. ఆయన సాయం ఎప్పటికీ మరువలేం.

- చింతాడ అప్పారావు, రామకృష్ణాపురం

(అల్లు నరసింహ రావు విలేకరి కొత్తూరు)

# నారాసురుడిది ఆదినుంచీ రక్తచరిత్రే

సాక్షి, అమరావతి:

సార్వత్రిక ఎన్నికల్లో పేదల పక్షాన నిలబడిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి బస్సు యాత్రలో సంఘీభావం తెలిపేందుకు ఊరూరా వాడవాడన మేమంతా సిద్ధం అంటూ ప్రజలు తండోపతండాలుగా కదలివస్తూ నీరాజనాలు పలుకుతున్నారు. ప్రజా క్షేత్రంలో ఒంటరిగా వైఎస్ జగన్‌ను ఎదుర్కోవడానికి భయపడి జనసేన, బీజేపీతో జట్టుకట్టి.. మూడు పార్టీలు సంయుక్తంగా నిర్వహిస్తున్న సభలకు జనం మొహం చాటేస్తుండటంతో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఆందోళన చెందుతున్నారు. సీఎం జగన్‌కు వస్తున్న ప్రజా స్పందనను చూసి ఓర్వలేక.. రాజకీయ ఉనికి ప్రశ్నార్థకం అవుతుందనే భయంతో శనివారం తాడికొండలో నిర్వహించిన ప్రజాగళం బహిరంగ సభలో సాయంత్రం 5.20 గంటలకు ప్రసంగిస్తూ రాళ్లు, చేతికి ఏది దొరికితే దాంతో సీఎం జగన్‌పై దాడి చేయాలని చంద్రబాబు ఆ పార్టీ శ్రేణులను రెచ్చగొట్టారు. చంద్రబాబు ప్రోద్బలంతో కరుడుగట్టిన టీడీపీ మూకల ముఠా విజయవాడ సింగ్‌నగర్‌లో డాబా కొట్ల సెంటర్ వద్ద బస్సు యాత్రలో సీఎం జగన్ రోడ్‌షో నిర్వహిస్తారని ముందే గ్రహించి.. పక్కా ప్రణాళికతో హత్యాయత్నానికి తెగబడ్డారు. ఈ హత్యాయత్నంపై చంద్రబాబు తనయుడు లోకేశ్, ఆ పార్టీ నేతలు మాట్లాడుతున్న తీరును చూస్తుంటే ఇందులో బాబు హస్తం ఉందని సీఎం జగన్ అభిమానులే కాదు పలు రాజకీయ పార్టీల సీనియర్ నేతలు, సామాన్య ప్రజలు సైతం అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. స్కిల్ స్కాంలో అడ్డంగా సీఐడీ పోలీసులకు పట్టుబడి.. రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి బెయిల్‌పై బయటకొచ్చినప్పుడు చంద్రబాబు మాట్లాడిన మాటలను ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. చరిత్రలో ఏ రాజకీయ నాయకుడికి జరగనటువంటి రీతిలో సీఎం జగన్‌ను దారుణంగా శిక్షిస్తానంటూ చంద్రబాబు ఆవేశంతో ఊగిపోవడాన్ని రాజకీయ పరిశీలకులు ఎత్తిచూపుతున్నారు. జగన్ ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ప్రజా సంకల్ప పాదయాత్రలో జనం నీరాజనాలు పలుకుతుండటం చూసి ఓర్వలేక విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్‌లో కోడికత్తితో హత్యాయత్నానికి తెగబడేలా కుట్ర చేశారు. చంద్రబాబు వ్యవహార శైలి మొదటి నుంచి ఇలానే ఉందని పలు ఘటనలను ఉదహరిస్తున్నారు.

**కుట్రలు, కుతంత్రాలే శ్వాసగా..**

టీడీపీ తీర్థం పుచ్చుకున్న తర్వాత చంద్రబాబు తన సహజ లక్షణాలైన కుట్రలు, కుయుక్తులకు మరింత పదును పెట్టారన్నది రాజకీయ పరిశీలకుల విశ్లేషణ.

### మహానేత సహకారంతో మంత్రి పదవి

దివంగత ముఖ్యమంత్రి మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి సహకారంతో టి.అంజయ్య మంత్రివర్గంలో స్థానం దక్కించుకున్న చంద్రబాబు.. ఆ తర్వాత ఆయన పట్ల కనీసం కృతజ్ఞత ప్రదర్శించని స్వార్థ పరుడని రాజకీయ విశ్లేషకులు స్పష్టీకరిస్తున్నారు. మంత్రిగా ఉన్న సమయంలోనే ఎన్టీఆర్ కుమార్తె భువనేశ్వరిని చంద్రబాబు వివాహం చేసుకున్నారు. ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించాక...

1983లో జరిగిన ఎన్నికల్లో తన మామ ఎన్టీఆర్‌పైనే పోటీ చేస్తానంటూ బీరాలు పలికిన చంద్రబాబు.. చంద్రగిరి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి ఘోర పరాజయం పాలయ్యారు. రాజకీయ అస్తిత్వం కోసం మామను బతిమాలి టీడీపీలో చేరారు. వద్దని వారించినా అల్లుడనే కనికరంతో చంద్రబాబును ఎన్టీఆర్ చేరదీశారని టీడీపీ సీనియర్ నేతలు పలు సందర్భాల్లో వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.

ఎన్టీ రామారావు మంత్రివర్గంలో, టీడీపీలో.. నాదెండ్ల భాస్కర్‌రావు, నల్లపురెడ్డి శ్రీనివాసులురెడ్డి, దగ్గుబాటి వెంకటేశ్వరరావు అత్యంత కీలకంగా వ్యవహరించేవారు. వారిని అడ్డుతొలగించుకోకపోతే తాను ఎదగలేననే భావనతో.. ఆ ముగ్గురిని టీడీపీ నుంచి సాగనంపడానికి కుట్రలు చేశారు. 1984 జనవరి 9 నాటికి ఎన్టీఆర్ సీఎంగా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా.. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో భారీఎత్తున సభ నిర్వహించారు. ఈ సభలో ఎన్టీఆర్‌పై మల్లెల బాబ్జీని ఉసిగొలిపి.. హత్యాయత్నం చేయించి.. ఆ నెపాన్ని తనపైకి నెట్టడానికి ప్రయత్నించారని నాదెండ్ల భాస్కర్‌రావు అనేక సందర్భాల్లో చెప్పారు. ఆ తర్వాత మల్లెల బాబ్జీకి ఇస్తానన్న రూ.3 లక్షల సుపారీ ఇవ్వకుండా చంద్రబాబు ద్రోహం చేశారని.. ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిన మల్లెల బాబ్జీ 1988లో ఆత్మహత్య చేసుకున్నాడనే విమర్శలు ఉన్నాయి. నాదెండ్ల భాస్కర్‌రావు తిరుగుబాటుతో ఎన్టీఆర్ ప్రభుత్వం కుప్పకూలింది. దీనికి నిరసనగా ఎన్టీ రామారావు శాంతియుతంగా ప్రజా పోరాటం చేశారు. కానీ.. ఎన్టీఆర్‌కు తెలియకుండా అప్పట్లో రాష్ట్రంలో హింసాత్మక సంఘటనలకు ప్రేరేపించి.. అగ్నిగుండం చేసిన చరిత్ర చంద్రబాబుదేనని ఆయన తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు 'ఒక చరిత్ర–కొన్ని నిజాలు' పేరుతో రాసిన పుస్తకంలో స్పష్టం చేశారు. ఆ తర్వాత 1985 ఎన్నికల్లో ఓటమి భయంతో పోటీ చేసేందుకు చంద్రబాబు జంకారు. టీడీపీ అధికారంలోకి రావడంతో ఎన్టీఆర్ దన్నుతో కర్షక పరిషత్ చైర్మన్‌గా దొడ్డిదారిన పదవి పొంది.. ప్రజాధనాన్ని అడ్డగోలుగా దోపిడీ చేశారు. తన దోపిడీ గుట్టంతా నాటి సీఎం ఎన్టీఆర్ వ్యక్తిగత కార్యదర్శి రాఘవేంద్రరావుకు తెలిసినందున పక్కా ప్రణాళికతో ఆయన్ను మట్టుబెట్టించి.. దాన్ని ప్రమాదంగా చిత్రీకరించారని అప్పట్లో టీడీపీ నేతలే ఆరోపించారు. అప్పట్లోనే ఓ వర్గం నేతలను చంద్రబాబు చేరదీసి వర్గ రాజకీయాలకు తెరతీశారని ఎన్టీఆర్‌కు సీనియర్ నేతలు ఫిర్యాదులు కూడా చేశారు.

## విద్యార్థి దశలోనే సం'కుల' సమరం

చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలం నారావారిపల్లెలో 1950 ఏప్రిల్ 20న జన్మించిన చంద్రబాబు.. విద్యార్థి దశలో తిరుపతిలోని గోవిందరాజస్వామి డిగ్రీ కళాశాల, వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో సం'కుల' సమరాన్ని రాజేసి.. విద్యాలయాలను భ్రష్టుపట్టించారని నాటి సహ విద్యార్థులు చెబుతున్నారు. కుల రాజకీయాలతో ఎదిగిన చంద్రబాబు.. కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయ అరంగేట్రం చేశారు. గల్లా రాజగోపాల నాయుడి శిష్యరికంతో 1978లో కాంగ్రెస్ పార్టీ టికెట్ సాధించి.. చంద్రగిరి నియోజకవర్గం నుంచి శాసనసభకు ఎన్నికయ్యారు. అనంతరం రాజకీయ భిక్ష పెట్టిన గల్లా రాజగోపాలనాయుడికి తీరని ద్రోహం చేశారనే విమర్శలు ఉన్నాయి.

## తొమ్మిదేళ్ల పాలనలో ఏరులై పారిన రక్తం

ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి సీఎం పీఠాన్ని అధిరోహించిన చంద్రబాబు.. 1995 – 2004 మధ్య కాలంలో రాజకీయాల్లో ప్రత్యర్థులను వర్గ శత్రువులుగా పరిగణిస్తూ వచ్చారు. రాయలసీమలో ఫ్యాక్షన్ ను రాజేసి.. అధికారాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయ ప్రత్యర్థులను అంతమొందించారనే ఆరోపణలు ఉన్నాయి. అనంతపురం జిల్లాలో ప్రత్యర్థి రాజకీయ పార్టీకి చెందిన 415 మందిని వెంటాడి వేటాడి చంపేయడంలో కీలక భూమిక పోషించారనే విమర్శలు అప్పట్లో బలంగా వ్యక్తమయ్యాయి. ఇలా హత్యకు గురైన వారిలో 300 మంది మృతదేహాల ఆచూకీ ఇప్పటికీ లభించలేదు. రాజకీయ ప్రయోజనాల కోసం కర్నూలు జిల్లాలో ఫ్యాక్షన్ రక్కసిని రాజేసి వందలాది హత్యలకు కారణమయ్యారని బాధిత కుటుంబాలు ఆరోపిస్తున్నాయి. కడప జిల్లాలో ఫ్యాక్షన్ తార స్థాయికి చేరడానికి చంద్రబాబు ఎప్పటికప్పుడు కుట్రలు చేశారని టీడీపీ సీనియర్ నేతలే పలు సందర్భాల్లో ఆరోపించారు. చిత్తూరు, ప్రకాశం జిల్లాల్లోనూ ఇదే రీతిలో ప్రత్యర్థులను మట్టుబెట్టారనే విమర్శలు ఉన్నాయి. 2003లో చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనే తనకు రక్షణ కల్పించాలని పరిటాల రవి కోరారు. కానీ.. పరిటాల రవికి భద్రత కల్పించలేదు. 2005లో పరిటాల రవి హత్యకు గురైన తర్వాత రాష్ట్రాన్ని అగ్ని గుండంగా మార్చేలా టీడీపీ శ్రేణులను ఉసిగొల్పడంపై చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ పెట్టారని.. జిల్లాల వారీగా టార్గెట్లు పెట్టి మరీ ఆర్టీసీ బస్సులను ధ్వంసం చేయించారని ఆ పార్టీ సీనియర్ నేతలే వివిధ సందర్భాల్లో తీవ్ర విమర్శలు చేశారు.



తిరుపతిలో అమిత్ షాపై దాడికి యత్నిస్తున్న టీడీపీ నేత (ఫైల్)

## జర్నలిస్టు పింగళి దశరథరామ్ హత్య

తమ అక్రమాలు, ఆగడాలను ప్రశ్నించిన రాజకీయ నాయకుల్నే కాదు.. జర్నలిస్టులను సైతం టీడీపీ నేతలు మట్టుబెట్టారు. విజయవాడలో 'ఎన్‌కౌంటర్' అనే పక్షపత్రికకు పింగళి దశరథరామ్ వ్యవస్థాపక సంపాదకుడు, పబ్లిషర్‌గా వ్యవహరించేవారు. కాంగ్రెస్, టీడీపీల ప్రజావ్యతిరేక విధానాలను తీవ్రంగా విమర్శించేవారు. ఈ క్రమంలోనే చంద్రబాబు అవినీతి, అక్రమాలను తన పత్రికలో ఎండగట్టారు. ఈ నేపథ్యంలో 1985 అక్టోబర్ 20వ తేదీ రాత్రి 9 గంటలకు విజయవాడలోని సత్యనారాయణపురంలో రిక్షాలో వెళ్తున్న దశరథరామ్‌ను గూండాలు అత్యంత కిరాతకంగా హత్య చేశారు. ఈ హత్య చేయించింది చంద్రబాబేనని ప్రజలు ఇప్పటికీ భావిస్తుంటారు.

## వెన్నుపోటుతో ఎన్టీఆర్ కన్నుమూత

కుట్రలు, కుయుక్తులతో టీడీపీలో ఎదిగిన చంద్రబాబు.. 1995లో రాజకీయ అస్తిత్వాన్ని కల్పించిన మామ ఎన్టీఆర్‌కే ద్రోహం తలపెట్టి వెన్నుపోటు పొడిచారు. వైస్రాయ్ హోటల్‌లో నిర్బంధించిన తన ఎమ్మెల్యేలను విడిపించుకోవడానికి వచ్చిన ఎన్టీ రామారావుపై చెప్పులతో దాడి చేయించిన నైజం చంద్రబాబుది అన్నది జగద్విదితం. తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు, బావమరిది ఎన్.హరికృష్ణలను మభ్యపెట్టి.. వారి సహకారంతో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొద్ది రోజుల్లోనే వారిద్దరినీ టీడీపీ నుంచి సాగనంపారు. చంద్రబాబుకు సహకరించి తప్పు చేశానని దగ్గుబాటి వెంకటేశ్వరరావు అనేక సందర్భాల్లో ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు వెన్నుపోటుతో అధికారాన్ని కోల్పోయిన ఎన్టీఆర్.. వైస్రాయ్ హోటల్ వద్ద చెప్పులు వేయించిన ఘటనతో మరింత క్షోభకు గురై ఆ ఆవేదనతోనే కన్నుమూశారు. ఎన్టీఆర్ కన్ను మూయడానికి కొద్ది రోజుల ముందు చంద్రబాబు గురించి చేసిన వ్యాఖ్యలు ఆయన నేర చరిత్రను ఎత్తిచూపాయి.

## వంగవీటి రంగా హత్యలో కీలక పాత్ర



రాష్ట్రంలో 1985 ఎన్నికల్లో విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీతో గెలుపొందిన వంగవీటి మోహనరంగా.. ప్రజా పోరాటాలతో తిరుగులేని నాయకుడిగా ఆవిర్భవించారు. రంగాను అడ్డుతొలగించుకోకపోతే కోస్తాలో రాజకీయ మనుగడ ఉండదని చంద్రబాబు భావించారని చెబుతున్నారు. అందుకే అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌కు తెలియకుండా కుట్ర చేసి.. 1988 డిసెంబర్ 26న ప్రజా సమస్యల పరిష్కారం, వ్యక్తిగత భద్రత కోసం ఆమరణ దీక్ష చేస్తున్న రంగాను అతి దారుణంగా హత్య చేయించడంలో చంద్రబాబు కీలక పాత్ర పోషించారని సీనియర్ నేత చేగొండి హరిరామజోగయ్య తన ఆత్మకథలో ఏకరవు పెట్టారు.



1995లో వైస్రాయ్ హోటల్ ముందు అవమానం ఎదుర్కొంటున్న ఎన్టీఆర్ (ఫైల్)

## మహానేత కుటుంబంపై ఎప్పుడూ కక్షే

- రాష్ట్రంలో అత్యంత ప్రజాదరణ కలిగిన కుటుంబం దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డిది. ఆ కుటుంబాన్ని కడతేర్చితే రాజకీయంగా తనకు తిరుగుండదని చంద్రబాబు భావించారని.. అందువల్లే వైఎస్ కుటుంబంపై కక్ష కట్టి.. మట్టుబెట్టేందుకు ఎప్పటికప్పుడు కుట్రలు చేస్తున్నారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.
- 1999లో వైఎస్ రాజశేఖరరెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికలను ఎదుర్కొంది. కడప జిల్లాపై వైఎస్ రాజశేఖరరెడ్డి తండ్రి వైఎస్ రాజారెడ్డి ముద్ర బలమైంది. ఆయన్ను హత్య చేస్తే.. వైఎస్ రాజశేఖరరెడ్డిని కడప జిల్లాకే పరిమితం చేయవచ్చునని.. తద్వారా ఎన్నికల్లో విజయం సాధించి అధికారాన్ని నిలుపుకోవచ్చునని నాటి సీఎం చంద్రబాబు భావించారని చెబుతున్నారు. వైఎస్ రాజారెడ్డిని 1998 మే 23న పులివెందులకు సమీపంలో హత్య చేశారు. హత్య చేసిన వారికి నెల రోజులపాటు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు తన అధికారిక నివాసంలోనే ఆశ్రయం కల్పించారనే విమర్శలు అప్పట్లో బలంగా వ్యక్తమయ్యాయి. వైఎస్ రాజారెడ్డి హత్య కేసులో నిందితుడైన రాగిపిండి సుధాకర్‌రెడ్డిని టీడీపీ ప్రభుత్వ హయాంలో క్షమాభిక్షపై విడుదల చేయడం ఆ విమర్శలకు బలం చేకూర్చుతోంది.
- 2019 ఎన్నికల్లో మళ్లీ అధికారాన్ని చేజిక్కించుకోవడం కోసం అత్యంత ప్రజాదరణ కలిగిన ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అంతమొందించేందుకు కుట్ర పన్నారు. విశాఖపట్నం విమానాశ్రయంలో సామాన్యులు ఎవరూ ప్రవేశించలేని వీఐపీ లాంజ్‌లో.. తనకు అత్యంత సన్నిహితుడైన నేతకు చెందిన రెస్టారెంట్లో పని చేసే ఉద్యోగి ద్వారా వైఎస్ జగన్‌ను కడతేర్చేందుకు 2018 అక్టోబర్ 25న కుట్ర చేశారు. హత్యాయత్నం నుంచి వైఎస్ జగన్ బయటపడ్డ తర్వాత చంద్రబాబు వ్యవహరించిన తీరు ఆయనే ఈ కుట్రకు సూత్రధారి అనేలా ఉందని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.
- 2019 ఎన్నికలకు ముందు ఎన్డీయే నుంచి వేరుపడిన చంద్రబాబు.. అప్పట్లో రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాపై తిరుపతిలో రాళ్లతో దాడి చేయించారు. ఇప్పుడు తన రాజకీయ జీవితానికి ముప్పు ఏర్పడటంతో పవన్ కళ్యాణ్‌తో కలిసి అమిత్ షాతో కాళ్లబేరానికి దిగి.. మళ్లీ బీజేపీ పంచన చేరారు. ఇలా అడుగడుగునా చంద్రబాబు కుట్రలు, కుతంత్రాలతో రాజకీయం చేస్తున్నారు. తాజాగా దుష్టచతుష్టయంతో కలిసి చెలరేగిపోతున్నారు.

## 2014-19 మధ్య అధికారం అండతో హత్యాకాండ

- రాష్ట్ర విభజన తర్వాత టీడీపీ అధికారంలోకి వచ్చింది. 2014–19 మధ్య టీడీపీ పాలనలో సాగిన హత్యాకాండలో 30 మందికి పైగా వైఎస్సార్‌సీపీ నేతలను మట్టుబెట్టారు.
- 2014 జూలై 3న అనంతపురం జిల్లా యల్లనూరు మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రకాశం శెట్టిని టీడీపీ నేతలు హత్య చేశారు.
- 2014 ఆగస్టు 11న కృష్ణా జిల్లా కంచికచర్ల మండలం గొట్టుముక్కల గ్రామంలో వైఎస్సార్‌సీపీ గ్రామ పంచాయతీ ఉపసర్పంచి ఆలోకం కృష్ణారావు(55)ను టీడీపీ కార్యకర్తలు హత్య చేశారు. తర్వాత అదే గ్రామంలోని వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యుడు గుదే అక్కారావు ఇంటిపైనా దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు.
- 2014 ఆగస్టు 21న గుంటూరు జిల్లా బొల్లాపల్లి మండలం మేళ్లవాగు గ్రామంలో వైఎస్సార్‌సీపీకి చెందిన అన్నదమ్ములు బూసి పెదనాగిరెడ్డి, చిననాగిరెడ్డిపై తెలుగుదేశం కార్యకర్తలు దాడి చేసి చంపేశారు.
- 2014 ఆగస్టు 22న అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గం పుట్లూరు మండలం ఎల్లుట్ల గ్రామంలో వైఎస్సార్‌సీపీ నేత మల్లిఖార్జునను హత్య చేశారు.
- 2014 సెప్టెంబరు 1న అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గం కణేకల్ మండలం హనుమాపురం సర్పంచ్ విశ్వనాథ్ ప్రాణం తీశారు.
- 2014 సెప్టెంబర్ 11న గుంటూరు జిల్లా చినగార్లపాడులో వైఎస్సార్‌సీపీ కార్యకర్త గోవింద్‌రెడ్డి హత్యకు గురయ్యాడు.
- 2014 నవంబర్ 27న కర్నూలు జిల్లా పలుకురులో వైఎస్సార్‌సీపీ నేత ప్రభాకర్‌నాయుడు హత్యకు గురయ్యారు.
- 2014 డిసెంబర్ 30న నెల్లూరు జిల్లాలో అల్లం నరేంద్రను హత్య చేశారు.
- 2015 మార్చి 31న అనంతపురం జిల్లా తాడిపత్రి నియోజకవర్గం పెద్దవడుగూరు మండలం కిష్టిపాడు సింగిల్ విండో అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డిని సింగిల్ విండో కార్యాలయంలోనే టీడీపీ నేతలు కత్తులు, వేటకొడవళ్లతో దారుణంగా నరికి చంపారు. ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి ప్రోద్బలంతోనే ఈ హత్య జరిగిందనే ఆరోపణలున్నాయి.
- 2015 ఏప్రిల్ 29న అనంతపురం జిల్లా రాప్తాడు వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ ప్రసాద్‌రెడ్డిని రాప్తాడు తహసీల్దార్ కార్యాలయంలో పట్టపగలే దారుణంగా హత్య చేశారు. ఒక్క అనంతపురం జిల్లాలోనే దాదాపు 12 రాజకీయ హత్యలు జరిగాయి.
- 2015 మే 15న కర్నూలు జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వసంతరావుపై దాడి చేసి చంపేశారు.
- 2015 అక్టోబర్ 14న కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని చింతకుంటలో వైఎస్సార్‌సీపీ నేత రాఘవరెడ్డిని హత్య చేశారు.
- 2016 డిసెంబర్ 9న వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గం వేంపల్లె మండలం అలవలపాడు ఎంపీటీసీ సభ్యుడు గజ్జెల రామిరెడ్డి ప్రత్యర్థుల చేతిలో దారుణ హత్యకు గురయ్యాడు. మండల సర్వసభ్య సమావేశం ముగించుకొని వేంపల్లె నుంచి అలవలపాడు గ్రామానికి మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా టీడీపీకి చెందిన కృష్ణారెడ్డి, ఆయన అనుచరులు సుమోతో ఢీకొట్టి, వేట కొడవళ్లతో నరికి చంపారు.
- 2017 మే 6న కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ నియోజకవర్గంలో గోవిందపల్లిలో వైఎస్సార్‌సీపీ నేత ఇందూరి ప్రభాకర్‌రెడ్డి, ఆయన బావ మరిదిని దారుణంగా హత్య చేశారు.
- 2017 మే 21న కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చెరుకులపాడు నారాయణరెడ్డిని క్రిష్ణగిరి మండలం రామకృష్ణాపురం వద్ద హత్య చేశారు.

## మీకు తెలుసా?



### నాకు 31 ఏళ్లు

నేను ఎవరా అని అనుకుంటున్నారా.. నేనేనండి మీరు ఐదేళ్లకోసారి ప్రభుత్వ కార్యాలయాలకు నా కోసమే క్యూ కడతారు.. గుర్తొచ్చానా.. మీ ఓటరు గుర్తింపు కార్డును. ఐదేళ్ల ఓట్ల పండగలోనే కాదండీ.. నాకు ఓ గుర్తింపు ఉంది. మీకు ఇతర అత్యవసర సమయాలలో గుర్తుంచుకోండి తోడుగా ఉంటా. అసలు నేను ఎలా, ఎప్పుడు వచ్చాను.. చెప్తాను వినండి.. 1950 జనవరి 25న భారత ఎన్నికల కమిషన్ ఏర్పాటైనప్పటి నుంచి 1993 వరకు అసలు నేను లేనే లేను. నేను లేకపోవడంతో దొంగ ఓటర్లకు పండగలా ఉండేది. అప్పుడు కేంద్ర ఎన్నికల కమిషనర్‌గా ఉన్న మన టీఎన్ శేషనన్న సరిగ్గా 31 ఏళ్ల క్రితం 1993లో వినూత్నంగా నన్ను తీసుకువచ్చారు. ముందు నేను నలుపు తెలుపు రంగులలోనే ఉన్నా.. అలా మొదలైన నా ప్రయాణం ప్రస్తుతం డిజిటల్ రూపంలో మరింత భద్రతా ప్రమాణాలు కలిగి ఉన్నాను. నన్ను ట్యాంపరింగ్ చేయలేరు కనుక నకిలీ ఓటర్లు, దొంగ ఓట్లను అవకాశమే ఉండదు. అన్నట్టు నాకు దేశ భక్తి కూడా ఎక్కువే. అందుకే నాలోనే మన దేశ చిత్రపటంతో హోలోగ్రామ్‌ను పెట్టుకున్నాను. అంతే కాదండీ నాపై మీ ఫొటోలు కూడా స్పష్టంగా చూసుకోవచ్చు. మీ పేరు, చిరునామా, తదితర వివరాలు ఉంటాయి.

### కేసుల చిట్టా చెప్పాల్సిందే

సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ నేరచరిత్ర, వాటి వివరాలను విధిగా ప్రకటించాలి. వాటిని కేంద్ర ఎన్నికల సంఘానికి తప్పనిసరిగా సమర్పించాలి. ఈ మేరకు 2015లో సుప్రీం కోర్టు స్పష్టమైన తీర్పునిచ్చింది. నేరచరిత్ర కలిగిన అభ్యర్థులు విధిగా అందుకు సంబంధించిన వివరాలను బహిర్గతం చేయాలి. అభ్యర్థులపై పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులు, వాటి వివరాలు, పార్టీలు తమ వెబ్ సైట్‌లో పొందపర్చాలి. కేసులు, నేరచరిత్ర ఉన్నప్పటికీ ఆ అభ్యర్థులను ఎందుకు ఎంపిక చేయాల్సి వచ్చిందో ఆ కారణాలను కూడా రాజకీయ పార్టీలు తెలపాలి. అభ్యర్థులను ప్రకటించిన 48 గంటల్లోపు, నామినేషన్ల దాఖలు మొదటి రోజుకు రెండు వారాల ముందు నివేదికను 72 గంటల్లోపు ఈసీకి సమర్పించాలి.

### బ్యాంక్ ఖాతా తప్పనిసరి

ఆర్పీ చట్టం (ది రిప్రజెంటేషన్ ఆఫ్ ది పీపుల్స్ యాక్ట్) 1951లోని సెక్షన్ 77 ప్రకారం ఎన్నికల వ్యయాన్ని పర్యవేక్షించేందుకు ప్రతి అభ్యర్థి ప్రత్యేకంగా బ్యాంక్ ఖాతా తెరవాలి. నామినేషన్ పత్రాలు దాఖలు చేయాలనుకున్న తేదీకి కనీసం ఒక రోజు ముందు అభ్యర్థి పేరు మీద కానీ లేదా, అతని ఎన్నికల ఏజెంట్‌తో ఉమ్మడి పేరుపై ఖాతాను తెరవవచ్చు. ఖాతా సంఖ్యను నామినేషన్ దాఖలు చేసే సమయంలో ఆర్వోకి లిఖితపూర్వకంగా తెలపాలి. ఫలితాల ప్రకటన తరువాత, ఖాతా స్టేట్మెంట్‌ను దాఖలు చేసే సమయంలో ఖర్చుల ఖాతా స్టేట్మెంట్‌తో పాటు బ్యాంక్ ఖాతా స్టేట్మెంట్‌కు సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని జిల్లా ఎన్నికల అధికారికి ఇవ్వాలి.

### గుర్తుల కేటాయింపు ఇలా..

ది ఎలక్షన్ సింబల్స్(రిజర్వేషన్ అండ్ అలాట్‌మెంట్) ఆర్డర్–1968 ప్రకారం రాజకీయ పార్టీలకు, స్వతంత్ర అభ్యర్థులకు ఎన్నికల సంఘం(ఈసీ) గుర్తులు కేటాయిస్తుంది. రిజర్వుడ్ సింబల్స్‌ను ఎన్నికల కమిషన్ గుర్తింపు ఉన్న పార్టీలకు(ఉదా..వైఎస్సార్‌సీపీ, టీడీపీ, కాంగ్రెస్, బీజేపీ) మాత్రమే కేటాయిస్తారు. ఈ గుర్తులను ఇతరులకు కేటాయించరు. ఫ్రీ సింబల్స్‌ను కొత్తగా స్థాపించిన పార్టీలు లేదా గుర్తింపులేని రిజిస్టర్డ్ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులకు కేటాయిస్తారు. కొత్తగా స్థాపించిన పార్టీలు, రిజిస్టర్డ్ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ చేసేటప్పుడు గుర్తుల కోసం దరఖాస్తు చేసుకుంటారు.

# బెంగోల్ కొట్టేదెవరో?

**పశ్చిమబెంగాల్లో సంకుల సమరం | తృణమూల్‌తో బీజేపీ అమీతుమీ | కాంగ్రెస్, లెఫ్ట్ అస్తిత్వ పోరాటం**




## పోటీ కేరళలో.. ప్రచారం గల్ఫ్‌లో!

'విజయం కోసం ఎంతకైనా, ఎందాకైనా...' – ఓ సినిమాలో హీరో చెప్పే డైలాగిది. కేరళ కాంగ్రెస్ నేత షఫీ పరంబిల్ దీన్నే గుర్తు చేస్తున్నారు. వడకర లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్–యూడీఎఫ్ కూటమి అభ్యర్థిగా బరిలోకి దిగిన గల్ఫ్ దేశాల్లో ఓట్లను అభ్యర్థిస్తున్నారు. యూఏఈ, ఖతార్ తదితర గల్ఫ్ దేశాల్లో భారీగా స్థిరపడిన కేరళీయులను కలిసి భారత్‌కు వచ్చి ఓటేయాలని కోరుతున్నారు. షార్జాలో, ఖతార్‌లో తాజాగా కేరళీయులతో సమావేశాలు నిర్వహించారు. ఆర్థిక ఇబ్బందులు లేకపోతే దయచేసి వచ్చి ఓటేయాలని కోరారు. అలాగే కేరళ నుంచి విదేశాలకు వెళ్తున్న వారు కూడా పోలింగ్ దాకా ప్రయాణం వాయిదా వేసుకోవాలని కోరుతున్నారు. కేరళ ఎన్నారైలు గతంలో లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల ఎన్నికల్లో భారీ సంఖ్యలో పాల్గొన్నారు. దాంతో ఈసారి వారి మద్దతు కోసం పరంబిల్ ఇలా గల్ఫ్ యాత్ర చేపట్టారు. కేరళలోని 20 లోక్‌సభ స్థానాలకు ఏప్రిల్ 26న రెండో విడతలో పోలింగ్ జరగనుంది. పరంబిల్ ప్రస్తుతం పాలక్కాడ్ నుంచి కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా ఉన్నారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో మెట్రోమ్యాన్‌గా పేరొందిన ఇ.శ్రీధరన్‌పై 3,000కు పైగా ఓట్ల మెజారిటీతో గెలిచారు. ప్రస్తుతం సీపీఎం ఎమ్మెల్యే కేకే శైలజ, బీజేపీ అభ్యర్థి ప్రఫుల్ కృష్ణన్ నుంచి గట్టి పోటీ ఎదుర్కొంటున్నారు. దాంతో ప్రచార నిమిత్తం ఇలా గల్ఫ్ బాట పట్టారు.

ఒకప్పటి కమ్యూనిస్టుల కంచుకోట పశ్చిమబెంగాల్ రాజకీయాల్లో కొన్నేళ్లుగా సమూల మార్పులు చోటుచేసుకుంటున్నాయి. బెంగాల్ బెబ్బులి మమత దెబ్బకు రాష్ట్రంలో 34 ఏళ్ల సుదీర్ఘ కమ్యూనిస్టు పాలనకు తెరపడటమే గాక కాంగ్రెస్ ప్రాభవమూ కొడిగట్టింది. ఈ రాజకీయ శూన్యాన్ని భర్తీ చేస్తూ బీజేపీ క్రమంగా బెంగాల్లో పాగా వేస్తోంది. గత లోక్‌సభ ఎన్నికల్లో ఏకంగా 18 సీట్లను కొల్లగొట్టి మమతకు పక్కలో బల్లెంలా మారింది. అనంతరం అసెంబ్లీ ఎన్నికల్లోనూ 77 సీట్లతో సత్తా చాటింది. కొంతకాలంగా రాష్ట్రం తృణమూల్, బీజేపీ ముఖాముఖి పోరుకు వేదికగా మారిపోయింది. బెంగాల్లో ఈ లోక్‌సభ ఎన్నికలు ప్రధాని మోదీ వర్సెస్ తృణమూల్ అధినేత్రి మమత అన్నట్టుగా సాగుతూ అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాయి...

**- సాక్షి, నేషనల్ డెస్క్**



స్టేట్ స్కాన్

42 స్థానాలతో లోక్‌సభ సీట్లపరంగా దేశంలో మూడో అతిపెద్ద రాష్ట్రం పశ్చిమ బెంగాల్. ఇది జాతీయ పార్టీలను ఊరించే విషయం. జ్యోతిబసు, బుద్ధదేవ్ భట్టాచార్య, సోమ్‌నాథ్ చటర్జీ వంటి ఉద్దండులను అందించిన కమ్యూనిస్టులకు ప్రస్తుతం లోక్‌సభలోనూ, బెంగాల్ అసెంబ్లీలోనూ ప్రాతినిధ్యమే లేకుండా పోయింది! గత ఎన్నికల్లో బీజేపీ పుంజుకున్న తీరుతో పరిశీలకులే నోరెళ్లబెట్టారు. రాష్ట్రంలో ఎన్నడూ రెండు స్థానాలు దాటని కమలనాథులు. మొత్తం స్థానాల్లోనూ పోటీ చేసి ఏకంగా 18 సీట్లలో కాషాయ జెండాను రెపరెపలాడించారు. దాంతో తృణమూల్ 34 నుంచి 22 సీట్లకు పడిపోయింది. ఈ ట్విస్టులకు తోడు సంక్లిష్ట రాజకీయాలకు, ఎన్నికల హింసకు పెట్టింది పేరైన బెంగాల్లో ఈసారి కూడా పొలిటికల్ హీట్ పీక్స్‌కు చేరింది.

### తృణమూల్‌కు సవాల్...



అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయాలు సాధిస్తున్న తృణమూల్ కాంగ్రెస్‌కు గత లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం బీజేపీ నువ్వానేనా అనేంతగా సవాల్ విసిరింది. 2014తో పోలిస్తే దీదీ ఏకంగా 12 సీట్లను కోల్పోయారు. కాషాయ దళం 18 సీట్లను ఎగరేసుకుపోయింది. ఇరు పార్టీల మధ్య ఓట్ల తేడా కేవలం 3 శాతమే! కానీ 2021 అసెంబ్లీ ఎన్నికల్లో పూర్తి భిన్న ఫలితాలొచ్చాయి. తృణమూల్ ఏకంగా 215 సీట్లతో క్లీన్ స్వీప్ చేసింది. కాకపోతే బీజేపీ బలం 3 అసెంబ్లీ సీట్ల నుంచి ఏకంగా 77 స్థానాలకు ఎగబాకింది. దాంతో కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలే ప్రధానంగా నష్టపోయి పూర్తిగా సున్నా చుట్టాయి. 2016లో 44 సీట్లు సాధించిన కాంగ్రెస్, 32 సీట్లు నెగ్గిన లెఫ్ట్ పార్టీలకు అసెంబ్లీలో ప్రాతినిధ్యమే లేకుండా పోయింది! అంతకుముందు 2019 లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ బలం 4 నుంచి 2 సీట్లకు పడిపోయింది. లెఫ్ట్ ఉన్న 2 సీట్లనూ కోల్పోయింది. ఇండియా కూటమిలో భాగంగా బీజేపీపై పోరాడుతున్న మమత ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం మొత్తం 42 స్థానాల్లోనూ ఒంటరిగా పోటీ చేస్తుండటం విశేషం. మోదీ సర్కారు తమ పార్టీపై, రాష్ట్రంపై కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతోందంటూ ఆమె ప్రజల్లోకి వెళ్తున్నారు. తమ అభివృద్ధిని ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. బీజేపీ హిందుత్వ నినాదం నేపథ్యంలో ముస్లిం ఓటర్లను పూర్తిగా తమవైపు తిప్పుకునేలా ప్రయత్నిస్తున్నారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, కార్పొరేట్లతో కుమ్మక్కు వంటి అస్త్రాలను మోదీపై ఎక్కుపెడుతున్నారు.


### బీజేపీ పై చేయి సాధించేనా?



పశ్చిమబెంగాల్‌లో అధికారమే లక్ష్యంగా సాగుతున్న కమలనాథుల్లో 2019 లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఫుల్ జోష్ నింపాయి. రాష్ట్రంలో 2 స్థానాలకు మించి ఎప్పుడూ గెలవని బీజేపీకి ఏకంగా 18 సీట్లు దక్కాయి. కాషాయదళం కేంద్రంలో తొలిసారి 300 సీట్ల మైలురాయిని అధిగమించడంలో ఈ స్థానాలే కీలకమయ్యాయి. అనంతరం 2021 అసెంబ్లీ ఎన్నికల్లో సైతం తృణమూల్‌కు బీజేపీ గట్టి పోటీ ఇచ్చింది. 77 సీట్లతో బలమైన ప్రతిపక్షంగా ఆవిర్భవించింది. ఇదే జోరుతో ఈసారి మరిన్ని లోక్‌సభ సీట్లు కొల్లగొట్టాలనేది బీజేపీ వ్యూహం. బెంగాలీ హిందూ ఓట్లపై కమలం పార్టీ ప్రధానంగా గురిపెట్టింది. అయోధ్య రామమందిర కల సాకారం, మోదీ ఫ్యాక్టర్, అభివృద్ధి నినాదాలను ప్రచారాస్త్రాలుగా మలుచుకుంటోంది. మమతా ప్రభుత్వ అవినీతి, విపక్షాలపై తృణమూల్ గూండాయిజం, దాడులను కూడా లేవనెత్తుతోంది. మమత ఒంటరిగా పోటీ చేస్తుండటంతో, త్రిముఖ పోరు నెలకొంది. ఇండియా కూటమికి తృణమూల్ మొండిచెయ్యి, కాంగ్రెస్, లెఫ్ట్ నిర్వీర్యమవడం తమకు కలిసొస్తుందనేది కమలనాథుల అంచనా. గత ఎన్నికల్లో ఉత్తర, పశ్చిమ ప్రాంతాల్లో సాధించిన గణనీయ విజయాలను మిగతా చోట్లా రిపీట్ చేసేందుకు బీజేపీ కసరత్తు చేస్తోంది. రాష్ట్రంలో ఇటీవల పలు ఇన్‌ఫ్రా, ఇతర అభివృద్ధి ప్రాజెక్టులకు మోదీ భారీగా నిధులు విదల్చడం దీనిలో భాగమే. మెజారిటీ స్థానాలతో దీదీపై పైచేయి సాధించాలని కమలనాథులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఆ క్రమంలో మోదీ కూడా బెంగాల్‌పై ఫోకస్ పెంచారు.

### సర్వేలు ఏమంటున్నాయి...

బెంగాల్లో పోటీ బీజేపీ, తృణమూల్ మధ్యేనని, ఇతర పార్టీలది ప్రేక్షక పాత్రేనని సర్వేలు చెబుతున్నాయి. టీఎంసీ ఈసారి కూడా 21–22 సీట్లను దక్కించుకోవచ్చని పలు సర్వేలు లెక్కలేస్తున్నాయి. బీజేపీకి 19–20 స్థానాలు రావచ్చంటున్నాయి. అంటే 2019 కంటే కాస్త మెరుగుపడనుంది. కాంగ్రెస్ రెండు సీట్లలో ఒకటి కోల్పోవచ్చని అంచనా.




**పోలింగ్ తేదీలు: ఏప్రిల్ 19, 26, మే 7, 13, 20, 25, జూన్ 1**

### సీఏఏ గేమ్ చేంజర్..!

కేంద్రం తాజాగా అమల్లోకి తెచ్చిన పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) ఈ ఎన్నికల్లో బెంగాల్లో బాగా ప్రభావం చూపేలా ఉంది. బెంగాల్ విభజన తర్వాత బంగ్లాదేశ్ నుండి భారీగా వలస వచ్చిన దళిత ప్రాబల్య మథువా సామాజిక వర్గం దశాబ్దాలుగా పౌరసత్వం కోరుతూనే ఉంది. సీఏఏ నేపథ్యంలో వారంతా గంపగుత్తగా బీజేపీకి జై కొట్టేలా కన్పిస్తున్నారు. వీరు ఉత్తర 24 పరగణాలు, నాదియా, మాల్దాతో పాటు పలు ఉత్తర బెంగాల్ జిల్లాల్లో ఎక్కువగా స్థిరపడ్డారు. సీఏఏ నుంచి ముస్లింలను మినహాయించడం తెలిసిందే. బంగ్లా నుంచి ముస్లింల వలసలకు మమత సర్కారు గేట్లెత్తేసిందనేది బీజేపీ ప్రధాన ఆరోపణ. మరోవైపు సీఏఏను మమత తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. బీజేపీ ఎన్నికల లబ్ధి కోసం తెచ్చిన ఈ చట్టం అమలును బెంగాల్లో అడ్డుకుని తీరతానంటున్నారు.

### పార్టీలవారీగా ఓట్ల శాతం







అవినీతికి లైసెన్స్, దోపిడీకి ఫ్రీ పాస్ కావాలని తృణమూల్ సర్కారు కోరుకుంటోంది. రాష్ట్రంలో టీఎంసీ సిండికేట్ రాజ్ నడుస్తోంది. అందుకే దోపిడీలకు, అవినీతికి పాల్పడిన పార్టీ నేతలపై విచారణ కోసం వచ్చిన కేంద్ర దర్యాప్తు సంస్థల అధికారులపై టీఎంసీ దాడులు చేయిస్తోంది.

**-జల్పాయ్‌గురి సభలో ప్రధాని మోదీ**



జూన్ 4న ఎన్నికల ఫలితాలొచ్చాక విపక్ష నేతలందరినీ జైలుకు పంపుతామంటూ మోదీ బెదిరిస్తున్నారు. ఒక ప్రధాని అనాల్సిన మాటలేనా ఇవి! కేజ్రీవాల్, హేమంత్ సోరెన్ వంటి చాలామంది నేతలను బీజేపీ ఇప్పటికే జైల్లో పెట్టింది. మొత్తం హిందుస్థాన్‌నే జైలుగా మార్చేసింది. సీబీఐ, ఎన్ఐఏ వంటి దర్యాప్తు సంస్థలు బీజేపీ సోదరులు. ఐటీ, ఈడీ ఆ పార్టీకి నిధులు సమీకరించే సంస్థలు. మీకు గెలిచే సత్తా, నమ్మకముంటే మా నాయకులను అరెస్టు చేయాల్సిన అవసరమేంటి? ఈ ఎన్నికల తర్వాత కూడా బెంగాల్‌లో ఉండేది మా ప్రభుత్వమే. మేం తలచుకుంటే మీ నాయకులందరినీ ఊచలు లెక్కపెట్టిస్తాం.

**- కృష్ణనగర్ ఎన్నికల ర్యాలీలో సీఎం మమతా బెనర్జీ**



# ఇందిరమ్మ శకం

గతం

### నెహ్రూ వారసురాలిగా తెరపైకి

**1966లో ప్రధానిగా బాధ్యతలు**
**ఐదేళ్లలోనే నలుగురు ప్రధానులు**
**కొత్త పార్టీలొచ్చినా సాగిన కాంగ్రెస్ హవా**
**కీలక మార్పులకు వేదికైన మూడో లోక్‌సభ**

భారత ప్రజాస్వామ్య చరిత్రలో మూడో లోక్‌సభ ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఆ కాలంలోనే దేశం ఇద్దరు ప్రధానులను కోల్పోయింది. రెండు యుద్ధాలనూ చవిచూసింది. నెహ్రూ ముచ్చటగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. తొలి రెండు విడతలతో పోలిస్తే ఎన్నికల నిర్వహణ కాలం మరింత తగ్గి రెండు నెలల్లోనే క్రతువు ముగిసింది. పదేళ్ల పాటు తండ్రి చాటు బిడ్డగా, నెహ్రూ సహాయకురాలిగా పనిచేసిన ఇందిరాగాంధీ 1959లో కాంగ్రెస్ అధ్యక్ష పగ్గాలు చేపట్టారు. ఆమె నాయకత్వంలోనే పార్టీ 1962 ఎన్నికలకు వెళ్లింది. అనూహ్య పరిణామాలతో 1966లో ఇందిర ప్రధాని అయ్యారు. ద్విసభ్య నియోజకవర్గాలు రద్దయ్యాయి. సి.రాజగోపాలాచారి సారథ్యంలో కొత్త జాతీయ పార్టీ తెరపైకి వచ్చింది. ఇలా ఎన్నో అనూహ్య పరిణామాలు, విశేషాలకు 1962–67 మూడో లోక్‌సభ కాలం వేదికగా నిలిచింది.

**- సాక్షి, నేషనల్ డెస్క్**

### మూడో లోక్‌సభలో పార్టీల బలాబలాలు

(మొత్తం స్థానాలు 494)

| పార్టీ | సీట్లు |
|---|---|
| కాంగ్రెస్ | 361 |
| సీపీఐ | 29 |
| స్వతంత్ర పార్టీ | 18 |
| ప్రజా సోషలిస్ట్ పార్టీ | 12 |
| భారతీయ జన సంఘ్ | 14 |
| ఇతరులు | 40 |
| స్వతంత్రులు | 20 |

### మూడో లోక్‌సభ కాలంలో ముఖ్య పరిణామాలు

- దేశవ్యాప్తంగా సైన్స్, టెక్నాలజీ, కమ్యూనికేషన్, పారిశ్రామికాభివృద్ధి తదితర రంగాలపై నెహ్రూ దృష్టి
- దేశంలో పలు ప్రాంతాల్లో స్టీల్ ఫ్యాక్టరీల తదితర చర్యల ద్వారా పారిశ్రామికీకరణకు మరింత ఊతం
- నెహ్రూ ఆకస్మిక మృతి, లాల్‌బహదూర్ శాస్త్రి మిస్టరీ మరణం
- భాషా ప్రాతిపదికన 1960లో మహారాష్ట్ర, గుజరాత్‌గా విడిపోయిన బొంబాయి రాష్ట్రం
- ఆహార కొరతకు విరుగుడుగా హరిత విప్లవం

### ఇందిరాగమనం...



పదేళ్ల పాలన తర్వాత కూడా దేశంలో బలమైన ప్రతిపక్షమంటూ వేళ్లూనుకోలేదు. ప్రజల మనసుల్లో నెహ్రూ స్థానం చెక్కు చెదరలేదు. 1962 మూడో లోక్‌సభ ఎన్నికల్లో 28 పార్టీలు పోటీ చేశాయి. కేరళ మినహా అన్ని రాష్ట్రాల్లోనూ 60 శాతానికి పైగా సీట్లు కాంగ్రెస్ ఖాతాలోనే పడ్డాయి. 1957 కంటే కేవలం 10 సీట్లు, ఒక శాతం ఓట్లు తగ్గాయి. సీపీఐకి 29, రాజాజీ స్థాపించిన స్వతంత్ర పార్టీకి 18 స్థానాలు దక్కాయి. ప్రజా సోషలిస్ట్ పార్టీ 12, భారతీయ జనసంఘ్ 14 స్థానాలను గెలుచుకున్నాయి. 361 స్థానాలతో కాంగ్రెస్ హ్యాట్రిక్ కొట్టి నెహ్రూ మూడోసారి ప్రధాని అయ్యారు. ముందుచూపుతో కుమార్తె ఇందిరను అప్పటికే కాంగ్రెస్ అధ్యక్ష పీఠంపై కూర్చోబెట్టారు. కానీ ఇందిర తీరు పార్టీలో అన్ని వర్గాలకూ నచ్చలేదు. ఆమె నాయకత్వ పటిమపై అనుమానాలూ రేకెత్తాయి. పలువురు సీనియర్లు బాహాటంగానే వ్యతిరేకత వ్యక్తం చేశారు. పార్టీలో ఇందిర అనుకూల, వ్యతిరేక వర్గాలు ఏర్పడ్డాయి. నెహ్రూ ఉన్నంత కాలం సజావుగానే సాగినా 1964 మే 27న గుండెపోటుతో నెహ్రూ హఠాన్మరణం అనూహ్య మార్పులకు దారి తీసింది. గుల్జారీలాల్ నందా తాత్కాలికంగా 13 రోజులు ప్రధానిగా వ్యవహరించాక 1964 జూన్ 9న లాల్‌బహదూర్ శాస్త్రి గద్దెనెక్కారు. ఆయన దురదృష్టవశాత్తూ 1966 జనవరి 11న ఉజ్బెకిస్థాన్‌లోని తాష్కెంట్‌లో ఆకస్మిక మరణానికి గురయ్యారు. మరోసారి నందా 13 రోజులు తాత్కాలిక ప్రధానిగా ఉన్నాక ఇందిర రంగప్రవేశం చేశారు. 1966 జనవరి 24న దేశ తొలి, ఏకైక మహిళా ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. అప్పటికామె యూపీ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 1959లో కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఇందిర రాజకీయ కెరీర్ మొదలైంది. అదే ఏడాది నెహ్రూతో విభేదించి సి.రాజగోపాలాచారి స్వతంత్ర పార్టీ ఏర్పాటు చేశారు. తమిళనాట కొత్తగా ఏర్పడ్డ ద్రవిడ మున్నేట్ర కళగం 1962 లోక్‌సభ ఎన్నికల్లో (డీఎంకే) 2 శాతం ఓట్లతో ఏడు సీట్లు గెలిచింది.

### చైనా, పాక్‌తో యుద్ధాలు

నెహ్రూ మూడోసారి అధికారం చేపట్టిన నెలల వ్యవధిలోనే చైనా దురాక్రమణను ఎదుర్కోవాల్సి వచ్చింది. టిబెట్ బౌద్ధ గురువు దలైలామాకు 1959లో భారత్ ఆశ్రయం కల్పించడం దీనికి నేపథ్యమంటారు. చైనా దళాలు లద్దాఖ్‌లో భారత భూభాగాన్ని ఆక్రమించడం 1962 అక్టోబర్ 20న ఘర్షణ మొదలైంది. నవంబర్ 20న చైనా కాల్పుల విరమణ ప్రకటించింది. 5,000 మంది సైనికులు అసువులు బాయడమో, అదృశ్యమవడమో జరిగింది. శాస్త్రి హయాంలో పాక్ మనతో కయ్యానికి కాలు దువ్వింది. భారత్‌లో అశాంతిని రాజేయడానికి ఉగ్రవాదులను దేశంలోకి చొప్పించే ప్రయత్నం యుద్ధానికి దారితీసింది. 1965 ఆగస్టు 5 నుంచి సెప్టెంబర్ 23 దాకా సాగిన ఈ యుద్ధంలోనూ 4,000 మంది దాకా సైనికులు అమరులయ్యారు. 1966 జనవరి 10న పాక్‌తో తాష్కెంట్ ఒప్పందం కుదిరింది. కానీ ఆ తర్వాత గంటల వ్యవధిలోనే అక్కడే శాస్త్రి కన్నుమూసిన తీరు మిస్టరీగానే మిగిలింది. గుండెపోటని వార్తలొచ్చినా అసలు కారణం ఇప్పటికీ వెలుగు చూడలేదు.

### సిరా చుక్కకు నాంది

ఓటేశాక వేలిపై సిరా చుక్క పెట్టే విధానాన్ని 1962 ఎన్నికల్లోనే ప్రవేశపెట్టారు. తయారీ కంపెనీ మైసూర్ పెయింట్స్ అండ్ వార్నిష్ లిమిటెడ్ ఎన్నో దేశాలకు ఇంకును ఎగుమతి చేసేది.

# కాంగ్రెస్‌లో ప్రియాంకం



పరిచయం

ప్రియాంకా గాంధీ వాద్రా. తండ్రి రాజీవ్ హత్యకు గురైనప్పుడు సమాజంతో పాటు మొత్తం ప్రపంచంపైనే కోపం పెంచుకున్న అమ్మాయి. ఎదిగే కొద్దీ క్షమాగుణం విలువను తెలుసుకున్నారు. ప్రధాని పదవి స్వీకరించాలని తల్లి సోనియాను కాంగ్రెస్ నేతలంతా కోరితే తననూ హత్య చేస్తారని భయపడి ఏడ్చిన నగటు యువతి. ఇప్పుడదే కాంగ్రెస్‌కు ట్రబుల్ షూటర్‌గా మారారు. అచ్చం నానమ్మ ఇందిర పోలికలను పుణికిపుచ్చుకున్న ప్రియాంక రాజకీయాల్లోకి వస్తారా, రారా అన్న చర్చ ఆమె పదహారులుగో ఏట నుంచే మొదలైంది! తనకు రాజకీయాలు సరిపడవని మొదట్లో గట్టిగా నమ్మారామె. అలాంటిది ఇప్పుడు రాజకీయాల్లో పూర్తిగా తలమునకలయ్యారు. గాంధీల కంచుకోటైన యూపీలోని రాయ్‌బరేలీలో తల్లికి బదులుగా కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తారంటూ ప్రచారమూ జరుగుతోంది.

### రాజకీయ జీవితం

ప్రియాంక తొలుత క్రియాశీల రాజకీయాల్లో అంతగా పాల్గొనలేదు. తల్లి, సోదరుల లోక్‌సభ నియోజకవర్గాలైన రాయ్‌బరేలీ, అమేథీలకు వెళ్లేవారు. 2004 లోక్‌సభ ఎన్నికలలో సోనియాకు ప్రచార నిర్వాహకురాలిగా వ్యవహరించారు. రాహుల్ ప్రచారాన్ని కూడా పర్యవేక్షించారు. 2007 యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆ రెండు లోక్‌సభ స్థానాల పరిధిలోని పది అసెంబ్లీ సీట్లలో ప్రచారం మొదలుకుని సీట్ల కేటాయింపులు, అంతర్గత పోరును పరిష్కరించడం దాకా అన్నీ తానై వ్యవహరించారు. 2019లో యూపీ తూర్పు భాగానికి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా అధికారికంగా రాజకీయాల్లోకి ప్రవేశించారు. తర్వాత యూపీ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. 2022 యూపీ అసెంబ్లీ ఎన్నికల బాధ్యతలను తీసుకున్నారు. మహిళలకు 40 శాతం టికెట్ల డిమాండ్‌తో 'లడ్కీ హూ, లడ్ సక్తీ హూ' నినాదాన్ని తెరపైకి తెచ్చారు. ఆమె ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమే చవిచూసింది. ఆ అనుభవం తన జీవితంలో స్థితప్రజ్ఞత తీసుకొచ్చిందంటారు ప్రియాంక. అయితే 2022 హిమాచల్‌ప్రదేశ్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రచారానికి సారథ్యం వహించి పార్టీని విజయ తీరాలకు చేర్చారు. కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నిక ల్లోనూ క్రియాశీల పాత్ర పోషించారు.

### హిందీ సాహిత్యం.. బౌద్ధం...

ప్రియాంక 1972 జనవరి 12న జన్మించారు. డెహ్రాడూన్ వెల్హామ్ బాలికల పాఠశాలలో చదివారు. తర్వాత భద్రతా కారణాలతో రాహుల్‌తో పాటు ఢిల్లీలోని డే స్కూల్‌కు మారారు. ఇందిర హత్యానంతరం ఇద్దరూ ఇంట్లోనే చదువుకున్నారు. ఢిల్లీ విశ్వవిద్యాలయం అనుబంధ కాలేజీ జీసస్ అండ్ మేరీ నుంచి ప్రియాంక సైకాలజీలో డిగ్రీ చేశారు. బౌద్ధ అధ్యయనంలో మాస్టర్స్ చేశారు. నానమ్మను అత్యంత శక్తివంతమైన మహిళగా చెబుతారు. బాల్యంలో నానమ్మతో రాహులే ఎక్కువగా గడపడం చూసి ఈర్ష్య పడేదాన్నంటూ నవ్వేస్తారు. ప్రియాంక బాల్యం ఎక్కువగా బాలీవుడ్ దిగ్గజం అమితాబ్ బచ్చన్ తల్లి తేజీ బచ్చన్‌తో గడిచింది. అమితాబ్ తండ్రి హరివంశ్ రాయ్ బచ్చన్ కవిత్వం చదివి హిందీ సాహిత్యంపై మక్కువ పెంచుకున్నారు. ప్రేమ్‌చంద్ సాహిత్యాన్ని ఇష్టపడతారు. ఖాళీ దొరికితే పుస్తకాలు పట్టుకుంటారు. బౌద్ధ తత్వశాస్త్రాన్ని ఆచరిస్తారు. 1999లో రాజకీయాల్లోకి రావాల్సి వచ్చినప్పుడు పది రోజులపాటు మెడిటేషన్ చేసి నిర్ణయం తీసుకున్నారు. 1997లో వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రాను పెళ్లాడారు. వారికిద్దరు పిల్లలు. ప్రియాంక రేడియో ఆపరేటర్ కూడా!

### పోరుబాట..

పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమించారు. మోదీ సర్కారు తెచ్చిన సాగు చట్టాలకు వ్యతిరేకంగా రైతుల పోరాటానికి నాయకత్వం వహించారు. హత్రాస్ అత్యాచార బాధితురాలి కుటుంబానికి బాసటగా నిలిచారు. 2021లో కేంద్ర మంత్రి కుమారుడు రైతులపైకి కారు ఎక్కించి చంపిన లఖింపూర్ ఖేరీని సందర్శించి అరెస్టయ్యారు. రెండు రోజులకు పైగా జైల్లో ఉన్నారు.

**- సాక్షి, నేషనల్ డెస్క్**